# క్రాంతి

లోపలి పేజీల్లో...


కా॥ రవీంద్రన్..... 17
మార్చి 8..... 19
అనుభవవాదాన్ని అధిగమించడం..... 30
మెదడువాపు..... 40
వన్ ఆఫ్ సెవంటీ..... 42
తూర్పు తైమూర్..... 49



భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) [పీపుల్స్‌వార్] రాష్ట్రకమిటీ అధికార పత్రిక

సంపుటి : 24 సంచిక : 1 | జనవరి-ఫిబ్రవరి 2000 | వెల : ఐదు రూపాయలు


## అమర నేతలు కామ్రేడ్స్ శ్యాం, మహేష్, మురళీలకు అరుణారుణ జోహార్లు!

## అమరనేతల ఆశయ సాధనకు రెట్టించిన దృఢదీక్షతో పునరంకితమవుదాం- అదే వారికి మనమందించగల నిజమైన నివాళి!!

# భూస్వామ్య వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక, నిరంకుశ పెట్టుబడిదారీ వ్యతిరేక ప్రజాయుద్ధాన్ని తీవ్రతరం చేస్తూ

## మన ప్రియతమ నాయకుల హత్యకు ప్రతీకారం తీర్చుకుందాం!!!

'వర్గ పోరాటం మహా కర్కశమైనది'. వర్గ దోపిడీ తీవ్రతరమయ్యేకొద్దీ వర్గ వైరుధ్యాలు పదునెక్కే కొద్దీ, వర్గ పోరు సైతం పదునెక్కుతుంది. అప్పుడది మరింత కర్కశత్వాన్ని సంతరించుకుంటుంది. గడచిన సుమారు పాతిక సంవత్సరాల నుంచి మన పార్టీ, ఉద్యమాల నిర్మాణ క్రమంతోను; ఆంతరంగికంగా తలెత్తిన సమస్యలు సంక్షోభాలన్నింటిని అధిగమిస్తూ, తెరలు తెరలుగా విరుచుకుపడుతుండే క్రూర దారుణ నిర్బంధ కాండలెన్నింటినో అధిగమిస్తూ మన పార్టీ ఉద్యమాలు పురోగమిస్తున్న క్రమమంతటితోనూ పెనవేసుకు పోయిన పాత్రని చరిత్రని కలిగుండే మన ప్రియతమ నాయకులు, మన పార్టీ కేంద్రకమిటీ సభ్యులు కామ్రేడ్స్ శ్యాం (నల్లా ఆదిరెడ్డి), మహేష్ (ఎర్రంరెడ్డి సంతోష్‌రెడ్డి) మురళి (శీలం నరేష్, జగన్) లను ఫాసిస్టు చంద్రబాబు ప్రభుత్వం తన కిరాయి పోలీసు



గూండాలచేత అతి కిరాతకంగా హత్య చేయించిందంటే, ఇందుకోసం ఆంధ్ర రాష్ట్ర హంతక డి.జి.పి. దొర నాయకత్వంలోని పోలీసు మృగాలు పన్నిన కోవర్టు కుట్ర పథకంలో-గడచిన 20 సంవత్సరాల నుంచి మన పార్టీని అంటి పెట్టుకుని వుంటూ పార్టీ నాయకత్వం విశ్వాసానికి పాత్రుడై వస్తుండిన గోవిందరెడ్డి దారుణ విద్రోహానికి విశ్వాస ఘాతుకానికి పాల్పడిపోయి నీచాతినీచమైన పాత్ర పోషణకి తలపడి పోయాడంటే-ఈ సందర్భంగా జరగరాని, జరిగిపోయిన సాంకేతిక పరమైన తప్పిదాలు, లోపాలు, అజాగ్రత్తలు అనే వాటిని గూర్చి సమీక్షించు కోవడం ఒక అంశం కాగా ఇంతకు మించిన ప్రాధాన్యతతో మనం చూడాల్సిన అంశం ఏమంటే-ఈనాడు యావత్ దేశంలోను, అందులో ఒక భాగంగానే గాక ఇక్కడ మన ఆంధ్ర రాష్ట్రంలో వుంటున్న మరిన్ని ప్రత్యేకతల రీత్యా ఇక్కడ మరింత అదనంగాను రోజురోజుకీ మాత్రమేగాక క్షణక్షణానికి కూడా తీవ్రతరం అయిపోతున్న వర్గపోరాట స్థితే ఆ ప్రత్యేకాంశం!

1970ల నాటికి దేశంలో పక్వ స్థితికి చేరిన విప్లవ పరిస్థితి నాటి ఎమ్.ఎల్. పార్టీ, ఉద్యమాల ఆవిర్భావానికి నేపథ్యం! ఇకా పరిస్థితి రోజు రోజుకి మరింత పదునెక్కుతుండటమే తప్ప మొద్దుబారడమనేది లేదు సరికదా, 1990-91ల తరువాత దేశ విప్లవకర స్థితి మరింత తీవ్రతరమైందనే చెప్పాలి. దేశీయ దోపిడీ పాలకవర్గాలు, వారి పార్టీలు, ప్రభుత్వాలు కొత్త గొంతులు సవరించుకున్నాయి, కొత్త నినాదాలందు కున్నాయి. 'నూతన ఆర్థిక విధానాలు', 'సరళీకృత పారిశ్రామిక విధానం', 'సంస్థాగత సర్దుబాట్లు' అంటూ దేశీయ బడా పెట్టుబడిదారీ బడాచోర్ల దళారీ పాత్రతో విదేశీ సామ్రాజ్యవాద శక్తులకి, సంస్థలకి దేశకోశాగారం తలుపుల్ని బార్లా తెరవడం ప్రారంభమైంది. స్వదేశీ స్వావలంబన అనేవి వెనుకబాటుదనానికి సంకేతాలై పోయాయి. పారిశ్రామిక రంగంలో ప్రభుత్వరంగం అనేది అనాథశిశువై పోయింది. అన్నింటినీ ప్రైవేటుపరం చేయడమనేది గొప్ప అభివృద్ధికర విధానంగా చిత్రించబడుతూ వచ్చింది. ఇక వ్యవసాయ రంగంలో హరిత విప్లవం ఆర్భాటం అంతరించి పోయింది. భారతదేశ దళారీ పాలకవర్గాలు దేశాన్ని ప్రపంచ సామ్రాజ్యవాద సంస్థ 'గాట్' గాటన కట్టేయడమనేది ఈ పరిణామ పరంపర పరాకాష్ట! ఇకా తరువాత సంవత్సరంలో మరింత నిస్సిగ్గుగా సామ్రాజ్యవాదులకి పాలకుల పాదాభివందనాలు ఎక్కువై పోయాయి. 'సంస్కరణలు' అనే తేనె పూసిన కత్తితో కార్మికులు, రైతాంగం, ఉద్యోగులతో కూడిన సమస్త రంగాలలోని జన సామాన్యంపై వేట్లు ఎక్కువై పోయాయి. పేదలకుద్దేశించిన 'సంక్షేమం', 'సబ్సిడీలు' అనేవి తిట్ల జాబితాలోకి చేరిపోయాయి. 'భూసంస్కరణలు' బూతుపదం అయిపోయింది. 'ప్రపంచీకరణ' (గ్లోబలైజేషన్) అంటూ ఇంకో కొత్త భావన, కొత్త నినాదంతో ప్రజలపై దాడి ప్రారంభమైంది. ప్రజల నిరసనని నిర్లక్ష్యం చేస్తూ దేశాన్ని 'ప్రపంచ వాణిజ్య సంస్థ' (డబ్ల్యు.టి.ఓ.) కి బందీ చేసేశారు పాలకులు! కాశ్మీర్, నాగాలాండ్, అస్సాం, త్రిపుర లాంటి చోట్ల సాగుతున్న వివిధ జాతుల పోరాటాలపై అప్రకటిత యుద్ధమే కొనసాగిస్తోంది భారత సైన్యం! మత మైనారిటీలపై అనాగరిక దాడులు, అణచివేతలు పెచ్చరిల్లి పోయాయి, వీటన్నింటి పరాకాష్టే బాబ్రీ విధ్వంసం! దళితులు, మహిళలు, ఆదివాసీలపై దాడులు అత్యాచారాలు నిత్యకృత్యమై పోయాయి.

ఇలాంటి పరిస్థితుల్లోనే చంద్రబాబు లాంటి ఆషాడభూతులు అందించిన అండదండలతో 13 మాసాలపాటు నడచిన బి.జె.పి. నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం ఒక్క ఓటు తేడాతో విశ్వాస తీర్మానం ఓడిపోయిన కారణంగా పడిపోయింది. తిరిగి ఎన్నికలు ప్రకటించబడ్డాయి. ఈ మధ్యకాలంలోనే బి.జె.పి. సంకీర్ణ ప్రభుత్వం ఆపద్ధర్మ ప్రభుత్వ హోదాలోనే దేశీయ దళారీ పాలకవర్గాల, విదేశీ సామ్రాజ్యవాదుల ప్రయోజనాలు ఈడేర్చే అతి కీలకమైన విధానాలని నిర్ణయాల్ని నిరాటంకంగా అమలుచేస్తూ వచ్చింది. అంటే అధికారంలో ఏ ప్రభుత్వం వున్నా ఎలాంటి ప్రభుత్వం వున్నా, అసలు ప్రభుత్వమనేది ఉన్నా లేకున్నా కూడా దోపిడీ పాలకవర్గాలు, వారి యజమానులైన సామ్రాజ్యవాదుల ప్రయోజనాలకి ఎలాంటి భంగం, ఆటంకం కలగనీయని ఒకరకమైన వాతావరణాన్ని, పరిస్థితిని పాలకవర్గాలు సృష్టించే పెట్టుకున్నాయి. కనీస చర్చనేదే లేకుండా 1998-99 కేంద్ర బడ్జెట్ ఆపద్ధర్మ ప్రభుత్వ హయాంలో ఆమోదించబడి పోవడమనేదే ఇందుకు కొట్టొచ్చిన నిదర్శనం! ఆపద్ధర్మ హోదాలో వుంటూనే ఫాసిస్టు బి.జె.పి. సర్వసాధారణ సరిహద్దు ఘర్షణల్ని కార్గిల్ కార్చిచ్చుగా రగిలించి, పాకిస్తాన్‌తో యుద్ధాన్ని నడిపి జాతీయ దురహంకార పూనకాన్ని పుట్టించి తిరిగి అధికారపగ్గాలు చేపట్టడానికి మార్గాన్ని సుగమం చేసుకుంది. అధికార పగ్గాలు చేపట్టడమే అసలు లక్ష్యంగా బాబ్రీ విధ్వంసానికి పూనుకుని మత మారణహోమం సృష్టించి రక్తపుటేరులు పారించింది. తిరిగి మళ్లీ అధికారమే లక్ష్యంగా కార్గిల్ చిచ్చురేపి వందలాది సైనికుల్ని బలిపశువుల్ని చేసి దేశంలో అనవసర ఉద్రిక్త వాతావరణాన్ని రగిల్చి వేలకోట్ల రూపాయిల ఆర్థిక భారాన్ని ప్రజలనెత్తిన రుద్ది తిరిగి అధికారాన్ని చేపట్టింది. అధికారం ఇబ్బందికరమైన స్థితే! కనుకనే ఇలాంటి ఇబ్బందికి విరుగుడుగా తన అధికారాన్ని స్థిరపరచుకోవడానికి అవసరమైన ఫాసిజీకరణకి బి.జె.పి. పకడ్బందీ వ్యూహంతో పావులు కదుపుతోంది. దేశాధ్యక్షుని స్పష్టమైన నిరసనను సైతం బేఖాతరు చేస్తూ 'రాజ్యాంగ సమీక్ష'కు (అంటే రాజ్యాంగాన్ని మరింత ఫాసిజీకరించడం) దురుసుగా పూనుకోవడం, ప్రభుత్వోద్యోగులు ఆర్.ఎస్.ఎస్.లో చేరరాదనే ఆంక్షల్ని ఎత్తేయడం లాంటివి ఈ వ్యూహంలో భాగమే! భారతదేశ దోపిడీ పాలకవర్గాలకి, సామ్రాజ్యవాదులకీ బి.జె.పి. తలపెడుతున్న ఈ పాసిజీకరణ వ్యూహం అనేది అనుకూలమే తప్ప ఏ రకంగాను వ్యతిరేకం కాదు. కనుక వారి అండదండలు బి.జె.పి.కి పుష్కళంగా వుంటాయి. దేశీయ దోపిడీ పాలకవర్గాలు వారు ఊడిగం చేస్తున్న విదేశీ సామ్రాజ్యవాద శక్తులు దేశ ప్రజలపై పడి విచ్చలవిడిగా దోచుకోవడానికి వీలుగా రాజ్య యంత్రాంగానికి మరిన్ని నట్లు, మరలు బిగించే పనిని యధేచ్ఛగా చేసుకు పోతోంది అధికారంలో వున్న ఫాసిస్టు బి.జె.పి.. 'కఠినతర రాజ్యం' (హార్డ్ స్టేట్) 'సమర్థవంతమైన రాజ్యం' (ఎఫెక్టివ్ స్టేట్) గూర్చి కేంద్ర హోం మంత్రి స్థానంలో వున్న కరడుగట్టిన హిందూ దురహంకార అభివృద్ధి నిరోధక మతఛాందసవాది, బాబ్రీ విధ్వంసక సూత్రధారీ, అపర హిట్లర్ అవతారీ అయిన అద్వానీ పదేపదే మాట్లాడుతున్నాడు, మాట్లాడుతున్నారు. ఈ ఫాసిస్టు రాజకీయ రాగానికి తగ్గట్టుగా ఆర్థిక పల్లవిని అందిస్తూ కేంద్ర ఆర్థిక మంత్రి యశ్వంత్ సిన్హా ఎన్ని సవాళ్ళు, ఆటంకాలు, విమర్శలు ఎదురైనా తన కఠిన వైఖరిని మార్చుకోజాలనని (అంటే దేశ ప్రజలపై మోపే పెను దోపిడీ భారాలు, వేట్లు విషయంలో చాలాపట్టుదలగా వ్యవహరిస్తాడన్న మాట) పదే పదే ప్రకటిస్తున్నాడు. ఇలాంటి ఫాసిస్టు వ్యూహాలు,

విధాన వైఖరులతో బి.జె.పి. ప్రభుత్వం ఈ దేశాన్ని దోపిడీ పాలకవర్గ బందిపోట్లకీ, ఈ బందిపోట్ల యజమానులైన సామ్రాజ్యవాద దుష్టశక్తులకి స్వర్గసీమగా మలచడానికి వీలుగా ఈ దేశాన్ని జాతుల బందిఖానాగా, మత మైనారిటీల శరణార్థ శిబిరంగా, దళితుల-ఆదివాసీల కాన్సన్‌ట్రేషన్ క్యాంపుగా, మహిళల నిర్బంధ శిబిరంగా మార్చేయడానికి సకల ప్రయత్నాలు చేస్తోంది.

ఇలాంటి పరిస్థితుల్లో ఈ దారుణ దోపిడీ అణచివేతల్ని మౌనంగా భరిస్తూ ప్రజలు పడుండరని, తిరగబడి తీరుతారని పాలకులకి తెలీంది కాదు. కనుక ప్రజా తిరుగుబాట్లని ఎదుర్కోడానికి ఇతరేతర మార్గాలన్నింటికంటే కూడా (అంటే తాత్కాలిక ఉపశమనాలు, రాయితీలు, తాయిలాలు, బుజ్జగింపులు, దృష్టి మళ్లింపు ప్రతీఘాతుక ఉద్యమాలు ఇత్యాది) పాశవిక అణచివేతే రాజమార్గంగా ఎంచుకొని దోపిడీ పాలకవర్గాలు ప్రభుత్వాలు తమ అణచివేత యంత్రాంగాన్ని పదును పెట్టుకుంటున్నాయి. ప్రజా తిరుగుబాట్లని సుళువుగా అణచేయాలంటే పోరాడే ప్రజలకి సరైన నాయకత్వం లేకుండా చేయాలి. తామనుసరిస్తోన్న దోపిడీ పాలకవర్గానుకూల, సామ్రాజ్యవాద అనుకూల పరమ ప్రజాకంటక కఠిన విధాన నిర్ణయాలు, వైఖరుల పర్యవసానంగా గతంలో ఎప్పటికంటే కూడా తీవ్రంగాను, విస్తృతంగాను భూస్వామ్య వ్యతిరేక సామ్రాజ్యవాద వ్యతిరేక నిరంకుశ రాజ్య యంత్రాంగ వ్యతిరేక ప్రజాపోరాటాలు, ప్రజాతంత్ర వుద్యమాలు వెల్లువలా పెల్లుబకనున్నాయి. ఈ సంగతి పాలకులకి తెలుసు. ఫాసిస్టు బి.జె.పి. ప్రభుత్వానికి స్పష్టంగా తెలుసు. పోరాటాలతో వీధులనెక్కే ప్రజలకి నాయకత్వం లేకుండా చేయాలనే కుట్రలో భాగంగానే పీపుల్స్‌వార్‌పై తన అణచివేత గురిని ఎక్కుపెట్టింది కేంద్రంలోని బి.జె.పి. ప్రభుత్వం. శతృదేశంతో యుద్ధానికి తలపడే తీరులో పీపుల్స్‌వార్‌కి వ్యతిరేకంగా వ్యూహరచనకి దిగింది. ఈ వ్యూహంలో భాగమే పీపుల్స్‌వార్ ఇప్పటికే విస్తరించి వున్న ఆంధ్ర, బీహార్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒరిస్సా రాష్ట్రాల మధ్య ఒక అత్యున్నత స్థాయి సమన్వయ సంఘాన్ని ఏర్పరచింది. ఈ సమన్వయ సంఘం కింద వివిధ సబ్‌కమిటీలు కూడా ఏర్పడ్డాయి. ఈ సమన్వయ సంఘానికి కోట్లాది రూపాయల బడ్జెట్ సైతం కేటాయింపైంది. ఈ వ్యూహాన్ని స్వయంగా అపర హిట్లర్ అద్వానీ పర్యవేక్షిస్తుంటాడు.

దేశంలో నెలకొన్న ఇలాంటి స్థితికి భిన్నంగా లేదు ఆంధ్ర రాష్ట్ర పరిస్థితి, పైగా ఇక్కడ ఫాసిస్టు చంద్రబాబు హయాంలో ప్రజలపై దాడులు మరింత దూకుడుగా సాగుతున్నాయి. పీపుల్స్‌వార్ పార్టీ, ఉద్యమాలకు ఆంధ్ర రాష్ట్రం తొలినుంచీ బలమైన కేంద్రంగా వుంటూ రావడం ఒక కారణంగాను ప్రపంచబ్యాంకు చేతిలో ఒక కిరాయి ఏజెంటుగా మలచబడిన మారిపోయిన చంద్రబాబు తిరిగి అధికార పగ్గాలు చేపట్టడం మరో అంశంగాను ఇక్కడ వర్గపోరాట స్థితి ఇంకెక్కడికంటే కూడా మరింత పదునుగా వుంటుంది. పార్టీ, ప్రభుత్వాల అధికారాల్ని మాజీ ముఖ్యమంత్రి స్వంత మామ అయిన ఎన్.టి. రామారావు నుంచి అనితర సాధ్యమైన వెన్నుపోటు విద్యతో కబ్జా చేసుకుని ముఖ్యమంత్రి పదవిని పదిలపరచుకున్న చంద్రబాబు 'పనివాడితనానికి' ప్రపంచబ్యాంకు అబ్బురపడి మరీ అతగాడిని దువ్వి ఆల్సేషియన్ కుక్కలా తర్ఫీదునిచ్చి రాష్ట్రం మీదికి వదిలింది.

అధికారాన్ని కైవశం చేసుకున్న మరునాటి నుండే చంద్రబాబు ప్రజలపై తదుపరి దాడులు ఎక్కుపెట్టాడు. కిలో 2రూ॥ లాంటి సంక్షేమ పథకాలన్నింటి రద్దు, మహిళలు పోరాడి మరీ సాధించుకున్న మద్యపాన నిషేధం రద్దు, విద్యుత్ ఛార్జీలు, బస్‌ఛార్జీల మోత, నిత్యావసర వస్తువుల ధరల పెంపు, వందలాది పరిశ్రమల మూత, కాల్దరిలో రైతులపై కాల్పులు కరువు వాతనపడి వందలాది మంది చావులు, వేలాది కుటుంబాల వలసలు-వీటన్నింటి పరాకాష్టగా నిత్యకృత్యం అయిపోయిన బూటకపు ఎన్‌కౌంటర్ హత్యలు! 1996-97 సంవత్సరాలు పశ్చిమ గోదావరి ఏజెన్సీ ప్రాంతమంతా గిరిజన భూపోరాటాలతో దద్దరిల్లింది. 1998వ సంవత్సరమంతా రైతుల ఆత్మహత్యలతో రాష్ట్రం అట్టుడికి పోయింది. ఇకా తరువాత విష జ్వరాల వాతపడి వైద్యమనేదే లేక వందలాది గిరిజన కుటుంబాలు విశాఖ ఏజెన్సీలో తుడిచిపెట్టుకు పోయాయి. ఇలా వుండగానే లోక్‌సభకి రాష్ట్ర అసెంబ్లీకి ఏకకాలంలో 1999 సెప్టెంబర్‌లో ఎన్నికలు జరిగాయి. జనాకర్షక పథకాలు అభివృద్ధికి ఆటంకాలు అంటూ సమాచార సాంకేతిక (ఐ.టి.) విమానంలో హైటెక్ విహారాలు చేస్తూ వచ్చిన చంద్రబాబు తీరా ఎన్నికలు దగ్గరపడేటప్పటికి దీపం, ఆదరణ, ముందడుగు లాంటి రకరకాల చిల్లర పథకాల జల్లులు కురిపిస్తూ ఓట్ల వేటకు దిగాడు. ముఖ్యంగా 'దీపం' మాయాజాలంతో మహిళల్ని మభ్యపరిచాడు. భూముల కబ్జా, ఆస్థుల కబ్జా, పదవుల కబ్జాలోనే కాదు, వంచనాశిల్పంతో ఓట్లని కబ్జా చేయడంలో సైతం చంద్రబాబు సాటివాళ్లందరినీ మించిపోయాడు. పచ్చి రాజకీయ అవకాశవాదీ, దగాకోరు అబద్ధాలకోరు అయిన చంద్రబాబు తానే చక్రం తిప్పుతూ వుండిన యునైటెడ్ ఫ్రంట్‌కి వెన్నుపోటు పొడిచేసి ఓట్లు రాల్చగలదని గ్రహించే బి.జె.పి.తో పొత్తుకి దిగారు. ఆ రకంగానే ఎన్నికల్లో గట్టెక్కి తిరిగి అధికారాన్నందుకున్నాడు. ప్రజాభిమానంతో సానుకూల ఓటుతో చంద్రబాబు ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చిందనే వాదన విశ్లేషణలు చంద్రబాబు పీపుల్స్‌వార్‌పై విషం కక్కుతూ ప్రచారం ప్రారంభించాడు. ఇది చంద్రబాబు తన వ్యూహానికి అనువుగా ఎంచుకున్న వైఖరే! ఏమంటే ఎన్నికల్లో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా జరిగేది, తన పార్టీ అయితే మరింత దూకుడుగా జరిగేదల్లా ఏమంటే ప్రజలపై, ప్రజావుద్యమాలపై దాడులే! ఈ విషయం అందరికంటే బాగా చంద్రబాబుకి తెలుసు. కనుకనే-పార్టీ భేదాలకతీతంగా స్వవర్గీయులైన దోపిడీ మూకలందరికీ అవసరమైన సంకేతాలు పంపడమే ఈ విమర్శల విరగబాటు ఆంతర్యం. అన్నింటికంటే ముఖ్యం పీపుల్స్‌వార్‌పై విషంకక్కే విమర్శలు పోలీసుల్ని ఎంతగానో ఉత్సాహపరుస్తాయి. ఎన్నికల్లో పోలీసుల పనివాడితనం గురించి చంద్రబాబుకంటే తెలిసినవారెవరూ వుండరు. ఆ రకంగా పోలీసుల్ని సంతోషపరచి వుద్యమ ప్రభావ ప్రాంతాలలోని ఓట్లను నిర్బంధ పూరితంగా వేయించుకుని, ప్రజలు పీపుల్స్‌వార్ వెనుక లేరని ప్రచారం చేయడం కూడా ఈ వ్యూహంలో ఒక అంశం! పైగా ఎలాంటి వెసులుబాటుకి, మెతకదనానికి తావివ్వకుండా పీపుల్స్‌వార్‌ని అణచిపారేయాలనేది చంద్రబాబుకి ప్రపంచబ్యాంకు తాకీదు. కనుక పీపుల్స్‌వార్‌పై మరింత క్రూరమైన అణచివేత సాగబోతోందనే సంకేతాల్ని అవసరమైన వారందరికీ ముఖ్యంగా పోలీసులకి అందించడమే దీని ఆంతర్యం!

ఇందుకనుగుణంగానే తన ప్రభుత్వం తిరిగి అధికారాన్ని అందీ అందుకోవడంతోనే ప్రజలపై దాడులు ప్రారంభించింది చంద్రబాబు

ప్రభుత్వం. బస్‌చార్జీల పెంపుతో ప్రారంభమైన ఈదాడి రోజుకో తీరులో అన్నిరంగాల ప్రజల్ని అతలాకుతలం చేస్తోంది. గుండెలు రగిలే ప్రజలు తలపడే పోరాటాలని విచ్ఛిన్నం చేసి అణచేయాలంటే ముందు రాష్ట్రంలోని విప్లవోద్యమంపైనే గురిపెట్టాలి, ప్రజలకి ఉత్సాహ ఉత్తేజాలనందించే, మార్గదర్శకత్వాన్నందించే నాయకత్వం లేకుండా చేయాలి. కనుకనే పీపుల్స్‌వార్‌పై అణచివేత అనేది తన ప్రభుత్వ ముఖ్య కర్తవ్యంగా భావిస్తూ చంద్రబాబు నడుం బిగించాడు. చంద్రబాబు ప్రభుత్వం ఇక్కడ ఎదుర్కొనే మరో ముఖ్య సమ్య ఏమంటే-ప్రత్యేక తెలంగాణా ఉద్యమం! తొలినుంచి తెలంగాణ గురవుతున్న దారుణ నిర్లక్ష్యం, అసమాన అభివృద్ధి, వలస కోస్తా సంపన్న వర్గాల ఆధిపత్య దోపిడీలకి వ్యతిరేకంగా తెలంగాణా ప్రజలు పెద్ద ఎత్తున మరో పోరాటానికి తలపడుతున్నారు. ఈ సమస్యపై సాటి బూర్జువా పార్టీలైన కాంగ్రెస్, బి.జె.పి.లు శక్తివంతమైన ప్రజావుద్యమాన్ని నిర్వహించగల స్థితిలో లేవని చంద్రబాబుకి తెలుసు. చిన్న రాష్ట్రాల ఏర్పాటుకి తాము వ్యతిరేకం కాకపోయినా తెలంగాణ విషయంలో దూరంగానే వుండదలచినట్లు బి.జె.పి. ప్రకటించేసింది. ఇక రివిజనిస్టు సి.పి.ఐ., సి.పి.యం. పార్టీల ఉద్యమ నిర్మాణశక్తి ఏమిటనేది అలా వుంచి అవి విధాన రీత్యానే ఈ ఉద్యమానికి వ్యతిరేక వైఖరితో అధికార పార్టీకి అనుకూలంగానే వుంటాయి. రాష్ట్రంలోని ఇతర విప్లవ నిర్మాణాలు తెలంగాణా గురవుతున్న వివక్షతపై పోరాటం అవసరమేగాని ప్రత్యేక తెలంగాణా నినాదం అంటరానిదనే వైఖరితో వుంటున్నారు. ఇక 'ప్రజాస్వామ్య తెలంగాణా' నినాదంతో ఈ ముఖ్య సమస్యపై సూత్రబద్ధ వైఖరితో ఉద్యమ ప్రాతిపదికగా శక్తివంతంగా పనిచేస్తున్నది పీపుల్స్‌వార్ పార్టీ మాత్రమే! ఇది చంద్రబాబుకి పెద్ద సవాలే! ఏమంటే-ప్రపంచబ్యాంకు రాష్ట్రంలో వర్తింపు చేయదలుస్తూ రూపొందించిన ప్రధాన పథకాలలో ప్రత్యేకంగా 'విజన్ 2020' అందులో అతి కీలక భాగం అయిన 'గ్రీన్ 2020' అంటే వ్యవసాయ విధానం అనేది 1991లో ప్రపంచబ్యాంకు ప్రకటించిన వ్యవసాయ విధాన పత్రానికి సరిగ్గా నఖలు! ఈ వ్యవసాయ విధానంలోని కీలకాంశమల్లా తెలంగాణా రైతాంగాన్ని పెద్ద ఎత్తున భూములనుంచి తొలగించేసి విశాలమైన వ్యవసాయ భూముల్ని దేశీయ, విదేశీయ కార్పొరేట్ సంస్థలకి ధారాదత్తం చేయడమే! ఈ దుష్ట పథకాన్ని తెలంగాణా రైతాంగం, వారికండగా పీపుల్స్‌వార్ పార్టీ ఎంత దృఢంగా వ్యతిరేకించగలవో చంద్రబాబుకి తెలుసు! ఈ రకంగా ప్రపంచబ్యాంకు సలహాలు పథకాలకనుగుణంగా ఈ రాష్ట్రాన్ని దేశీయ విదేశీయ దోపిడీ దార్లందరికీ యధేచ్ఛగా కట్టబెట్టేయడానికి ఒప్పందపడి పోయిన చంద్రబాబు కిరాయి ప్రభుత్వం ఇందుకు రాష్ట్రంలో పెద్ద ఆటంకంగా వుంటున్న పీపుల్స్‌వార్‌తో తాడో పేడో తేల్చుకునే బరితెగింపు వైఖరికి తలపడింది.

ఈ బరితెగింపులో భాగమే, చంద్రబాబు ప్రభుత్వం తన చెప్పుచేతుల్లోని పోలీసు జాగిలాల్ని ఉరకదోలించి కోవర్టు పద్ధతిలో అతి నీచమైన కుట్రకు పాల్పడి మన పార్టీ కేంద్రకమిటీ నేతలు ముగ్గురిని కిరాతకంగా హత్య చేయించింది. ఈ నేతల హత్యాకాండతో మన పార్టీ ఉద్యమాలు వెన్నువిరిగి కుప్పగూలి పోతాయని, ఈ పెనుఘాతం నుంచి ఇక ఎన్నటికీ మనపార్టీ కోలుకోలేదని చంద్రబాబు ప్రభుత్వం అతడి పోలీసు యంత్రాంగం ప్రచారం లంకించుకున్నాయి. కాని వీరి సంబరాల బడాయి మూన్నాళ్ళ ముచ్చటగా కూడా సాగలేదు. ఈ దారుణ హత్యాకాండ వార్త వెలువడిన కొద్ది గంటల వ్యవధిలోనే విప్లవ ప్రజానీకంలో రగిలిన ఆగ్రహావేశ నిరసన జ్వాలలతో రాష్ట్రం భగ్గుమంది. ఇక తెలంగాణ జ్వాలాముఖీ అయింది. రోజురోజుకీ ప్రజ్వలించక తప్పని ప్రజా విప్లవ జ్వాలల బారినపడి మసై పోకుండా దోపిడీ పాలకవర్గాల బందిపోటు నేతలందరికీ రక్షణ దుర్గంగా మలుస్తూ ప్రపంచబ్యాంకు ప్రణాళికతో తగిన బందోబస్తులతో రూపుదిద్దబడిన 'సైబరాబాద్'కి ప్రజాశత్రువులంతా పరుగులు తీశారు. గ్రామ సర్పంచ్ స్థాయి నుంచి రాష్ట్ర మంత్రుల వరకు మన పార్టీ వ్యతిరేక, ఉద్యమ వ్యతిరేక, ప్రజా వ్యతిరేక చరిత్ర స్వభావాలుండే వారందరికీ తెలంగాణా పల్లెలు నిషేధం ప్రకటించాయి. 'మర్డర్లు-మానభంగాలు, చోరీలు-ఘోరాలు; శవాలు-పంచనామాలు; కేసులు-చార్జిషీట్లు వేటితో పనిలేదు, దేన్నీ పట్టించుకోవద్దు, స్టేషన్లకే పరిమితమై తుపాకుల పహారాలో ప్రాణాలు దక్కించుకోండి' అనే తీరులో పోలీసు ఉన్నతాధికార్లు తెలంగాణాలోని అన్ని పోలీసు స్టేషన్లకి హెచ్చరికలు జారీ చేసారు. ఇక పోలీసులు అక్షరాలా ఈ హెచ్చరికల్ని పాటించారు. కూడా! ఊరూరునా వీధి వీధినా ప్రజలు ప్రజ్వలించక పోతే; పార్టీ నేతల హత్యాకాండ పట్ల ఎంతటి వీరావేశం ఆగ్రహావేశాలతో వున్నప్పటికీ కేవలం పార్టీ కార్యకర్తలు, సానుభూతిపరులు, పార్టీ సాయుధ దళాల చర్యలు స్పందనలతోటే ఇంతటి తిరుగుబాటు వాతావరణం నెలకొనడం ఇంతటి నిరసన జ్వాల రగలడం అనేవి అసంభవం అన్న వాస్తవం చంద్రబాబు ప్రభుత్వానికి పోలీసు దొరకి తెలీందేమీ కాదు. నూతన సహస్రాబ్ది నూతన సంవత్సరం తొలి జనవరి మాసం మొత్తం నెలదినాలు రాష్ట్రాన్ని, ప్రభుత్వాన్ని కుదిపేస్తూ మన పార్టీ ఆధ్వర్యంలో ప్రజలు జరిపిన మిలిటెంట్ నిరసనల వార్తలే ప్రధానం అనేది అతిశయోక్తి కాదు. ఇక ఈ అమరనేతల అంత్యక్రియలకి హాజరైన జనసందోహం సంగతి చెప్పనే అక్కర్లేదు. పోలీసు ఆంక్షల్ని, అడ్డంకుల్ని వెక్కిరిస్తూ ధిక్కరిస్తూ గ్రామాలకు గ్రామాలే కదలిపోయాయి.

మన పార్టీ ప్రభావ ప్రాంతాల్లోని విప్లవ ప్రజల విప్లవ శక్తుల ఆగ్రహావేశాలు, నిరసనలు ఇలా వుండగా; మన పార్టీ ఉద్యమాలకి వెలుపల వుండే రాష్ట్రంలోని ఇతర విప్లవ పార్టీలు, వివిధ విప్లవ ప్రజాసంఘాలు, దళిత, మహిళాసంఘాలు, పౌరహక్కుల సంఘాలు ఈ హత్యాకాండని నిర్ద్వంద్వంగా ఒకే గొంతుతో ఖండించాయి. రాష్ట్రంలోని సి.పి.ఐ., సి.పి.ఎం. పార్టీలు ఈ హత్యాకాండని ఖండిస్తూ దీనిపై న్యాయ విచారణను డిమాండ్ చేసాయి. చివరకి రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సైతం దీన్ని ఎన్‌కౌంటర్‌గా చూడ నిరాకరిస్తూ న్యాయ విచారణను కోరింది. ఒక్కమాటలో చెప్పాలంటే-ఫాసిస్టు చంద్రబాబు ప్రభుత్వం దాని పోలీసు గూండాలు, చంద్రబాబుని రాష్ట్రాధినేతగా మలచడంలో తన శక్తియుక్తులన్నింటినీ అంకితం చేస్తూ ప్రాంతీయ దళారీ బూర్జువాగా పడగెత్తిన రామోజీరావు అతడి 'ఈనాడు' తప్ప రాష్ట్రంలోని ఇతర సంస్థలు, వ్యక్తులు, పత్రికలు ఏ ఒక్కరూ ఏ ఒక్కటీ కూడా ఇది నిజంగా ఎన్‌కౌంటరేనని అంగీకరించడానికి అనడానికి సాహసించలేదు సరికదా 'ఇది నగ్నమైన పోలీసు హత్యాకాండే' అని ప్రకటించలేక పోయినా ఈ ఎన్‌కౌంటర్ కథనం అనుమానాస్పదం అంటూ న్యాయ విచారణ జరిగి తీరాల్సిందేనని చెప్పారు. పీపుల్స్‌వార్ పార్టీ ఉద్యమాలు అంతరించి పోవాలని మనసారా కోరిన 'ఆంధ్రప్రభ' కూడా ఈ బూటకపు ఎన్‌కౌంటర్‌పై న్యాయ

విచారణను డిమాండ్ చేసింది. ఇందుకు ఏకైక మినహాయింపు అల్లా కేంద్రంలో ఎన్.డి.ఏ. ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తున్న ఫాసిస్టు బి.జె.పి. రాష్ట్రనేత, రాష్ట్రంలో పీపుల్స్‌వార్ ఉద్యమాన్ని అణచేయడానికి వీలుగా చంద్రబాబు ప్రభుత్వానికి అవసర సహకార సమన్వయాలని అందించడానికే కేంద్రంలో హోంశాఖ సహాయ మంత్రి పదవిని చేపట్టిన కరీంనగర్ యం.పి. విద్యాసాగరరావు మాత్రమే! ఇతడు బాహాటంగానే ఈ హత్యాకాండని మనసారా సమర్థిస్తూ చంద్రబాబుకి తన హర్షాభివందనల్ని తెలియజేసాడు. ఇది సహజమే! ఏమంటే కేంద్రంలోని ఇతగాడి ప్రభుత్వం సైతం పీపుల్స్‌వార్‌పై అణచివేత అనేదాన్ని తన ముఖ్య కర్తవ్యంగానే పాటిస్తోంది!

ఆంధ్ర రాష్ట్రంలోనే కాదు, దేశంలోనే కాదు, సాయుధ ప్రజా విప్లవోద్యమాలు చురుగ్గా సాగుతున్న పిలిప్పైన్స్, టర్కీ, న్యూజిలాండ్, బెల్జియం లాంటి దేశాల విప్లవ ప్రజానీకం తమతమ విప్లవ పార్టీల ద్వారా మన పార్టీ నేతలపై సాగిన ఈ ఫాసిస్టు హత్యాకాండను తీవ్రంగా నిరసిస్తూ, మనపార్టీ కేంద్రకమిటీకి తమ ప్రగాఢ సానుభూతి సంతాపాల్ని తెలియజేస్తూ సందేశాలు పంపారు. ఈబూటకపు ఎన్‌కౌంటర్‌ని నిరసిస్తూ, కేంద్ర హోంమంత్రి అద్వానీ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర డి.జి.పి. దొర కుమ్మక్కయి జరిపిన ఈ కుట్రపూరిత హత్యాకాండపై విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ బెల్జియం వర్కర్స్ పార్టీ భారత రాష్ట్రపతికి లేఖ రాసింది. అంతర్జాతీయ విప్లవోద్యమ కమిటీ (రిమ్) ఈ హత్యాకాండని తీవ్రంగా నిరసిస్తూ మన నేతల అమరత్వం భారత విప్లవోద్యమాన్ని మరింత ఎరుపెక్కించగలదనే ఆశా భావాన్ని వ్యక్తపరుస్తూ మనపార్టీ కేంద్రకమిటీకి తన సందేశాన్ని ప్రంపింది. ఇంతటి అపూర్వమైన, ఘనమైన స్పందనల్ని ఈ ముగ్గురు కామ్రేడ్స్ అమరత్వం రగిలించ గలిగిందంటే- వీరి వెనుక సమీకరణ అయివుంటున్న శక్తివంతమైన మన పార్టీ ఉద్యమాల పాత్ర అనేది ఒక అంశం కాగా; ఈ పార్టీ ఉద్యమాల నిర్మాణం పురోగమనాల చరిత్రలతో పెనవేసుకు పోయినవిగా, వాటినుంచి వేరుచేసి చూడవీలు లేనివిగా తమ విప్లవ జీవిత చరిత్రల్ని మలచుకున్న ఈ ముగ్గురు నాయకత్వ కామ్రేడ్స్ విశిష్ట విప్లవ కృషి అనేది వేరొక అంశం! వీరి జీవిత చరిత్రల్లోకి రేఖామాత్రంగా తొంగి చూసినా కూడా ఇది స్పష్టంగా అర్థమవుతుంది.

## కామ్రేడ్ నల్లా ఆదిరెడ్డి (శ్యాం)

శ్యాంగా చిరపరిచితుడైన కా॥ నల్లా ఆదిరెడ్డి కరీంనగర్-ఆదిలాబాద్ ఉద్యమాల ప్రియతమ పుత్రుడు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ తాలూకా కొత్తగట్టు గ్రామంలో 1956వ సం॥లో కా॥ శ్యాం ఒక మధ్య తరగతి రైతు కుటుంబంలో జన్మించాడు. జమ్మికుంట కళాశాలలో డిగ్రీ చదువుతూ రాడికల్ విద్యార్థి సంఘంలో చేరాడు. ఆంధ్రప్రదేశ్‌లో 1973 నుండి రాజుకుంటున్న విప్లవ విద్యార్థి ఉద్యమంలో పనిచేస్తూనే జె.ఎన్.ఎమ్. కార్యకలాపాల్లో పాలుపంచుకున్నాడు. 1975లో ఇందిరా ప్రభుత్వ ఎమర్జెన్సీ కాలంలో కళాశాల అధికారులు విద్యార్థులపై అమలు చేసే నిర్బంధానికి నిరసన తెలిపి అజ్ఞాతవాసం వెళ్ళాడు. అప్పటినుండి చనిపోయేనాటి వరకు విప్లవోద్యమంలో చాలా కీలక పాత్ర వహించాడు. ఎమర్జెన్సీ కాలమంతటా జగిత్యాల తాలూకా మద్దనూర్ కేంద్ర ఆర్గనైజర్‌గా రహస్య జీవితం కొనసాగించి మద్దనూర్ భూస్వామికి వ్యతిరేకంగా రైతాంగాన్ని కూడగట్టాడు. పార్టీ నిర్ణయం మేరకు ఆదిలాబాద్ జిల్లాలో తపాలాపూర్ భూస్వాముల మీద దాడిచేసి వారిని శిక్షించడంలో ముందున్నాడు. కా॥ శ్యాం మిలిటెంట్ దాడుల్లో చురుకుగా వుండేవాడు. ఎమర్జెన్సీ ఎత్తివేత పిమ్మట ఉప్పెనలా ముందుకు వచ్చిన కరీంనగర్, ఆదిలాబాద్ పోరాటాలకు నాయకత్వం వహించాడు. 1977లో కరీంనగర్ జిల్లా కమిటీ కార్యదర్శిగా ఉంటూనే రెండు జిల్లాలను కో-ఆర్డినేట్ చేశాడు. రాష్ట్రంలో ప్రజా ఉద్యమాలను మలుపు తిప్పన జగిత్యాల జైత్రయాత్ర. ఆసిఫాబాద్ గోండన్నల తిరుగుబాటుకు గైడెన్స్ అందించాడు. 1979లో నూతనంగా ఏర్పడిన ఆదిలాబాద్ జిల్లా కమిటీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టి ఆదిలాబాద్ జిల్లా ఉద్యమ విస్తరణకు ఎనలేని కృషిచేశాడు. 1980 సెప్టెంబరులో జరిగిన రాష్ట్ర కాన్ఫరెన్స్‌లో రాష్ట్రకమిటీ సభ్యుడిగా ఎన్నుకోబడి గెరిల్లాజోన్ ఉద్యమ నిర్మాణానికి ప్రముఖ పాత్ర వహించాడు. ఆ క్రమంలో అడవి దళాలను సమన్వయం చేయడానికి ఏర్పడిన ఫారెస్టు లైజాన్ కమిటీలో సభ్యుడిగా తన పాత్ర నిర్వహించాడు. మరోవైపు సింగరేణిలో మిలిటెంట్ కార్మికోద్యమానికి నాయకత్వం వహించి ఎందరో కార్మిక యువకులను ఆదిలాబాద్ గ్రామీణ ప్రాంతానికి పంపించాడు. ఇలా రైతాంగ ఆదివాసీ, కార్మిక ఉద్యమాల్లో భాగమై ఉద్యమం గెరిల్లాజోన్ స్థాయికి అభివృద్ధి చెందడానికి పునాదులు వేశాడు.

1985 పార్టీ మొదటి అంతర్గత సంక్షోభంలో ఆంధ్రరాష్ట్ర కమిటీ కార్యదర్శిగా, కేంద్రకమిటీ సభ్యుడిగా బాధ్యతలు చేపట్టి పార్టీ సంక్షోభాన్ని విజయవంతంగా అధిగమించడానికి కృషి సల్పాడు. 1986లోనే హైదరాబాద్‌లో శత్రువు చేతికి చిక్కి రెండు సంవత్సరాలు జైలు జీవితం గడిపాడు. 1988లో ఆదిలాబాద్ పట్టణంలో సబ్‌జైలు నుండి తప్పించుకుని నేరుగా విప్లవోద్యమ నిర్మాణానికి నడుం బిగించాడు. 1990లో మళ్ళీ కేంద్రకమిటీ సభ్యుడిగా ఆంధ్రరాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టాడు. అప్పటికి పార్టీ నాయకుడైన కె.యస్. సృష్టించిన సంక్షోభంలో పార్టీ సరైన పంథాను నిలబెట్టడం కోసం పోరాడాడు. కె.యస్. ముఠాను ఓడించి పార్టీని ముందుకు నడిపించడంలో కీలకపాత్ర నిర్వహించాడు. ఇలా ఉద్యమాన్ని మలుపు తిప్పడంలో, పార్టీ సంక్షోభాలను ఎదుర్కొని నడిపించడంలో సమర్థవంతంగా నాయకత్వాన్ని అందించాడు. ఆచరణ నుండి విషయాలను గ్రహించి సైద్ధాంతీకరించడం, ఆ క్రమంలో కొత్త ప్రతిపాదనలు చేయడంలో అభివృద్ధి చెందాడు. పార్టీ పనివిధానంలో వాస్తవాల వైపుగా నిలబడుతూ సత్యం కోసం పోరాడేవాడు. పార్టీ శ్రేణులతో, తనతోటి కమిటీ సభ్యులతో చక్కటి సంబంధాలు కల్గి వున్నాడు. విప్లవ వ్యతిరేకులతో, శత్రువుతో, విచ్ఛిన్నకారులతో కా॥ శ్యాం ఎప్పుడూ రాజీ పడలేదు. ఆయన ఉత్తర తెలంగాణ స్పెషల్‌జోన్ మొదటి కాన్ఫరెన్స్ ముగింపు ఉపన్యాసంలో మాట్లాడుతూ '' పార్టీ రెండు కవల పిల్లలను కన్నది. అవి ఉత్తర తెలంగాణా, దండకారణ్యం అనే రెండు గెరిల్లాజోన్స్- వీటిని అభివృద్ధి చేయాల్సిన బాధ్యత పార్టీపై వుందని'' పిలుపిచ్చాడు. ఆ కవల పిల్లల లాంటి ఉద్యమాలను అభివృద్ధి చేయడానికి కేంద్రకమిటీలో చాలా కృషి చేశాడు. గెరిల్లాజోన్స్ అధ్యయనంలో ముందుండేవాడు.

గెరిల్లాజోన్స్‌కు సంబంధించిన ఆయన ప్రతిపాదనలెన్నో పార్టీ అంతటి ఆమోదం పొందాయి. అవి ఆచరణలో అనేక మంచి ఫలితాలు ఇచ్చాయి. తన ఆలోచనలో, ఆచరణలో ప్రజాపంథా, ఐక్య సంఘటన, ప్రజా ఉద్యమాలకు, ప్రజా రాజకీయాధికారానికి, గెరిల్లా సైన్య నిర్మాణానికి ప్రాధాన్యత నిచ్చేవాడు. తన 25 ఏళ్ళ విప్లవ జీవితంలో మంచి పరిణతి కల్గిన నాయకుడిగా ఎదిగాడు. కా॥ శ్యాం నుండి మనం నేర్చుకోవాల్సిన ఎన్నో మంచి అంశాలున్నాయి. నిలకడ కల్గిన, క్రియాశీలమైన ఆలోచన ఆయన సొత్తు. విప్లవంలో ఎల్లప్పుడూ ఉత్సాహంగా పాల్గొన్నాడు. స్నేహశీలంగా వుంటూ కేడర్లకు రాజకీయ బోధనలో సహాయాన్నందించేవాడు. కార్యశీలత, నిర్మాణదక్షత, వ్యూహరచనాశక్తి కల్గిన కా॥ శ్యాం మూడు దశాబ్దాల విప్లవోద్యమ ప్రతి మలుపులో నాయకత్వ పాత్ర వహించాడు.

భారత విప్లవోద్యమంలో మితవాద, ''అతివాద'' అవకాశవాదాలు ప్రమాదకరంగా పరిణమించి ప్రజలను ప్రక్కదారి పట్టించడమేగాక, తీవ్రమైన నష్టాలు చేకూర్చాయి. కా॥ శ్యాం ఈ రెండు పెడ ధోరణులకు వ్యతిరేకంగా తీవ్రమైన పోరాటాన్ని చేపట్టినాడు. ఆయన ఈ పోరాటానికి తానొక్కడే కాక పార్టీని మొత్తం సిద్ధం చేయడానికి తీవ్రమైన కృషి చేశాడు. విప్లవోద్యమంలో తప్పులు జరగడమనేది వాస్తవమేనని కాబట్టి తాను పనిచేసిన ప్రతిచోట పార్టీ లైన్‌ను సరిగా అమలు జరిపించేటట్టు చూడడం తన లక్ష్యంగా ఎంచుకున్నాడు. తప్పులకు బహిరంగంగా బాధ్యత వహించి, వాటిని సరిదిద్దుకోవడానికి సహాయం అందించేవాడు.

కా॥ శ్యాం ఈ మధ్య విప్లవోద్యమానికి మితవాద, ''అతివాద'' అవకాశవాదాలు ఎంత ప్రమాదకరమైనవో ఆర్థికవాదం కూడా అంతే ప్రమాదాన్ని కలుగజేస్తుందని, ఉత్తర తెలంగాణాలో ఆచరణ నుండి ఆర్థికవాదం ఏ విధంగా పార్టీ పని విధానంలో ప్రతిబింబిస్తుందో క్యాడర్లకు విద్యగరిపే ఒక వ్యాసాన్ని రాశాడు.

1998 హైదరాబాద్‌కు చెందిన ఉదారవాద ప్రజాస్వామిక వాదులతో చర్చలు జరిగినపుడు తాను కా॥ మహేష్‌తో కలిసి వారి బూర్జువా ప్రజాస్వామిక భావాలలోని తప్పు అవగాహనను ఎత్తి చూపాడు. అదే సమయంలో పార్టీవైపు నుండి సమాచార లోపంవల్ల క్యాడర్లలో జరుగుతున్న పొరపాట్లను సరిదిద్దవలసిన అవసరాన్ని ఒప్పుకున్నాడు. 30 సం॥ల పార్టీ చరిత్రలో ప్రత్యేకంగా 1980 నుండి పార్టీలో తలెత్తిన అన్యవర్గ ధోరణులకు వ్యతిరేకంగా పోరాడడానికి విమర్శ-స్వయంవిమర్శను, పార్టీలోని చెడులను సరిదిద్దడానికి దిద్దుబాటు ఉద్యమాలని కింది నుండి మీదికి, మీది నుండి కిందికి నిర్వహించడంలో తాను ఇతరులకు ఆదర్శంగా నిలిచాడు. ఆయన ఎప్పుడూ నిర్మొహమాటంగా పొరపాట్లను ఒప్పుకోడానికి సిద్ధంగా వుండేవాడు. ఇతరుల పొరపాట్లను విమర్శించేటప్పుడు వారి సరిదిద్దడానికి ప్రత్యేక శ్రద్ధ వహించేవాడు.

ఇంతేకాక ఫీల్డుకు పోయి ప్రతి క్యాంపెయిన్ కింద ఎలా అమలవుతున్నదో పర్యవేక్షించి ఆయా స్థాయిలలోని కమిటీలలో సూటిగా విమర్శ ప్రవేశపెట్టి ఆయా నిర్మాణాలలో తప్పులను సరిదిద్దబడే విధంగా గైడెన్స్ ఇచ్చేవాడు. అటువంటి సూత్రబద్ధమైన వైఖరి ద్వారా తోటి కామ్రేడ్ల అభిమానాన్ని చూరగొనే కా॥ శ్యాం పద్ధతిని మనం ఆదర్శంగా తీసుకోవాలి. ఉద్యమంతో పాటు అంచెలంచెలుగా ఎదుగుతూ, ఉద్యమాన్ని ఉన్నతస్థాయికి అభివృద్ధి చెందిస్తూ, భారత విప్లవోద్యమ అగ్ర నాయకులలో ఒకడిగా ఖ్యాతిగాంచి, జీవితమంతా నిజమైన విప్లవకారుడిగా క్యాడర్ల, ప్రజల హృదయాలలో చెరగని ముద్రవేసిన కా॥ శ్యాం విప్లవ జీవితం మనందరికీ అనుసరణీయమైనది.

## కామ్రేడ్ ఎర్రంరెడ్డి సంతోష్‌రెడ్డి (మహేష్)

తెలంగాణా సాయుధ పోరాట మొదటి అమరుడు కా॥ దొడ్డి కొమురన్నకు మరెందరో అమరులకు జన్మనిచ్చిన వరంగల్ జిల్లాలోని కడివెండి గ్రామంలోనే కా॥ సంతోష్ పుట్టి పెరిగాడు. వరంగల్‌లో రాడికల్ విద్యార్థి నాయకుడిగా డిగ్రీ పూర్తి చేసి హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్శిటీలో ఎమ్.ఎస్.సి.లో చేరాడు. కా॥ జార్జిరెడ్డి అమరుడైన తర్వాత ఉస్మానియాలోని విప్లవ విద్యార్థి ఉద్యమంలో నెలకొని వున్న స్తబ్దతను కా॥ సంతోష్ ఛేధించాడు. ఉస్మానియా యూనివర్శిటీలోనే కాక సిటీలోని విద్యార్థి హాస్టళ్ళను, పాలిటెక్నిక్, దిల్‌సుఖ్‌నగర్ బి.సి.హాస్టళ్ళను విద్యార్థి కేంద్రాలుగా మార్చి, ఎందరో విద్యార్థులను ఆర్గనైజర్లుగా మలిచాడు. సిటీ విద్యార్థి ఉద్యమ బాధ్యుడుగా వుండి 1981లో ఏర్పడిన సిటీ పార్టీ కమిటీలోకి సభ్యునిగా ఎన్నికైనాడు. విద్యార్థి ఉద్యమాన్నేగాక సిటీలో కార్మికుల, మహిళల, ప్రజాస్వామిక ఉద్యమాలను కూడా గైడ్ చేశాడు. ఈ కాలంలో హైదరాబాద్ నుండి పదుల సంఖ్యలో విద్యార్థులు, యువజనులు, మహిళలు, గ్రామీణ, అటవీ ఉద్యమాల నిర్మాణానికి తరలివెళ్ళారు. 1984లో రాష్ట్రకమిటీ ఖమ్మం జిల్లా ఉద్యమాన్ని పునర్నిర్మించడానికి ఆ జిల్లా ఆర్గనైజర్‌గా పంపింది. 1985లో జరిగిన ఉత్తర తెలంగాణా రీజినల్ కమిటీ ఆల్టర్‌నేటివ్ సభ్యునిగా ఎన్నికైనాడు. 1985 డిసెంబరులో ఒక ద్రోహి ఇచ్చిన సమాచారంతో అరెస్టై ఐదు సం॥లు జైలులో వున్నాడు. ఈ కాలం పార్టీకి పరీక్షా కాలం. పార్టీలో సంక్షోభం, తీవ్ర నిర్బంధ కాలం కూడా. ఈ సమయంలో జైలు వాతావరణంలో కామ్రేడ్స్‌ను ఉత్తేజంగా నిలబెట్టడంలో తన కృషి అద్వితీయమైనది. జైలును రాజకీయ పాఠశాలగా మార్చి అనేకమంది కామ్రేడ్స్ విడుదలైన తర్వాత విప్లవోద్యమంలో దృఢంగా నిలబడడానికి తోడ్పడ్డాడు. ఈ కాలంలో తన రాజకీయ-సైద్ధాంతిక జ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోడానికి సీరియస్‌గా అధ్యయనం చేయడం మాత్రమే కాక తన తోటి కామ్రేడ్ల అభివృద్ధికి నిరంతరం సహకరించాడు. సుదీర్ఘ జైలు జీవితం ఆయన విప్లవ తత్వాన్ని నిర్వీర్యపర్చలేదు సరికదా జైలు నుండి బయటకు వచ్చి రాజకీయంగా పరిణతి చెందిన నాయకుడిగా విప్లవోద్యమ బాధ్యతలు చేపట్టాడు.

1991 డిసెంబర్‌లో వరంగల్ నుండి అటవీ ప్రాంతాన్ని విడగొట్టి ఉత్తర తెలంగాణా ఫారెస్ట్ డివిజన్ (ఎన్.టి.ఎఫ్.డి.) ఏర్పర్చి, నిర్మించిన కమిటీకి కార్యదర్శిగా నామినేట్ చేయబడ్డాడు. 1992 ఏప్రిల్‌లో ఉత్తర తెలంగాణా రీజియనల్ కమిటీ సభ్యుడిగా కో-ఆప్ట్ అయినాడు. అదే సంవత్సరం అక్టోబర్‌లో జరిగిన రాష్ట్ర ప్లీనంలో రాష్ట్రకమిటీ సభ్యుడిగా ఎన్నుకోబడినాడు. 1993లో దక్షిణ తెలంగాణా ఉద్యమ నాయకత్వం అరెస్టు కావడం జరిగిన నేపథ్యంలో ఆ రీజియన్‌కు ఉద్యమ నిర్మాణానికి వెళ్లాడు. 1995లో జరిగిన రాష్ట్ర కాన్ఫరెన్స్‌లో రాష్ట్రకమిటీ కార్యదర్శిగా, ఆ వెంటనే జరిగిన కేంద్ర కాన్ఫరెన్స్‌లో కేంద్రకమిటీ సభ్యుడిగా ఎన్నుకోబడినాడు. 1995 తర్వాత మూడు రీజియన్‌లు, హైదరాబాద్, వైజాగ్ పట్టణాలతో

కలిపిన ఆంధ్ర రాష్ట్ర ఉద్యమాన్ని నిర్మించడంలో చాలా కృషి చేశాడు. వైవిధ్యపూరితంగా వుండే మూడు రీజియన్స్‌ను కో-ఆర్డినేట్ చేశాడు. ఈ సమయంలో కూడా సిటీ ఉద్యమాన్ని నేరుగా కామ్రేడ్ మహేష్ గైడ్ చేశాడు.

కామ్రేడ్ మహేష్ ప్రజాస్వామిక ఉద్యమంపై స్పష్టమైన సైద్ధాంతిక అవగాహన కలిగి వున్నాడు. ఉదారవాద ప్రజాస్వామిక మేధావులు పార్టీని, ప్రభుత్వాన్ని ఒకే గాటన కట్టి విమర్శించినప్పుడు ఎప్పటికప్పుడు సమాధానమిచ్చి వారి తప్పుడు అవగాహనను ఎత్తి చూపాడు. శత్రువు విప్లవోద్యమంపై చేపట్టిన వైఖరిని అర్థం చేసుకోకుండా తమకున్న పరిమితుల నుండి ఉద్యమంపై పరిమితులు విధింపజూసిన ఈ ఉదారవాద ప్రజాస్వామిక మేధావుల తప్పుడు అవగాహనలను ఓడించి ప్రజల్లో బహిర్గత పరచడంలో కా॥ మహేష్ నిర్వహించిన పాత్ర అద్వితీయమైనది. ఒక యువ సిద్ధాంత వేత్తగా కా॥ మహేష్ మార్క్సిస్టు-లెనినిస్టు సూత్రాల నుండి ఈ సమస్యపై పార్టీని, ప్రజలను చైతన్య పరిచాడు. 1995-98 కాలంలో ఎ.పి. రాష్ట్ర కమిటీ నూతన కార్యదర్శిగా బయట కుహనా మార్క్సిస్టులు, ఫెమినిస్టులు ఇంకా రకరకాల వారు మార్క్సిజం కుల సమస్య, మహిళా సమస్య, సెక్షనల్ ఉద్యమాలను పరిష్కరించడంలో విఫలమైందని విషప్రచారం చేస్తూ గందరగోళం లేపినపుడు చొరవ ప్రదర్శించి పార్టీ వైఖరిని ప్రజల ముందుంచి వారిని ఎండగట్టాడు. ఈ సమస్యల పట్ల కేడర్‌కు, ప్రజాసంఘ నాయకులకు ముందుండి పార్టీలైన్‌ను సరిగ్గా అర్థం చేయించాడు. శత్రు పాశవిక నిర్బంధం మధ్య పట్టణ ఉద్యమాలని ముందుకు తీసుకుపోవడం పార్టీ ముందు ఛాలెంజ్‌గా వున్న పరిస్థితుల్లో పార్టీ రహస్య యంత్రాంగాన్ని రక్షిస్తూ హైదరాబాద్, విశాఖ పట్టణోద్యమాల నిర్మాణ స్వరూపాలను, స్వీయాత్మక శక్తులను నిర్బంధం మధ్య అభివృద్ధి చేస్తూ శత్రువుపై ఆధిక్యత సాధించి, నష్టాలు జరిగినపుడు ఆ అనుభవాల నుండి గుణపాఠాలు తీయడంలో ఎ.పి. రాష్ట్రకమిటీకి నాయకత్వం వహించాడు. గత 7, 8 సం॥లుగా ఎస్.ఐ.బి. యంత్రాంగం కేంద్ర, రాష్ట్ర నాయకత్వాలను తుడిచిపెట్టాలని తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నపుడు రాష్ట్రకమిటీ చొరవ కోల్పోకుండా కా॥ మహేష్ నిబ్బరంగా వ్యవహరించాడు.

విప్లవోద్యమం ఎదుర్కొంటున్న నిర్దిష్ట సమస్యలకు మార్క్సిజం-లెనినిజం-మావో ఆలోచనా విధానాన్ని సృజనాత్మకంగా అన్వయించడంలో కా॥ మహేష్ అసాధారణ ప్రజ్ఞాపాటవాలను ప్రదర్శించాడు. ఫిబ్రవరి 1999లో జరిగిన ఎ.పి. ప్లీనం డెలిగేట్ల ముందు పార్టీని ఉదారవాదం, స్పాంటేనిటీ, ఆర్థికవాదం, పెత్తందారీ ధోరణులు, స్వీయాత్మకత వంటి చెడుల నుండి బయట పడవేసేందుకు ఉద్దేశించిన దిద్దుబాటు ఉద్యమానికి సంబంధించిన నిర్దిష్ట కార్యక్రమాన్ని ప్రవేశపెట్టాడు. కామ్రేడ్ మహేష్ విద్యార్థి ఉద్యమాలను నిర్మించే దశనుండి ఈ రెండు దశాబ్దాలలో వర్గ పోరాటాలకు, గెరిల్లా పోరాటాలకు నాయకత్వం వహించే దిశగా ఎదిగాడు. వర్గ పోరాటం నుండి 5 సంవత్సరాలు జైలు జీవితం అవరోధం కల్గించినప్పటికీ అతని అధ్యయనం మాత్రం ఆగలేదు. అవసరమైనప్పుడు ఆచరణలోకి వెళ్లి అనుభవాన్ని సంపాదించి నాయకత్వ స్థానంలోకి ఎదిగాడు. సాధారణంగా కనిపించే కామ్రేడ్ మహేష్‌కు అసాధారణమైన పరిశీలనా శక్తి వుంది. నిర్మాణ, రాజకీయ రంగాల్లో విమర్శనాత్మక పరిశీలన కల్గి వున్నాడు. మామూలుగా మాట్లాడుతూనే ఎంతో లోతుల్లోకి వెళ్ళి మాట్లాడగలడు. ఏ విషయాన్నైనా ఓపికగా, వివరంగా ఎవరైనా సులువుగా అర్థం చేసుకునేలా మాట్లాడగలడు. ఎంత క్లిష్ట పరిస్థితిలోనైనా చాలా బ్యాలెన్స్‌గా నిర్ణయాలు చేయగలిగే శక్తి ఉంది. సిద్ధాంత, రాజకీయ అధ్యయనాల్లో చాలా సీరియస్‌గా వుండేవాడు. ఈ రెండు దశాబ్దాల వర్గ పోరాటం నుండి అనేక ఆటుపోట్ల మధ్య అభివృద్ధి చెందిన పార్టీ నాయకుల్లో ఆయన ఒకరు. తన శరీరాన్ని ముక్కలుగా నరికినా యుద్ధరంగాన్ని వీడకుండా తలఎత్తి దృఢంగా నిలిచిన కా॥ మహేష్ మనందరికీ ఆదర్శం. ప్రతికూల పరిస్థితుల్లో చాలా తక్కువ కాలంలో ఉద్యమ అవసరాలకు తగిన ప్రజా నాయకునిగా ఎదిగిన కా॥ మహేష్ ఆంధ్ర రాష్ట్ర విప్లవోద్యమ చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తాడు.

## కామ్రేడ్ శీలం నరేష్ (మురళి)

తెలంగాణా పీడిత ప్రజల ముద్దు బిడ్డ కా॥ మురళి అనేక మలుపులతో కూడిన మార్గంలో ఎన్నో తుఫానులను ఎదుర్కొని దృఢంగా నిలిచి పడవను నడిపిన అనుభవజ్ఞుడైన నావికునివలె 1981-1999 దాకా రెండు దశాబ్దాలు ఉద్యమాన్ని నడిపిన విప్లవ నాయకుడు. కా॥ మురళికి ఉత్తర తెలంగాణాలో తెలియని పల్లెగాని, తెలియని క్యాడరుగాని లేరు. ఒక్కమాటలో చెప్పాలంటే రక్తసిక్త తెలంగాణా చరిత్రే ఆయన జీవిత చరిత్ర.

కా॥ నరేష్ జగిత్యాల పట్టణంలో ఒక మధ్యతరగతి ఉపాధ్యాయ కుటుంబంలో జన్మించాడు. 1980లో సిరిసిల్లలో పాలిటెక్నిక్ చదువుతూ కరీంనగర్, ఆదిలాబాద్ రైతాంగ పోరాటాల ఉత్తేజంతో రాడికల్ విద్యార్థి సంఘంలో చేరాడు. కరీంనగర్ జిల్లా ఆర్.యస్.యు. ఉపాధ్యక్షుడుగా ఎన్నికై విద్యార్థులను కూడగట్టుతూ అనేక పోరాటాలను నిర్వహించాడు. 1982లో పూర్తికాలం కార్యకర్తగా నిజామాబాద్ ఉద్యమ నిర్మాణం కోసం వెళ్లాడు. దళ సభ్యుడిగా పనిచేసి 1983లో కామారెడ్డి ఏరియా ఆర్గనైజర్‌గా బాధ్యతలు చేపట్టాడు. ఏరియాలోని ప్రతి పల్లెలో కా॥ నరేష్ జగన్‌గా చిరపరిచితుడు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో, ప్రజా శత్రువులను దెబ్బతీయడంలో అత్యంత చొరవ ప్రదర్శించి ప్రజల ఆదరాభిమానాలు చూరగొన్న ప్రజా నాయకుడు.

1985లో జరిగిన నిజామాబాద్ జిల్లా పార్టీ కాన్ఫరెన్స్‌లో జిల్లాకమిటీ సభ్యుడిగా ఎన్నికైనాడు. గెరిల్లాజోన్ లక్ష్యంగా ముందుకు పోతున్న కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల ఉద్యమ స్థాయికి నిజామాబాద్ జిల్లా ఉద్యమాన్ని తీసుకుపోయిన నాయకులలో కామ్రేడ్ జగన్ ఒకడు. జిల్లా కమిటీలో సరైన పనివిధానాన్ని తీసుకురావడానికి కృషి చేశాడు. అప్పటికి నిజామాబాద్ జిల్లా కార్యదర్శిగా వున్న కుమార్‌రెడ్డి తప్పుడు పని పద్ధతులకు వ్యతిరేకంగా పోరాడడంలో ముందు నిలిచాడు. సత్యమూర్తి సృష్టించిన సంక్షోభాన్ని సరిగా అర్థం చేసుకొని నిజమైన విప్లవ నాయకత్వంవైపు నిలబడ్డాడు. 1987లో జిల్లా కార్యదర్శి బాధ్యతలు చేపట్టి, జిల్లా ఉద్యమాన్ని ముందుకు తీసుకు పోవడంలో అత్యంత చొరవ చూపాడు. జిల్లాలో దూకుడుగా ముందుకు వస్తున్న ప్రజా శత్రువులను, పోలీసు అధికారులను దెబ్బతీయడానికి సమగ్రమైన పథకం రూపొందించి అమలు చేశాడు.

1988లో శత్రువు అమలు జరిపిన తీవ్ర నిర్బంధ కాండలో కరీంనగర్ జిల్లా కమిటీ మొత్తంగా నష్టపోవడంతో ఏర్పడిన క్లిష్ట పరిస్థితిలో కరీంనగర్ జిల్లా కమిటీ కార్యదర్శి బాధ్యతలను చేపట్టాడు. నిప్పులు చెరిగే నిర్బంధంలో అనేక నష్టాల మధ్య జిల్లా క్యాడర్ నైతిక ధృతిని నిలబెడుతూ ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోవడంలో ముఖ్యమైన పాత్ర నిర్వహించాడు.

1987 నుండి ఉత్తర తెలంగాణా రీజినల్ కమిటీ సభ్యునిగా బాధ్యతలు నిర్వహిస్తూ 1990లో జరిగిన ఉత్తర తెలంగాణా రీజినల్ ప్లీనంలో రీజినల్ కమిటీ కార్యదర్శిగా ఎన్నుకోబడినాడు. అదే సంవత్సరం జరిగిన రాష్ట్ర ప్లీనంలో రాష్ట్ర కమిటీ సభ్యునిగా ఎన్నికైనాడు. రాష్ట్రకమిటీ సభ్యుడిగా ఉత్తర తెలంగాణ ఉద్యమాన్ని గైడ్ చేస్తూనే రాష్ట్ర ఉద్యమాన్ని ముందుకు తీసుకు పోవడంలో కూడా గణనీయమైన కృషి చేశాడు.

1990లో కె.యస్. ముఠా సృష్టించిన సంక్షోభంలో కామ్రేడ్ మురళి గుండె నిబ్బరంతో వుంటూ వారి తప్పుడు విధానాలను అవకాశవాదాన్ని ఓడించడంలో తనవంతు కర్తవ్యాన్ని నిర్వహించాడు. 1991 నుండి శత్రువు తీవ్ర నిర్బంధాన్ని అమలు జరుపుతూ బి.ఎస్.ఎఫ్., పంజాబ్ కమెండోలు, ఐ.టి.బి.పి., సి.ఆర్.పి.యఫ్ . గ్రేహౌండ్స్ దళాలను మోహరించి పల్లెలను వల్లకాడులుగా చేసినపుడు శత్రువును దెబ్బతీసి ఉద్యమాన్ని ముందుకు తీసుకు పోవడానికి తగిన కర్తవ్యాలను రూపొందించి అమలు జరిపే విధంగా ఉత్తర తెలంగాణాలో జరిగిన భూపోరాటాలు, రైతాంగ పోరాటాలు అనేక ఇతర పోరాటాలను సమీక్షించి, ఆ సమీక్ష వెలుగులో పోరాటాల్లో ప్రజల పాత్రను పెంచడానికి, పోరాటాలను మరింత ఉన్నత స్థాయికి నడిపించడానికి నిరంతరం కృషి చేశాడు. అలాగే ఉద్యమంలో జరుగుతున్న తప్పుడు ధోరణులకు వ్యతిరేకంగా పోరాడుతూ ఆ తప్పులను సరిదిద్దడానికి కృషి చేశాడు.

1995లో జరిగిన ఎస్.జెడ్.సి. కాన్ఫరెన్స్‌లో స్పెషల్ జోనల్ కమిటీ సభ్యునిగా ఎన్నికై స్పెషల్ జోన్ సెక్రటేరియట్ సభ్యునిగా పనిచేశాడు. అదే సంవత్సరం జరిగిన సెంట్రల్ కాన్ఫరెన్స్‌లో ఆల్టర్‌నేటివ్ కేంద్రకమిటీ సభ్యునిగా ఎన్నికైనాడు. 1997 ఏప్రిల్‌లో సి.సి. మెంబర్‌గా కో-ఆప్ట్ కాబడి అదే సంవత్సరం అక్టోబర్‌లో ఎస్.జెడ్.సి. కార్యదర్శిగా ఎన్నికైనాడు. ఎస్.జెడ్.సి. కార్యదర్శిగా, కేంద్రకమిటీ సభ్యుడిగా వుంటూ ఉత్తర తెలంగాణాలో పోరాట, నిర్మాణ కర్తవ్యాలను రూపొందించి అమలు జరపడంలో కామ్రేడ్ మురళి నిర్విరామంగా కృషి చేశాడు. ఉత్తర తెలంగాణా ఉద్యమంలో జరుగుతున్న ప్రతీ విషయాన్ని పరిశీలించడం, దానికి తగిన విధంగా రాజకీయ, నిర్మాణ, మిలటరీ, పోరాట కర్తవ్యాలను రూపొందించి అమలు జరిపే విషయంలో చొరవతో పాల్గొంటూ ఇతరులు పాల్గొనే విధంగా గైడెన్స్ ఇచ్చాడు.

కామ్రేడ్ మురళి తన విప్లవ జీవితంలో నిత్య నిర్బంధాల మధ్య కూడా కార్యకర్తలను ఉత్సాహపరిచేవాడు. ప్రభుత్వం అమలు జరిపిన 1985, 1992 నిర్బంధ క్యాంపెయిన్‌ను ఓడిస్తూ క్యాడర్ మొరాలిటీని నిలబెట్టి శత్రువును మట్టికరిపిస్తూ మరోవైపు ప్రజా పోరాటాలను నడిపించిన విప్లవకారుడు. నేడు కొనసాగుతున్న మూడవ అణచివేత క్యాంపెయిన్‌ను ఓడించటానికి పార్టీ రూపొందించిన ఎత్తుగడలను అమలు చేయడానికి కృషి చేశాడు.

శత్రువు అమలుజరుపుతున్న పాశవిక నిర్బంధ కాండలో అమరులవుతున్న కామ్రేడ్స్‌ను గుర్తు తెచ్చుకుంటూ కామ్రేడ్ మురళి చలించి పోయేవాడు. ఆ వెనువెంటనే అమరుల రక్తానికి బదులు తీర్చుకుంటామని ప్రతిజ్ఞ చేసేవాడు. అమరుల పేరు వినగానే ఒకవైపు బాధ, మరోవైపు కసి అనేది అతని హృదయంలో చోటు చేసుకునేది ప్రజలపట్ల అత్యంత ప్రేమపూరితంగా వుంటూ వాళ్ళలో కలగలిసిపోయేవాడు. వారి బాధల పట్ల చలించిపోయేవాడు. కా॥ మురళి ఉత్తర తెలంగాణా జిల్లాల్లోని కార్యకర్తలందరికీ సుపరిచితుడు. ఎప్పుడూ నవ్వుతూ కార్యకర్తలను నవ్విస్తూ వారి ఆదరాభిమానాలను చూరగొన్న నాయకుడు. కా॥ మురళి విప్లవ జీవితమంతా ప్రజల మధ్య, కార్యకర్తల మధ్యనే గడిచింది. ప్రజల బాధల పట్ల స్పందించే స్వభావాన్ని, శత్రువుపై వుండే కసిని, కార్యకర్తలతో కలగలిసిపోయే తత్వాన్ని కా॥ మురళి నుండి మనందరం నేర్చుకోవాలి.

విప్లవోద్యమ నిర్మాణంలో నాయకులనేవారు తాము జీవించి వున్నపుడు పార్టీకీ ఉద్యమానికి వెన్నుదన్నుగా పనిచేస్తూ మార్గదర్శకత్వాన్ని అందించడమేగాదు, పోరులో ఒరిగి భౌతికంగా లేకుండాపోయినా కూడా అపార త్యాగ సాంప్రదాయాల నిధిని, విప్లవ విలువలు, పద్ధతులు, ప్రవర్తనలకి సంబంధించి తాము ప్రోదిచేసి పెట్టిన అపార సంపదల్ని పార్టీకి అందించేపోతారు. అందుకే వారు అమరులు! పార్టీలో మిగిలివున్నవారంతా తాము అసంపూర్ణంగా విడిచి వెళ్ళాల్సి వచ్చిన విప్లవాశయ సాధనకి దృఢంగా పునరంకితమవుతూ పనిచేయడానికేగాక ఎంతోమందిని కొత్తగా విప్లవోద్యమంలోకి ఉరకలెత్తించడానికి అమరనేతలు గొప్ప స్ఫూర్తి దాతలుగా నిలిచి పోతారు. కామ్రేడ్స్ శ్యామ్, మహేష్, నరేష్‌లు మన పార్టీ ఉద్యమాలకి అలాంటి స్ఫూర్తి నిధిగా మిగిలిపోయారు. ఈ కామ్రేడ్స్ అమరులైన తరువాత యీ ఒకటి రెండు మాసాల వ్యవధిలోనే అనేక మంది నూతన యువతీ యువకిశోరాలు మనపార్టీ ఉద్యమాలలోకి చేరుతుండడమే యిందుకు ప్రబల తార్కాణం. కొన్ని బూర్జువా పత్రికలు ఆశ్చర్యాన్ని, ఆందోళనని వ్యక్తంచేసినంతగా మన పార్టీ ఉద్యమాలలోకి కొత్తగా వస్తున్నవారు యిప్పటికింకా వెల్లువలాగా లేకపోయినా, రానున్న రోజుల్లో యిది వెల్లువలాగాసాగే అవకాశాలు ఎక్కువే!

ఇది కేవలం సహజ పరిణామమే! ఏమంటే, సామ్రాజ్యవాదులకి దాసోహం అయిపోయిన పాలకవర్గాలు ప్రభుత్వాలు, సామ్రాజ్యవాదుల క్రూరమైన ఘోరమైన దోపిడీకి ద్వారాలు తెరిచేసి ప్రజలపై మరింత విచ్చలవిడి దోపిడీ అణచివేతలకి దిగిపోతున్నాయి. వీధులనెక్కి పోరాడక తప్పని స్థితికి అన్ని రంగాలలోని సామాన్య ప్రజల్ని యివి నెట్టేస్తున్నాయి. పచ్చి ఫాసిస్టు బి.జె.పి. హయాంలోని ఉత్తరప్రదేశ్‌లో సంస్కరణల మేలిముసుగులో విద్యుత్ కార్మికులు ఉద్యోగులపై ప్రభుత్వం ఎక్కుపెట్టిన దాడికి నిరసనగా విద్యుత్ ఇంజనీర్ల స్థాయి సిబ్బందే సమరశీలమైన సమ్మె ఉద్యమాన్ని విజయవంతంగా నడిపి ప్రభుత్వాన్ని ఖంగుతినిపించారు. ఉద్యమ నాయకులతో సహా వందలాదిగా అరెస్టులు అయ్యి జైళ్ళకెళ్ళినా నాయకులందరినీ ఉద్యోగాలనుండి తొలగించే బెదిరింపులకి ప్రభుత్వం దిగినా వారు వెనుకంజ వేయలేదు. అలానే రాజస్థాన్‌లోని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు దేశంలో యిటీవలి కాలంలో ఎక్కడా జరగనంతటి సుదీర్ఘకాలం (గడచిన రెండు మాసాల నుండి) సమ్మె పోరాటం రాజీలేని తీరులో

కొనసాగిస్తూనే వున్నారు. ఈ రెండు సందర్భాలలోనూ ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు ప్రయోగించిన నిర్బంధాన్ని, బెదిరింపుల్ని, కక్షసాధింపుల్ని వెక్కిరిస్తూ ధిక్కరిస్తూ వాటిని త్రిప్పికొట్టారు. దేశవ్యాప్తంగా సంపూర్ణంగా ఐదు రోజుల పాటు సాగిన పోర్టు కార్మికుల సమ్మె కారణంగా దేశంలోని పోర్టులన్నింటిలో పని పూర్తిగా స్తంభించి పోయింది. రాబోయే రోజుల్లో దేశవ్యాప్తంగానే విస్ఫోటించనున్న కార్మికవర్గ తిరుగుబాట్లకి యివి సంకేతాలు!

ఇక ఆంధ్ర రాష్ట్రంలో నెలకొంటున్న పరిస్థితి పరిణామాలు ఉద్యమకారులకి ఆసక్తికరంగానూ పాలకులకి ఆందోళనకరంగానూ వుంటున్నాయనే చెప్పాలి! అధికారంలో వుంటూనే మరోసారి ఎన్నికై అధికారంలోకి రావడం అనేది యివ్వాల్టి పరిస్థితుల్లో ఒక్క తనకు మాత్రమే చెల్లిందని, యిందుకు రాష్ట్ర ప్రజల్లో తన పాలనపట్ల ఏర్పడిన మొగ్గు అభిమానాలే కారణమని, కనుకనే యితర రాష్ట్రాల, యితర పార్టీల రాజకీయ నాయకులంతా తనని ఒక ఆదర్శ నమూనాగా భావిస్తున్నారని ఇరవై నాలుగు గంటలూ ప్రసార సాధనాలన్నింటి ద్వారా పరమ డాంబిక ప్రచారాన్ని చేయించుకుంటూ చలాయించుకొస్తున్న యీ సహస్రాబ్ది హిపోక్రాట్ (నయవంచకుడు)గా చెప్పదగ్గ చంద్రబాబు ముసుగుని చీల్చేసి, అతడి పరమ వికృతమైన దొంగముఖాన్ని వీధుల్లో ఊరేగిస్తూ మరీ రాష్ట్రంలోని విద్యార్థి నిరుద్యోగ యువతీ యువకులు, జూనియర్ డాక్టర్లు గొప్ప ఆందోళనలు నిర్వహించారు. డాక్టర్ల సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి స్వయానా చంద్రబాబు పోషించిన పరమ అసహ్యాకరమైన టక్కరి, మోసకారి, అబద్ధాలకోరు పాత్రని రాష్ట్ర ప్రజలందరితోపాటు స్పష్టంగా చూసిన సింగరేణి కార్మికులు యీ మోసకారి పంపిన చర్చల ఆహ్వానానికి ఎలాంటి విశ్వసనీతని యివ్వకుండా అతడి ఆహ్వానాన్ని బేఖాతరు చేస్తూ దృఢంగా సమ్మెకు పూనుకున్నారు. ఇక రాష్ట్ర ప్రభుత్వోద్యోగులైతే ''ప్రపంచ బ్యాంకు షరతులకు లోబడి సర్వీసు వయోపరిమితిని కుదిస్తే మెరుపుసమ్మె తప్పదు'' అని హెచ్చరిస్తూ ప్రపంచబ్యాంకుతో చంద్రబాబు కుమ్మక్కుని రచ్చకీడ్చారు. తమ జీవనాధార పంట భూముల్ని భారీ ఉప్పు ఫ్యాక్టరీ పెట్టదలచిన ఒక సంపన్న ప్రవాసభారతీయుడికి ధారాదత్తం చేయడాన్ని వ్యతిరేకిస్తూ ప్రకాశంజిల్లా చినగంజాం చుట్టుపట్ల 12 గ్రామాల రైతులు ప్రజాస్వామ్యయుతంగా నిరసన వ్యక్తపర్చడమే నేరమన్నట్లుగా చంద్రబాబు ప్రభుత్వంలోని మహిళామంత్రి జాగర్లమూడి లక్ష్మీపద్మావతి పంపించిన సాయుధ పోలీసు గూండాలు తప్పతాగిన సి.ఐ. ఆదేశాలపై విచ్చలవిడిగా రైతాంగంపై జరిపిన కాల్పుల్లో బలైపోయిన పుల్లారెడ్డి, వీరరాఘవరెడ్డి అనే అమాయక రైతుల హత్యాకాండపై ప్రకాశంజిల్లా అట్టుడికిపోయింది. పోలీసులెంత ప్రయత్నించినా వారి ఆధ్వర్యంలో శవాల పోస్టుమార్టంని ప్రజలు అనుమతించలేదు. రేపీ ఆందోళన మరింత తీవ్రమయ్యేదిగానే వుంది.

రాష్ట్రం నలుమూలలా కార్మికులు, రైతులు, విద్యార్థి యువజనులు, నిరుద్యోగులు, ఉద్యోగులు తదితర ప్రజలంతా చేస్తున్న యీ పోరాటాలు, ఉద్యమాలతో మన పార్టీకి ఉద్యమానికి నేరుగా నిర్మాణపరమైన సంబంధాలు లేకపోవచ్చు. కాని ఇవన్నీ పరోక్షంగా మన పార్టీ ఉద్యమంలో భాగం అయినవిగానే మనం భావిస్తాం! ఇలాంటి ప్రజా పోరాటాలకి మన పార్టీ మరింత సన్నిహిత మార్గదర్శకత్వాన్ని అందించగల పరిస్థితులు, అవకాశాలు అభివృద్ధి కానున్నాయి. కనుక, యీ ఉద్యమాలన్నింటిలోనూ మన అమరనేతలు చిరంజీవులై వర్ధిల్లుతున్నారనే మనం భావిస్తాం!


మన నేతల్ని పరమనీచంగా పిరికితనంగా కుట్రపూరితంగా హత్యచేయించిన నిర్వాకంతో యిక ఫాసిస్టు చంద్రబాబు మన ఉద్యమాన్ని అణచేయగలనని వెర్రిగా కలలుగనొచ్చు. అతడి కలలన్నీ కల్లలుగాక తప్పవు. రాష్ట్ర ప్రజలు చంద్రబాబు ఫాసిస్టు పాలనని నిలువెత్తు లోతున పాతిపెట్టేయడానికి సమర సన్నాహాలతో ముందుకొస్తున్నారు. తిరగబడుతున్న పీడిత ప్రజలందరికీ మన పార్టీ ఉద్యమాలు కొండంత అండగా నిలుస్తాయి. ప్రజల అండతో అన్ని రకాల నిర్బంధాల్ని అణచివేతల్ని అధిగమిస్తూ మన విప్లవోద్యమాన్ని మరింత విస్తృతస్థాయిలో మరింత ఉధృత స్థాయిలో మనం పురోగమింపజేస్తాం! ఇదే మన అమరనేతలు కామ్రేడ్స్ శ్యామ్, మహేష్, మురళిలకు నిజమైన నివాళిగా మనం భావిస్తాం. ఈ క్రమంలోనే మన ప్రియతమ నేతల హంతకులు మనకు బాకీపడిన నెత్తుటి అప్పుని కక్కించి తీరుతాం! ❑

## కామ్రేడ్ బండి మొగిలి (సమ్మన్న) శవయాత్ర జరిపి జోహార్లర్పించిన ప్రజలు

1-4-1999న మెదక్ జిల్లా నర్సాపూర్ దళం చిన్న చింతకుంట గ్రామంలో ఒక షెల్టర్‌లో వుండగా స్పెషల్ సాయుధ బలగాలు చుట్టుముట్టి అత్యాధునిక ఆయుధాలతో జరిపిన పాశవిక దాడిలో నర్సాపూర్ దళ కమాండర్‌తో సహా పదిమంది సభ్యులున్న దళం మొత్తం హత్యకు గురయింది.

కామ్రేడ్ సమ్మన్న కరీంనగర్ జిల్లా భీమదేవరపల్లి మండలం మాణిక్యాపూర్ గ్రామానికి చెందినవాడు. బండి సమ్మన్న ఇంటర్మీడియట్ చదువు పూర్తి చేసిన తర్వాత పీపుల్స్‌వార్ పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితుడై పూర్తికాలం కార్యకర్తగా వచ్చి నర్సాపూర్ దళ కమాండర్‌గా బాధ్యత నిర్వహిస్తూ ప్రజల పోరాట పటిమను పెంపొందిస్తున్న క్రమంలో ఒక ద్రోహి ఇచ్చిన సమాచారం మూలంగా బూటకపు ఎన్‌కౌంటర్‌లో ప్రాణాలు విడిచాడు. నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో వున్న సమ్మన్న శవాన్ని అదే రోజు రాత్రి 11 గంటలకు మాణిక్యాపూర్ గ్రామానికి తీసుకు వచ్చారు. శవాన్ని చూడడం కోసం రత్నగిరి, జీల్గుల, కాట్రపల్లి, అమ్మనగుర్తి తదితర గ్రామాల వేలాది మంది ప్రజలు తండోపతండాలుగా వచ్చి శవాన్ని చూసి కన్నీరు మున్నీరుగా రోదించారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమైన శవయాత్రలో శత్రువుకు భయపడకుండా 300 మంది ప్రజలు పాల్గొని పాటలు పాడుతూ, నినాదాలు ఇస్తూ 5 గంటల వరకు ఊరేగింపు జరిపి శవానికి అంత్యక్రియలు జరిపినారు. ❑


# న్యాయ విచారణ జరిపి దోషులను శిక్షించాలంటూ కొయ్యూరు అమరుల శవయాత్రలకు వేలాదిగా తరలివచ్చిన ఉత్తర తెలంగాణ విప్లవ ప్రజానీకం




1999 డిసెంబరు 2వ తేదీన కొయ్యూరు సమీపంలోని సోమన్‌పల్లి అడవుల్లో మన పార్టీ కేంద్రకమిటీ సభ్యులు ముగ్గురితో పాటు కరీంనగర్ జిల్లా గర్జనపల్లికి చెందిన పశువుల కాపరి కామ్రేడ్ సింగం లక్ష్మీరాజంను కూడా బూటకపు ఎన్‌కౌంటర్‌లో హతమార్చిన సంఘటన ఉత్తర తెలంగాణాతో పాటు యావత్ భారతదేశ విప్లవ ప్రజానీకాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది. మన పార్టీ చరిత్రలోనే ఎన్నడూ లేనివిధంగా ముగ్గురు కేంద్ర స్థాయి నాయకులను ఒకేసారి కోల్పోవడం అత్యంత బాధాకరమైన విషయమే. వారి అమరత్వం వేలాది, లక్షలాది ప్రజానీకంలో కదలిక తెచ్చి ప్రజా పోరాటాల్లోకి మరింతగా తీసుకొస్తున్నది. అమరుల ప్రాణ త్యాగాలకు ప్రతిఫలం అంతకన్నా కావాల్సింది ఏమీ లేదు. విప్లవోద్యమంలో ప్రాణ నష్టం జరిగినా, ఇతర ఏ రకమైన నష్టం జరిగినా అది తాత్కాలికమే. కానీ అంతిమంగా ఆ నష్టాలు విప్లవోద్యమానికి గుణపాఠాలై విప్లవోద్యమాన్ని, విప్లవ ప్రజానీకాన్ని మరింత చైతన్యవంతం చేస్తాయి. మరింత ముందుకు తీసుకుపోతాయి. కొయ్యూరు ఎన్‌కౌంటర్ పేరుతో హత్య చేయబడిన కామ్రేడ్స్ శవయాత్రలకు తరలివచ్చిన వేలాది ప్రజానీకం ఈ విషయాన్ని నిజం చేశారు.



ఆంధ్ర రాష్ట్రంలోని అనేక ప్రజాస్వామిక, విప్లవసంఘాలు, వ్యక్తులు ప్రభుత్వ నిర్బంధాన్ని ఖండిస్తూ ఐక్యంగా పోరాటం ప్రారంభించాయి. శాంతికాలాల్లో తమ బిడ్డలు తల్లిదండ్రుల చితికి నిప్పంటిస్తే, యుద్ధ కాలాల్లో తండ్రులే తమ బిడ్డల చితికి నిప్పంటించాల్సి వస్తుందని ఎవరన్నారోగాని అది ఈరోజు పీపుల్స్‌వార్ పార్టీ నాయకత్వంలో నడుస్తున్న విప్లవోద్యమంలోని ఆచరణలో రుజువవుతున్నది. అనేకమంది యువకులు నూనూగు మీసాల వయస్సులోనే హతమార్చబడుతూ తండ్రులే తమ చితికి నిప్పంటించాల్సి పరిస్థితి


కడివెండి గ్రామంలో కామ్రేడ్ మహేష్ శవయాత్రలో పాల్గొన్న ప్రజానీకం

కొనసాగుతున్నది. ఉత్తర తెలంగాణాలో ఈ పరిస్థితి సర్వసాధారణమై పోయింది. తెల్లారి లేస్తే ఎక్కడో ఒక చోట ఎవరో ఒక ఉద్యమకారుని చితి పేర్చబడుతున్నది.

రెండు దశాబ్దాల క్రితం ఇల్లు విడిచి, విప్లవోద్యమంలోకి అడుగిడి తమ కుటుంబ సభ్యుల క్షేమ సమాచారం సైతం తెలియని పరిస్థితుల్లో రహస్యంగా పనిచేస్తూ విప్లవానికే తమ జీవితాన్ని ధారపోసిన తమ కొడుకులు తిరిగి శవాలై తమ ఇంటికి వస్తారని ఆ తల్లిదండ్రులు ఆశించని పరిణామమే.

మోసకారి కోవర్ట్ ఆపరేషన్ ద్వారా, బెంగుళూరులో వలపన్ని పట్టుకొని హత్యచేసి కొయ్యూరు అడవుల్లో పడవేసిన ముగ్గురు కేంద్రకమిటీ సభ్యులు కామ్రేడ్స్ శ్యాం, మహేష్, మురళిల అంత్యక్రియలను తమ కుటుంబ సభ్యులు నిర్భయంగా నిర్వహించి తమ బిడ్డలను హత్యచేస్తే వందలాది వేలాది మంది వారి బాటలో నడుస్తారనే ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రభుత్వం ఎంత నిర్బంధం ప్రయోగించి, శవయాత్రలకు హాజరయ్యే ప్రజానీకాన్ని ఆపడానికి ఎన్ని అడ్డంకులు కల్పించినా కెరటాల్లా ఎగిసిపడుతూ అమరుల శవయాత్రలకు హాజరయ్యారు. నిర్బంధాలు, ఎన్‌కౌంటర్లు విప్లవోద్యమాన్ని ఆపలేవంటూ నిరూపించారు. అనేక ప్రజాసంఘాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు వందలాది మంది ఈ ముగ్గురు కామ్రేడ్స్ శవయాత్రల్లో పాల్గొన్నారు.

డిసెంబర్ 1న పట్టుకొని 2వ తారీఖు తెల్లవారుజాము వరకే కొయ్యూరు అడవుల్లో శవాలను పడవేసి పత్రికలకు ఎన్‌కౌంటర్ జరిగిందనే సమాచారం ఇచ్చారు. తమ కొడుకుల మరణవార్తను పేపర్ల ద్వారా తెలుసుకోగలిగిన ఆ ముగ్గురి కుటుంబాలు రోదిస్తూ



జగిత్యాలలో కామ్రేడ్ మురళి శవయాత్రకు హాజరైన ప్రజానీకం

ఎన్‌కౌంటర్ జరిగిందని చెప్పిన స్థలానికి, పోస్టుమార్టం నిర్వహించబడిన పెద్దపల్లికి చేరుకున్నారు. కామ్రేడ్ మురళి శవాన్ని తమ కుటుంబ సభ్యులు తమ స్వగ్రామమైన జగిత్యాలకు తీసుకెళ్ళి అంత్యక్రియలు నిర్వహించారు. జగిత్యాల పట్టణ ప్రజానీకం వందలాది మంది శవయాత్రకు తరలిరాగా, పూరాణీపేట్ నుండి స్మశాన వాటిక వరకు ఊరేగింపు నిర్వహించబడింది. శవంపై ఎర్రని గుడ్డ కప్పి బ్యానర్లు పట్టుకొని, పాటలు పాడుతూ, నినాదాలు ఇస్తూ తమ ప్రియతమ నాయకునికి ఘనంగా జోహార్లర్పించారు. జగిత్యాల జైత్రయాత్ర నుండి ఆరంభమైన కామ్రేడ్ మురళి విప్లవ జీవితం జగిత్యాలలో జరిగిన అంత్యక్రియలతో ముగిసింది. కానీ అతని ఆశయం కోసం పోరాటం కొనసాగుతూనే వుంటుంది.

కేంద్ర సెక్రటేరియట్ సభ్యుడు కామ్రేడ్ శ్యామ్ శవాన్ని తమ సోదరుడు కరీంనగర్ జిల్లా కొత్తగట్టు గ్రామానికి డిసెంబరు 3వ తేదీన తీసుకువెళ్ళి తెల్లారి 4వ తేదీన అంత్యక్రియలు నిర్వహించారు. ఒక రోజుపాటు దహనం చేయకుండా వున్న శవాన్ని వేలాది మంది ప్రజలు చివరిసారిగా చూసుకున్నారు. అంత్యక్రియలకు హాజరైన అనేకమంది ప్రజాసంఘాల, పార్టీల నాయకులు ఉపన్యాసాలిచ్చారు. బూటకపు ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ జరిపించాలంటూ డిమాండు చేశారు. ఫాసిస్టు చంద్రబాబు అమలు చేస్తున్న నిర్బంధాన్ని ఖండించారు. ప్రభుత్వ నిర్బంధానికి వ్యతిరేకంగా ప్రజాస్వామిక శక్తులందరూ మరింత ఐక్యం కావాల్సిన అవసరాన్ని గుర్తింపజేశారు.

కామ్రేడ్ మహేష్ శవాన్ని రీపోస్టుమార్టం జరిపేటంత వరకు తీసుకపోయేది లేదని తల్లిదండ్రులు, వివిధ ప్రజాసంఘాల నాయకులు ఆందోళనకు దిగడంతో కామ్రేడ్ మహేష్ శవాన్ని ప్రభుత్వం తిరిగి పోస్టుమార్టం చేయించక తప్పలేదు. ప్రజల వత్తిడి మేరకు డిసెంబర్ 8న రీపోస్టుమార్టం చేయించినప్పటికీ ఆ రిపోర్టును వెల్లడి చేయకుండా అదే పనిగా పోలీసులు తమ వాదనను వినిపిస్తూనే వున్నారు. డి.జి.పి. దొర పూటకొక్క మాట మాట్లాడుతూ ఎన్‌కౌంటర్ బూటకత్వాన్ని మరుగుపర్చడానికి ప్రయత్నిస్తూనే వున్నాడు. రీపోస్టుమార్టం నిర్వహించిన రోజు రాత్రే కామ్రేడ్ మహేష్ శవాన్ని తన స్వగ్రామమైన వరంగల్ జిల్లా దేవరుప్పల మండలం కడివెండికి తీసుకువచ్చారు. మర్నాటి ఉదయం శవాన్ని ట్రాక్టర్‌లో వుంచి ఎర్రని గుడ్డలు కప్పి శవయాత్రను ప్రారంభించారు. వేలాదిమంది గ్రామ ప్రజలు, విప్లవాభిమానులు, ప్రజాసంఘాల నాయకులు తరలి వచ్చారు. కామ్రేడ్ సంతోష్‌రెడ్డి అమర్‌హై అని రాసివున్న బ్యానర్లు గ్రామమంతా కట్టారు. విప్లవ సంఘాల నాయకులు నల్లజెండాలను పట్టుకొని



కామ్రేడ్ సింగం లక్ష్మిరాజం (మార్చురీలోని శవం)

ప్రభుత్వానికి తమ నిరసనను వ్యక్తం చేశారు.

''కామ్రేడ్ సంతోష్‌రెడ్డి అమర్‌హై'', ''అమరవీరులకు జోహార్లు'', ''విప్లవాల యుగం మనది విప్లవిస్తే జయం మనది'', ''అరచేతిని అడ్డుపెట్టి సూర్యకాంతినాపలేరు'', ''పీపుల్స్‌వార్ లాంగ్‌లివ్'', ''చంద్రబాబు నరహంతక పాలనను అంత మొందించాలి'' అంటూ నినాదాలు చేస్తూ ఊరేగింపులో సాగిపోయారు.

సంతోష్‌రెడ్డి శవం చుట్టూ కూర్చున్న ప్రజలను ఉద్దేశించి విరసం, ప్రజాప్రతిఘటన, జనశక్తి, తెలంగాణ జనసభ, మహిళా చైతన్య వేదిక లాంటి సంస్థలకు చెందిన నాయకులు ప్రసంగించారు. ''ప్రజాయుద్ధ వీరులు'' అనే పుస్తకాన్ని కామ్రేడ్ గద్దర్ ఆవిష్కరించాడు.

కామ్రేడ్ మహేష్ శవయాత్ర సందర్భంగా తన తల్లి ''మాకు సేవచేయకున్న ప్రజలకు సేవచేత్తవనుకున్న కొడుకా'' అంటూ తన కొడుకు విప్లవోద్యమంలో ఇంకా చాలాకాలం పనిచేయాల్సి వుండెననే బాధను వ్యక్తపరిచింది.

అమరులైన వారి కుటుంబ సభ్యులందరూ కూడా తెలుగుదేశం ప్రభుత్వ ఫాసిస్టు పాలనను ఖండించారు. తమ బిడ్డల అమరత్వం వారిలో మరింత కసిని రగిల్చింది.

ఒక వీరుడు మరణిస్తే వేలాదిమంది వీరులు పుట్టుకొస్తారనే సత్యాన్ని నిజం చేస్తూ, ఒరిగిన మన ప్రియతమ కామ్రేడ్స్ అంత్యక్రియలకు హాజరైన ప్రజానీకానికి సి.పి.ఐ. (యం-యల్) [పీపుల్స్‌వార్] ఆంధ్రరాష్ట్ర కమిటీ విప్లవ జేజేలు పలుకుతున్నది. ❑

## 'ఎన్‌కౌంటర్లన్నీ పోలీసు హత్యలే' అంటూ దేశమంతటా ప్రతిధ్వనించిన ఊరేగింపులూ, ప్రతీకార చర్యలూ.....

సి.పి.ఐ. (యం-యల్) (పీపుల్స్‌వార్) అగ్రనేతలను పాశవికంగా హత్య గావించిన విషాదకరమైన వార్త వెలువడిన మరుక్షణం నుంచీ ఈ హత్యలను ఖండిస్తూ, అమరులకు తమ నివాళులర్పిస్తూ దేశవ్యాప్తంగా పార్టీ విభాగాలు, సాయుధ గెరిల్లా దళాలూ, వివిధ ప్రజాసంఘాలూ, విప్లవ ప్రజానీకం వేలాదిగా కదిలి రావటం మొదలెట్టారు. లక్షలాది మంది ప్రజల హృదయాలలో పేరుకుపోయిన మహా విషాదం త్వరలోనే హంతకులకు, వారు ప్రాతినిధ్యం వహిస్తున్న దోపిడీ వ్యవస్థకు, ఎవరి రక్షణ కోసం వారు ఈ కిరాతక హత్యలకు పాల్పడ్డారో, ఆ పాలకవర్గాలకూ వ్యతిరేకంగా తీవ్ర విద్వేషంగా మారింది.

డిసెంబర్ 3న సొంత పట్టణమైన జగిత్యాలలో కామ్రేడ్ శీలం నరేష్ అంత్యక్రియల సందర్భంగా వెల్లువెత్తిన జన ప్రవాహంతో మొదలెట్టి నిరసన కార్యక్రమాలు, కాగడాల ప్రదర్శనలూ, సభలూ, ధర్నాలూ, రాస్తా, రైల్‌రోకోలు ఆంధ్రప్రదేశ్ మొత్తంగానూ, దేశంలోని పలు ప్రాంతాలలోనూ శరవేగంగా వ్యాపించాయి. కరీంనగర్ జిల్లా కొత్తగట్టు గ్రామంలో డిసెంబర్ 5న కామ్రేడ్ నల్లా ఆదిరెడ్డి (శ్యాం) అంత్యక్రియలకు, అట్లే వరంగల్ జిల్లా కడివెండి గ్రామంలో డిసెంబర్ 10న కామ్రేడ్ ఎర్రంరెడ్డి సంతోష్‌రెడ్డి (మహేష్) అంత్యక్రియలకు ప్రజలు హాజరు కాకుండా అడ్డుకోవాలని ప్రభుత్వం విశ్వ ప్రయత్నం చేసినప్పటికీ వేలాదిమంది ప్రజలు ఈ అంత్యక్రియలకు తరలి వచ్చారు. పోలీసుల ఆదేశంతో చుట్టుప్రక్కల గల ఏరియాల నుండి బస్సులన్నింటినీ ఉపసంహరించారు; ప్రజలను తీసుకొస్తున్న లారీలనూ, ఇతర వాహనాలనూ ఆపివేశారు. తాము కోల్పోయిన నాయకుల చివరి అంత్యక్రియల్లో పాల్గొనేందుకుగాను కదిలివస్తున్న ప్రజలను బలవంతంగా వెనక్కు పంపారు. అయినప్పటికీ పోలీసుల బెదిరింపులను, హెచ్చరికలను లెక్క పెట్టకుండా రాష్ట్రం నలుమూలల నుండి బయలుదేరి కరీంనగర్, వరంగల్ జిల్లాలలో ప్రవేశించిన ప్రజలు పోలీసులను తలాయించి వేల సంఖ్యలో ఈ రెండు గ్రామాలకూ చేరుకున్నారు. డిసెంబర్ 8 నుడి 14 దాకా వారం రోజుల నిరసన కార్యక్రమాల తర్వాత ఉత్తర తెలంగాణా మొత్తంలో, ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాలలోనూ డిసెంబర్ 15, 16 తేదీలలో 48 గంటల బంద్ జరిగింది. డిసెంబర్ చివరి వారంలో గుంటూరు జిల్లాలో ప్రభుత్వం విధించిన నిషేధాజ్ఞలను ధిక్కరించి 5000 మంది ప్రజలు ర్యాలీలో పాల్గొన్నారు. బూటకపు ఎన్‌కౌంటర్లకు వ్యతిరేకంగా ఐక్యపోరాట కమిటీ జనవరి 11న గుంటూరు జిల్లా దాచేపల్లిలో నిర్వహించ తలపెట్టిన భారీ బహిరంగ సభను పోలీసులు విచ్ఛిన్నం చేశారు. భారీ పోలీసు బలగాలను ఏరియాలో దించారు. సభా స్థలానికి వస్తున్న ప్రజలను కొట్టి బలవంతంగా చెదరగొట్టారు. బహిరంగ సభనుద్దేశించి ప్రసంగించడానికిగాను దాచేపల్లి వెళ్ళిన వరవరరావు, ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం అధ్యక్షురాలు రత్నమాలతో సహా పలువురు ప్రజలను అరెస్ట్ చేశారు. బూటకపు ఎన్‌కౌంటర్లను నిలిపివేయాలని, కామ్రేడ్స్ శ్యామ్, మహేష్, మురళిల హత్యలపై ఉన్నత న్యాయ విచారణ జరిపించాలని డిమాండుచేస్తూ బూటకపు ఎన్‌కౌంటర్ల వ్యతిరేక పోరాట కమిటీ జనవరి 1నుండి హైదరాబాద్‌లో రిలే నిరాహార దీక్షను మొదలెట్టింది.

భారీస్థాయి ప్రజా ప్రదర్శనలు, సభలూ, ఇతర నిరసన రూపాలూ భారతదేశంలోని పలు రాష్ట్రాలకు వ్యాపించాయి.

పోలీసుల హత్యాకాండపై అత్యున్నత స్థాయిలో న్యాయ విచారణ జరపాలని, అపరాధులైన అధికారులను శిక్షించాలని డిమాండు చేస్తూ డిసెంబర్ 6న దేశ రాజధాని ఢిల్లీలో ఊరేగింపు జరిగింది. కలకత్తాలో డిసెంబర్ 15న ఒక ఊరేగింపు జరిగింది.

అదే రోజున బీహారులో రాజధాని పాట్నాలో పలు ప్రజాస్వామిక, విప్లవ సంఘాలు, వ్యక్తులూ ఊరేగింపు తీశారు. ఎ.ఐ.పి.ఆర్.ఎఫ్., జనముక్తి సంఘర్షవాహిని, సర్వహార చేతన, సి.పి.ఐ. (యం-యల్) ఏక్తా పహల్, నారీ ముక్తి సంఘర్ష్ సమితి, డెమోక్రాటిక్ స్టూడెంట్స్ యూనియన్, క్రాంతికారీ బుద్ధిజీవి సంఘ్‌జన సంవాద్, తదితర సంఘాలు దీంట్లో పాల్గొన్నాయి. ప్రధాన్ హెచ్.ప్రసాద్, ప్రీతి సిన్హా (ఫిల్‌హాల్ సంపాదకురాలు) భూపేంద్రకుమార్, మిథిలేష్ కుమార్ తదితరులతో కూడిన పలువురు రచయితలు, మేధావులు ఈ ఊరేగింపులో పాల్గొన్నారు. ఆలిండియా రేడియో కేంద్రం సమీపంలో జరిగిన ఒక బహిరంగ సభలో పలువురు వక్తలు రాజ్య బీభత్సానికి వ్యతిరేకంగా బలమైన ప్రతిఘటనోద్యమాన్ని నిర్మించమని ప్రజలకు పిలుపిస్తూ, కామ్రేడ్స్ శ్యామ్, మహేష్, మురళిల హత్యలో పాల్గొన్న పోలీసు అధికారులపై నేర విచారణను డిమాండ్ చేశారు.

మహారాష్ట్రలో డిసెంబర్ 2వ వారంలో ముంబాయిలో, చంద్రాపూర్‌లో ఊరేగింపులు జరిగాయి. ముంబాయిలో డిసెంబర్ 22న, గుజరాత్ రాష్ట్ర, సూరత్‌లో 23వ తేదీన బహిరంగ సభలు జరిగాయి.

దక్షిణ భారతదేశంలోని కర్నాటకలో డిసెంబర్ 20వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి ఇంటివద్ద ఒక పెద్ద వూరేగింపు జరిగింది. కర్నాటక రైతుకూలీ సంఘం, ఎ.ఐ.పి.ఆర్.ఎఫ్, ఏ.ఐ.ఆర్.ఎస్.ఎఫ్., విప్లవ యువజన ఫ్రంట్, తదితర పలు ప్రజాస్వామిక, విప్లవ సంఘాలు దీంట్లో పాల్గొన్నాయి. ఆంధ్ర పోలీసులు ముగ్గురు నాయకులను చంపివేసే పథకంలో జతకలిసిన కర్నాటక పోలీసులపైన కూడా చర్య తీసుకోవాలంటూ నిరసనకారులు డిమాండ్ చేశారు.

ఈ పాశవిక హత్యల తర్వాత ఒక నెల పొడవునా ప్రజా నిరసన కార్యక్రమాలతోపాటు సాయుధ ప్రతిఘటనా చర్యలు ఆంధ్రప్రదేశ్, దండకారణ్య, బీహార్, భారతదేశంలోని తదితర ప్రాంతాలను దద్దరిల్లజేశాయి. ఇది రాస్తున్న సమయంలో కూడా సాయుధ ప్రతిఘటనా చర్యలు కొనసాగుతూనే వున్నాయి.

డిసెంబర్ సాయంత్రం 'ఎన్‌కౌంటర్' వార్తలు వెలువడిన వెంటనే అదే రాత్రి ఆదిలాబాద్ జిల్లా ఇంద్రారం గ్రామంలో రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సును తగులబెట్టడంతో మొదలైన సాయుధ ప్రతిఘటనా చర్య త్వరలోనే భారతదేశంలోని పలు రాష్ట్రాలకు వ్యాపించింది. గవర్నమెంటు బస్సులు, జీపులు, ఇతర వాహనాలు-

# కేంద్రకమిటీ సభ్యులు కామ్రేడ్స్ శ్యాం, మహేష్, మురళిల బూటకపు ఎన్‌కౌంటర్‌ను ఖండిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా వెల్లువెత్తిన నిరసనలు- ప్రతిఘటనా వార్తలు!!

కామ్రేడ్స్ శ్యాం, మహేష్, మురళిల బూటకపు ఎన్‌కౌంటర్లకు రాష్ట్రవ్యాప్తంగా నిరసన పెల్లుబికింది. పలు పార్టీలు, ప్రజాసంఘాలు, పౌరహక్కుల సంఘాలు చంద్రబాబు ప్రభుత్వ దమన నీతిని ఖండిస్తూ న్యాయ విచారణకై డిమాండ్ చేశాయి. పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి వద్ద పోస్టుమార్టం నిర్వహించినపుడు తమ నాయకులను చూడటానికి భారీ ఎత్తున ప్రజలు తరలి వచ్చారు. ప్రజలను, విలేకరులను కూడా శవాలను చూడనీయలేదు. కామ్రేడ్స్ శ్యాం, మహేష్, మురళిల మృతదేహాలను తీసుకుపోయిన తర్వాత పెద్దపల్లి చేరుకున్న కా॥ గద్దర్ కా॥ మహేష్, లక్ష్మీరాజంలకు నివాళులర్పించి రీపోస్టుమార్టం ఉత్తర్వులు వచ్చేదాకా కదిలేది లేదని అక్కడే కూర్చున్నాడు. బెంగుళూరు నుండి పట్టుకొచ్చి కాల్చిచంపారని, ప్రపంచబ్యాంకు అప్పులతో ముక్కచెక్కలు చేస్తూ ఉక్కుపాదంతో అణచజూస్తున్నారని దుయ్యబట్టాడు. ఎన్‌కౌంటర్‌పై న్యాయవిచారణ జరిపించాలని, బాధ్యులైన పోలీసు అధికారులను హత్యానేరం కింద విచారించాలని పౌరహక్కుల సంఘం అధ్యక్షురాలు రత్నమాల డిమాండ్ చేసింది. జనశక్తి కార్యదర్శి రాజన్న, ప్రతిఘటన కార్యదర్శి పురుషోత్తమరాజు, న్యూడెమొక్రసీ కార్యదర్శి సుభాష్ చంద్రబోస్, ఓ.పి.డి.ఆర్. కార్యదర్శి భాస్కర్‌రావు మరియు పి.యు.డి.ఆర్. ఇది బూటకపు ఎన్‌కౌంటర్ అని ఖండిస్తూ న్యాయ విచారణకై డిమాండ్ చేశారు.

నాయకత్వం దళాలతో వుందని పోలీసు అధికారులు చేస్తున్న ప్రచారం బూటకమని, నాయకత్వం దళాలతో వుంటే కంటికి రెప్పలా

కోర్టు భవంతులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆఫీసులు, అతిథి గృహాలు, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్‌లు, రైల్వే స్టేషన్లు, రైలు పట్టాలు, ఇతర ప్రభుత్వాస్తులు, పాలకవర్గ రాజకీయ నాయకుల, ప్రభుత్వాధికారుల భూస్వాముల ఇళ్ళు, స్థిరాస్తులు మొదలయినవి ప్రజల ఆగ్రహ జ్వాలలలో బూడిదయిపోయాయి. పాలకవర్గానికి చెందిన పలు ప్రతినిధులను పోలీసులను అధికారులను మట్టుబెట్టారు. డిసెంబర్ 5న ఆదిలాబాద్ జిల్లా ఖానాపూర్ టౌన్ దగ్గర్లో ఒక పోలీసు పార్టీని తీసుకెళుతున్న వాహనాన్ని మందుపాతరతో పేల్చి వేసిన ఘటనలో ఒక సబ్ ఇన్‌స్పెక్టరు, ముగ్గురు పోలీసులు తుడిచిపెట్టుకుపోగా, మరో సి.ఐ., ఆరుగురు పోలీసులు తీవ్రంగా గాయపడినారు. డిసెంబర్ రెండో వారంలో సి.పి.ఐ. (యం-యల్) (పీపుల్స్‌వార్) స్పెషల్ స్క్వాడ్ చేసిన రెండు దాడులలో వరంగల్ జిల్లా యేటూరు నాగారంలో ఇద్దరు పోలీసులు చావగా, వరంగల్ పట్టణం నడిబొడ్డున ఒక హెడ్‌కానిస్టేబుల్ హతమైపోయాడు.

ఆదిలాబాద్ జిల్లాలో డిసెంబర్ 19న జిల్లాలో పేల్చిన మందుపాతర ఘటనలో హెడ్ కానిస్టేబుల్ చావగా పలువురు పోలీసులు తీవ్రంగా గాయపడినారు.

ఉత్తర తెలంగాణాలో మండుతున్న పోరాట ప్రాంతాల నుండి దక్షిణ తెలంగాణా, నల్లమల అడవుల దాకా, రాయలసీమ నుండి తీరాంధ్రలోని తూర్పురీజియన్‌దాకా తమ ప్రియతమ నేతల హత్యకు ప్రతీకారాన్ని కోరుతూ ప్రజల ఆగ్రహ జ్వాలలు నెలరోజులపాటు మిన్నంటాయి.

పొరుగున వున్న దండకారణ్యంలో మధ్యప్రదేశ్ బాలాఘాట్ జిల్లాలోని సోనాపురి గ్రామంలో రాష్ట్ర రవాణా శాఖా మంత్రి లిఖిరామ్ కావ్రే ఇంటిపై డిసెంబర్ 16న సాయుధ గెరిల్లాలు దాడిచేసి చంపేశారు.

మరింత ఉత్తరానికి పోతే బీహార్‌లో డిసెంబర్ 16వ తేదీనాడే జెహానాబాద్ సమీపంలోని తారెనాలో రైల్వే పట్టాలను పేల్చివేశారు. దీంతో పాట్నా-గయా రైలుమార్గంలో రైళ్ళ రాకపోకలు స్తంభించాయి. డిసెంబర్ 18న పలామూ జిల్లాలో ఒక రైలు మార్గాన్ని పేల్చివేశారు. అదేరోజు కాజ్రా-నవాధి రైల్వే స్టేషన్‌ని పేల్చివేయగా పదిగంటలపాటు రైలు సర్వీసులకు అంతరాయం కలిగింది. ఇది రాస్తున్న సమయానికి ప్రతిఘటనా చర్యలు కొనసాగుతూనే వున్నాయి.

ప్రజల కోపాగ్నికి, సాయుధ గెరిల్లాల ప్రతీకార చర్యలకు దోపిడీ పాలక వర్గాల ప్రతినిధులు ఎంతగా భయపడిపోయారంటే ఉత్తర తెలంగాణాలోని గ్రామాల నుండి, చిన్న పట్టణాల నుండి, వర్గ పోరాటం తీవ్రంగా సాగుతున్న ఇతర ప్రాంతాల నుండి రాజకీయ నాయకులూ, ఉన్నతాధికార్లూ, ఇతర పాలక వర్గ ప్రతినిధులూ రక్షణకోసం హైదరాబాద్‌కు పరారై పోయారు. పాలక తెలుగుదేశం రాజకీయ నాయకులు, చివరకు గ్రామ సర్పంచులు సైతం జిల్లాలు వదిలి పారిపోయి రాజధాని నగరంలో సైతం పోలీసు రక్షణ కోసం ప్రాధేయపడినారు. ప్రతీకార చర్యలకు భయపడి ఆంధ్రప్రదేశ్‌లో 700 మంది వి.ఐ.పి.లు పోలీసు రక్షణ పొందారు. మొత్తంగా చూస్తే ఈ ముగ్గురు కామ్రేడ్స్ అమరత్వం తర్వాత ప్రధానంగా 150 వరకు ప్రతీకార ప్రతిఘటనా దాడులు జరిగాయి.

భారీస్థాయి ప్రజా నిరసన ప్రదర్శనలు, ఊరేగింపులు, పలు ప్రజా నిరసన రూపాలు, తమ ప్రియతమ నేతల మరణానికి ప్రతీకారం తీర్చుకోవడానికి విప్లవ శక్తులు చూపించిన దృఢ నిశ్చయం అన్నవి పాలకవర్గాలలో భయాందోళనలు కల్గించాయి. దేశంలో సాగుతున్న ప్రజాయుద్ధాన్ని, ప్రజా వుద్యమాలను అణచివేయాలని వారు కన్న కలలన్నీ నిజానికి పీడకలగా మారాయి. మన ప్రియతమ నేతలు మృత్యుంజయులయ్యారు. పాలకవర్గాల చేత రాక్షసంగా కబళించబడిన కా॥ శ్యాం, మహేష్, మురళిలు పాలకవర్గాలను కూల్చడానికి అమేయశక్తితో ప్రజలను ముందుకు నడిపిస్తూ వారిలో పునరుజ్జీవితులైనారని భారీస్థాయి ప్రజా ప్రదర్శనలు చాటి చెప్పాయి. ఈ కామ్రేడ్స్ ఏ ఆదర్శాల కోసం తుది క్షణం దాకా నిలబడ్డారో ఆ ఆదర్శాలతో ప్రభావితం చెందిన విప్లవ ప్రజానీకం ఈ భారత గడ్డనుంచి భూస్వామ్య విధానం, సామ్రాజ్యవాద విధానం, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానాలను తుడిచిపెట్టే తమ చారిత్రక కర్తవ్యాన్ని మరింత దృఢంగా ముందుకు తీసుకుపోవడానికి కట్టుబడి వున్నారు. ❑

కాపాడుకుంటామని అందుకోసం డిఫెన్స్ టీం ప్రత్యేకంగా వుంటుందని, ఇతర రాష్ట్రాల నుండి పట్టుకొచ్చి కొయ్యూరు అడవిలో కాల్చి చంపారని ప్రభుత్వ పాశవిక హత్యలకు నిరసనగా ఈనెల 8 నుండి 14 వరకు నిరసన కార్యక్రమం కొనసాగించి 15, 16 తేదీలలో రాష్ట్ర బంద్ పాటించాలని ఎ.పి. రాష్ట్రకమిటీ సభ్యుడు కామ్రేడ్ రామకృష్ణ, ఉత్తర తెలంగాణా స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు కామ్రేడ్ ప్రసాద్‌లు ఒక సంయుక్త పత్రికా ప్రకటన ద్వారా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ప్రతిఘటనా చర్యలు:

### డిసెంబర్ 5

1. ఆదిలాబాద్ జిల్లాలో ఖానాపూర్ తర్లపాడుల మధ్య 11 మందితో పోతున్న పోలీసు జీబును మందుపాతరతో పేల్చి వేయడం జరిగింది. ఒక ఎస్.ఐ.తో సహా ముగ్గురు పోలీసులు హతంకాగా 8 మంది తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిలో సి.ఐ. లియాఖత్ ఆలీఖాన్‌తో పాటు ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్ళు వున్నారు.
2. ఖానాపూర్-పెంబి గ్రామాల మధ్య రెండు ఆర్.టి.సి. బస్సులు దగ్ధం.
3. లోడ్‌పల్లి సర్పంచ్, సింగిల్ విండో అధ్యక్షుడు జి. నర్సింగరావు ఇల్లు పేల్చివేత.
4. పెంచికల్ పేట తెలుగుదేశం నాయకుడు జి. శ్రీనివాస్ ఇల్లు పేల్చివేత.
5. బజార్‌హత్నూర్ మండలం జాతర్ల గ్రామంలో మాజీ మంత్రి జి. నగేష్ తండ్రి టి.డి.పి. జిల్లా కన్వీనర్ జి. రామారావు ఇల్లు పేల్చివేత. కారు, ట్రాక్టర్‌లు దగ్ధం.
6. కరీంనగర్ జిల్లా ముత్తారం మండలం మచ్చుపేటలో బస్సు దగ్ధం.
7. మండల కేంద్రం మల్లాపూర్‌లో భూస్వామి కొల్లూరి రంగారావు ఇల్లు పేల్చివేత.
8. కరీంనగర్ జిల్లా ధర్మపురి మండలం దోనూరు గ్రామ మాజీ సర్పంచ్ కొండపల్లి వాసుదేవరావు హతం.

### డిసెంబర్ 6

1. వరంగల్ జిల్లా ఏటూరు నాగారంలోని మంగపేట క్రాస్‌రోడ్ వద్ద బ్యానర్లు కట్టి ఎరవేసి వచ్చిన పోలీసులపై కాల్పులు జరిపారు. ఇద్దరు పోలీసులు చావగా, ఎ.ఎస్.ఐ.తో సహా ముగ్గురు తీవ్రమైన గాయాలతో పారిపోయారు. ఐదు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. వీటిలో ఒక ఎ.కె.47., 3 ఎస్.ఎల్.ఆర్.లు, ఒక రైఫిల్ వున్నాయి.
2. చేర్యాల మండలం వేచరేణి గ్రామం టి.డి.పి. నాయకుడు, డి.సి.సి.బి. డైరెక్టర్ పి. లక్ష్మీనర్సింహారెడ్డి ఇల్లు, సామాగ్రి దహనం.
3. చేర్యాల-సిద్దిపేట రహదారిలో ఒక ఆయిల్ ట్యాంకర్, రెండు బస్సులకు నిప్పు.
4. ఆదిలాబాద్ జిల్లా సిర్‌పూర్-కాగజ్‌నగర్ సమీపంలోని వేంపల్లి స్టేషన్‌వద్ద రైల్వేలైన్ పేల్చివేత.
5. ధర్మపురి మండలం జైన గ్రామంలో, సారంగపూర్ మండలం మంగెళ గ్రామంలో మార్‌ఫోన్లు ధ్వంసం.

### డిసెంబర్ 7

1. ఆదిలాబాద్ జిల్లా, సారంగపూర్ మండలం జాం గ్రామంలోని ఫారెస్టు గెస్ట్‌హౌస్ పేల్చివేత.
2. కరీంనగర్ జిల్లా వీణవంక మండలం మామిడాలపల్లి టెలిఫోన్ ఎక్సేంజి, ప్లాంట్ రూం, జనరేటర్ దగ్ధం.
3. నిజామాబాద్ జిల్లా, డిచ్‌పల్లి మండలం గన్నారం వద్ద ఒక బస్సు దగ్ధం, మరో బస్సు ధ్వంసం.
4. మహబూబ్‌నగర్ జిల్లాలో కొల్లాపూర్, వీపనగండ్లలలో కోర్టు భవనాలు పేల్చివేత.
5. ఊర్కొండ వద్ద బస్సు దగ్ధం.
6. తూర్పుగోదావరి జిల్లా అడ్డతీగల ఎమ్.ఆర్.ఓ. కార్యాలయం పేల్చివేత.
7. కర్నూలు జిల్లా వెలుగోడులో అటవీశాఖకు చెందిన భవనం పేల్చివేత.

### డిసెంబర్ 8

1. ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ వద్ద బస్సు ధ్వంసం.
2. వరంగల్ జిల్లా శాయంపేట మండలం కొప్పుల గ్రామంలో స్థానిక జెడ్.పి.టి.సి., జిల్లా బి.జె.పి. నాయకుడు దేవు సాంబయ్య ఇల్లు దహనం.
3. వర్ధన్నపేట మండల టి.డి.పి. నాయకుడు, రాయపర్తి సింగిల్ విండో ఛైర్మన్ తిరుమలాయిపల్లికి చెందిన జినుగు అనిమి రెడ్డి ఇల్లు పేల్చివేత.
4. నల్గొండ జిల్లా కోతులారం గ్రామంలో మార్ టెలిఫోన్ ధ్వంసం.

### డిసెంబర్ 9

1. కరీంనగర్ జిల్లా కాటారం మండలం అంకుశాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ మహబూబ్ బేగ్ ఇల్లు దగ్ధం.
2. మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో ఎమ్.ఆర్.ఓ. భవనం పేల్చివేత.
3. అనంతపూర్ జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలోని ఎమ్.ఆర్.ఓ., ఎమ్.డి.ఓ. కార్యాలయాల దగ్ధం.
4. కంబదూరు సమీపంలో బస్సు దగ్ధం.
5. కర్ణాటకలోని తుమ్కూర్ జిల్లా నాగలపుర ప్రాంతంలో ఎ.పి.ఎస్.ఆర్.టి.సి. బస్సు దగ్ధం.

**డిసెంబర్ 10**

1. నిజామాబాద్ జిల్లా బిక్కనూర్ మండలం రాజంపేట గ్రామంలో టి.డి.పి. మండలాధ్యక్షుడు జూకంటి మోహన్‌రెడ్డి ఇల్లు పేల్చివేత.
2. వరంగల్ జిల్లా భూపాలపల్లి మండలం, అజంనగర్ వద్ద గిరిజన సహకార కార్పోరేషన్‌కు చెందిన వ్యాన్ దగ్ధం.
3. మెదక్ జిల్లా కొండపాక మండలం బంధారం గ్రామంలో టి.డి.పి. నాయకుడు, జిల్లా పరిషత్ వైస్ ఛైర్మన్ నర్రా కేశవరెడ్డి ఇల్లు పేల్చివేత.
4. నల్గొండ జిల్లా ఆలేరు మండలం కొల్లూరు సింగిల్ విండో కార్యాలయం రికార్డులు దగ్ధం.
5. మహబూబ్‌నగర్ జిల్లా కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ ఛైర్మన్ సంపతి పర్వతరెడ్డి ఇల్లు, ట్రాక్టర్, స్కూటర్ తదిరత వస్తువులు దగ్ధం.

**డిసెంబర్ 11**

1. వరంగల్ జిల్లా హన్మకొండ పట్టణంలో స్పెషల్ పార్టీలో పనిచేస్తున్న ఎ.ఆర్. హెడ్‌కానిస్టేబుల్‌పై కాల్పులు-తీవ్రమైన గాయాలు.
2. పరకాల పట్టణంలో గ్రామీణ నీటి సరఫరా కార్యాలయం పేల్చివేత.
3. వరంగల్-ఖమ్మం రోడ్డులోని వర్ధన్నపేట మండలం ఇల్లెంద వద్ద కల్వర్టు పేల్చివేత.

**డిసెంబర్ 13**

1. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం పొన్న గ్రామంలో మండల జెడ్.పి.టి.సి. సభ్యుడు అశోక్ ఇల్లు దగ్ధం.
2. కరీంనగర్ జిల్లా ముత్తారం మండలం అడివి శ్రీరాంపూర్ గ్రామ సర్పంచ్ చోట నారాయణ ఇల్లు దగ్ధం.
3. నిజామాబాద్ జిల్లా గన్నారం-చంద్రాయన్ పల్లి గ్రామాల మధ్యగల టెలికాం శాఖకు చెందిన 'కోయాక్సిల్-రిపీటర్స్' రెండింటి పేల్చివేత.
4. వరంగల్ జిల్లా చిట్యాల మండలం గోపాలపూర్ వద్ద బస్సు దగ్ధం.
5. నల్గొండ జిల్లా కాంగ్రెస్ నాయకుడు, జిల్లా కోపరేటివ్ బ్యాంకు ఛైర్మన్ మేరెడ్డి జైపాల్‌రెడ్డి ఇల్లు పేల్చివేత.
6. పెదవూర మండలం పర్వేదుల గ్రామంలో డి.సి.సి.బి. డైరెక్టర్ మెరెడ్డి జైపాల్ రెడ్డి ఇల్లు పేల్చివేత.
7. గుంటూరు జిల్లా గణపవరంలో టి.డి.పి.కి చెందిన వెన్నా సాంబశివారెడ్డి టూరింగ్ టాకీస్ క్యాబిన్ దగ్ధం.
8. అనంతపురం జిల్లా కంబదూరు మండలం నూతిమడుగు టెలిఫోన్ ఎక్చేంజి దగ్ధం.

**డిసెంబర్ 14**

1. గుంటూరు జిల్లా నడికూడి-పొందుగల రైల్వే స్టేషన్ల మధ్య రైల్వేలైన్ పేల్చివేత.
2. అనంతపూర్ జిల్లా కనగానపల్లి మండల పరిషత్ కార్యాలయం దగ్ధం.
3. కరీంనగర్ జిల్లా సారంగపూర్ మండలం తుంగూర్ మాజీ సర్పంచ్, ప్రస్తుత ఎమ్.పి.టి.సి. రాజగోపాలరావు ఇంటిని, సుజుకి సైకిల్ మోటార్, వి.సి.పి., టి.వి., టెలిఫోన్ తదితర సామాగ్రితో పాటు దగ్ధం.
4. నల్గొండ జిల్లా పి.ఎ. మండలం తిర్మలగిరిలో మార్ టెలిఫోన్ దగ్ధం.

**డిసెంబర్ 15**

1. కరీంనగర్ జిల్లా కమలాపూర్ ఎమ్.ఎల్.ఏ. ముద్దసాని దామోదర్ రెడ్డి ఇల్లు పేల్చివేత.
2. జమ్మికుంట మండలం రేచ్‌పల్లి మాజీ సర్పంచ్ రామచంద్రారెడ్డి ఇల్లు పేల్చివేత.
3. వీణవంక మండలం చల్లూరులో మండల ప్రజాపరిషత్ అధ్యక్షుడు, టి.డి.పి.కి చెందిన బాలకిషన్‌రావు ఇల్లు పేల్చివేత.
4. మ్యల్లర్ మండలం తాడిచెర్ల గ్రామంలో శ్రీనివాసరావు ఇల్లు దగ్ధం.
5. కాటారం మండలం మద్రిపల్లి భూస్వామి ప్రతాప్‌రావు ఇల్లు, ట్రాక్టర్ దగ్ధం.
6. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం, చంద్రాయనపల్లి అడవి రహదారిపై కల్వర్టు పేల్చివేత.
7. మాచారెడ్డి మండలం అక్కాపూర్‌లో కామారెడ్డి మార్కెట్ కమిటీ ఛైర్మన్ పొన్నాల లక్ష్మారెడ్డి ఇల్లు పేల్చివేత.
8. కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లి టి.డి.పి. కార్యాలయం పేల్చివేత.
9. నిజామాబాద్-సికింద్రాబాద్ మార్గంలో తల్మడల రైల్వేస్టేషన్ రికార్డులు, పరికరాలు దగ్ధం.
10. మెదక్ జిల్లాలో సర్ధన, పాతూర్ గ్రామాలలో టెలిఫోన్ ఎక్చేంజిలు దగ్ధం.
11. బూర్గుపల్లి గ్రామంలో అటవీశాఖ భవనం దగ్ధం.

**డిసెంబర్ 16**

1. నిజామాబాద్ జిల్లా ఉప్పల్వాయి రైల్వేస్టేషన్ పేల్చివేత.
2. బషీరాబాద్ కమ్మర్‌పల్లి మండలాధ్యక్షుడు గోపీకిషన్ ఇల్లు పేల్చివేత.
3. కామారెడ్డి మండలం చేక్రియాల్‌లో, తాడ్వాయి మండలం కాలోజివాడి గ్రామాలలో మార్‌ఫోన్‌లు దగ్ధం.
4. కరీంనగర్ జిల్లా, మల్లాపూర్ మండలంలో భూస్వామి చంద్రశేఖర్ రావు ఇల్లు పేల్చివేత.
5. వీణవంక మండలం, బొంతనపల్లి గ్రామంలో మార్‌ఫోన్, రేగుంటలో జీబు దగ్ధం.

6. శంకరపట్నం మండలంలో సి-డాట్ టెలిఫోన్ ఎక్ఛేంజి ధ్వంసం.

7. గుంటూరు జిల్లా వెల్దుర్తి సమీపంలో బండలవాగు మీది కల్వర్టు పేల్చివేత.

8. అనంతపూర్ జిల్లా పెనకచర్ల డ్యాం సమీపంలోని, పినాకినీ అతిథి గృహం పేల్చివేత.

9. కర్నూలు జిల్లా చలమ రైల్వేస్టేషన్ వద్ద అమరావతి ఎక్స్‌ప్రెస్ ఇంజన్‌కు నిప్పుపెట్టి 15 బోగీలను ధ్వంసం చేయడం జరిగింది. 600 మంది ప్రయాణికులనందరినీ ఒక దగ్గర చేర్చి సాయుధ పహారాలో ప్రభుత్వం బూటకపు ఎన్‌కౌంటర్లలో పార్టీ నాయకులను, కార్యకర్తలను హతమార్చుతున్నదని దానికి నిరసనగానే తాము ఈ కార్యక్రమం తీసుకోవాల్సి వచ్చిందని వివరించి తర్వాత స్టేషన్‌ను కూడా పేల్చి వేయడం జరిగింది. ఇవేకాక, ఇంకా అనేక చర్యలు, మొత్తంమీద 150కి పైగానే జరిగాయి.

15వ తేదీన ఎన్‌కౌంటర్లను నిరసిస్తూ బంద్‌కు మద్దతుగా హైదరాబాద్‌లోని పలు విప్లవ పార్టీలు, ప్రజాసంఘాలు నిరసన ప్రదర్శన నిర్వహించాయి. ప్రదర్శన పాత ఎమ్.ఎల్.ఏ. క్వార్టర్స్ నుండి మొదలై బషీర్‌బాగ్, ఖైరతాబాద్‌ల మీదుగా రాజ్‌భవన్ చేరింది. ప్రదర్శనకు అనుమతి లేదని నగర పోలీసులు అడ్డుకోవడానికి ప్రయత్నించారు. తాము శాంతి యుతంగా ప్రదర్శన నిర్వహించి గవర్నర్‌కు వినతి పత్రం అందజేస్తామని చెప్పినా పోలీసులు ఖాతరు చేయక పోవడంతో పోలీసులను చేధించుకొని ప్రదర్శన ముందుకు సాగింది. ప్రదర్శనలో ''ముఖ్యమంత్రి డౌన్ డౌన్'', ''రాజ్యహింస నశించాలి'', ''ఎన్‌కౌంటర్లన్నీ పోలీసు హత్యలే'', ''చంద్రబాబు ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలి'', ''డి.జి.పి. దొరను సస్పెండ్ చేయాలి'', ''పోలీసులను హత్యానేరం కింద విచారించాలి'' అని నినాదాలిచ్చారు.

16వ తేదీన బంద్ రెండవ రోజు కామ్రేడ్స్ శ్యాం, మహేష్, మురళిల ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్ సెక్రటేరియట్ ముందు ధర్నాకు దిగిన కామ్రేడ్స్ వరవరరావు, గద్దర్‌లతో పాటు 9 మందిని పోలీసులు అరెస్టు చేశారు. నిషేధాజ్ఞలు లెక్కచేయకుండా వరవరరావు, గద్దర్, ఐ.ఎఫ్ .టి.యు. నాయకుడు కె. చంద్రయ్య, పి. శ్యామలరావు, విరసం సభ్యురాలు విమల, ఎఫ్.డి.ఎస్.యు. నాయకుడు ఎ. రాజు, అడ్వకేటు లక్ష్మీ నర్సయ్య, జనశక్తి నాయకుడు విజయకుమార్, పణిలు అకస్మాత్తుగా సెక్రటేరియట్ గేటు ముందుకు చేరుకొని ఒక్కసారిగా చంద్రబాబు డౌన్ డౌన్, ఎన్‌కౌంటర్లనీ పోలీసుల హత్యలే, హంతక దొరను సస్పెండ్ చేయాలి, కొయ్యూరు ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ జరిపించాలని నినాదాలు చేస్తూ ధర్నా చేశారు. ❑

---

**(18వ పేజీ తరువాయి)**

రక్తసిక్త త్యాగాల బాటలో ఉద్యమిస్తున్న తమిళనాడు పీపుల్స్‌వార్ పార్టీ కా॥ రవీంద్రన్ హత్యతో కృంగిపోయే అర్భక స్థితిలో లేదు. రెట్టించిన పట్టుదల ప్రతిఘటన ప్రతీకారాలతో ఉద్యమాన్ని పురోగమింపజేయడానికే పునరంకితమవుతుంది. కనుకనే ''విత్తుని పూడ్చిపెడితే పోయేదేమీ లేదు-అది మొలకెత్తి తీరుతుంది-అలానే విప్లవకారులు కూడా! ఒక కా॥ రవీంద్రన్ పోరులో నేలకొరగొచ్చు! వేన వేల రవీంద్రన్‌లు మొలకెత్తుకొస్తారు. ఒక్క ధర్మపురి ప్రాంతంలోనే కాదు, రాష్ట్ర వ్యాపితంగా కూడా!'' అని పీపుల్స్‌వార్ తమిళనాడు రాష్ట్రకమిటీ ప్రకటించింది.

సరళీకరణ పేరుతో సామ్రాజ్యవాద శక్తుల నిలువుదోపిడీకి గేటు తెరిచే చౌకీదారు పనిలో ఇతర రాష్ట్రాల ప్రభుత్వాలతో (ప్రత్యేకించి దక్షిణాది ఇరుగుపొరుగు రాష్ట్రాలైన ఆంధ్ర, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వాలతో, మరీ ప్రత్యేకించి ప్రపంచబ్యాంకు ఒడిలో బొచ్చుకుక్కలా వ్యవహరిస్తున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో) పోటీ పడుతున్న కరుణానిధి ప్రజాస్వామ్యం ఫోజులు ఎన్ని ఇచ్చినా ఫాసిస్టు జయలలిత హయాంని మరపించే తీరులో పీపుల్స్‌వార్ పార్టీ ఉద్యమాలనేగాక యావత్ ప్రజా పుద్యమాలపై విరుచుకు పడడం అనేది ఒక సహజ పరిణామమేనని పీపుల్స్‌వార్ తమిళనాడు రాష్ట్ర పార్టీ విశ్లేషిస్తూ అణచివేతకు వ్యతిరేకంగా అన్నిరకాలుగా ప్రజల్ని ప్రతిఘటనకు సిద్ధపరుస్తోంది.

జనవరి 13వ తేదీన చెన్నైలో జరిగిన కా॥ రవీంద్రన్ అంత్యక్రియల అనంతరం జరిగిన సంతాపసభకి 400 మంది విప్లవాభిమానులు హాజరయ్యి శ్రద్ధాంజలి ఘటించారు. ''ప్రియతమ కామ్రేడ్ రవీంద్రన్ కన్న కలల్ని నిజం చేద్దాం'', ''కా॥ రవీంద్రన్ హత్యకు ప్రతీకారం తీర్చుకుందాం'' అనే నినాదాల ఘర్జనతో 200 మందితో స్ఫూర్తిదాయకమైన ఊరేగింపు జరిగింది. అనంతరం కా॥ రవీంద్రన్ భౌతికకాయాన్ని ఖననం చేసిన స్థలం వద్ద జరిగిన సంతాప సభలో వివిధ విప్లవ సంస్థల, ప్రజాతంత్ర సంస్థల, పౌరహక్కుల సంస్థల ప్రతినిధులతో పాటు కా॥ రవీంద్రన్ భార్య స్ఫూర్తిమంతమైన సందేశాలతో ప్రసంగించారు.

పార్టీ ఇచ్చిన ఉత్తేజకరం, స్ఫూర్తిదాయకం అయిన పిలుపు మేరకు జనవరి 21వ తేదీన తీవ్ర నిర్బంధం మధ్యనే 'నాయకన్ కొట్టాయ్'లో కా॥ రవీంద్రన్ స్మారక సభ జరిగింది. చుట్టుపక్కల గ్రామాల నుంచి వందలాది ప్రజలు తమ ప్రియతమ నేతకు విప్లవాంజలి ఘటించడానికి హాజరయ్యారు. సభని నిర్వహించిన తమిళనాడు ఆర్.యస్.యు. కార్యకర్తల్ని సంఘ నాయకుడు కా॥ బాలన్‌ని సభానంతరం అరెస్టు చేయడానికి పెద్ద ఎత్తున పోలీసులు మోహరించగా గ్రామ ప్రజలు ప్రత్యేకించి గ్రామ మహిళలు పోలీసుల్ని ప్రతిఘటించి వెనక్కి తిప్పికొట్టారు.

''కా॥ రవీంద్రన్ అమరత్వం వర్ధిల్లుతుంది-వేనవేల రవీంద్రన్‌లు అందుకొస్తారు'' అన్న తమిళనాడు పార్టీ ఆశ, ఆకాంక్షలు నిజం కాగలవనేదానికి నిదర్శనం నిలవగల పరిణామాలివి! ❑


# కామ్రేడ్ రవీంద్రన్ అమర్ రహే!

## దోపిడీ, నయవంచక కరుణానిధి ప్రభుత్వం రాష్ట్రంలో విప్లవోద్యమంపై సాగిస్తున్న అనాగరిక అణచివేత దాడులను ఎదుర్కొందాం!!

## విప్లవోద్యమాన్ని పురోగమింపజేస్తూ కామ్రేడ్ రవీంద్రన్ హత్యకు ప్రతీకారం తీర్చుకొందాం!!!

## తమిళనాడు పీపుల్స్‌వార్ పార్టీ పిలుపు.....

ప్రపంచబ్యాంకు విధిస్తున్న అప్పుల షరతులు, ఆదేశాలకి అనుగుణంగా ఆంధ్ర రాష్ట్రంలో ప్రజా వుద్యమాల్ని, ప్రత్యేకించి పీపుల్స్‌వార్ పార్టీ ఆధ్వర్యంలోని విప్లవోద్యమాన్ని రక్తపుటేరుల్లో ముంచెత్తుతున్న ఫాసిస్టు చంద్రబాబు ప్రభుత్వం క్రింది పోలీసు గూండాలు, డెన్ కీపర్ గోవిందరెడ్డి విద్రోహిగా మారిపోయి అందించిన సమాచారంతో గడచిన డిసెంబర్ ఒకటవ తేదీనాడు బెంగుళూరులో ద్రోహి గోవిందరెడ్డి ఇంటిలో సమావేశం అయివున్న పీపుల్స్‌వార్ పార్టీ కేంద్రకమిటీ సభ్యులు ముగ్గురిపై దాడి చేసి బంధించి, చిత్రహింసల పాల్జేసి, కిరాతకంగా హత్య చేసేసి ఎన్‌కౌంటర్ కథలల్లారు. దేశంలో ప్రత్యేకించి ఆంధ్ర, బీహార్, ఒరిస్సా, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాలలో దోపిడీ పాలక వర్గాలకి ప్రభుత్వాలకి అలానే కేంద్రంలోని ఫాసిస్టు బి.జె.పి. నేతృత్వంలోని ఎన్.డి.ఏ. ప్రభుత్వానికి కంపరం పుట్టిస్తున్న పీపుల్స్‌వార్ పార్టీకి చెందిన కేంద్రస్థాయి నాయకులు ముగ్గురిని ఒకేసారి హత్యచేసేయ గలిగినందుకు ఈ నరహంతక దోపిడీదార్లంతా తెగ సంబరపడి పోయారు. ప్రజల అసహ్యానికి గురై చరిత్రహీనులైన ప్రపంచ నియంతల జాబితాలో సరిగ్గానే చేర్చబడిన (తరువాత కారణాంతరాల వల్ల తొలగించబడిన) కేంద్ర హోం మంత్రి అద్వానీ అలానే దేశంలో విస్తరిస్తున్న పీపుల్స్‌వార్ ఉద్యమానికి బలమైన స్థానంగా వుంటున్న ఆంధ్రరాష్ట్రంలో ఆ వుద్యమాన్ని అణచేయడంలో తమ సహచర ఫాసిస్టు చంద్రబాబుకి చేదోడు వాదోడుగా వుంటూ కేంద్రంతో అనుసంధానం నెరపడమే ప్రధాన లక్ష్యంగా కేంద్ర హోం సహాయమంత్రి పదవి చేపట్టిన కరీంనగర్ ఎం.పి. విద్యాసాగరరావు ఈ ఘోర క్రూర హత్యాకాండని బలపరుస్తూ చంద్రబాబుని హర్షాభినందనలతో ముంచెత్తారు. కాని ఈ హంతక ముఠాలందరి సరదా సంబరాలు మూన్నాళ్ళ ముచ్చట కాదుకదా ముప్పయి గంటల ముచ్చటకి కూడా నోచుకోలేదు. తమ ప్రియతమ నాయకుల హత్యాకాండ వార్త తెలుసుకున్న కొద్ది గంటల నుండే ప్రజాగ్రహం వెల్లువై పెల్లుబికింది. ఆంధ్రరాష్ట్రం యావత్తు భగ్గుమంది, ప్రత్యేకించి తెలంగాణా అగ్నివీణే అయింది. పార్టీ శ్రేణుల్లో, దళాల్లో, విప్లవ ప్రజానీకంలో పెల్లుబికిన ఆవేదన ఆగ్రహావేశాలు, ప్రతిఘటన ప్రతీకార కాంక్షలకి నిదర్శనాలుగా 150కి పైగా చెప్పుకోదగ్గ తీవ్ర ప్రతిఘటనా ప్రతీకార చర్యలు ఒక్క ఆంధ్రలోనే జరిగాయి. అవి నేటికీ కొనసాగుతూనే వున్నాయి. వేరొక ప్రక్క ఈ బూటకపు ఎన్‌కౌంటర్ తంతుని, ఈ హత్యాకాండని నిరసిస్తూ ప్రజాతంత్ర ఉద్యమం బలోపేతమవుతోంది. పీపుల్స్‌వార్ అగ్రనేతల హత్యకి ప్రతిఘటన, ప్రతీకారం అనేది ఒక్క ఆంధ్ర రాష్ట్రానికే పరిమితం కాలేదు. పార్టీ నిర్మాణం పనిచేస్తున్న రాష్ట్రాలన్నింటిలోనూ పెద్ద ఎత్తున నిరసన, ప్రతిఘటన సాగుతున్నాయి. మధ్యప్రదేశ్‌లో ఒక రాష్ట్రమంత్రే మట్టికరచాడు.



తమిళనాడులో సైతం పార్టీ నిర్మాణం చురుగ్గా పనిచేస్తున్న ధర్మపురి, సేలం ప్రాంతాలలో పార్టీ శ్రేణులు, పార్టీ ఆధ్వర్యంలోని విప్లవ ప్రజాసంఘాలు, విప్లవ ప్రజలు అగ్రనేతల హత్యాకాండకి నిరసనగా వాల్‌పోస్టరింగ్, వీధి మీటింగులు, ప్రదర్శనలు లాంటి నిరసన చర్యలతో పాటు ధర్మపురి జిల్లాలో ఒకటి రెండు రాష్ట్ర రోడ్ రవాణా బస్సుల్ని సైతం తగలేసారు. నిజానికిది పెద్ద విశేషం కాదు. ఏమంటే తమిళనాడులో ఏ చిన్న రాజకీయ పార్టీ అయినా నిరసన ఆందోళనల్లో బస్సుల్ని తగలేయడం పరిపాటే! కాని, కేంద్రంలో బి.జె.పి. సంకీర్ణంలో భాగస్వామిగా ఫాసిస్టు బి.జె.పి.తో అంటకాగుతున్న డి.యం.కె. కరుణానిధి ప్రభుత్వం ఈ బస్సుల దగ్ధం అనే చిన్న ఘటనని ఆసరా చేసుకొని, వేళ్లూనుకొని విస్తరించే క్రమంలో వున్న పీపుల్స్‌వార్ పార్టీని ఉద్యమాన్ని అణచివేసే ఒక ఫాసిస్టు కుట్ర పథకాన్ని పన్నింది. ఈ కుట్రలో భాగమే కా॥ రవీంద్రన్ హత్య.

బూటకపు ఎన్‌కౌంటర్ పేరుతో రవీంద్రన్ హత్యకి పథకం పన్నిన కరుణానిధి ప్రభుత్వ పోలీసులు, ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు పీపుల్స్‌వార్ అగ్రనేతలు మరణించినందుకు ప్రతీకారంగా ఆ పార్టీ విభాగం తమిళనాడులో ప్రత్యేకించి ధర్మపురి జిల్లాలో పెద్ద ఎత్తున విధ్వంసకాండకి బీభత్సకాండకి తలపడవచ్చనే కథనాలతో కుట్రపూరిత ప్రచారం లంకించుకున్నారు. తమిళనాట పత్రికలన్నీ ఈ పోలీసు ప్రచారానికి పెద్ద పీట వేసాయి. గడచిన డిసెంబర్ మొదటి వారంలోనే ఈ కుట్రపూరిత ప్రచారం ప్రారంభమై రోజురోజుకీ పెరిగింది. వేరొకప్రక్క పీపుల్స్‌వార్ హింసా విధ్వంసాల్ని ఎదుర్కోవడం పేరుతో స్మగ్లర్ వీరప్పన్ వేటకి ఉద్దేశిస్తూ ధర్మపురి జిల్లాలో తిష్టవేసి వున్న యస్.టి.యఫ్. ప్రత్యేక బలగాల్ని కూడా

పీపుల్స్‌వార్ పైకి మళ్లించారు. కా॥ రవీంద్రన్‌ను, మరొక కా॥ శివను పెరున్‌గాడు (PERUNGADU) గ్రామంలో జనవరి 7వ తేదీన అరెస్టు చేసి, చిత్రహింసలు పెట్టారు. అనంతరం కా॥ రవీంద్రన్‌ను 1వ తేదీన కాల్చిచంపి ఎన్‌కౌంటర్ కట్టుకథను అల్లారు. ఆరోజు ధర్మపురి జిల్లా వ్యాపితంగా 4 వేల మంది సాయుధ బలగాల్ని మోహరింపజేసారంటేనే కా॥ రవీంద్రన్‌ది వ్యూహం ప్రకారం జరిగిన నగ్నమైన హత్య అనేది తేటతెల్లమవుతుంది. పీపుల్స్‌వార్ పార్టీ ధర్మపురి ఏరియా కమిటీ సభ్యుడిగా ధర్మపురి జిల్లాలో చురుగ్గా తనకార్యకలాపాలు ప్రారంభించిన 1995 నాటి నుంచే కా॥ శక్తివేల్ (రవీంద్రన్)పై తమిళనాడు పోలీసుల డేగకళ్ల వేట ప్రారంభమైందని చెప్పాలి. అడ్డూ, ఆపూ లేకుండా వివిధ విద్యాసంస్థల్లో అమలవుతుండిన అక్రమ డొనేషన్లకి వ్యతిరేకంగా; ఉచిత చీరా-పంచల పంపకం పథకంలో అమలవుతుండిన అవినీతి అక్రమాలకు వ్యతిరేకంగా; అటవీ అధికార్ల దోపిడీ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా; ప్రజలకి సంబంధించిన ఉమ్మడి భూస్థలాల్ని స్థానిక పెత్తందార్లు వారి గూండాలు దౌర్జన్యపూరితంగా దురాక్రమించు కోవడానికి వ్యతిరేకంగా ఇలా చెప్పాలంటే ఎన్నెన్నో ప్రజా పోరాటాలకి కా॥ రవీంద్రన్ ధర్మపురి జిల్లాలో నేతృత్వం వహించాడు, వాటిని ప్రజల మద్దతుతో విజయవంతంగా నడిపాడు. అప్పటికే కా॥ రవీంద్రన్‌పై పోలీసుల కన్నెర్ర ప్రారంభమైంది. ఇలా వుండగా పూతిపట్టి గ్రామంలో ఒక భూ దురాక్రమణ సమస్యపై కా॥ రవీంద్రన్ భూపోరాటాన్ని నడిపాడు. ఆ గ్రామంలో 'మథియాన్' అనే ఒక పెత్తందారుకు పోలీసులు ఆయుధాల్ని, కిరాయి రౌడీలని అందించారు. పోలీసుల అండతో రెండు మాసాల క్రితమే ఈ 'మధియాన్' ఉన్మాదపూరితంగా కా॥ రవీంద్రన్‌పై కాల్పులు జరిపాడు. అయితే కా॥ రవీంద్రన్ తృటిలో తప్పించుకొన్నాడు. కాగా, గడచిన ఆరుమాసాల నుంచి కా॥ రవీంద్రన్‌ని హత్యచేసే పథకంతో పోలీసులు అతడు కనిపిస్తే కాల్చేసే ఉత్తర్వులున్నాయని, అతడిని పోలీసులకు పట్టించిన వారికి నగదు బహుమానాలున్నాయని, అనధికారికంగా తమ ఆధీనంలోని కిరాయి గూండాలు, పెత్తందారీ మూకల ద్వారా విస్తృత ప్రచారం చేయిస్తూ వచ్చారు. ఆ క్రమంలో కా॥ రవీంద్రన్ గూర్చి వేటాడుతూ ఆచూకీ తెలుసుకొని దాడిచేసి కా॥ రవీంద్రన్‌తో పాటు మరో ముగ్గురు కామ్రేడ్స్‌ని బంధించి రవీంద్రన్‌ను నీచంగా హత్యచేసి ఆంధ్ర పోలీసులకి మల్లే ఎన్‌కౌంటర్ కట్టుకథని అల్లారు.

కా॥ రవీంద్రన్‌గా పార్టీకి, విప్లవ ప్రజలకి ప్రీతిపాత్రుడైన కా॥ శక్తివేల్ టెలికామ్ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ ఇంజనీర్‌గా పనిచేస్తూ ఉద్యమంలోకి ఉరికి వచ్చిన విద్యావంతుడు. రవీంద్రన్ తండ్రి నైవేలి లిగ్నైట్ కార్పోరేషన్‌లో సూపరెంటెండెంట్ ఇంజనీర్ (యస్.ఇ.)గా వుంటూ రిటైర్డ్ అయ్యాడు. కా॥ రవీంద్రన్ బాల్యం, విద్యాభ్యాసం అన్నీ నైవేలీలోనే జరిగాయి. సివిల్ ఇంజనీరింగ్‌లో డిప్లమా పొందిన రవీంద్రన్ టెలికామ్ విభాగంలో జూనియర్ ఇంజనీర్‌గా పనిచేస్తూ ఉద్యమ రాజకీయాలవేపు ఆకర్షితుడయ్యాడు. సహజ సిద్ధంగానే కా॥ రవీంద్రన్ నిత్య పోరాటకారుడు. తన పోరాట చొరవ, పటిమల కారణంగానే అతడు తమిళనాడు రాష్ట్ర ఇంజనీర్ల ట్రేడ్ యూనియన్ కార్యదర్శిగా ఎన్నికయ్యాడు. ఆ సంఘ నాయకుడిగా కా॥ రవీంద్రన్ టెలికామ్ ఉద్యోగులు కార్మికులకి సంబంధించిన అనేక సమస్యలపై విజయవంతమైన పోరాటాలు నడిపాడు. ఇలా వుండగా 1985లో కా॥ రవీంద్రన్‌కి పార్టీతో సంబంధాలు ఏర్పడ్డాయి. 1989 నుంచి పూర్తి స్థాయి పార్టీ కార్యకర్తగా పనిచేయ ప్రారంభించాడు. పార్టీ కార్యకర్తగా వుంటూ 1990లో చెన్నైలో ట్రేడ్ యూనియన్ ఆర్గనైజర్‌గా పనిచేసాడు. అటుపై పార్టీ సూచన ప్రకారం 1993లో ధర్మపురి ప్రాంతంలో పార్టీ సెంట్రల్ ఆర్గనైజర్ (సి.ఒ.)గా పని ప్రారంభించిన కా॥ రవీంద్రన్ ధర్మపురి జిల్లాలోని తెంకన్‌కోట్టయ్ ప్రాంతంలో రైతాంగ వుద్యమ నిర్మాణ బాధ్యతలు చేపట్టాడు. కొద్ది కాలానికే అరెస్టయ్యాడు. విడుదలైన తరువాత ఇక అమరుడైన నాటి వరకు రవీంద్రన్ పెన్నాకరమ్ ప్రాంతంలో ఉద్యమ నిర్మాణం చేస్తూ వచ్చాడు.

చెన్నైలో ట్రేడ్ యూనియన్ ఆర్గనైజర్‌గా పనిచేస్తుండిన కాలంలో కా॥ రవీంద్రన్ మండల్ కమిటీ నివేదిక అమలుని డిమాండు చేసే ఆందోళన; గల్ఫ్ యుద్ధ వ్యతిరేక ఆందోళన, కూదనాన్ కులమ్ అణు విద్యుత్ పథకానికి వ్యతిరేకంగా సాగిన ఆందోళన లాంటి ముఖ్య ప్రజాందోళనలన్నింటిలో ముందుపీఠిన వుంటూ కీలకపాత్ర పోషిస్తూ వచ్చాడు. అరెస్టయి జైలు నిర్బంధంలో వుంటూ కూడా జైలులోని అనారోగ్యకర అధ్వాన్న పరిస్థితులకి వ్యతిరేకంగా మౌలిక సదుపాయాల కల్పనకోసం పోరాటాలు నడిపాడు. జైలు పరిస్థితులపై హైకోర్టు ఎంక్వైరీ కమీషన్ కోసం పట్టుపడుతూ కా॥ రవీంద్రన్ నిరాహార దీక్షకు పూనుకొని ఆ డిమాండ్‌ని సాధించాడు.

పెళ్ళికి సంబంధించి, మహిళలకి సంబంధించి కా॥ రవీంద్రన్ ఆలోచనా సరళి ఎప్పుడూ విప్లవాత్మకంగాను ప్రగతిశీలంగానే వుంటూ వుండేది. తాను ఒక వితంతువుని లేదా విడాకులు తీసుకున్న మహిళని వివాహం చేసుకోవాలని తీర్మానించుకున్నాడు. తదనుగుణంగానే ఒక బిడ్డ తల్లిగా వుంటూ విశాఖపట్నం లా కాలేజీ లెక్చరర్‌గా పనిచేస్తుండిన శ్రీమతి నిర్మలని పెళ్ళి చేసుకున్నాడు.

కా॥ రవీంద్రన్ అమరత్వం తమిళనాడులోని పార్టీ, ఉద్యమాలకి పెద్ద నష్టమే కావచ్చు గాక! ఇలాంటి కష్టనష్టాలెన్నింటినో తమిళనాడులో పీపుల్స్‌వార్ పార్టీ ఎదుర్కొంటూ అధిగమిస్తూ అభివృద్ధి అవుతూనే వస్తోంది. పీపుల్స్‌వార్ మాతృసంస్థ అయిన భా.క.పా. (మా-లె) తమిళనాడు కార్యదర్శిగా వుంటూండిన కా॥ అప్పుని 1970లో ఇలానే అరెస్టుచేసి ఇదే నయవంచక కరుణానిధి ప్రభుత్వ హయాంలో పోలీసులు రహస్యంగా హత్య చేసారు. తప్పించుకు పోయినట్లు ప్రచారం చేసారు. ఇప్పటికీ తప్పించుకుపోయిన ఆచూకీ తెలియని వ్యక్తిగానే కా॥ అప్పు గురించి పోలీసులు ప్రభుత్వం ప్రచారం చేస్తుంటాయి. ఉత్తర ఆర్కాట్‌లో జోలార్‌పేట్ ప్రాంతంలో కార్మిక రైతాంగ రంగాలలో చురుగ్గా పనిచేస్తుండిన 18 సం॥రాల యువ విప్లవ కిశోరం కా॥ సేరళన్‌ని 1977లో పోలీసులు దారుణంగా హత్య చేసారు. అలానే 1980లో కామ్రేడ్స్ బాలన్, కన్నుమొనిలను అరెస్టుచేసి చెట్లకి కట్టేసి ప్రజల సమక్షంలోనే వారిని తీవ్రంగా హింసించి మరీ నిలువునా పోలీసులు కాల్చి చంపారు. ఈ తీరులో సుమారు 26 మంది విప్లవకారుల్ని తమిళనాడు పోలీసులు హత్యచేసారు. తమిళనాడు పోలీసుల ఈ నీచ పైశాచిక హంతక చరిత్ర అతి నగ్నంగా పార్టీ ముందు ప్రజలముందు ప్రదర్శితమవుతున్నదే! అయినా తమిళనాడు పోలీసుగూండానేత డి.ఐ.జి. కాళీముత్తు కా॥ రవీంద్రన్ పోలీసు ఎన్‌కౌంటర్‌లోనే మరణించినట్లు పిరికితనంతో బుకాయిస్తున్నాడు.

**(తరువాయి 16వ పేజీలో)**

**మార్చి 8**

## గత శతాబ్ది మహిళా విముక్తి ఉద్యమాలు, అనుభవాల నుండి నేర్చుకుందాం!
## అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట వారసత్వాన్ని మరింత దీక్షగా కొనసాగిద్దాం!!

# స్త్రీ పురుషుల సంపూర్ణ సమానత్వం లక్ష్యంగా శ్రమవిముక్తి, మహిళా విముక్తి బాటలో సాగిపోదాం!!!

'నూతన శతాబ్ది, నూతన సహస్రాబ్ది వచ్చేసిన శుభ సందర్భం' అంటూ ప్రచార సాధనాలు గత రెండు నెలలుగా మానవ చరిత్ర గత విజయాలనూ, చారిత్రక పరిణామాలనూ, స్త్రీ పురుషులలో విశిష్టమైన వ్యక్తులనూ పేర్కొంటూ పుంఖానుపుంఖాలుగా వ్యాసాలనూ, టి.వి. ప్రదర్శనలను గుప్పిస్తున్నాయి. ''చరిత్రపై కొత్త సంతకం'' అనీ, ప్రవేశించడానికి అసాధ్యంగా వుండిన ''పురుషుల దుర్భేద్య దుర్గాలలోకి మహిళల చొరబాటు'' అనీ, సామాజిక రంగంలో 'స్త్రీల ఆధిపత్యానికి తెరతీసిన కాల'మనీ, స్త్రీలపట్ల వైఖరులకు సంబంధించి 'సరికొత్త పురుషావతారాల'కు వీలు కల్పిస్తున్న సాంకేతిక విప్లవానికి ప్రారంభమనీ ప్రచార సాధనాలు పేర్కొంటూ స్త్రీల పురోగమనానికి సంబంధించిన పలు వ్యాఖ్యానాలతో ముందుకు వస్తున్నాయి. అయితే మానవుల సమిష్టి సంపదలను, అవకాశాలను హక్కు భుక్తం చేసుకుని సామాజిక నిచ్చెనలో పై మెట్లకు చేరుకున్న కొద్దిమంది ఆస్తిపర బృందాల, వర్గాల చరిత్రనూ కొద్దిమంది ప్రముఖ మహిళల చరిత్రనూ పురోగమనానికి, అభివృద్ధికి కొలబద్ధలుగా తీసుకుంటున్న వ్యాఖ్యానాలు, నిర్వచనాలు ఇవి.

అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినమైన మార్చి 8ని గుర్తించుకుంటున్నపుడు, స్త్రీల ప్రతిపత్తిలో వచ్చిన, వస్తోన్న మార్పులను మానవజాతి పురోగమనంలో, దాని విజయాల, వైఫల్యాల క్రమంలో భాగంగా మాత్రమే మనం లెక్కించాల్సి వుంటుంది. వాస్తవ జీవితంలోనూ, తాత్విక చింతనలోనూ హేతువుకు బదులు మత విశ్వాసాన్ని, సృష్టివాదాన్ని నిలబెట్టి శతాబ్దాలుగా గడ్డకట్టుకు పోయిన తొలి వర్గ సమాజాలు అంతరించాక పారిశ్రామిక విప్లవంతో పెట్టుబడిదారీ వ్యవస్థ మారాకు తొడిగింది. పారిశ్రామిక విప్లవం చరిత్ర గమనంపై మతం ఉడుంపట్టును తుత్తునియలు చేసింది. వేల సం॥లు కొనసాగిన వ్యవసాయ ప్రాధాన్య సమాజాలు యూరప్‌లో కనుమరుగై పరిశ్రమలకు ప్రాధాన్యం పెరిగింది. ఈ పారిశ్రామికీకరణ క్రమంలోనే 'మానవులంతా సమానులే' వంటి మహత్తరమైన ఆధునిక భావనలు, హక్కుల భావనలు ఆవిర్భవించాయి. దైవాంశ సంభూతుడైన రాజుకి, భూమ్మీద దేవుని ప్రతినిధులయిన మతాధిపతులకు, రాచరికపు అల్పసంఖ్యాక కులీన వర్గాలకు (ఇందులోనూ పురుషులకే) తప్ప తక్కిన అశేష ప్రజానీకానికి ఎటువంటి హక్కులు లేకుండా పోయిన భూస్వామ్య సమాజంలోని పరిస్థితులను పెట్టుబడిదారీ విధానం పూర్తిగా మార్చివేసింది. వ్యవసాయంమీద ఆధారపడిన జీవిత విధానం స్థానంలో పరిశ్రమలపై ఆధారపడిన జీవిత విధానం ప్రవేశించి అనేక నూతన సామాజిక తరగతులనూ, వర్గాలనూ సృష్టించింది. ఈ నేపథ్యంలోనే అప్పటివరకూ భూస్వామ్య యుగానికి ప్రతినిధులైన ఉన్నత వర్గాలకూ, రాచరిక వర్గాల పురుషులకూ మతాధిపతులకు మాత్రమే పరిమితమై వుండిన పౌరహక్కులూ, అధికారంలో ప్రాతినిధ్యం వంటివి నూతనంగా ఏర్పడుతున్న సామాజిక వర్గాలకు కూడా అందాలనే ఉదార ప్రజాస్వామిక భావనలు మొదలయినాయి.

అయితే మానవులందరూ సమానులే, చట్టంముందు అందరూ సమానులే అనే నూతన భావనలు పైకి ఎంత గొప్పగా వున్నా అవి హక్కుల్ని, అధికారాన్ని అతికొద్దిమంది కులీనులకే పరిమితం చేసిన భూస్వామ్య సమాజంపై తొలి బూర్జువా వర్గ తిరుగుబాటులో భాగంగా ఆవిర్భవించాయి. అందుకే ప్రతి నూతన భావనకీ దాని వర్గ స్వభావం దానికుంటుంది. భూస్వామ్య దోపిడీదారులకే పరిమితమైన హక్కుల్ని, అధికారాల్ని బూర్జువా దోపిడీ దారులు కైవసం చేసుకొనేందుకు జరిపిన తీవ్రమైన వర్గపోరాటంలో ఈ నూతన భావనలు పుట్టుకొచ్చాయి కాబట్టే సారాంశంలో వాటికి బూర్జువా వర్గ పరిమితులే వుంటూ వచ్చాయి. మానవులంతా సమానులు అంటే బూర్జువాలందరూ సమానులే అనే అర్థం. భూస్వామ్య సమాజం విధించే పలు అడ్డంకులను, నియమ నిబంధనలనూ తొలగించి వ్యాపారాన్ని స్వేచ్ఛగా, నిర్నిరోధంగా జరుపుకోడానికి, ఒక నూతన దోపిడీ సమాజ విధానాన్ని నెలకొల్పుకోవడానికి బూర్జువాలు కోరుకున్న సమానత్వమే ఇది కాబట్టి ఈ 'మానవ సమానత్వం' ఆనాటి బానిసల హక్కులనూ, శ్రామికుల, స్త్రీల హక్కులనూ గుర్తించలేదు. బానిస వ్యాపారం చేయడానికి స్వేచ్ఛా సమానత్వం...., శ్రామికుల, స్త్రీల శ్రమను దోపిడి చేయడానికి స్వేచ్ఛా సమానత్వం... కాబట్టే అది సారాంశంలో బూర్జువాల సమానత్వం.

ఈ బూర్జువా వర్గం కూడా భూస్వామ్య పితృస్వామ్యం స్థానంలో బూర్జువా పితృస్వామ్య రూపాన్ని ప్రవేశపెట్టింది కాబట్టి స్త్రీలను పరాధీనులుగా తప్ప స్వతంత్ర వ్యక్తులుగా, సమానులుగా అది భావించే ప్రశ్నే లేదు. అందుకే ఆధునిక మార్పులను, హక్కులను, అధికారాన్ని కోరుకున్న ఆనాటి నూతన వర్గాలూ, బృందాలూ కూడా స్త్రీలకు సామాజిక హక్కులు వుండాలని భావించలేదు. 20వ శతాబ్ది ప్రారంభం వరకూ పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన యూరప్, అమెరికాలలో సైతం స్త్రీలకు ఓటుహక్కు లేదు. బూర్జువా ''మానవ సమానత్వం'' స్త్రీలను పౌరులుగా సైతం గుర్తించలేదన్న సత్యానికి ఇదే ప్రామాణిక ఉదాహరణగా నిలుస్తుంది. స్వేచ్ఛా, సమానత్వం, సౌభ్రాతృత్వం అంటూ యూరప్‌ను ఉర్రూతలూగించిన ఫ్రెంచి బూర్జువా

ప్రజాస్వామ్య విప్లవం (1789) కూడా మనిషి హక్కులనే-రైట్స్ ఆఫ్ మాన్-కోరుకుంది కాని స్త్రీల ప్రతిపత్తికి దీంట్లో తావులేదు. తర్వాత వందేళ్ళపాటు ఉన్నత, మధ్యతరగతి స్త్రీల భావ పోరాటం జరిగిన పిమ్మటే స్త్రీల హక్కులను బూర్జువా సమాజం గుర్తించటం మొదలైంది.

వర్గ సమాజ చరిత్రలోకెల్లా మొదటిసారిగా 18వ శతాబ్ది మధ్యభాగం నుండీ (1750) స్త్రీలకు కూడా హక్కులుండానే ఆలోచనా ధోరణి పూర్తిగా ఉన్నతవర్గాల స్త్రీ పురుషులకే పరిమితమైన రూపంలో యూరప్‌లో మొదలైంది. 1792లో బ్రిటన్ మహిళ మేరీ ఉల్‌స్టోన్ క్రాఫ్ట్ రాసిన ''ఎ విండికేషన్ ఆఫ్ ది రైట్స్ ఆఫ్ ఉమెన్'' అనే పుస్తకం మహిళల హక్కుల గురించి ప్రస్తావించిన మొట్టమొదటి రచనగా పేరుగాంచింది. అంతవరకూ స్త్రీలకు వ్యక్తులుగా ఒక సామాజిక హోదా అన్నదే చరిత్రలో లేదు. ''స్త్రీలు కుటుంబంలో భాగం. వారికి బయటి ప్రపంచపు రాజకీయాలతో సంబంధం లేదు. వారు పురుషుల సొంత ఆస్థి. (కోడిపెట్ట కోడిపుంజుకు చెందుతుంది. స్త్రీ భర్తకు చెందుతుంది) స్త్రీకి సంబంధించిన ప్రతి అంశాన్నీ పురుషుడే నిర్ణయిస్తాడు. పురుషుడి పెత్తనం క్రిందే స్త్రీ శాంతిగా వుండగలుగుతుంది'' అనే భావజాలం ఆనాటి వరకు అంటే కొన్ని వందల, వేల సం॥లుగా ప్రపంచమంతటా రాజ్యమేలుతూ వచ్చింది. బూర్జువా వర్గ పురుషుల ఆధిపత్యాన్ని, మానవ సమానత్వం పేరిట అసమానత్వాన్ని నూతన రూపంలో సాగిస్తున్న వారి ఆచరణను ఆ బూర్జువావర్గ మహిళలే ప్రశ్నించిన నేపథ్యంలో స్త్రీల చదువుకున్న ప్రాముఖ్యత, స్త్రీల సామాజిక హోదా వంటి అంశాలు సమాజం ముందుకొచ్చాయి. బూర్జువావర్గ మహిళలు వర్గ పురుషుల ఆధిపత్యాన్ని ప్రశ్నిస్తూ, నిలదీస్తూ తమ ఉనికి కోసం సాగించిన ఈ ప్రయత్నం 19వ శతాబ్దంలో మాత్రమే ఒక ఉద్యమ రూపాన్ని పొందింది. అంటే దాదాపు వంద సం॥ల పాటు ఎంతోమంది ఉన్నతవర్గ, మధ్యతరగతి స్త్రీలు సమాజంలో వ్యక్తి హోదా కోసం కనీస హక్కుల కోసం ప్రశ్నిస్తూ, పోరాడుతూ వచ్చారు. 1850లలో యూరప్‌లో ప్రధానంగా ఇంగ్లండ్‌లో మధ్యతరగతి స్త్రీలు ఉన్నత విద్యకోసం, చట్టాల్లో తమ కనుకూలమైన మార్పుల కోసం, ఆస్థి హక్కు కోసం పోరాడారు. చదువు గురించి, చట్టాల గురించి, పని గంటల తగ్గింపు గురించి స్త్రీలు బహిరంగంగా మాట్లాడటాన్ని సహించని కాలంలో ఈ మహిళలు పురుషులకు ప్రవేశంలేని స్త్రీల సంఘాలను ఏర్పర్చుకున్నారు. ఈ వందేళ్ళ కాలంలోనే శ్రామికవర్గ మహిళల్లో కూడా పరిశ్రమల్లో, గనుల్లో తమను దారుణంగా దోపిడీ చేస్తున్న పరిస్థితులకు వివక్షతకు వ్యతిరేకంగా లేచి నిలబడటం మొదలయింది.

పాశ్చాత్య దేశాలలో పెట్టుబడిదారీ విధానం ప్రవేశపెట్టిన అతి ముఖ్యమైన ఆర్థికపరమైన మార్పు ఏమిటంటే అది స్త్రీలను సామాజిక ఉత్పత్తిలోకి చాలా పెద్ద ఎత్తున లాక్కొని రావటమే. పెట్టుబడిదారీ విధానానికి శ్రామికుల రిజర్వ్ సైన్యం పెద్ద ఎత్తున అవసరం కాబట్టే అది విస్తరించే క్రమంలో గృహిణులను కూడా సామాజికోత్పత్తిలో భాగం చేసింది. గత సమాజాల్లో ప్రధానంగా ఇళ్ళలోనే వుంటూ సరళమైన ఉత్పత్తి పనులు చేసే వారుగా, గృహిణులుగా వుండిన మహిళలు ఇపుడు ఎప్పటికీ సులభంగా దొరికే అదనపు శ్రామికశక్తిగా మారిపోయారు. ఈ మహిళా రిజర్వ్ సైన్యం తొలినుండి పెట్టుబడిదారీ వ్యవస్థకు అపారమైన లాభాలపంట పండిస్తూ వచ్చింది. పితృస్వామ్యం మహిళల శ్రమను ప్రాధాన్యం లేనిదిగా చిత్రిస్తూ వచ్చింది కాబట్టి పెట్టుబడికి మహిళలు కారుచౌక శ్రమకే లభ్యమవుతారు. అట్లే శ్రమశక్తి విలువను తగ్గించడానికి కూడా ఈ మహిళా రిజర్వ్ సైన్యం ఒక సాధనంగా పనికొస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా స్త్రీలు ఇంటి బయటకు రావటం ద్వారా తమ ఉపాధి అవకాశాలు తగ్గిపోయాయని సాధారణంగా పురుషులు ఆరోపిస్తుండటం అందరికీ తెలిసిన విషయమే. ఒకసారి ఇలా మహిళా రిజర్వ్ సైన్యం తయారయినాక పెట్టుబడిదారీ వర్గం తొలిదశలో స్త్రీలను, పిల్లలను నగ్నదోపిడీతో పీల్చి పిప్పిచేసింది. పురుషుల వేతనాలనే కుదించిన పెట్టుబడిదారీ వర్గం స్త్రీల వేతనాలను మరీ తగ్గించి వేసింది. 19వ శతాబ్దంలో స్త్రీలు, పిల్లలు పశ్చిమ దేశాలలో రోజుకి 16 గంటల పైనే పని చేయాల్సిన దుర్భరమైన పని పరిస్థితుల్లో నలిగిపోయారు. ఇక నల్లజాతి బానిస స్త్రీల పరిస్థితి మరీ హీనంగా వుండేది. జాతి వివక్షత బహిరంగంగా విచ్చలవిడిగా వుండేది. ఇంట్లో, పనిస్థలంలో కనీస హక్కులు మృగ్యమైన ఇలాంటి పరిస్థితులు, అతి తక్కువ వేతనాలు, వివక్ష వంటివన్నీ కలిపి శ్రామికవర్గ మహిళలు సంఘటితం కావడానికి, కలిసి పనిచేయడానికి తోడ్పడినాయి.

సంఘాలు అనేవి పురుషుల దుర్భేద్య స్థావరాలుగా వుండి, ట్రేడ్ యూనియన్‌లలో స్త్రీలకు ప్రవేశమే లేని రోజుల్లో అమెరికాలో 1830లలో నల్లజాతి స్త్రీ కార్మికులు జాతి వివక్షకు వ్యతిరేకంగా ప్రాణాలకు తెగించి 'నల్లజాతి స్త్రీల జాతీయ సంఘం'ని ఏర్పర్చారు. 1845లో అమెరికాలోని పశ్చిమ పెన్సిల్వేనియా బట్టల మిల్లులో 5000 మందికి పైగా స్త్రీ పురుషులు కలిసి పాల్గొన్న సమ్మె 10 గంటల పనిదినం కోసం, సమాన వేతనం కోసం పోరాటంగా 10 సం॥ల పైగా కొనసాగింది. పలు ప్రాంతాలకు విస్తరించిన ఈ సమ్మె 1857 మార్చి 8న విజయం సాధించింది. ఈ ఉద్యమ స్ఫూర్తితోనే 1910లో కోపెన్‌హేగ్‌లో సోషలిస్టు మహిళల రెండో అంతర్జాతీయ సదస్సులో మార్చి 8వ తేదీని అంతర్జాతీయ మహిళా దినంగా ప్రకటించారు. బూర్జువా పెత్తనంపై పోరాడేందు కోసం స్త్రీలలోని విశాలమైన విభాగాలను కూడగట్టే లక్ష్యంతో సోషలిస్టు మహిళా నేత క్లారా జెట్కిన్ చేసిన ప్రతిపాదన ప్రకారమే మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినంగా ఏర్పడింది. కాలక్రమంలో బూర్జువా మహిళా ధోరణుల నుండి తన్నుతాను వేరుపర్చుకుంటూ మార్చి 8 అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినంగా రూపొందింది. ఇలా 18వ శతాబ్ది మధ్య నుండి ఉన్నత వర్గాల మహిళల అస్తిత్వ పోరాటాలూ, 19వ శతాబ్ది మధ్య నుండి శ్రామికవర్గ మహిళల జీవన్మరణ పోరాటాలూ రెండు పాయలుగా సాగుతూ వచ్చాయి. ఈనాటికీ ఈ రెండు పాయలూ వివిధ రకాలుగా సమాంతరంగా కొనసాగుతూనే వున్నాయి. అయితే పనిగంటల తగ్గింపు డిమాండ్ ఫలవంతమయిన దినంగా చరిత్రలో నిలచిపోయిన మార్చి 8 అంతర్జాతీయ మహిళాదినం పోరాడే మహిళలకు ఆయుధమైంది.

20వ శతాబ్దిలో బూర్జువా, పెటీబూర్జువా స్త్రీల పోరాటాలూ, శ్రామికవర్గ స్త్రీల పోరాటాలూ వాటి స్వభావ రీత్యానే విభిన్న రూపాల్లో, మార్గాల్లో కొనసాగుతూ వచ్చాయి. ఈ శతాబ్ది మొదటనుండీ ఉన్నత, మధ్య తరగతి స్త్రీల పోరాటం ఓటు హక్కు సాధించడం లక్ష్యంగా సాగింది. అయితే ఈ పోరాటంతో శ్రామికవర్గ

స్త్రీలకు ఏ సంబంధమూ లేకుండా పోయింది. 1918లో ఇంగ్లాండులోనూ, 1919లో అమెరికాలోనూ స్త్రీలకు ఓటుహక్కు లభించింది. సామాజికంగా ఆర్థికంగా ముందడుగు వేసిన ఈ వర్గ మహిళలకు కుటుంబం, వివాహ వ్యవస్థ, నీతిసూత్రాలు, స్త్రీల శ్రమ-సంప్రదాయాలు, గర్భస్రావ హక్కు, విడాకులూ, వ్యభిచారం, స్త్రీల శరీరం, లింగ వివక్షత వంటి అంశాలు పోరాట లక్ష్యాలుగా మారాయి. ఈ తరగతి మహిళలే 1930లలో ఫెమినిజానికి, 1960లలో రాడికల్ ఫెమినిజానికి నాంది పలికారు. స్త్రీల దృక్పథం నుంచి స్త్రీల అనుభవాల నుంచి సమాజాన్ని విశ్లేషించే స్త్రీ వాదానికి ప్రతినిధులుగా వీరు భావజాల పోరాటాన్ని పెద్ద ఎత్తున సాగించారు. అయితే ప్రారంభం నుంచీ వీరి పోరాటం మిలిటెంట్ రూపాన్ని తీసుకోనందుకు వారి వర్గ స్వభావమే కారణం. స్త్రీల విముక్తికి, వ్యక్తిగత ఆస్థి రద్దుకి వున్న సంబంధాన్ని కాకుండా, అన్ని వ్యవస్థలలో కొనసాగిన పితృస్వామిక ప్రాతిపదికనుండే వీరు సమాజంలోని సమస్త అంశాలను విశ్లేషించడం సాగించారు. ముఖ్యంగా 1960లలో సైద్ధాంతికంగా మార్క్సిజంతో ప్రభావితులైనప్పటికీ ఏ విధమైన కమ్యూనిస్టు పార్టీ నిర్మాణంలోనూ చేరకుండా వుండిపోయిన ఒక సెక్షన్ మహిళా మేధావులు....ప్రత్యేకించి విద్యారంగానికి చెందినవారు తమను తాము రాడికల్ ఫెమినిస్టులుగా, సోషలిస్టు ఫెమినిస్టులుగా అభివర్ణించుకున్నారు. 18వ శతాబ్ది చివర్లో, 19వ శతాబ్ది మొదట్లోనూ యూరప్‌లో వ్యాపించిన, కొనసాగుతూ వచ్చిన లిబరల్ ఫెమినిజం (ఇది బూర్జువా ఫెమినిజానికి నమూనా లాంటిది) తో తాము తెగతెంపులు చేసుకున్నట్లు ప్రకటించిన ఈ రాడికల్ లేక సోషలిస్టు ఫెమినిస్టులు మహిళల ఇంటిపని సమస్యను, సామాజిక ఉత్పత్తిలో మహిళల పాత్రను, ఎంగెల్స్ రచనలపై ఆధారపడి 'పితృస్వామ్యం' భావనను, రాజ్యానికి వున్న పితృస్వామిక లక్షణాలను లోతుగా విశ్లేషించారు.

అయితే స్త్రీలను సామాజిక వ్యవస్థ నుండి విడదీసి చూడటం, వర్గ అణచివేతకు, పితృస్వామిక వ్యవస్థకు మధ్య వున్న సంబంధాలను చూడ నిరాకరించటం, స్త్రీలందరినీ ఒకటే వర్గంగా చూస్తూ, వివిధ వర్గాల స్త్రీల మధ్య వుండే వర్గ విభజనను, వర్గ వైరుధ్యాన్ని మరుగున పర్చటం, మహిళా ఉద్యమ స్వయంప్రతిపత్తిని, నిర్మాణ రాహిత్యాన్ని ముందుపీఠిన తీసుకురావడం వంటి పెడధోరణుల వల్ల ఈ రకరకాల ఫెమినిస్టులందరూ సాధారణ మహిళా వుద్యమం పేరుతో పెటీబూర్జువా, వున్నతవర్గాల మహిళల సమస్యలనే విశ్లేషిస్తూ ముందుకు తీసుకొస్తుంటారు. వీరిలో కొందరు సామ్రాజ్యవాద సంస్థల నిధులతో స్వచ్ఛంద సంస్థలుగా ఏర్పడి, వివిధ దేశాల్లో దోపిడీ వ్యవస్థను ముట్టకుండా సంస్కరణలను కోరుకుంటూ మహిళా ఉద్యమాన్ని బూర్జువా వర్గం కోరుకునే రీతిలో భావజాల పోరాటంగా మారుస్తూ వస్తున్నారు. కొన్నిచోట్ల స్వచ్ఛంద సంస్థల పేరిట సామ్రాజ్యవాదుల ప్రయోజనాలను కాపాడే వారుగా విప్లవోద్యమం జరుగుతున్న వెనుక బడిన దేశాల్లో ఈ ఫెమినిస్టుల్లోని కొన్ని సెక్షన్లు పనిచేస్తున్నాయి. స్త్రీ విముక్తి అవసరాన్నే త్రోసిపుచ్చడం, శాస్త్ర సాంకేతిక అభివృద్ధి క్రమంలోనే స్త్రీలు శారీరకంగా, జీవశాస్త్రపరంగా తమమీద వున్న భారాన్ని, పాత్రను (అంటే గర్భనిరోధం, గర్భధారణ నుండి, మాతృత్వం నుండి విముక్తి కావటం, ప్రసవానికి పూర్వం, ప్రసవానంతరం తమ కేర్పడుతున్న శారీరక సమస్యలను శాస్త్ర విజ్ఞానం సహాయంతో అధిగమించడం) తొలగించుకోగలరని, తోసిపుచ్చగలరనీ సూత్రీకరణలు చేయటం వంటి రకరకాల వాదాలతో ధోరణులతో స్త్రీవాదం మొత్తంగానే శ్రామికవర్గ మహిళల జీవిత కాలపు సమస్యలను ఆచరణలో తృణీకరించి అశేష శ్రామిక మహిళా జనావళి నుండి వేరుపడి పోయారు. పారిశ్రామిక, సామ్రాజ్యవాద దేశాలలో కాని, వర్ధమాన దేశాల్లోకాని రకరకాల ఫెమినిస్టుల వర్గ స్వభావం, పెటీబూర్జువా, ఉన్నతవర్గాల స్వభావంతోనే వుంటోంది. తమ వర్గ స్వభావానికి సామాజిక, ఆర్థికహోదాకి అనుగుణంగానే 20వ శతాబ్ది ముగిసిన దశలోనూ వీరు గర్భస్రావహక్కు, పర్యావరణం, ఇంటిపనికి వేతనంపై ఉద్యమం, వ్యభిచారాన్ని చట్టబద్ధం చేయటం, మహిళలకు రిజర్వేషన్లు వంటి వాటికే ప్రాధాన్యమిస్తూన్నారు. పాలకవర్గ సంస్కరణలకు అనుగుణంగా వుంటున్న ఈ సమస్యలపై కొన్ని సందర్భాలలో వ్యవస్థ పరిమితులలో ఫెమినిస్టులు మార్పులు తీసుకువస్తున్నారు కూడా.

రెండున్నర శతాబ్దాలుగా సాగుతున్న పెటీబూర్జువా, బూర్జువా మహిళల ఉద్యమాలతో పోలిస్తే శ్రామికవర్గ మహిళల పోరాటం స్వభావం రీత్యానే భిన్నమైంది. దుర్భరమైన పని పరిస్థితులు, హీనస్థాయి వేతనాలు, కుటుంబ నిర్వహణా భారం, వసతుల లేమి ఇంటా, బయటా అణచివేత వంటి నిత్య జీవిత సమస్యలు శ్రామిక స్త్రీలను తమ వర్గ పురుషులతో భుజం భుజం కలిపి పోరాడేటట్లుగా చేశాయి. 1845లో పెన్సిల్వేనియాలో పనిగంటల తగ్గింపును సాధించిన కార్మికుల సమ్మె తర్వాత కార్మిక స్త్రీల ఐక్యతకు విస్తృత ప్రాతిపదిక ఏర్పడింది. ఈ క్రమంలో కార్మిక స్త్రీల సంఘాలు ఆవిర్భవించాయి. ఎనిమిదిగంటల పనిదినాలు, ఇంటివసతి, సమాన వేతనం వంటి డిమాండ్లతో కార్మికవర్గ స్త్రీలు 20వ శతాబ్దం మొదటనుండి కార్మిక పురుషులతో కలిసి మిలిటెంట్ పోరాటాలకు దిగారు. సమస్యల పరిష్కారానికి, ఉద్యమ లక్ష్యాలకు కార్మిక స్త్రీలు ప్రాణాలర్పించటం, రాజ్యహింసను ఎదుర్కోవడం, నిర్బంధాల పాలవడం విస్తృత స్థాయిలో మొదలయింది. దోపిడీరాజ్య దుర్గాలను కూల్చివేసేందుకు శ్రామికవర్గ మహిళలు ప్రాణాలొడ్డి చేసిన వీరోచిత పోరాటాలకు 19వ శతాబ్దిలో పారిస్ కమ్యూన్ సాక్షిగా నిలిచింది. స్త్రీ పురుష సంబంధాల గురించి, కుటుంబ రూపాల గురించి పారిశ్రామిక విప్లవం ప్రారంభం నుండే మొదలైన చర్చలూ, పరిశోధనలూ, వ్యాఖ్యానాలూ 1850ల తర్వాత ఒక సమగ్ర రూపం దాల్చాయి. ''1844 ఆర్థిక, తాత్విక రాతప్రతులు'' రచన మొదలుకుని 'పెట్టుబడి' వరకు మార్క్స్ చేసిన పలు రచనలూ, మోర్గాన్ 'పురాతన సమాజం' గ్రంథం ప్రాతిపదికగా ఏంగెల్స్ రాసిన ''కుటుంబం, వ్యక్తిగత ఆస్థి, రాజ్య ఆవిర్భావం''లు స్త్రీల పరాధీనతకు, గృహ బానిసత్వానికి, వ్యక్తిగత ఆస్థి పుట్టుక ఎలా కారణమైందో శాస్త్రీయంగా విడమర్చి చెప్పాయి.

వ్యక్తిగత ఆస్థిని, దాన్ని పెంచి పోషించిన వర్గ సమాజాన్ని, దాన్ని కాపాడుతూ వచ్చిన రాజ్యాన్ని కూల్చకుండా, ఆస్తి ప్రాతిపదికన ఏర్పడిన బూర్జువా కుటుంబ రూపాన్ని రద్దు చేయకుండా, పరివర్తించకుండా స్త్రీల విముక్తి, దానితోపాటూ పురుషుల విముక్తి సాధ్యం కావని మార్క్స్ ఎంగెల్స్‌ల రచనలు చాటి చెప్పాయి. నాటి నుంచి నేటి దాకా వీరి రచనలు మహిళా విముక్తికి సంబంధించి వివిధ దేశాల శ్రామిక ఉద్యమాలకు మార్గదర్శకత్వం వహిస్తున్నాయి.

మార్క్సిజం వెలుగులో రష్యా, చైనా విప్లవాల విజయం స్త్రీల ఆర్థిక సామాజిక పరిస్థితులలో చారిత్రాత్మకమైన మార్పులను తీసుకొచ్చింది. ''స్త్రీల విముక్తికి మొట్టమొదటి షరతు యావత్తు స్త్రీ జాతిని సామాజిక ఉత్పత్తి రంగంలోకి తిరిగి ప్రవేశపెట్టడం...'' అన్న ఎంగెల్స్ సూత్రీకరణ విప్లవానంతరం రష్యా చైనాలలో మొదటిసారిగా అమలయింది. సోవియట్ రిపబ్లిక్ తన ప్రాథమిక కర్తవ్యంగా స్త్రీల హక్కుల మీద గల పరిమితులన్నింటినీ రద్దు చేసింది. సంపూర్ణ వివాహ స్వేచ్ఛ, సంపూర్ణ విడాకుల స్వేచ్ఛను శాసనబద్ధం చేసింది. 'పెళ్ళిద్వారా' సంతానానికి, 'పెళ్ళి కాకుండా' సంతానానికి మధ్యగల సమస్త భేదాన్ని, స్త్రీలపట్ల సాగుతున్న రాజకీయ నిర్బంధాలను సోవియట్ ప్రభుత్వం ఏర్పడిన వెనువెంటనే రద్దు చేసింది. ఈ సందర్భంలోనే ''ప్రపంచంలో ఒక్క ప్రజాతంత్ర పార్టీకూడా, అత్యంత పురోగామి బూర్జువా రిపబ్లిక్‌లలో సైతం మనం అధికారంలోకి వచ్చిన మొట్టమొదటి సం॥రంలో చేసిన దానిలో శతాంశాన్ని దశాబ్దాలలో కూడా చేయలేక పోయిందని'' లెనిన్ ప్రకటించాడు. భూమీమ్మీదా, ఫ్యాక్టరీల మీదా సొంత స్వామ్యాన్ని రద్దుచేసే క్రమం, ఇంటిపనిని సమాజపరం చేసి 'గృహ బానిసత్వం' నుండి స్త్రీ విముక్తికి దారి యేర్పర్చే క్రమం ప్రారంభమైందనీ, మనం కొత్తదారి పట్టామని లెనిన్ ప్రకటించాడు. 1930లలో భూముల సమిష్టీకరణ దశలో, వ్యవసాయ, పారిశ్రామిక, శాస్త్ర సాంకేతిక రంగాల్లో స్వల్పకాలంలోనే సోవియట్ రష్యా మహిళలు సాధించిన ప్రగతి, ఉత్పత్తిలో వారు దక్కించుకున్న ప్రాధాన్యత యావత్ ప్రపంచంమీదా ప్రగాఢ ప్రభావాన్ని కల్గించాయి. ఇక చైనా విప్లవం ప్రత్యేకించి 1966 నుండి చైనాలో జరిగిన సాంస్కృతిక విప్లవం సామాజిక శ్రమ, ఇంటిపని, పిల్లల పెంపకం, కుటుంబంలో స్త్రీ పురుషుల పాత్రలకు సంబంధించి మానవ చరిత్రలోకెల్లా మొట్టమొదటి సారిగా సామ్యవాద సంస్కృతికి సంబంధించిన ఆచరణను పతాకస్థాయికి తీసుకుపోయింది. ''స్త్రీలు ఆకాశంలో సగం వారు తమ భాగాన్ని గెల్చుకోవాల్సి వుంది'' అన్న మావో, చైనా కమ్యూనిస్టు పార్టీలు ఆ సగ భాగంలో మార్పు తేవడానికి మొత్తం చైనానే వేదికగా మార్చారు. స్త్రీలపట్ల యుగాల నుండి సాగుతున్న పాత భావాలపై చైనా మహిళలు యుద్ధం ప్రకటించారు.

అయితే విప్లవానికి, ప్రతీఘాత విప్లవానికి మధ్య, కార్మిక వర్గానికి, బూర్జువా వర్గానికి మధ్య, నిరంతరం జరిగిన పోరాటంలో రష్యా, చైనాలు రెండింటిలో విప్లవం తిరోగమించింది. కార్మికవర్గం తాత్కాలికంగా ఓడిపోయింది. మొదట రష్యాలో, తర్వాత చైనాలో జరిగిన ఈ తిరోగమనంతో సామ్రాజ్యవాదులకు పట్టపగ్గాలు లేకుండా పోయాయి. 'సోషలిజానికి అంతం' 'చరిత్రకు అంతం', 'పెట్టుబడిదారీ విధానమే శాశ్వతం' అంటూ పోరాడే శక్తులను, పీడిత ప్రజలను నిరాశా నిస్పృహలకు గురిచేసి, నిర్వీర్యపరచే పలు తిరోగమన సిద్ధాంతాలు బయలుదేరాయి. అయితే గత రెండున్నర శతాబ్దాల చరిత్రలో బూర్జువా విప్లవాల సారాంశాన్ని, 20వ శతాబ్దిలో సోషలిస్ట్ విప్లవాల విజయాలూ, వైఫల్యాల సారాంశాన్ని, ఈ కాలంలోనే సమాంతరంగా సాగిన మహిళా ఉద్యమాల సారాంశాన్ని బోధపర్చుకున్నట్లయితే ఎలాంటి తిరోగమన, నిరాశావాద సిద్ధాంతాలూ పోరాట ప్రజలను భయపెట్టజాలవు. అసమానత్వం గురించి, మనిషిని మనిషి పీడించే అమానవీయ సంస్కృతి గురించి వేల సం॥లుగా మానవ మేధస్సుకు చిక్కుముడిగా వున్న సమస్య ఈ కాలంలోనే పరిష్కరింపబడింది. శ్రమించే వారికి, శ్రమను దోపిడీ చేసే వారికి మధ్య వైరుధ్యమే మానవుల సమస్యలన్నింటికీ మూలం అన్న సత్యాన్ని మార్క్సిజం కనుగొన్నది. శ్రమ దోపిడీ రద్దులోనే సకల వైరుధ్యాలకూ పరిష్కారముందన్న మార్క్సిజం మానవ సమానత్వం అంటే ''స్త్రీ పురుషులిరువురి సమానత్వం కూడా'' అంటూ చాటి చెప్పింది. శ్రమ విముక్తి అంటే శ్రామికుల విముక్తి జరగకుండా స్త్రీల విముక్తి జరగదని నిరూపించింది. ఈ సత్యమే శ్రామికవర్గ విప్లవాలకు మూలమైంది. శ్రమ విముక్తిపై సమాజాన్నే ప్రయోగశాలగా చేసే క్రమంలో 20వ శతాబ్దిలో శ్రామికవర్గ విప్లవాలు గెలిచి ఓడాయి. నిజమే.... పిరికివాళ్ళు మెరుపు మెరిసినా హడలి చస్తారు. బతకాలంటే పోరాడి తీరాల్సినవారు ఓటమిలోనూ విజయానికి దారులు వెతుకుతారు. ప్రపంచంలో నిలబడాల్సిందీ, బతకాల్సిందీ ఎవరు? దోపిడీదారులా, దోపిడీకి గురయ్యే వారా? అన్న ప్రశ్న ఇప్పటికీ మిగిలే వుంది. ఈ ప్రపంచం ఎవ్వరిది అనే సమస్యే నూతన శతాబ్దిలోనూ, నూతన సహస్రాబ్దిలోనూ సవాలుగా వుంటోంది. శ్రామిక వుద్యమాల ముందు, శ్రామిక మహిళా ఉద్యమాల ముందు పదివేల మైళ్ళ ప్రయాణం వుంది. మహా ప్రారంభం మొదలైంది. ప్రపంచంలోని పలు దేశాలలోనూ, మన దేశంలోనూ అభివృద్ధి చెందుతున్న విప్లవ మహిళా వుద్యమం సామ్రాజ్యవాదాన్ని, ఫ్యూడలిజాన్ని భూమీమ్మీద పితృస్వామిక పీడనను నిర్మూలించే లక్ష్యంతో తన సొంత విముక్తిని ముడిపెట్టి సడలని మనో ధైర్యంతో, దీక్షాపరత్వంతో ముందుకు సాగుతోంది. ఆకాశంలో సగాన్ని గెలుచుకోవడం ద్వారా మహిళలు ప్రపంచం ఎవ్వరిది అన్న ప్రశ్నకు జవాబివ్వడానికి సిద్ధంగా వున్నారు.

కార్మికులను, మహిళలను, పీడిత ప్రజలను శాశ్వతంగానే వంచించగలమనే అతి విశ్వాసంతో గ్లోబలైజేషన్ దశలో సామ్రాజ్యవాదులు, రకరకాల అణచివేత పద్ధతులను చేపడుతూనే మరోవైపు సంస్కరణలకు కొత్త రంగులద్ది ప్రపంచంమీదికి వదులుతున్నారు. సమగ్ర అభివృద్ధి పేరిట నూతన దోపిడీ సిద్ధాంతాలను, పథకాలను ముందుకు తెస్తూ మూడో ప్రపంచ దేశాలకు ప్రపంచబ్యాంకు మార్గాన్నే ఏకైక మార్గంగా చూపిస్తూ ప్రజల్లో పేరుకుపోతున్న అసంతృప్తిని చల్లార్చేందుకు వివిధ పథకాలతో వాగాడంబరం ప్రదర్శిస్తున్నారు. అదే సమయంలో పోరాడుతున్న పీడిత ప్రజలపై మహిళలపై కనీ వినీ ఎరుగని వ్యవస్థీకృత హింసను అమలు చేయిస్తున్నారు. సామ్రాజ్యవాదుల ఈ రెండు ముఖాల పథకాలకు చంద్రబాబు పాలన ఒక తిరుగులేనిది ఉదాహరణ. డ్వాక్రా, దీపం, రోష్నీ పథకాలనూ, బెల్లి లలిత హత్య మొదలుకొని నిన్న మొన్నటి ఎక్సైజ్ పోలీసుల దారుణ అఘాయిత్యం వరకూ రాజ్యహింస బీభత్సకాండనూ చూస్తే సంస్కరణలనూ, ఉద్యమాలపై దమన కాండను పాలకవర్గాలు ఏకకాలంలో అమలు పర్చడానికి కంకణం కట్టుకున్నాయని అర్థమవుతుంది.

## పొదుపు సంఘాలు

ప్రచ్ఛన్న యుద్ధానంతరం దోపిడీని ప్రపంచీకరించటం, సరళీకరించటం బలం పుంజుకున్న నేపథ్యంలో అభివృద్ధికి సంబంధించి బూర్జువా ప్రజాస్వామ్యపు చిట్కాలు, తూతూ

మంత్రాలనే సమాజ ఆదర్శాలుగా ఎత్తి చూపడం బాగా పెరిగి పోతోంది. మన రాష్ట్రంలో మహిళా పొదుపు సంఘాలు మొదలుకొని ఫాసిస్ట్ చంద్రబాబు ప్రభుత్వం తీసుకొస్తున్న సవాలక్ష పథకాలన్నింటినీ ఇందుకు ఉదాహరణలుగానే చూపవచ్చు. పొదుపు చేయటంద్వారా అభివృద్ధి, డ్వాక్రా బజార్ల ద్వారా అభివృద్ధి, గ్యాస్ పంపిణీ-దీపం-ద్వారా అభివృద్ధి ఇవి ఒక్కొక్కటి ఏడుస్తున్న పసిపిల్లలను మభ్యపెట్టడానికి, బుజ్జగించడానికి కుటుంబాల్లో పెద్దవారు ఉపయోగించే చిట్కాల కంటే ఏమంత భిన్నమైనవికావు. సారా వ్యతిరేక ఉద్యమం తర్వాత వృద్ధిచెంది లక్షలాది మంది స్త్రీలు సభ్యులుగా వున్న కొన్ని వేల పొదుపు సంఘాలను రాష్ట్ర ప్రభుత్వంకానీ, స్వచ్ఛంద సంస్థలు కానీ తమ ప్రచారానికీ, పలుకుబడికీ ఆయువుపట్టుగా చేసుకుంటున్నాయి. పొదుపు చేయటం ద్వారా స్త్రీల అభివృద్ధి జరుగుతుంది. అంటే అర్థం ఏమిటి? పొదుపు సంఘంలో చేరి ఒక క్రమ పద్ధతిలో కొంతమందితో కలిసి డబ్బు కూడబెట్టడం, దాని సభ్యులు తమ అవసరానికి వాడుకోవడం, కొంతైనా ఆర్థిక స్వాతంత్ర్యం సంపాదించుకోవడం, పురుషులపై నిస్సహాయంగా ఆధారపడే స్థితి నుంచి బయటపడి స్త్రీలు 'స్వతంత్రంగా అప్పులు' తెచ్చుకోగలగటం... ఇది ఖచ్చితంగా స్త్రీల జీవితంలో వచ్చిన అభివృద్ధి అని ప్రపంచబ్యాంకుకు అమ్ముడు పోయిన వారంటున్నారు. దీన్ని జాగ్రత్తగా గమనిద్దాం. పొదుపు సంఘాల అంతిమ ప్రయోజనం ఏమిటంటే స్త్రీలు స్వతంత్రంగా అప్పులు తెచ్చుకోగలగటమట! ఎక్కడ అప్పు దొరికే అవకాశముందనిపిస్తే అక్కడికల్లా పరుగెడుతూ అప్పులాంధ్రకు బాటలేసిన ప్రాంతీయ దళారులు ప్రజలకు అప్పులు తెచ్చుకోవటంలో స్వతంత్రతను ప్రసాదిస్తున్నారు. స్త్రీలను సంఘటితం చేయడానికి, వారిలో మరుగున పడిన నైపుణ్యతలను వెలికి తీయడానికి మరే ఇతర నిజమైన కార్యక్రమాలు విజన్ 2020లో లేక పోయాయి. అప్పుల ప్రభుత్వాలూ, అప్పుల బతుకులూ.... ప్రపంచబ్యాంకు పథకాల ఫలితాలకు ఇంతకు మించిన రుజువులెందుకు మరి? సొంతకాళ్ళ మీద నిలబడటమనే మాటేలేదు. 'ఆధునిక మహిళలు చరిత్రను తిరగరాస్తారు' అని 20వ శతాబ్ది తొలినాళ్ళలో గురజాడ అప్పారావు దార్శనిక దృష్టితో రాబోయే చరిత్రను గురించి వ్యాఖ్యానించాడు. కానీ మన దివాళాకోరు ప్రభుత్వాలు ఈరోజు మహిళలపై అప్పుల భారాన్ని మోపే చరిత్రను సృష్టిస్తున్నాయి. వ్యాపారానికి నీతి, నియమం లేదని మనం చిన్నప్పుడే మూడో క్లాసులోనూ నాలుగో క్లాసులోనో లెక్కల టీచరువద్ద చదువుకుని వుంటాం. లీటరు పాలు ఒక రూపాయి చొప్పున (1960ల నాటి లెక్క) అయిదు లీటర్ల పాలు కొని వాటికి రెండు లీటర్ల నీళ్ళు కలిపి లీటరు పాలను రూపాయి పావలా లెక్కన అమ్మితే వచ్చే లాభమెంత? నష్టమెంత? అన్నవి మనం ఉగ్గుపాల దశనుంచి దోపిడీ ప్రభుత్వాల పాఠశాలల్లో నేర్చుకునే లెక్కలు. (లెక్కలు కూడా సమాజంలోని వైరుధ్యాలనే అంకెల భాషలో చెబుతాయి గదా!) ప్రజల కొంపలు నిలువునా ముంచే ఈ తరహా దోపిడీ లెక్కల వ్యాపారంలో నీతి న్యాయాలకు ఏమాత్రం తావుంటుందో పొదుపు ద్వారా, అప్పుల ద్వారా అభివృద్ధికి సంబంధించిన నేటి ప్రభుత్వ కార్యక్రమాలలో కూడా అంతే నీతి, అంతే న్యాయం మాత్రమే వుంటోంది. 200 సం॥రాల క్రితం స్వేచ్ఛా సమానత్వం సౌభ్రాతృత్వం గురించి యుద్ధభేరి మోగించిన బూర్జువా ప్రజాస్వామ్యం ఇంతకాలం తర్వాత కూడా ప్రజల స్వేచ్ఛను, సమానత్వాన్ని ఈ రకమైన అప్పుల సమానత్వం రూపంలోనే నిర్వచిస్తోంది. పొదుపు సంఘాలలో చేరి సక్రమంగా అప్పు తీసుకోవడం....సక్రమంగా బతకటం...సక్రమంగా అప్పు చెల్లించటం.... విజన్ 2020 దార్శనికతలో అన్నీ సక్రమమే....కాని నిజానికి లేనిదల్లా అదే....ఉత్పత్తిలో, నిర్వహణలో స్త్రీల యాజమాన్యం అనే శతాబ్ది కాలపు ఉన్నతాదర్శాలు అడుగంటి పోయాయి. అప్పుల పొదుపుల మార్గంలో అభివృద్ధి గురించి సరళీకరణ సిద్ధాంతాలు బయలుదేరుతున్నాయి. ఎన్ని పేకమేడలైనా సరే కట్టి చూపిస్తాం కాని గ్రామీణ ప్రజలకు భూమిని పంచిపెట్టే పనిమాత్రం చేయనని ఘంటాపథంగా ప్రకటిస్తున్న ప్రభుత్వం వాటర్‌షెడ్ లాంటి కార్యక్రమాల్లోగాని, వ్యవసాయ యాజమాన్య పద్ధతులలో కాని స్త్రీలకు భాగస్వామ్యాన్ని కల్పించటం వంటి పనులకు దిగుతాందనుకోవడం ఎడారిలో ఎండమావులను వెతకటం లాగే వుంటుంది.

## డ్వాక్రా బజార్లలో ఇ-కామర్స్ విప్లవం

సరళీకరణ దశలో ప్రతి మార్పుకూ 'విప్లవం' అనే బురఖా తగిలించేయటం పాలకవర్గాలకు పెద్ద ఫ్యాషనై పోయింది. చంద్రబాబు ప్రభుత్వం తాను చేపడుతున్న ప్రతి పథకాన్ని సమూల మార్పును తీసుకొచ్చేదిగా డబ్బా కొట్టుకుంటోంది. ఆ రకంగా విద్యా కమిటీల విప్లవం, సాగునీటి సంఘాల విప్లవం, రైతుబజార్ల విప్లవం, పొదుపు సంఘాల విప్లవం....ఇలా చెప్పుకుంటూపోతే అన్నీ విప్లవాలే.... పాలకవర్గాల ఈ 'విప్లవ బాట'లోకి ఈమధ్య డ్వాక్రా బజార్లు, 'దీపాలు' కూడా వచ్చేశాయి. నిద్రలేచింది మొదలు నాలెడ్జ్ సొసైటీ, ఇన్ఫర్మేషన్ హైవే, సైబర్‌గేట్ అంటూ ప్రపంచబ్యాంకు భావనలను రాష్ట్రంమీదకు వదులుతూ పదాల పిచ్చి పట్టిన ఫాసిస్ట్ చంద్రబాబు ఈ మధ్యే 'ఇ-కామర్స్‌తో డ్వాక్రా బజార్లలో విప్లవం' గురించి శివాలెత్తి పోయాడు. మహిళల పొదుపు గ్రూపులు తయారు చేసిన వస్తువులను డ్వాక్రా బజారుల్లో అమ్ముకుని లాభాలు గడించేలా చేయటమే కాదు...అక్కడ అమ్మే వస్తువుల జాబితాను ఇంటర్నెట్‌లో పెట్టి ఎలక్ట్రానిక్ వాణిజ్యం (ఇ-కామర్స్) తో స్త్రీలను ఉద్ధరిస్తాడట! కంప్యూటర్ పిచ్చి తలకెక్కిపోయిన చంద్రబాబుకు తానేం వాగుతున్నాడో కూడా తెలియని సుప్తావస్థకు చేరుకున్నాడు. ఇంతకూ డ్వాక్రా బజార్లలో ఏం అమ్ముతున్నారో చూస్తే వాటికీ, ఇ-కామర్స్‌కూ మధ్య బాదరాయణ సంబంధమేమిటో అర్థమవుతుంది. గ్రామీణ మహిళలు తయారు చేసిన విస్తళ్ళు, మసాలా పొడులు, పచ్చళ్ళు, అప్పడాలు, జడకుచ్చులు, ఎండుచేపలు, పాకంపప్పులు, చాపలు, బ్యాగులు, చీరలు, ఉలెన్ బొమ్మలు, స్వెట్టర్లు, టి.వి. కవర్లు, వెంకటగిరి జరీ చీరలు....ఇవీ డ్వాక్రా బజారు ఉత్పత్తులు. విస్తళ్ళను, మసాలా పొడులను, అప్పడాలను, జడకుచ్చులను, పాకంపప్పులను ఇంటర్నెట్‌లో ఇ-కామర్స్ ద్వారా అమ్మించి డ్వాక్రా బజార్లనూ, మహిళలనూ ఉద్ధరించే పెద్ద మనుషులు మన పాలకులుగా వున్నారిపుడు. ఇంతవరకు క్రెడిట్ కార్డుల ద్వారానే ఇ-కామర్స్ జరుగుతున్నదని అతికొద్దిమంది లక్షాధికార్లు మాత్రమే క్రెడిట్‌కార్డులు కలిగివున్నారని మనకు తెలుసు. కాని విస్తళ్ళను, అప్పడాలను, జడకుచ్చులను, ఎండుచేపలను క్రెడిట్ కార్డ్ హోల్డర్‌లకు ఇ-కామర్స్ ద్వారా బట్వాడా చేసే ఏర్పాటు చేస్తామనే రకం కంత్రీజాతి పాలకులను మనం ఇపుడిపుడే చూస్తున్నాం. కనీసం జిల్లా కేంద్రాలలో కూడా

సరైన ఇంటర్నెట్ సౌకర్యాలు లేని రాష్ట్రంలో, జనాభాలోని అల్ప సంఖ్యాకులకు మాత్రమే ఇంటర్నెట్ అవకాశాలు గల రాష్ట్రంలో ఇ-కామర్సూ, అప్పడాల అమ్మకాలూ గురించి దంచుతూ జనం కళ్ళలో, ప్రత్యేకించి మహిళల కళ్ళలో కారం గొట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇకపోతే గ్రామీణ సమాజంలో లేస్తే పన్ను, కూచుంటే పన్ను విధించటానికి ప్రయత్నిస్తూ ప్రజల బ్రతుకుల్లో దీపాలనార్పి వేసేందుకు కంకణం కట్టుకున్న దళారీ పాలకులు గ్యాస్ పంపిణీతో గ్రామాల్లో దీపం వెలిగిస్తామని డప్పు కొడుతున్నారు. అసెంబ్లీ ఎన్నికలు పూర్తికాగానే కొడిగట్టిన దీపం పథకం మున్సిపల్ ఎన్నికలు వస్తుండటంతో మళ్ళీ వెలగబోతోంది. కొత్తగా మరో ఐదు లక్షల గ్యాస్ కనెక్షన్లను సాధించేందుకు ఫిబ్రవరి మొదటి వారంలో కేంద్ర పెట్రోలియం శాఖపై తీవ్రమైన ఒత్తిడి తీసుకువచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ఈ 5 లక్షల గ్యాస్ కనెక్షన్ల కోసం 50 కోట్ల డిపాజిట్ చెల్లించలేని ఆర్థిక దుస్థితిలో మల్లగుల్లాలు పడుతోంది. దశాబ్దాలుగా అవిచ్ఛిన్నంగా సాగుతూ వచ్చిన ''సబ్సిడీపై కిరోసిన్ పంపిణీకి గండి కొట్టాలని ప్రపంచ బ్యాంకూ, దళారీ పాలకులూ పన్నిన మహా కుట్రలో భాగంగా 'దీపం పథకం రాష్ట్రంలోనూ, దేశంలోనూ వివిధ రకాల ముసుగులలో మొదలైందని ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాల్సిన అవసరం మనమీదుంది.

## మహిళా రిజర్వేషన్ మతలబులు

ఇక మహిళలకు 33 శాతం రిజర్వేషన్ వెనుక పెద్ద చరిత్రే వుంది. విప్లవోద్యమాల పురోగతివల్ల, దళారులూ, మహిళలూ, ఆదివాసులూ వంటి వేరు వేరు సెక్షన్ల పీడిత ప్రజలు తమపై ఆర్థిక, రాజకీయ, సాంఘిక అణచివేతలకు వ్యతిరేకంగా సాగించిన పోరాటాల వల్ల పీడిత ప్రజలలో రాజ్యాధికారంలో మాకూ భాగం కావాలనే ఆలోచన, చైతన్యం పెరిగింది. ఈ చైతన్యాన్ని విప్లవోద్యమంలో భాగం కానీయకుండా, తమ ఆధిపత్యానికి ప్రమాదం రాకుండా చాలా తెలివిగా పాలకవర్గాలు చట్టసభల్లో రిజర్వేషన్లను ప్రవేశపెట్టి దళిత పాలకవర్గాలను తయారు చేస్తూ వచ్చారు. గత దశాబ్దంలో మహిళల్లో ఈ కోణంలో పెరిగిన చైతన్యాన్ని దృష్టిలో పెట్టుకుని చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ తేవడానికి పాలకవర్గాలు మొత్తంగానే పెద్ద హంగామా చేస్తున్నాయి. కానీ పితృస్వామ్యం వ్యవస్థలో ఎంత బలంగా పాదుకుని వుందంటే ఓట్లపరంగా, వ్యవస్థ మనుగడ పరంగా చూసినా తమకే ప్రయోజనం కల్గించగల ఈ మహిళా రిజర్వేషన్ బిల్లును దొడ్డిదారిన పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేందుకే పాలకవర్గాలకు నాలుగేళ్ళ కాలం పట్టింది. రిజర్వేషన్లకు కుల ప్రాతిపదిక అవసరం లేదన్న అగ్రవర్ణ పాలకవర్గాలకు-దోపిడీ రాజ్యాధికారంలో దళిత, వెనుకబడిన వర్గాల మహిళలకు కూడా వాటా పంచాలన్న నిమ్నవర్ణ పాలకవర్గాలకు అంతర్ వైరుధ్యాల కారణంగా పార్లమెంటులో ఎన్ని బాహా బాహీ ముష్టియుద్ధాలు జరిగాయో, ఎన్ని కుర్చీలూ, మైకులూ విరిగాయో ఇటీవలి చరిత్రలో నమోదైంది. మరోవైపు మహిళల ఓట్లే తన రాజకీయ మనుగడకు కీలకమని దృఢంగా నమ్మిన చంద్రబాబు తన మంత్రివర్గంలో గతంలో ఏ ప్రభుత్వం ఇవ్వనన్ని మంత్రి పదవులను (5) మహిళలకిచ్చి, రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్‌గానే మహిళను ప్రతిష్టించాడు. దీనివల్ల (దోపిడీ) రాజ్యాధికారంలో మహిళల భాగస్వామ్యం పెరిగిందని పత్రికలు, కుహనా మేధావులు, బూర్జువా ప్రజాస్వామ్యాన్ని వంధి మాగధుల్లా పొగుడుతూ వున్నారు. ఇంకా పంచాయితీ వ్యవస్థ మూలుగులను పీల్చివేసిన చంద్రబాబు మరోవైపు స్థానిక స్థాయిలో అన్ని నిర్ణయాలలో ప్రజల భాగస్వామ్యం పేరిట మహిళలను ప్రత్యేకించి ప్రశ్నిస్తూ, జవాబులు రాబడుతూ పెద్ద ఎత్తున ప్రచార హంగామా చేస్తున్నాడు. తమ దోపిడీకి ప్రమాదంకాని విధంగా వీటిని పాలకవర్గాలు ఎంతో కొంత అమలు జరిపి పీడిత ప్రజలను, మహిళలను కొంతకాలం భ్రమల్లో వుంచవచ్చు. పార్టీ నిర్మాణాలు విప్లవ మహిళా, ప్రజాసంఘాలూ వీటిని ఎండగట్టక పోతే ప్రజల్లో ఏర్పడిన భ్రమలు దీర్ఘకాలం కొనసాగే అవకాశముంది. పొదుపు సంఘాలూ, డ్వాక్రా గ్రూపులూ, దీపం పథకాలూ వంటి ఆర్థిక సంస్కరణలు మహిళల కంటితుడుపు చర్యలే తప్ప వారి ఏడ్పుకు కారణమైన వ్యవస్థను మార్చలేవని, దోపిడీ రాజ్యాన్ని కూల్చకుండా మహిళలకు విముక్తి లేదనే రాజకీయ చైతన్యాన్ని మహిళల్లో పెంచుతూ పెద్ద ఎత్తున ప్రచారం చేయాలి. మహిళా ప్రజానీకాన్ని ఆ మేరకైనా భ్రమలకు గురిచేయగలిగే పథకాలను మనం ఎక్కడికక్కడ ఎండగట్టాల్సి వుంది.

అయితే చట్టసభలలో 33 శాతం రిజర్వేషన్లలోనే కాదు. సమాజంలో అన్నిరంగాల్లోనూ మహిళలు గ్లోబలైజేషన్ దశలో కోల్పోతున్న ఉద్యోగాలనూ, జీవనభృతి అవకాశాలనూ గమనిస్తే బూర్జువా ప్రజాస్వామ్యపు ప్రధాన లక్షణాలలో ఒకటైన ''చట్టం ముందు అందరూ సమానులే'' అనే లాంఛనగత సమానత్వం కూడా మనలాంటి వెనుకబడిన అర్ధవలస సమాజాలలో ఇంకా వాస్తవంగా ఏర్పడలేదని బోధపడుతుంది. లాంఛనాగత సమానత్వము, ఆర్థిక సమానత్వమూ తత్పర్యవసానంగా సామాజిక అసమానత్వమూ కలగలిసి వుండే దోపిడీ సమాజంలో స్త్రీల శాసనపరమైన చట్ట ప్రతిపత్తికి పాలకవర్గాలు పూనుకోలేవు. ఒక సమాజ సాంస్కృతిక స్థాయికి అత్యుత్తమమైన గీటురాయి స్త్రీలకు ఆ సమాజంలో చట్టపరంగా లభించే ప్రతిపత్తి మాత్రమే. కాని గత శతాబ్ది చరిత్రను చూస్తే అత్యంత ప్రగతిశీల రిపబ్లికన్ ప్రజాతంత్ర బూర్జువా రాజ్యాలుగా చెప్పబడుతున్నట్టివి కూడా సంపూర్ణ సమానత్వాన్ని ఇవ్వలేదు అని తెలుస్తుంది. ఈ నేపథ్యంలో లాంఛనగత సమానత్వం కొరకు మాత్రమేకాక స్త్రీలకు ఆర్థిక, సామాజిక సమానత్వం కొరకు పోరాడటమే శ్రామిక మహిళా ఉద్యమం ప్రధాన కర్తవ్యం అవుతుంది. ❑

**మన ప్రియతమ అమరనేతల, అమరుల విప్లవ స్వప్నాల**
**సాఫల్యం కోసం శపథం చేస్తూ అంతర్జాతీయ శ్రామిక మహిళా**
**పోరాటదినాన్ని ఎల్లెడలా జరుపుదాం!!!**

# పెరుగుతున్న మహిళల చైతన్యాన్ని ఎన్నికల ప్రయోజనాలకు బలిపెట్టే పాలకవర్గాల కుటిలనీతిని ఎండగడుతూ విప్లవ మహిళా ఉద్యమాన్ని బలోపేతం చేద్దాం!

ఎన్నికల రణరంగంలో ఇతర అన్ని పార్టీల కన్నా అన్ని విషయాల్లోనూ పైచేయి సాధించి గత అసెంబ్లీ ఎన్నికల్లో చంద్రబాబు తెలుగుదేశం పార్టీ తిరిగి అధికారంలోకి రాగలిగింది. ధనబలం, కండబలం, రిగ్గింగ్, పోలీసు, పౌర అధికార యంత్రాంగాన్ని విరివిగా ఉపయోగించుకోవడంతో పాటుగా ప్రచారంలో కూడా చంద్రబాబు తన 'హైటెక్' తెలివిని సమర్థవంతంగా వినియోగించుకోగలిగాడు. గతంలో జరిగిన ఎన్నికలన్నింటిలోకన్నా ఈసారి జరిగిన ఎన్నికల్లో మహిళల పాత్ర పెరిగి చంద్రబాబు గెలుపుకు దోహదం చేసిన విషయం ఆంధ్ర రాష్ట్రంలో ప్రధాన చర్చనీయాంశమైంది. ప్రపంచ వ్యాప్తంగా మహిళలు తమ హక్కుల సాధన కోసం చేస్తున్న పోరాటాలు ఈ మధ్యకాలంలో వెల్లువెత్తుతున్న నేపథ్యంలోనే ఆంధ్ర రాష్ట్ర మహిళల పోరాటాలను, పెరుగుతున్న వారి పోరాట చైతన్యాన్ని పరిశీలించాలి. ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యంగా 1990వ తరతరాల అణచివేతను ప్రశ్నిస్తూ తమ ఇళ్ళ నుండి వీధుల్లోకి వచ్చి పోరాడే చైతన్యాన్ని పెంచడంలో ఈ పోరాటాలు ప్రధాన పాత్ర వహించాయి. స్థానిక, జాతీయ, అంతర్జాతీయ పరిస్థితుల్లో వస్తున్న మార్పుల కనుగుణంగా తన ఎత్తుగడలను తెలివిగా మార్చుకోగలిగే చంద్రబాబు ఈ ఉద్యమాలను కూడా తన ప్రయోజనాల కోసం తెలివిగానే వాడుకున్నాడు. అవి దళితుల పోరాటాలు అయినా, మహిళల పోరాటాలైనా వాటిని ప్రక్కదారి పట్టించగలిగే నేర్పు సంపాదించాడు. ఒక్క ఆంధ్రరాష్ట్రంలోనే కాకుండా మహిళల రిజర్వేషన్ సమస్యపైన ఈరోజు దేశవ్యాప్తంగా వున్న అన్ని రాజకీయ పార్టీల్లోనూ, మహిళా సంఘాల్లో కూడా అనేక చర్చలు జరుగుతున్నాయి.

తెలుగుదేశం పార్టీ గెలుపు వెనుక వున్న ఒక ప్రధానమైన విషయంగా మహిళల పాత్ర ఎలా వుంది అనే విషయాన్ని చర్చించడానికి ముందు, తన నాలుగు సంవత్సరాల పాలనకాలంలోనూ, అంతకుముందు సంవత్సర కాలంపాటు ఎన్టీఆర్ అధికారంలో వున్న కాలంలో మహిళల పోరాటాలు, వాటిపట్ల తెలుగుదేశం ప్రభుత్వం అనుసరించిన వైఖరి ఏమిటో పరిశీలించాలి. అధికారంలోకి వచ్చిన తొలిరోజుల్లో మహిళల వ్యతిరేకతను ఎదుర్కొన్న చంద్రబాబు క్రమంగా ఎన్నికల సమయం నాటికి మహిళల మద్దతు ఎలా పొందగలిగాడన్న విషయాన్ని కూడా మనం చూడాలి. మొత్తంగా పాలకవర్గ పార్టీలన్నీ, మహిళల పోరాట చైతన్యాన్ని ప్రక్కదారి పట్టించే విధంగా ద్వంద్వ నీతితో ఎలా పనిచేస్తున్నాయో అర్థం చేసుకోవాలి. అప్పుడే మహిళల పోరాటాలను ఒక సరైన దారిలో నడపడానికి కావలసిన స్పష్టత పోరాడే సంఘాలకు, ప్రజానీకానికి కలుగుతుంది.

1994 డిసెంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్టీఆర్ గెలువడానికి ప్రధాన కారణం అధికారంలోకి వచ్చిన వెంటనే సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని అమలు చేయగలనని ఇచ్చిన వాగ్దానం. అప్పటిదాకా దేశ ప్రజల, ముఖ్యంగా మహిళల దృష్టిని ఆకర్షించిన ఆంధ్రరాష్ట్ర మహిళల మద్య నిషేధ ఉద్యమం ఊపులో కొనసాగింది. విప్లవ పార్టీలు, ప్రజాసంఘాలు అనేక సంవత్సరాల కృషి ఆనాటి మహిళల మద్యపాన వ్యతిరేక ఉద్యమం ద్వారా ఫలితాలనిచ్చింది. ఒక చిన్న గ్రామంలో మొదలైన సారా వ్యతిరేక పోరాటం సంపూర్ణ మద్యపాన నిషేధ ఉద్యమంగా రూపుదిద్దుకొని మిలిటెంటుగా కొనసాగింది. జనాభాలో దాదాపు సగభాగం వున్న మహిళల సారా వ్యతిరేక పోరాటాన్ని తన ఎన్నికల ప్రయోజనాల కోసం సొమ్ము చేసుకోగలమనే ఆశతోనే ఆనాడు ఎన్టీఆర్ సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు చేస్తాననే వాగ్దానం చేసి ఎన్నికల్లో నెగ్గాడు. తన వాగ్దానాన్ని నెరవేరుస్తూ సంపూర్ణ మద్యపాన నిషేధానికి సంబంధించిన ప్రభుత్వ ఆదేశాలైతే జారీచేసినప్పటికీ, దొంగసారా, నాటుసారా, దొంగ బ్రాండి, విస్కీలను తయారు చేసే బ్లాక్ మార్కెట్‌గాళ్ళను అదుపు చేయలేదు. ఫలితంగా దొంగదారిలో మద్యం ఏరులై పారుతూనే వచ్చింది. ఇదంతా కుట్రపూరితంగానే సాగిస్తూ వచ్చి, దొంగసారాను అరికట్టాలంటే మద్య నిషేధాన్ని ఎత్తివేయక తప్పదనే ప్రచారం చేస్తూ వచ్చారు.

1994 డిసెంబరులో ఎన్టీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత పంచాయితీరాజ్ వ్యవస్థలో మార్పులు చేసి ఐదంచెలుగా మార్చాడు. అంతకుముందున్న సర్పంచ్, మండల అధ్యక్షుడు, జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవులకు తోడుగష యం.పి.టి.సి., మరియు జెడ్.పి.టి.సి. అనే పదవులను సృష్టించి ఆ పదవులకు జరిగే ఎన్నికల్లో ఎక్కువగానే మహిళలకు రిజర్వేషన్లు కల్పించాడు. పేరుకు మహిళలు నిలబడి గెలిచినప్పటికీ అధికారమంతా వారి తండ్రులో, సోదరులో, భర్తలో లేదా రాజకీయ ప్రాబల్యం వున్న ఇతర పురుష రాజకీయ నాయకులో చెలాయిస్తూ వస్తున్నారనేది వాస్తవం. మహిళలకు రాజకీయ పదవుల్లో రిజర్వేషన్లు కల్పించడం ద్వారా మాత్రమే వారికి నిజమైన రాజకీయ అధికారం లభించినట్లేనని భావిస్తే అది పొరపాటు. కేవలం తన పార్టీ కేడర్లను పెంచుకునే లక్ష్యంతోనే పంచాయితీరాజ్ వ్యవస్థలో మార్పులు చేసి అందులో మహిళలకు స్థానం కల్పించడం ద్వారా రెండు రకాల లాభాలను పొందగలిగారు. మహిళలకు అధిక స్థానాలు కల్పిస్తూ వారికి ప్రాధాన్యతనిస్తున్నామనే ప్రచారం ఒకటి కాగా మొత్తంగా తన పార్టీ బలాన్ని పెంచుకోవడం ఇంకొకటి.

1995 మధ్య కాలంలో మామకు ధోకా ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు మొట్టమొదటగా చేసిన పని మద్యపానంపై వున్న నిషేధాన్ని ఎత్తివేయడమే. అంతకుముందే మద్యపాన నిషేధం మూలంగా బడ్జెట్ లోటు వున్నందువల్ల రెండు రూపాయలకు కిలో బియ్యం పథకాన్ని అమలు చేయడం సాధ్యం కావడం లేదన్న సాకుతో బియ్యం ధర రెండు రూపాయల నుండి మూడున్నరకు పెంచాడు. తర్వాత కొద్ది కాలానికే మద్యపాన నిషేధం అమలు చేయడం మూలంగా దొంగదారిలో మద్యం వ్యాపారం సాగుతున్నదన్న కారణం చెప్పి ముందుగా బ్రాందీ విస్కీలపై నిషేధం ఎత్తివేసాడు. తర్వాత సారా స్థానంలో ఐ.యం.ఎఫ్ .ఎల్. అనే చౌక ధరకులభించే సారాను దించాడు. మద్యపాన నిషేధం ఎత్తివేత ద్వారా వచ్చిన నిధులతో మళ్లీ రెండు రూపాయల కిలో బియ్యం పథకాన్ని పునరుద్ధరించకుండా తెలివిగా దాటవేశాడు. మద్యపాన నిషేధం ఎత్తివేసిన తర్వాత రాష్ట్రంలో

మహిళలు తిరిగి ఉద్యమాన్ని లేవదీస్తే వారిని ఫాసిస్టు పద్ధతుల్లో చంద్రబాబు కారుకు అడ్డంతిరిగి మద్య నిషేధాన్ని ఎత్తివేస్తే మా బతుకులు ఏంగావాలి అని ప్రశ్నించగా ''మద్య నిషేధం మూలంగా దొంగ దారిలో మద్యం ప్రవహిస్తున్నది గదా'' అని బదులిచ్చాడు. తిరిగి ఆ ముసలవ్వ ''మరి ప్రభుత్వం దొంగ సారాను అదుపు చేయవచ్చుగదా'' అని ప్రశ్నించగా ''నీకాదేవుడే సమాధానం చెప్పాలంటూ'' జవాబు చెప్పలేక కారులో ఉడాయించాడు. ప్రత్యక్షంగా ప్రజల ముందుకు వచ్చి తన విధానాలపై ప్రజల విమర్శలను ఎదుర్కోలేని చంద్రబాబు నిర్బంధం ప్రయోగించి లాఠీలతో, తూటాలతో మాత్రమే ప్రజలకు సమాధానం చెప్పబూనుకున్నాడు. ప్రజలతో ప్రత్యక్షంగా మాట్లాడలేకనే 'ముఖ్యమంత్రితో ముఖాముఖి' అంటూ టెలిఫోన్లలో ముఖం చాటేసుకుని మాట్లాడటం మొదలు పెట్టాడు.

మద్య నిషేధం అమలులో వున్న కాలంలో గ్రామాల్లో దొంగసారాను (గుడుంబా) మహిళలతో ధ్వంసం చేయించే కార్యక్రమం తీసుకుంటూ పోలీసులను గ్రామాల్లోకి పంపించి గ్రామాల్లో ప్రజల మధ్య తగవులను రెచ్చగొడుతూ తమ ఇన్ఫార్మర్ యంత్రాంగాన్ని తయారు చేసుకునే ప్రయత్నం చేశాడు. అదే గుడుంబా సమస్యపై విప్లవ పార్టీల నాయకత్వం కింద మహిలా సంఘాలు కదిలి సారా వ్యతిరేక పోరాటం చేస్తే వారిపై నిర్బంధం ప్రయోగించి అణచివేసే ద్వంద్వ వైఖరిని అవలంభించాడు.

అప్పటికి కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన 'డ్వాక్రా'(DWCRA-డెవలప్‌మెంట్ ఆఫ్ వుమెన్ అండ్ చిల్డ్రెన్ ఇన్ రూరల్ ఏరియాస్-గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు మరియు శిశువుల అభివృద్ధి) పథకాన్ని తన ప్రభుత్వమే ప్రారంభించినట్లుగా ప్రచారం చేస్తూ విస్తృతంగా గ్రామాల్లో డ్వాక్రా యూనిట్లు ఏర్పరచడానికి సిద్ధమయ్యాడు. వాస్తవంగా ఈ పథకానికి యూనిసెఫ్ (UNICEF-యునైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ చిల్డ్రన్స్ ఎమర్జెన్సీ ఫండ్-ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ బాలల అత్యవసర నిధి) నుండి ఒక వంతు నిధులు, కేంద్ర ప్రభుత్వం నుండి ఒక వంతు నిధులు కేటాయించబడగా అందులో మిగతా ఒక భాగం నిధులు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేస్తుంది. ఈ డ్వాక్రా గ్రూపుల్లో తన పార్టీకి చెందిన కార్యకర్తల కుటుంబాలకు చెందిన మహిళలను విరివిగా భాగస్వాములను చేసి తన పార్టీ ప్రచారానికి ఉపయోగించుకున్నాడు. డ్వాక్రా గ్రూపులకు చెందిన మహిళలు తయారు చేసిన వస్తువులను అమ్మకానికి పెట్టే పేరుమీద హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన 'ఢ్వాక్రా బజారు'ను పెట్టుబడిదారులు తయారుచేసిన సరకులను అమ్మడానికి మంచి వేదికగా మల్చుకున్నాడు. అగ్ని ప్రమాదం సంభవించగా అనేకమంది గ్రామీణ మహిళలు నష్టాల పాలైనా వారికి తగిన నష్టపరిహారం చెల్లించలేదు. వారికి తగిన వసతులు ఏర్పాటు చేయలేదు. గ్రామీణ ప్రాంతాల నుండి వెళ్లిన ఆ మహిళలు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కోగా ఢ్వాక్రా బజారులో మహిళా గ్రూపులకు విపరీత లానాలు వచ్చాయంటూ అసత్య ప్రచారం చేశాడు. మహిళా గ్రూపుల ద్వారా చేయించిన పొదుపు మొత్తాలను ఇతర అవసరాలను తీర్చుకునే నిమిత్తం దారిమళ్లించి పొదుపు చేసిన మహిళల డబ్బును కాజేశాడు.

బీడీలు తయారు చేయడం కుటీర పరిశ్రమల లాగా వుంటూ అనేకమంది బీడీ కార్మికులకు ఉపాధి కల్పిస్తున్నది. ఇందులో మహిళలే అధికంగా వున్నారు. బీడీల పరిశ్రమలను దెబ్బతీసే విధంగా బహుళజాతి కంపెనీలకు చెందిన 'మినీ సిగరెట్ల'ను అనుమతిస్తూ బీడీ కార్మికుల జీవితాల్లో కలకలం రేపాడు. అటవీ ప్రాంతాల్లోని తునికాకు సేకరణ కూలీల్లో సైతం మహిళలే అధికంగా వున్నప్పటికీ వారు సేకరించే తునికాకుకు సరైన ధర చెల్లించక పోవడమే కాకుండా, ఆ సమయంలో వారికి తగిన వసతులు కలుగజేయాలంటూ పోరాడే తునికాకు సేకరణ కూలీలను అణచివేయడానికి గ్రామీణ ప్రాంతాల్లోకి పోలీసులను దించాడు.

తాను అధికారంలోకి వచ్చిన తొలిరోజుల్లో అనుసరించిన విధానాల మూలంగా మహిళల నుండి వచ్చిన వ్యతిరేకతను స్పష్టంగానే గమనిస్తూ వచ్చిన చంద్రబాబు 1996 సంవత్సరంలో జరిగిన పార్లమెంటు ఎన్నికలకు ముందునుండే మహిళలకు వర్తించే పథకాలను ప్రవేశపెట్టాడు. ఆడబిడ్డ పుట్టగానే 5వేల రూపాయలు బ్యాంకులో డిపాజిటు చేయడం ఈ పథకం యొక్క కార్యక్రమం. ఎన్నికల సందర్భంగా ఈ పథకాన్ని ప్రకటించి రెండేండ్లు తిరగకుండానే తరువాత ప్రారంభించిన 'ముందడుగు' అనే పథకంలో దాన్ని విలీనం చేశాడు. ఆడబిడ్డ పుట్టి పెరిగిన తర్వాత ఇచ్చే వరకట్న సమస్యను పరిష్కరించకుండా, వారి పోషణ సమస్యను పరిష్కరించకుండా కేవలం ఐదువేల రూపాయలు బ్యాంకులో డిపాజిటు చేయడమంటే అసలు బాధ్యతనుండి తెలివిగా తప్పుకోవడమే. ఇలా మహిళల పేరుమీద అమలులోకి తెచ్చిన పథకాలన్నీ వేళ్ళమీద లెక్కబెట్టగలిగే మహిళలకే వర్తించగా మొత్తం మహిళలకు ప్రయోజనం కల్గిస్తున్నట్లుగా ప్రచారం చేయడంలో మాత్రం ముందున్నాడు. 1998-99 సంవత్సరంలో 'ముందడుగు' పథకం కింద సహాయం పొందిన వారు రాష్ట్ర వ్యాప్తంగా కేవలం 425 మంది మాత్రమే. అందులో కూడా ఎక్కువమంది టి.డి.పి. కార్యకర్తలే వున్నారు.

ప్రపంచబ్యాంకు సంస్కరణల్లో భాగంగా సంక్షేమ కార్యక్రమాలపై ప్రభుత్వం వెచ్చించే నిధుల్లో కోత విధించడంలో భాగంగానే ప్రజల శ్రమను అతి చౌకగా కొల్లగొట్టడానికి 'శ్రమదానం', 'జన్మభూమి' లాంటి కార్యక్రమాలు అమలు చేస్తూ వచ్చాడు. 'శ్రమదానం' మరో రూపంలో శ్రమదోపిడీయే. తన పార్టీ కార్యకర్తలకు దండిగా జేబులు నింపడమే కాకుండా గ్రామస్థాయిలో తన పార్టీ బలాన్ని పెంచుకోవడం కోసమే 'జన్మభూమి' కార్యక్రమాలు అమలుచేస్తూ వచ్చాడు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో 1998 మే నెలలో జరిగిన 10వ విడత జన్మభూమిని 'మహిళా జన్మభూమి'గా ప్రకటించి ప్రత్యేకంగా మహిళలకు సంబంధించిన సమస్యలపై కదిలించాడు. మహిళలకున్న సమస్యలు మొత్తం ఈ మహిళా జన్మభూమితోనే తీరిపోతాయన్నట్లుగా ప్రచారం చేశాడు. ఈ మహిళా జన్మభూమి నడుస్తున్న సయమంలోనే ఇంకోవైపు తన పోలీసులు విజయవాడలో కృష్ణకుమారి అనే మహిళను, తెలంగాణా కళాసమితి నాయకురాలు బెల్లి లలితను హత్యచేసి తమ మహిలా జన్మభూమి యొక్క అసలు రూపాన్ని ప్రదర్శించాడు. మహిళా జన్మభూమి కొనసాగిన రోజుల్లోనే నిజామాబాద్ జిల్లాలోని అనేక గ్రామాల ప్రజలు నిరసనను వ్యక్తం చేయగా వారిపై లాఠీచార్జీ జరిపించి తనకు మహిళల అభివృద్ధిపై వున్న చిత్తశుద్ధి ఏమిటో బయట పెట్టాడు.

1999 సెప్టెంబరు-అక్టోబరు నెలల్లో అసెంబ్లీ, పార్లమెంటు

ఎన్నికలు జరుగబోయే కొద్దిరోజుల ముందుగానే తెలివిగా మహిళల కోసం మరో పథకాన్ని ప్రారంభించాడు. అదే 'దీపం' పథకం. మైనారిటీ మహిళలకైతే ఇది 'రోష్నీ'. గ్రామీణ ప్రాంతపు మహిళలకు పదిలక్షల గ్యాస్ కనెక్షన్లు అందజేయాలనేది ఈ పథకం ఉద్దేశం. ఈ పథకం అమలు చేస్తున్నట్లు ప్రకటించగానే కాంగ్రెస్ పార్టీ టి.డి.పి. ఎన్నికల ప్రయోజనం కోసమే ఈ పథకాన్ని అమలు చేస్తున్నారని సవాల్ చేస్తూ ఎన్నికల కమీషన్‌కు ఫిర్యాదు చేయగా కమీషన్ ఆ పథకాన్ని ఎన్నికలయ్యేంత వరకు తాత్కాలికంగా నిలిపివేయాలని ఆదేశించింది. ఒకవైపు చంద్రబాబు వాగ్దానాన్ని ప్రశ్నించిన వై.యస్. రాజశేఖరరెడ్డి తన ప్రచారంలో మాత్రం తాను అధికారంలోకి వస్తే 20 లక్షల గ్యాస్ కనెక్షన్లను ఇస్తానని ప్రకటించి చంద్రబాబు కంటే రెండింతలు ఎక్కువగా మహిళలను మభ్యపెట్టాడు. 'దీపం' పథకం ద్వారా తెలుగుదేశం పార్టీ మహిళలను కొంత ఎక్కువగానే ఆకర్షించగలిగింది. ఫలితంగా ఎన్నికల నాటికి తెలుగుదేశం పార్టీకి మహిళల ఓట్లు ఎక్కువగా పడడానికి దోహదం చేసింది. అయితే మొత్తం మహిళా లోకాన్ని ఈ పథకం ఆకర్షించగలిగిందనేది తప్పు. ఒక దీపం పథకమే కాకుండా మిగతా పథకాలు కూడా మొత్తం ప్రజలకు వర్తించేవి మాత్రం కావు. ఈ మొత్తం పథకాల ద్వారా ఒక సెక్షను ప్రజానీకం తెలుగుదేశం పార్టీ వెనుక సమీకరించబడింది. ఇలాంటి వాళ్ళే ఎన్నికల ప్రచారంలోనూ, ఓట్లు వేయడంలోనూ ముఖ్యమైన పాత్ర పోషించారు. ఈసారి ఎన్నికల్లో నెగెటివ్ ఓటు పడలేదని చేసే ప్రచారం అసత్యం. ప్రభుత్వ నిర్బంధాన్ని తీవ్రంగా చవిచూసిన తెలంగాణా జిల్లాల్లోని అనేక ప్రాంతాల్లో ప్రజలు తమ నిరసనను తెలిపారు. అసలు ఓటింగులో పాల్గొనని గ్రామాలు కూడావున్నాయి. చంద్రబాబుకు వ్యతిరేకంగా మరో పార్టీకి ఓటు వేసిన ప్రజలు కూడా వున్నారు.

ఎన్నికల ముందు 'దీపం' పథకం ఆర్భాటంగా ప్రకటించి ప్రచారం చేసినంతగా ఎన్నికల తర్వాత ఆ పథకం అమలు తీరుతెన్నులను పరిశీలిస్తే మహిళల ఓట్లను కొట్టేయాలనే ఉద్దేశంతోనే ఆ పథకాన్ని ప్రకటించాడని చెప్పవచ్చు. అధికారంలోకి రాగానే మొదటి దఫాలో కొన్ని గ్యాస్ కనెక్షన్లను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించాడు. ముందుగా డ్వాక్రా గ్రూపుల్లో వున్న మహిళలకే గ్యాస్ కనెక్షన్లను ఇస్తామని ప్రకటించాడు. రాష్ట్ర వ్యాప్తంగా వున్న రెండు లక్షల యాభై వేల డ్వాక్రా గ్రూపుల్లో సగటున నలుగురు మహిళలు వున్నారనుకుంటే మొత్తం పదిలక్షల గ్యాస్ కనెక్షన్లు అందులోని నలుగురు మహిళలకు కూడా అందజేయబడవు. మరో సందర్భంలో వనసంరక్షణ సమితుల్లో సభ్యులుగా వున్న మహిళలకే అందజేస్తామని ప్రకటించాడు. ఈ ప్రకటనలను బట్టి చూస్తే 'దీపం' పథకం ఆశచూపి మహిళలను తాను నిర్మించే వివిధ రకాల కమిటీల్లోకి ఇముడ్చుకొని గ్రామాల్లో తన పార్టీ బలాన్ని పెంచుకునే కుట్రపూరిత ఎత్తుగడగానే అర్థమవుతున్నది. మొత్తం డ్వాక్రా గ్రూపుల్లో వున్న మహిళలకుగానీ, ఇతర కమిటీల్లో వున్న మహిళలకుగానీ అందరికీ ఈ పథకం ప్రయోజనం చేకూర్చలేదనేది వేరే చెప్పనవసరం లేదు. కేవలం గ్యాస్ కనెక్షన్లు మాత్రమే ఇచ్చి బర్నర్ల (పొయ్యిలు) ఖర్చు మాత్రం లబ్దిదారులే భరించాలని ఎన్నికల తర్వాత ప్రకటించడం ప్రభుత్వ మోసకారితనానికి చక్కని సాక్ష్యం.

రాష్ట్రాన్ని పూర్తిగా సామ్రాజ్యవాదులకు అప్పజెపుతూ నూతన ఆర్థిక విధానాలను అమలు చేయడం ద్వారా ఒకవైపు రైతాంగ, కార్మిక మహిళలను మరింత దారిద్ర్యంలోకి నెట్టివేస్తూనే మరోవైపు మహిళల అభివృద్ధి కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తున్నట్లుగా ప్రచారం చేయడం మహిళలను వంచించడమే. వ్యవసాయ రంగంపై ప్రభుత్వ నిర్లక్ష్యం మూలంగా రైతుకూలీ మహిళలు ఉపాధి కోల్పోతూ పట్టణాలకు వలస వెల్లక తప్పని స్థితి నెలకొన్నది. పొట్ట చేత పట్టుకొని పట్టణాలకు వెళ్లిన మహిళలపై మరింతగా ఆర్థిక, లైంగిక దోపిడీ పెరిగిపోతూ వారి జీవితాలు దుర్భరమవుతాయి. పట్టణాల్లోని అనేక కంపెనీలు మూసివేయ బడుతుండటంతో అందులో పనిచేసే మహిళలు ఏ ఆధారం లేకుండా అవుతున్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే మూసివేసిన ఆల్విన్ వాచ్ కంపెనీలో అధిక భాగం మహిళలే వున్నారు. మహిళలకు ఇచ్చే ప్రభుత్వ ఉద్యోగాల్లో అధికశాతం అంతగా శారీరక భారం పడని ఓపికతో చేసే పనులే వుంటాయి. టీచర్లు, నర్సులు, అసెంబ్లీ పరిశ్రమలు (ఆల్విన్ వాచ్, ఎలక్ట్రానిక్ పరికరాలు బిగించడం లాంటివి) మొదలైన వాటిలో మహిళలే అధికంగా వుంటారు. విద్య, వైద్య రంగాలు ప్రైవేటీకరించ బడుతున్న పరిస్థితిలో క్రమంగా ఆయా రంగాల్లో ఉద్యోగవకాశాలు కోల్పోతుండటంతో మహిళలకు ఉద్యోగవకాశాలు మరింతగా తగ్గిపోతున్నాయి.

విజన్ 2020 కార్యక్రమం ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను 2020 సంవత్సరం నాటికి 'స్వర్ణాంధ్రప్రదేశ్'గా మారుస్తానని చంద్రబాబు ఊదరగొడుతున్నాడు. అందుకు అనుగుణంగానే రాష్ట్రంలోకి పెద్ద ఎత్తున విదేశీ పెట్టుబడులను ఆహ్వానిస్తూ ప్రైవేటీకరణను ప్రోత్సహిస్తున్నాడు. ఆర్థిక విషయాల్లో ఆంధ్రప్రదేశ్‌ను అంగడి సరకుగా మార్చడమే కాకుండా, పెట్టుబడిదారుల వినోదం కోసం హైదరాబాదు నగరంలో నైట్‌బజార్లను ఏర్పాటు చేసి మహిళలను కూడా అంగడి సరకుగా మార్చివేశాడు. మహిళా అభ్యున్నతి అంటూ మాట్లాడుతూ ఇంకోవైపు సిగ్గూ ఎగ్గూ లేకుండా ఇలాంటి నైట్ బజార్లను ఏర్పాటు చేయడానికి పూనుకుంటున్నాడంటే మహిళల అభివృద్ధి గురించి మాట్లాడే నైతిక హక్కు చంద్రబాబుకు ఏమాత్రం లేదు.

## మహిళల నిజమైన అభ్యున్నతికి పాటుపడే శక్తులపై నిర్బంధం

ప్రజల అభివృద్ధి కోసం తాను రోజుకు పదహారు గంటలు శ్రమిస్తున్నాని మాట్లాడే చంద్రబాబు వాస్తవానికి పెట్టుబడిదారుల పాద సేవకే అహర్నిషలు పాటుపడుతున్నాడు. ఇంకోవైపు విప్లవకర శక్తుల నాయకత్వంలో నడుస్తున్న మహిళా సంఘాల కార్యక్రమాలకు తీవ్రవాదం ముద్రలు వేస్తూ పీపుల్స్‌వార్ పార్టీ దళాల్లో, విప్లవ మహిళా సంఘాల్లో పనిచేస్తున్న మహిళల నైతికతపై పోలీసుల అసభ్యకరమైన, అవాస్తవమైన ఆరోపణలు చేస్తూ విప్లవోద్యమం పట్ల సాధారణ ప్రజానీకానికి, మహిళలకు ఏహ్యాభావం కల్గించడానికి తీవ్రంగా ప్రయత్నిస్తూ, కరపత్రాలు, కౌన్సిలింగ్ కార్యక్రమాల ద్వారా ప్రచారం చేస్తున్నాడు. తెలంగాణాలోని అనేక గ్రామాల్లో మహిళలను వేధింపులు, అత్యాచారాలకు గురిచేసిన సంఘటనలను ఎన్నింటినైనా పేర్కొనవచ్చు. నిజామాబాద్ జిల్లా చింతకుంట గ్రామంలో క్రిష్ణవేణి, గంగామణిల నుండి ఆదిలాబాద్ జిల్లా గొల్లాపూర్ గ్రామానికి చెందిన భారతీబాయి, మాజీ నక్సలైటు హుస్సేన్ బీ లాంటి వారిని అనేకమందిని ఉదహరించవచ్చు. ఈ మధ్యనే 17 ముక్కలుగా నరికి

చంపివేసిన బెల్లి లలిత హత్య సంఘటనతో మహిళలపై ప్రభుత్వ ఫాసిస్టు నిర్బంధం పతాక స్థాయికి చేరుకున్నది. బెల్లిలలిత నైతికతపై దుష్ప్రచారం చేసి అతి క్రూరంగా హత్య చేయించి తమ పారదర్శకతకు అర్థం చెప్పుకున్నారు. గెరిల్లా దళాలపై దాడులు చేస్తున్న సమయంలో ఒంటరిగా దొరికిన మహిళా గెరిల్లాలను పట్టుకొని, అత్యాచారం జరిపి, చిత్రహింసలు పెట్టి కాల్చి చంపడం చంద్రబాబు ప్రభుత్వం, పోలీసుల కుటిలనీతికి నిదర్శనం. నిజామాబాద్ జిల్లా సిర్నాపల్లి దళానికి చెందిన కామ్రేడ్ సరితక్కను, కరీంనగర్ జిల్లా కుంభంపల్లి గ్రామంలో లోకల్ గెరిల్లా దళ సభ్యురాలు కామ్రేడ్ జ్యోతక్కను సజీవంగానే పట్టుకొని కాల్చి చంపారు. కామ్రేడ్ జ్యోతక్కను పట్టుకొని నడి గ్రామంలోకి తీసుకువచ్చి బట్టలూడదీసి సిగరెట్లతో కాలుస్తూ పైశాచికంగా వేధించి కాల్చి చంపి ఎన్‌కౌంటర్ అన్నారు. నిజామాబాద్ జిల్లాలోని ఎల్లారెడ్డి దళంలో వున్న తన బిడ్డను చూడడానికి వచ్చిన తల్లితో సహా ఇద్దరు దళ సభ్యురాళ్ళను క్రూరంగా హింసించి కాల్చి చంపారు. ఇలా తన పరిపాలనా కాలమంతా జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్లలో అమరులైన విప్లవకారుల్లో దాదాపు ముప్పై మంది వరకు మహిళలున్నారు.

తమ దైనందిన సమస్యలపై మహిళా సంఘాల నాయకత్వంలో కదులుతూ పోరాటాలకు దిగుతున్న మహిళలపై పోలీసులతో లాఠీ చార్జీ చేయిస్తూ వారిని నిర్బంధానికి గురిచేస్తున్నారు. గ్రామాల్లోని మహిళలు ఏ పోరాటాల్లో కదిలినా, చివరికి తమ కొడుకు బిడ్డలు బూటకపు ఎన్‌కౌంటర్లలో హత్య గావింపబడ్డప్పుడు శవయాత్రలు నిర్వహించినా, తమ బిడ్డల శవాలు తమకు ఇవ్వాలంటూ డిమాండు చేసినా వారిని అనేక రకాల బెదిరింపులకు గురిచేస్తున్నారు. అమరుల తల్లులు, భార్యలను మీకింకా పార్టీతో సంబంధం వుందని నిరంతరం వేధిస్తూ, వారిని మానసికంగా, శారీరకంగా హింసిస్తున్నారు. 'కౌన్సిలింగ్' కార్యక్రమాలకు రహస్య కార్యకర్తల తల్లిదండ్రులను, భార్యలను బలవంతంగా తరలిస్తూ వారిచేత పార్టీలోని తమ కుటుంబ సభ్యులను లొంగి పోవాలని ప్రకటనలిప్పిస్తూ ఒత్తిడి చేస్తున్నారు.

## పాలకవర్గ పార్టీలన్నీ మహిళా రిజర్వేషన్లకు వ్యతిరేకమైనవి

మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఎన్నికల ముందు అన్ని పార్టీలు ప్రకటించినప్పటికీ, అలా కల్పించడం సాధ్యమే అయినప్పటికీ ఏ పార్టీ కూడా తాము నిలబెట్టిన అభ్యర్థుల్లో కనీసం 20 శాతం మహిళల్ని కూడా నిలబెట్టలేదు. నిలబెట్టిన మహిళలు కూడా తలపండిన రాజకీయ నాయకుల బంధువర్గాలకు సంబంధించినవారు మాత్రమే. లేదా వారు ఆడించినట్లు ఆడగలిగే మహిళలు మాత్రమే ఎన్నికల్లో పోటీ చేయగలిగారు. సిర్పూర్ కాగజ్‌నగర్ ఎం.ఎల్.ఎ. పాల్వాయి పురుషోత్తం రావును చంపివేసిన తర్వాత తిరిగి అతని భార్యనే నిలబెట్టారంటే ప్రజలనుండి సానుభూతి పొంది సీటు దక్కించుకోవడానికి మాత్రమే. అలాంటివాళ్ళు పాలకవర్గాలకు మహిళలపై వున్న సానుభూతికి గానీ, ప్రజల ఆకాంక్షలను గానీ నిదర్శనం కానే కారు. ఈ దోపిడీ వ్యవస్థలో ప్రజల్ని పీడించే యంత్రాంగంలో భాగం మాత్రమే.

మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే విషయంలో పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టడానికి అనేకసార్లు ప్రయత్నిస్తున్నట్లు నటిస్తున్నారు. వివిధ పార్టీలు ఈ బిల్లుపై వివిధ రకాలైన అభిప్రాయాలను, అభ్యంతరాలను వ్యక్తపరుస్తూ ఆ బిల్లును అచేతనంగా మార్చి వేస్తున్నాయి. మహిళల నాయకత్వం వున్న కాంగ్రెస్, ఎ.ఐ.డి.ఎం.కె., ఆర్.జె.డి. లాంటి పార్టీలు కూడా ఈ బిల్లుపై స్పష్టమైన వైఖరిని చెప్పడం లేదంటే పాలకవర్గ పార్టీలకు చెందిన మహిళలకు సైతం మహిళల రిజర్వేషన్లపై ఏ మాత్రం అవగాహన, చిత్తశుద్ధి వున్నదో అర్థం చేసుకోవచ్చు. ఈ బిల్లుపై ఏకాభిప్రాయం సాధించే పేర ఈ మధ్య కాలంలో బి.జె.పి. నాయకత్వంలోని ఎన్.డి.ఏ. ప్రభుత్వం అన్ని పార్టీలతో కూడిన అఖిలపక్ష సమావేశాలను ఏర్పాటు చేసింది. దేశాన్ని తాకట్టుపెట్టే అనేక రకాల ఆర్థికపరమైన బిల్లులను పార్లమెంటులో ఏ చర్చా లేకుండానే ఆమోదిస్తుండగా కేవలం ఒక్క మహిళా రిజర్వేషన్ బిల్లుపై మాత్రం అతిగా చర్చలు చేస్తున్నారంటే ఇది ప్రజాస్వామిక పద్ధతుల్లో బిల్లును ఆమోదించే ప్రయత్నం అసలే కాదు. వారి చట్టం లేకున్నా తమ పార్టీ పదవుల్లో గానీ, ఎన్నికల్లో నిలబెట్టే అభ్యర్థుల్లోగాని మహిళల శాతాన్ని వారి ఇష్టాయిష్టాలను బట్టి నిర్ణయించవచ్చు. కానీ అలాంటి పనిచేయడానికి ఏ పార్టీ ముందుకు రావడం లేదంటేనే మహిళల రిజర్వేషన్ల పట్ల వారికున్న చిత్తశుద్ధి ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు.

## మహిళల నిజమైన విముక్తి పార్లమెంటరీ సంస్కరణల ద్వారా కాదు విప్లవోద్యమం ద్వారానే సాధ్యం

మహిళా విముక్తి గురించి అనేక రకాలైన సంస్థలు, పార్టీలు, ఫెమినిస్టు సంఘాలు, ప్రభుత్వాలు అనేక రకాలుగా మాట్లాడుతున్నాయి. మహిళల విడివిడి పోరాటాల ద్వారానే మహిళా విముక్తి సాధ్యమవుతుందని బూర్జువా ఫెమినిస్టు సంఘాలు వాదిస్తుండగా, సంస్కరణల ద్వారానే సాధ్యమని ప్రభుత్వాలు చెబుతున్నాయి. వారి దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి మాత్రమే అభివృద్ధిని ఆశించాలనే వైఖరిని ప్రభుత్వం ప్రదర్శిస్తున్నది. మౌలిక సమస్యలను ఏమాత్రం పరిష్కరించకుండా పైపైన పూత మందుల సంస్కరణలు ఏ వర్గాన్ని ఉద్ధరించలేవు. అందులో భాగంగా మహిళలు కూడా తమ మౌళిక సమస్యలను పరిష్కరించుకోకుండా సంస్కరణల మాయలో పడితే తమపై కొనసాగుతున్న దోపిడి, అణచివేతలు ఇంకా తీవ్రమవుతాయే తప్ప విముక్తి సాధ్యం కాదు. వరకట్న దురాచారాన్ని రూపుమాపే ప్రయత్నం చేయకుండా 'ఆడబిడ్డ' పథకాన్ని ప్రవేశపెట్టడం, మహిళలను ఇంటిపని నుండి బయటపడ వేయకుండా మరింత నైపుణ్యంగా వంట బాధ్యతను చకచకా నిర్వహించేందుకు గ్యాస్ పొయ్యిలను అందించే 'దీపం' పథకాన్ని ప్రవేశపెట్టడం మోసపూరితమైనదే. అర్ధ భూస్వామ్య సంబంధాలు బలంగా వున్న మన సమాజంలో ఆధునిక గ్యాస్ పొయ్యిలు సైతం వారిని ఆటవికంగా చంపివేయడానికి ఉపయోగపడుతుండటం మనకు తెలియనిది కాదు. ప్రత్యేక మహిళా జన్మభూమిని నిర్వహించడం ద్వారా మహిళల సమస్యలు పరిష్కరించబడవు. మహిళలకు నిజంగా 33శాతం రిజర్వేషన్లు కల్పించినా ఈ దోపిడీ సంబంధాలు కొనసాగుతున్న వ్యవస్థలో మహిళలకు ఏమాత్రం వుపయోగపడవు. మహిళలను కూడా అప్రయత్నంగా, అనివార్యంగా ఈ దోపిడీ వ్యవస్థలో భాగం చేయడానికే పనిచేస్తాయి.

మహిళల నిజమైన విముక్తి దోపిడి వ్యవస్థ నిర్మూలించ

ఎ.పి. రిపోర్ట్

# నిర్బంధం-ప్రతిఘటన

రాష్ట్ర వ్యాపితంగా మన ఉద్యమంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి మొదలుపెట్టిన నూతన దాడి అన్ని ప్రాంతాలలోనూ తీవ్రతరం చేస్తున్నాడు. దక్షిణ తెలంగాణా, ఉత్తరాంధ్ర, దక్షిణ కోస్తా-రాయలసీమ ప్రాంతాల్లో అక్రమ అరెస్టులు, చిత్రహింసలు, బూటకపు ఎదురుకాల్పులు తీవ్రతరం చేశాయి. తమ న్యాయమైన హక్కుల కోసం పోరాడుతున్న ప్రజలు, తమ పోరాటాలకు నాయకత్వం వహిస్తున్న పార్టీ, సంఘాల కార్యకర్తల అక్రమ అరెస్టులకు నిరసనగా, బూటకపు ఎన్‌కౌంటర్లకు నిరసనగా, పోరాటాలపై దాడులకు నిరసనగా అనేక పద్ధతుల్లో నిరసన తెల్పుతున్నారు. పార్టీకి ప్రజల అండదండలు లేవని గోబెల్స్ ప్రచారం చేస్తున్న ప్రభుత్వానికి చెంపపెట్టుగా, అరెస్టులను అడ్డుకోవడానికి ప్రయత్నించటం, అరెస్టయిన వాళ్ళని విడిపించుకోవటానికి ధర్నాలు చేయటం, సాయుధ ప్రతిఘటన చేయటం మొదలైన రూపాలు అమలు చేస్తున్నారు.

**గుంటూరు జిల్లా:**

13-3-1999న మాచర్లలో కా॥ భాగ్యక్క, శేఖర్, శ్రీధర్‌లను గ్రేహౌండ్స్ పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారు. పార్టీ రహస్యాలు చెప్పమని చిత్రహింసలు పెట్టారు. అరెస్టు చేసిన 24 గంటలలో కోర్టుకు హాజరుపరచాల్సి వుండగా వారం రోజుల అవుతున్నా కోర్టులో ప్రవేశపెట్టలేదు. వాళ్ళని వెంటనే కోర్టులో హాజరుపరచాలని డిమాండ్ చేస్తూ, 19-3-'99న ప్రజాసంఘాల నాయకత్వాన నాయకత్వాన దాచేపల్లిలో, చుట్టుప్రక్కల గ్రామాల నుండి కదిలి వచ్చిన 300 మంది ప్రజలు 4 గంటలపాటు జాతీయ రహదారిపై రాస్తారోకో చేసారు.

**సంఘనాయకుడి భార్య అక్రమ అరెస్టుకు నిరసనగా కదిలిన స్త్రీ, పురుషులు:**

నాగులేటి దళం ఏరియాలో గ్రామాల్లో సంఘ నాయకులను అరెస్టు చేయటానికి పోలీసులు దాడులు ముమ్మరం చేశారు. దాన్లో భాగంగా, 20-3-'99న మాచవరం మండలం రేగులగడ్డ గ్రామంలోని సంఘ నాయకుని ఇంటిపై ఎస్.ఐ. నాయకత్వాన 15 మంది పోలీసులు దాడి చేసారు. సంఘ నాయకుడు తృటిలో తప్పుకున్నాడు. సంఘ నాయకుడు చిక్కక పోయేటప్పటికి పిచ్చెత్తిన పోలీసులు, అతని భార్య నాగమణిని అరెస్టు చేసి స్టేషనుకు తీసుకుపోయారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామ ప్రజలు 150 మంది స్త్రీలు, 100 మంది పురుషులు మొత్తం 250 మంది వెంటనే కదిలి పోలీస్‌స్టేషన్‌కు వెళ్ళి నాగమణిని వెంటనే విడుదల చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ, పోలీసుల్ని డిమాండ్ చేశారు. ప్రజల సంఘటిత శక్తిని చూసిన పోలీసులు, నాగమణిని పోలీస్ స్టేషన్‌లో వుంచకుండా, ఒక మధ్యవర్తి ఇంట్లో వుంచి, వెంటనే కోర్టులో హాజరుపరచగా, ప్రజలు నాగమణిని బెయిల్‌పై విడిపించుకున్నారు.

**అగ్రహారం వి.ఆర్.సి.యస్. కార్యవర్గ సభ్యుడి అక్రమ అరెస్టును ప్రతిఘటించిన గ్రామ ప్రజలు:**

నాగులేటి దళం ఏరియాలోని దాచేపల్లి మండలంలోని అగ్రహారం గ్రామ వి.ఆర్.సి.యస్. కార్యవర్గ సభ్యుడైన కా॥ కుమార్ ఇంటిపై 25-3-'99 తెల్లవారు జామున 4 గంటలకు, 4గురు ఎస్.ఐ.ల నాయకత్వాన 4 జీపులలో వచ్చిన 30 మంది పోలీసులు దాడిచేసి, కుమార్‌ను అక్రమంగా అరెస్టు చేసారు. కుమార్ అరెస్టును మహిళలు అడ్డుకోగా, వారిని కొట్టి, కుమార్‌ను తీసుకెళ్ళారు. కుమార్ అక్రమ అరెస్టును నిరసిస్తూ, అరెస్టు చేసిన కుమార్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ, గ్రామం నుండి స్త్రీలు, పురుషులు, పిల్లలు మొత్తం 250 మంది కదిలివెళ్ళి, స్టేషన్ ముందు ధర్నాకు దిగారు. పోలీసులు వచ్చి, ధర్నా విరమించండి అని బెదిరించినా ప్రజలు భయపడక ధర్నాను కొనసాగించారు. ప్రజల ప్రజాస్వామిక హక్కును కాలరాస్తూ, శాంతియుతంగా ధర్నా చేస్తున్న ప్రజలపై, డి.యస్.పి. నాయకత్వాన 50 మంది పోలీసులు లాఠీలతో దాడి చేసారు. దీంతో కోపోద్రిక్తులైన ప్రజలు మరింత పోరాట పటిమతో పోలీసులపై తిరగబడ్డారు. చేతికి దొరికిన రాళ్ళతో పోలీసులని ప్రతిఘటించారు. ఈ ప్రతిఘటనలో కొందరు పోలీసులకు గాయాలైనాయి. ఈ సందర్భంగా స్వరాజ్యం అనే యువతిని పోలీసులు అరెస్టు చేసి అక్రమ కేసు పెట్టారు. ఈ అక్రమ అరెస్టులకు, పోలీసుల దాడిని ఖండిస్తూ, ప్రజల మండల బంద్‌కు పిలుపిచ్చి, దాన్ని జయప్రదం గావించారు. ప్రజల ఈ ఆందోళనతో, పోలీసులు అరెస్టు చేసిన వాళ్ళని కోర్టులో హాజరుపరిచారు.

**(తరువాయి 32వ పేజీలో)**

---

బడినప్పుడు మాత్రమే సాధ్యమవుతుంది. భూస్వామ్య వ్యవస్థ నిర్మూలించ బడినప్పుడే భూస్వామ్య భావజాలంలో భాగమైన పితృస్వామ్యం, పురుషాధిపత్యం నుండి మహిళలు విముక్తి చెందుతారు. సామ్రాజ్యవాద ఆర్థిక వ్యవస్థ కూల్చివేయబడినప్పుడే మహిళలపై జరుగుతున్న శ్రమదోపిడీతో పాటు వారిపై అమలవుతున్న లైంగిక దోపిడీ నిర్మూలించబడడానికి అవకాశం వుంటుంది. సామ్రాజ్యవాద సంస్కృతి రూపుమాపబడినప్పుడే సమాజంలో మహిళలకు నిజమైన గౌరవం దక్కుతుంది.

భారతదేశంలో వున్న అర్ధభూస్వామ్య-అర్ధవలస ఆర్థిక వ్యవస్థకు వ్యతిరేకంగా జరుగుతున్న సాయుధ రైతాంగ పోరాటాల్లో పాల్గొంటూ తమ ప్రత్యేక సమస్యలపై ఉద్యమించడమే మహిళా విముక్తికి సరియైన మార్గం. పీపుల్స్‌వార్ పార్టీ నాయకత్వంలో కొనసాగుతున్న నూతన ప్రజాస్వామిక విప్లవోద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొంటూ ప్రజా రాజకీయాధికార అంగాలైన గ్రామరాజ్య కమిటీల్లో భాగస్వాములౌతూ మౌళిక సమస్యలైన దున్నేవారికే భూమి దక్కే విధంగా పోరాటాలకు సిద్ధం కావాలి. ప్రభుత్వ సాయుధ బలగాలను ఓడించడానికి ప్రజాసాయుధ బలగాల్లో చేరి పోరాడాలి. ❑

# అనుభవవాదాన్ని

**లెనిన్ రాసిన ''భౌతికవాదం మరియు అనుభవవాద విమర్శ'' చదివిన తర్వాత తయారు చేసిన నోట్సు**

- వీచీ-పు

*(రచయిత పెకింగ్‌లోని యుంగ్‌టింగ్ మెషినరీ ప్లాంట్‌లో డ్రిల్లింగ్ ఆపరేటర్‌గా పనిచేసేవాడు. (సాంస్కృతిక విప్లవ కాలంలో చైనా కమ్యూనిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యుడయినాడు)*

## అనుభవానికి సంబంధించిన రెండు వ్యతిరేక సిద్ధాంతాలు

''భావవాదం మరియు యాంత్రిక భౌతిక వాదం, అవకాశవాదం మరియు దుస్సాహసికవాదం వీటన్నిటికీ-భౌతిక వాస్తవికత, స్వీయాత్మకతల మధ్య ఏర్పడ్డ అగాథం, జ్ఞానాన్ని ఆచరణ నుండి విడదీయడం అనే లక్షణాలుంటాయి.'' అని మావో ఆచరణ వ్యాసంలో పేర్కొన్నాడు. రష్యా పార్టీలోకి చొరబడ్డ బొగ్దనోవ్ మరియు అతనిలాంటి ఇతర వంచనాపరులు అటువంటి అవకాశవాదులే. లెనిన్ తన ''భౌతికవాదం మరియు అనుభవవాద విమర్శ''లో వీరి స్వభావాన్ని చాలా పదునుగా ఎండగట్టడంపై కేంద్రీకరించాడు. ఈ మూర్ఖులు విప్లవాచరణను వ్యతిరేకించి, ఆచరణకు సంబంధించిన భౌతికవాద సిద్ధాంతాన్ని నిరాకరించి భావవాద ఆచరణా సిద్ధాంతాన్ని ప్రబోధించారు. వారు విప్లవ సిద్ధాంతాన్ని వ్యతిరేకించి, గతితార్కిక భౌతికవాదాన్ని 'మాయా వాదమని', 'పిడివాదమని' ద్వేషంతో అవమానపరిచారు. వారి మెదళ్ళలో భౌతికవాదానికి బదులు భావవాదాన్ని, మార్క్సిజానికి బదులు రివిజనిజాన్ని నింపారు. ఈ విషయంలో వారింకెంత మాత్రం ఒంటరివాళ్ళు కాదు; లీషావ్-చీ, ఇతర రాజకీయ మోసగాళ్ళు కూడా ఇదే కోవకు చెందుతారు. 'ప్రతిభ' పేర పిలవబడుతున్న తప్పుడు సిద్ధాంతానికి బాకాలూదుతూ, వారు మనిషి సామర్థ్యం ఆచరణ నుండే పుడుతుందనే భౌతికవాద దృక్పథాన్ని వ్యతిరేకిస్తారు. మార్క్సిజం-లెనినిజం కాలానుగుణంగా లేదని, పనికిరాదని ఉన్మత్తతతో దాడి చేశారు. విప్లవ సిద్ధాంతాన్ని విప్లవ ప్రజారాశుల నుండి వేరుచేసి ప్రక్కదారి పట్టించడానికి, మోసం చేయడానికి ప్రయత్నించారు. ఇదంతా ఏం తెలియజేస్తుందంటే మనం అవకాశవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్నప్పుడు ఆచరణకు ప్రథమస్థానం ఇచ్చే దృక్పథాన్ని ఎత్తిపట్టాలి. భావవాద ఊహలను వ్యతిరేకించాలి. అదే సమయంలో మనని మనం భావవాదం, అధి భౌతికవాదంలోకి కూరుకుపోకుండా నివారించుకోవడానికి, భావవాద ఊహల నుండి రక్షించబడడానికి విప్లవ సిద్ధాంత నాయకత్వ పాత్ర ప్రాముఖ్యతకు కట్టుబడి వుండాలి.

అనుభవం, వర్గపోరాట ఆచరణ నుండి ఉత్పత్తి కోసం పోరాటం నుండి మరియు శాస్త్రీయ ప్రయోగం నుండి వస్తుందని మార్క్సిజం చెబుతుంది. ''నిజమైన జ్ఞానం అంతా ప్రత్యక్ష ఆచరణ నుండే పుడుతుంది.'' (ఆచరణ). నా స్వంత అనుభవం నుండి కూడా ఇది నిజం అని తెలుసుకున్నాను. ఇది ఆకాశం నుండి ఊడిపడలేదు లేదా మనస్సు నుండి ఉద్భవించలేదు. ఇది మా రిసెర్చి గ్రూపు చేసిన దాదాపు ఒక వేయి ప్రయోగాల ఫలితం. వీరు బెంచి వద్ద 12 సం॥ల అనుభవం, స్వదేశంలో, విదేశాల నుండి కూడా మెరుగైన అనుభవాన్ని గడించినవారు. ఇంకోమాటలో ఇది డ్రిల్లింగ్ మిషిన్ ఆపరేటర్ల ఆచరణానుభవం నుండి సృష్టించబడింది.

జ్ఞానానికి సంబంధించిన భౌతికవాద మార్గాన్ని వ్యతిరేకించడంలో, భావవాదులందరూ అనుభవానికి సంబంధించిన విషయాల భౌతిక వాస్తవికతను తేడా లేకుండా నిరాకరిస్తారు. తాము బయట పడకుండా వుండటానికి, ఇతరులను మోసం చేయడానికి వారు తరచుగా 'అనుభవం' అనే పాత బ్యానర్‌ను ఎత్తిపడుతుంటారు. కాని వాస్తవానికి భావవాద దృక్పథం గల అనుభవాన్ని వీరు ముందుంచుతారు. అనుభవానికి సంబంధించిన వీరి దృక్పథాన్ని లెనిన్ స్పష్టంగా బహిర్గతపరిచి విమర్శించాడు. ''తత్వశాస్త్రంలో భావవాద, భౌతికవాద మార్గాలు రెండూ బహుశా 'అనుభవం' అనే పదం మాటున దాగి వున్నాయి అని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు'' అని భౌతికవాదం మరియు అనుభవవాద విమర్శలో పేర్కొన్నాడు. అనుభవానికి సంబంధించిన విషయాలపై ఆధారపడి భౌతిక వాస్తవికతకు కట్టుబడి వుండడం అనేది భౌతికవాద మార్గాన్ని ఎత్తిపట్టి దాన్ని సరిగా అర్థం చేసుకోవడానికి వుండవలసిన ముందు షరతు.

## అనుభవమే సంపూర్ణమైనదని ఎప్పుడూ ఎంచకూడదు

మనం ప్రత్యక్ష (స్వంత) అనుభవంలో వుండడం వల్ల మనంతట మనం భౌతికవాద మార్గంలో మన పనిని కొనసాగిస్తామని అర్థమా? లేదు. ప్రత్యక్ష అనుభవమే సంపూర్ణమైనదని భావిస్తే మనం తప్పులు చేస్తాం. మన పాక్షిక అనుభవాన్నే తిరుగులేని నమూనాగా ఎంచి దానిని అంతటా వర్తింపజేస్తే-పాత అనుభవంతో నూతన విషయాలను, అభివృద్ధి చెందిన లేదా మారిన విషయాలను పరిష్కరింప బూనుకుంటే, మన పాక్షిక అనుభవాన్ని ఎక్కువ అంచనా వేసుకొని ఇతరుల, ప్రజల సరైన అనుభవాన్ని తక్కువ అంచనా వేస్తే లేదా నిరాకరిస్తే మనం అనుభవవాదానికి గురవుతాం. దాని ఫలితంగా మనం ఇంకా బోగ్దనోవ్ ప్రవచించిన భావవాద అనుభవవాద సిద్ధాంతం నుండి పూర్తిగా బయట పడలేక తెలిసిగాని, తెలియకగాని భావవాద బురదగుంటలో మునిగిపోతాం.

ప్రపంచంలోని అన్ని విషయాలు లేదా వస్తువులు పరస్పర సంబంధం కలిగి వుండి అదే సమయంలో ఒకదానితో మరొకటి వైవిధ్యం (తేడా) కలిగి వున్నాయి. ఆచరణలో మనం విషయాల సాధారణత్వంపట్ల మాత్రమే శ్రద్ధ చూపకూడదు. అంతకంటే ముఖ్యమైనది, ప్రతిదాని యొక్క నిర్దిష్టత్వం పట్ల శ్రద్ధ వహించడం. వస్తువులలోని ప్రత్యేక వైరుధ్యం ఏదైతే మిగతా వస్తువుల నుండి దానిని భిన్నంగా చూపుతుందో దానికనుగుణంగా వైరుధ్యాన్ని పరిష్కరించడానికి సరైన చర్యలు చేపట్టాలి. దీన్ని సులభంగా ''తాళాన్ని తీయడానికి సరైన తాళం చెవిని ఉపయోగించడం''గా చెప్పవచ్చు. అదే విధంగా మనం అన్ని రోగాలను నయం చేయడానికి ఒకే మందు ఉపయోగించలేం. ఒక దాని నుండి పొందిన అనుభవంలో కొన్ని విషయాలు ఇతరులకు తగినవిగా వుండవచ్చు, కొన్ని పాక్షికంగా సరిపోవచ్చు, మరికొన్ని అసలు పూర్తిగా తగినవిగా వుండకపోవచ్చు. వైరుధ్యాల ప్రత్యేకతను నిర్లక్ష్యంచేసి, యాంత్రికంగా పాత అనుభవంతోనే ప్రతి దానినీ పరిష్కరించబూనడమే 'అనుభవవాదం'.

ప్రపంచంలోని ప్రతి ఒక్కటి మార్పుకు గురవుతున్నది. ఈ

# అధిగమించడం

మార్పు దాని అభివృద్ధి క్రమంలో ఒక నిర్దిష్ట దశలో దానంతటదే స్పష్టంగా కనపడుతుంది. కాబట్టి మన ఆలోచన భౌతిక పరిస్థితుల అభివృద్ధి దశను దాటిపోవద్దు. భవిష్యత్తులో మాత్రమే చేయగలిగిన దానిని ఇప్పుడే ఒక దెబ్బతో సాధించాలని కలలు కనగూడదు. ఐనప్పటికీ భౌతిక పరిస్థితులు మారినకొద్దీ దానికనుగుణంగా మన ఆలోచనలో తప్పక మార్పురావాలి. ఈ విధంగా మాత్రమే భౌతిక వాస్తవికత యొక్క అభివృద్ధికి వెనుకబడి వుండకుండా, 'పాత అనుభవం'తో కొత్త సమస్యలు పరిష్కరించకుండా వుండగలం. ఆచరణ నుండి వచ్చింది కనుక పాత అనుభవం సరైందని మనం అంటాం. కాని మనం దాన్ని పట్టుకొని వేలాడితే పరిస్థితులు మారినప్పుడు అటువంటి అనుభవం స్వీయాత్మకమై పోతుంది.

ఆచరణ కార్యకలాపం అనేది అత్యంత విస్తృతమయినది. కాని వ్యక్తిగత ఆచరణకుగల అవకాశం ఎప్పుడూ పరిమితమయినదే. మనం వ్యక్తిగత ఆచరణ ద్వారా పొందిన ప్రత్యక్షానుభవానికి గల ప్రాముఖ్యతకు అంటి పెట్టుకొని వుంటూనే ప్రజలు సృష్టించిన అనుభవాలని చాలా విలువైనవిగా ఎంచాలి. అధ్యయనం, పరిశోధనలు చేయడంలో, ఇతరుల అనుభవాలను స్వీకరించడంలో సంసిద్ధంగా వుండాలి. ఆ విధంగా మాత్రమే మన పనిని సరిగా చేయగలుగుతాం.

చున్ డ్రిల్ మిషన్ ఏ విధంగా రూపొందించబడిందో గుర్తు చేసుకుంటే-జ్ఞానమనే సముద్రం ప్రజల ఆచరణ నుండే సృష్టించబడిందనే లోతైన అవగాహనకు వచ్చాను. డ్రిల్లింగ్‌లో ప్రజలు సృష్టించిన వాటిని, వారి విలువైన అనుభవాలను తీసుకొని ఎంతో జాగరూకతతో పరిశోధించిన తర్వాతే మేం చున్ డ్రిల్ బిట్ మీద చెప్పుకోదగ్గ 5 పెద్ద మార్పులను తీసుకు రాగలిగాం. ఏ ఒక్కరు కూడా ప్రతి విషయంలో ప్రత్యక్ష అనుభవం కలిగి వుండరు. వాస్తవానికి చాలా జ్ఞానం పరోక్షానుభవం ద్వారానే వస్తుంది. ఒకవేళ ఎవరైనా ప్రజల అనుభవం కంటే తన వ్యక్తిగత అనుభవం గొప్పదని, పరోక్ష అనుభవం కంటే ప్రత్యక్ష అనుభవం గొప్పదని భావిస్తే అనుభవవాద తప్పులకు గురవుతారు. మావో ఈ విధంగా పేర్కొన్నాడు: ''ఇతరుల అనుభవాల నుండి కూడా మొహమాటం లేకుండా నేర్చుకోవడం అవసరం. దానికి బదులుగా మూర్ఖంగా స్వంత అభిప్రాయాలకే కట్టుబడి వుండి ఇతరుల అనుభవాలను తిరస్కరించినా, స్వంత అనుభవమే అన్ని విషయాలకు సరిపోతుందని పట్టుపట్టినా శుద్ధ 'సంకుచిత అనుభవవాదమే' అవుతుంది'' (చైనా విప్లవ యుద్ధంలో వ్యూహాత్మక సమస్యల నుండి).

స్వీయాత్మకత, లాంచనవాదాల వ్యక్తీకరణే అనుభవవాదం. సైద్ధాంతికంగా ఇది గతితార్కిక భౌతికవాద, చారిత్రక భౌతికవాదాల మౌలిక సూత్రాలకు వ్యతిరేకంగా నడుస్తుంది. అనుభవవాదులు తరచుగా ''అతివాద'', మితవాద అవకాశవాదాన్ని గుడ్డిగా అనుసరించడానికి ఇదే సైద్ధాంతిక పునాది. ఇటువంటి పరిస్థితుల్లో అనుభవవాదానికి గురైన వారు మార్క్సిజం విప్లవాచరణకు మార్గదర్శి అనే విషయాన్ని నిర్లక్ష్యం చేస్తారు. విప్లవ సిద్ధాంత అధ్యయనం పట్ల శ్రద్ధ పెట్టరు. అప్పుడప్పుడు లభించే విజయాలను, మెరుపులను చూసి సంతృప్తి చెందుతారు. సంకుచిత, సూత్రబద్ధంకాని ''ప్రయోజన వాదం'' అనే మత్తులో మునిగిపోతారు. భవిష్యత్తులేని ''ఆచరణవాదులు''గా వుండి పోతారు. వారు రాజకీయ మోసగాళ్ళ కుహనా మార్క్సిస్టు సిద్ధాంతాలకు సులభంగా బందీలయిపోతారు.

## చైతన్యంతో కూడిన అధ్యయనం ద్వారా అనుభవవాదాన్ని అధిగమించడం

మార్క్సిజాన్ని చైతన్యయుతంగా అధ్యయనం చేయడమే అనుభవవాదాన్ని అధిగమించడానికున్న మౌలిక మార్గం. అనుభవ వాదాన్ని సైద్ధాంతికంగా విమర్శించడానికి మనం తత్వశాస్త్రాన్ని తప్పనిసరిగా అధ్యయనం చేయాలి. ''పనిలో అనుభవం గడించినవారు సిద్ధాంత అధ్యయనాన్ని సీరియస్‌గా చేపట్టడం ద్వారా మాత్రమే వారి అనుభవాన్ని ఒక క్రమ పద్ధతిలో సంశ్లేషించి దానిని సిద్ధాంత స్థాయికి పెంచుకో గలుగుతారు. ఆ విధంగా మాత్రమే వారి పాక్షిక జ్ఞానాన్ని విశ్వజనీన సత్యంగా పొరపడరు, అనుభవవాద తప్పులు చేయరు'' (పార్టీ పని శైలిని సరిదిద్దండి).

ఆచరణ నుండి గడించిన ప్రత్యక్ష అనుభవం భౌతిక ప్రపంచానికి సంబంధించిన కొంత వాస్తవాన్ని ప్రతిబింబించినప్పటికీ అది అనుభూతి జ్ఞానం మాత్రమే. అలా ప్రతిబింబించేది పైపైన కనిపించేది, పాక్షికమైనది, అసంపూర్ణమైనది. ''సాపేక్షికంగా సంపూర్ణ జ్ఞానం లేకుండా విప్లవాన్ని సరిగా కొనసాగించడం అసాధ్యం'' (పార్టీ పనిశైలిని సరిదిద్దండి). సంపూర్ణ జ్ఞానాన్ని సాపేక్షికంగా సంపూర్ణ జ్ఞానంగా మార్చడానికి విప్లవ సిద్ధాంతాన్ని చైతన్యపూర్వకంగా అధ్యయనం చేయడం తప్పనిసరి. మార్క్సిస్టు-లెనినిస్టు దృక్పథం, వైఖరి, పద్ధతులను చేపట్టి ఒకరి ప్రత్యక్ష అనుభవాన్ని ప్రత్యేకంగా వర్గపోరాట, రెండు పంథాల మధ్య పోరాటానుభవాల నుండి అంచనా కట్టాలి. పునర్నిర్మాణం ద్వారా అనుభూతి జ్ఞానం నుండి హేతుబద్ధ జ్ఞానానికి గెంతు వేయడానికి-పనికిరాని దానిని విసర్జించి అవసరమైన దానిని ఎంచుకోవాలి, తప్పులను వదిలించుకొని సత్యాన్ని నిలబెట్టుకోవాలి. ఒకదాని నుండి ఇంకోదానికి, బయటి నుండి లోపలకు పోతూ ముందుకు సాగాలి. ఈ క్రమంలో సరైన వైఖరి, దృక్పథం, పద్ధతులు చేపట్టడం అత్యంత ముఖ్యమైన విషయం. మార్క్సిస్టు వైఖరి, దృక్పథం, పద్ధతులు లేకుండా తెలుసుకోవడంలో గెంతు వాస్తవరూపం ధరించడం సాధ్యం కాదు. ఎవరైనా విషయాలను అనుభవవాద దృక్పథం నుండి చూస్తే అతను అవసరమైన దానికి పనికిరాని దానికి మధ్య తేడా చూడలేడు. కాని సత్యాన్ని అసత్యంగా, అసత్యాన్ని సత్యంగా మార్చివేస్తాడు.

లెనిన్ ఈ విధంగా పేర్కొన్నాడు: ''మార్క్సిస్టు సిద్ధాంత మార్గాన్ని అనుసరించడం ద్వారా మనం భౌతిక వాస్తవికతకు చేరువవుతాం (దాన్ని ఎన్నటికీ విడనాడకుండా వుంటే); కాని ఏ ఇతర మార్గాన్ని అనుసరించినా మనం గందరగోళానికి, అబద్ధాలకు చేరువవుతాం'' (భౌతికవాదం మరియు అనుభవవాద-విమర్శ). వర్గ పోరాటం, రెండు పంథాల మధ్య పోరాటం దీర్ఘకాలం ఉనికిలో వుంటాయి. పాత వైరుధ్యాలు పరిష్కారమైన తర్వాత వాటి స్థానంలో నూతన వైరుధ్యాలు ముందుకు వస్తాయి. ఒక యుద్ధంలో గెలిచిన తర్వాత నూతన యుద్ధాల్లో గెలవాల్సి వుంటుంది. భౌతిక ప్రపంచాన్ని మార్చడం అనేది ఎప్పటికీ ముగిసి పోయేదికాదు. మన ఆచరణ నుండి సత్యం అనే జ్ఞానాన్ని తెలుసుకోవడం కూడా ఎన్నటికీ ముగిసిపోదు. కాబట్టి మనం విప్లవాత్మకంగా వుండాలి, మనం బతికి వున్నంతకాలం అధ్యయనం చేస్తూనే వుండాలి. (నంబర్:43, అక్టోబర్ 27, 1972 పెకింగ్ రివ్యూలోని వ్యాసానికి సంక్షిప్త రూపం). ❑

( 29వ పేజీ తరువాయి)

### కా॥ మస్తాన్‌ని విడుదల చేయాలని డిమాండు చేస్తూ భార్య ఆమరణ దీక్ష:

ఎస్.బి.సి.కి. చెందిన పార్టీ ఆర్గనైజర్ కా॥ భూతం మస్తాన్ నర్సారావుపేట దగ్గరలోని ఒక గ్రామంలో వున్న తన భార్య సుశీలను కలవటానికి 18-3-‘99న వెళ్ళాడు. గ్రామంలోని ఒక ద్రోహి (ఇన్‌ఫార్మర్) ద్వారా అతని రాకను తెలుసుకున్న పోలీసులు, అదే రాత్రి అతనున్న ఇంటిపై దాడిచేసి, అరెస్టుచేసి, చిత్రహింసలకు గురిచేశారు. మస్తాన్ సొంత గ్రామమైన జూలకల్లు ప్రజలకు ఈ వార్త తెలిసి, అప్పటికప్పుడు 200 మంది కదిలి, అక్రమంగా అరెస్టు చేసిన మస్తాన్‌ను విడుదల చేయాలి అని డిమాండ్ చేస్తూ, 3 గంటలసేపు రాస్తారోకోను చేసారు. తన భర్తను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సుశీల నర్సరావుపేటలో ఆమరణ దీక్ష చేపట్టింది. వివిధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో 300 మంది ప్రజలు ధర్నా, రాస్తారోకో చేసారు. ఇంత చేసినా ఎస్.పి. కిమ్మనలేదు. ఆ సమయంలోనే ఎస్.పి. దాచేపల్లి రాగా, ప్రజలు ఎస్.పి.ని ఘెరావ్ చేసారు. అయినా ఎస్.పి. మస్తాన్ విషయం ఏం మాట్లాడలేదు. దీంతో మస్తాన్ ప్రాణాలకు అపాయం రావచ్చని, దాచేపల్లి వద్ద ఆర్.టి.సి. లగ్జరీ బస్సుపై ప్రజలు దాడిచేసి, దాన్ని ధ్వంసం చేసి నిరసన తెలిపారు. ఇది మరింత ఉధృతమవుతుందని గ్రహించిన ఎస్.పి., అక్రమ కేసులు పెట్టి వెంటనే మస్తాన్‌ను కోర్టులో హాజరు పెట్టాడు.

మాచవరం మండలం రేగులగడ్డ గ్రామంపై 6-7-‘99 రాత్రి 150 మంది పోలీసులు దాడి చేసి ఇద్దరు రైతుకూలీ సంఘ కార్యకర్తలను అరెస్టు చేసారు. వాళ్ళను విడుదల చేయాలని డిమాండు చేస్తూ, మాచవరం పోలీస్‌స్టేషన్ ముందు గ్రామానికి చెందిన 100 మంది మహిళలు ధర్నా చేసారు. ధర్నా చేస్తున్న మహిళలపై పోలీసులు విచక్షణా రహితంగా లాఠీ చార్జీ చేసి 11 మంది మహిళలను అరెస్టు చేసి, అక్రమ కేసులు పెట్టి రాజమండ్రి జైలుకు పంపారు. అదేరోజు వేమవరం గ్రామంపై కూడా దాడిచేసి నలుగురిని అరెస్టు చేసారు. ఈ అరెస్టులను, దాడులను నిరసిస్తూ ఏరియావ్యాప్తంగా జాతీయ రహదారిపై రాస్తారోకోకు పిలుపివ్వగా, ఏరియా మొత్తం పోలీసులు 144 సెక్షన్ విధించి, ఎక్కడికక్కడ పోలీసులను విస్తృతంగా దించి, రాస్తారోకోను భగ్నం చేసారు. విస్తృతంగా కరపత్రాల ప్రచారం జరిగింది.

బెల్లంకొండ ఏరియాలో గ్రామాలపై పోలీసులు జరుపుతున్న దాడులు, అక్రమ అరెస్టులకు నిరసనగా, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో 250 మందితో ధర్నా జరిగింది.

### నల్గొండ జిల్లా:
### పోలీసుల గల్లాలు పట్టిన మహిళలు:

పోచంపల్లి మండలం, భీమన్‌పల్లి గ్రామంలో ‘99 జనవరి మొదటి వారంలో ఉదయం 9 గంటల ప్రాంతంలో ఆ గ్రామ యువకులను అరెస్టు చేసి పోలీసులు తీసుకుపోయారు. అప్పుడే ప్రజలు అడ్డంపడి విడిపించుకోవటానికి ప్రయత్నించారు. కానీ, పోలీసులు పశుబలంతో తీసుకెళ్ళారు. వెంటనే, ఆ గ్రామ మహిళలు, యువకులు, వృద్ధులు కలిసి మొత్తం 200 మంది వరకు స్టేషన్ ముందు ధర్నాకు దిగారు. ఇది చూసి పోలీసులు వెంటనే ఆ యువకులను విడచిపెట్టారు. ఆ సందర్భంగా, వాళ్ళను ఎందుకు తీసుకొచ్చారో చెప్పమని పోలీసులను నిలదీశారు. ఆ సమయంలోనే వివిధ స్టేషన్ల నుండి అదనపు బలగాలను పిలిపించి, ధర్నా చేస్తున్న ప్రజలపై పోలీసులు లాఠీ చార్జీ చేశారు. అనేకమందిని విచక్షణా రహితంగా కొట్టారు. కొందరు ప్రజలకి తీవ్ర గాయాలైనాయి. ఒక ముసలమ్మ తల పగిలింది. ఒకరైతు చేయి విరిగింది. దీంతో ప్రజలు ఆగ్రహించి, పోలీసులపై తిరగబడి రాళ్ళు రువ్వారు. ముఖ్యంగా మహిళలు పోలీసుల గల్లాలు పట్టారు. కొందరిని యువకులు కొట్టారు. యస్సైపై ఉమ్మేశారు. సి.ఐ. తల పగలకొట్టారు. తర్వాత పోలీసులు 10 మంది మహిళలను, 5 గురు యువకులను అరెస్టుచేసి, 2 నెలలపాటు జైల్లో పెట్టారు.

### ప్రజల ఎదురుదాడికి దడిచి పొలాలవెంట పరుగెత్తిన పోలీసులు:

ఆలేరు మండలంలోని ఆమన్ బాల్ గ్రామంలో ప్రజలు వాగు నుండి ఇసుక రవాణాను అడ్డుకున్నారు. అన్నల సలహా మీద ఇసుక రవాణాను అడ్డుకున్నారంటూ, ఇసుక రవాణాలో వాటాలు మేసిన పోలీసులు ఆ గ్రామ ప్రజలపై దాడి చేశారు. బాబు మియా, నర్సింహ, ఉప్పలయ్య మరి కొందరు యువకులను పోలీసులు పట్టుకు పోతుంటే, ఆ గ్రామ మహిళలు, యువకులు వృద్ధులు దాదాపు 500 మంది అడ్డం తిరిగారు. అప్పుడు పోలీసులు ప్రజలపై రాఠీ చార్జీ చేయుట, మొదలు పెట్టగా, దానికి మరింత ఆగ్రహించిన ప్రజలు పోలీసులపై రాళ్ళతో, కర్రలతో ఎదురుదాడి చేశారు. పోలీసు జీపును బోల్తా (తిరగ) కొట్టించారు. ఒక కానిస్టేబుల్ తల పగిలింది. ఇంకో కానిస్టేబుల్ చేయి విరిగింది. దాంతో పోలీసులు ప్రాణ భయంతో గ్రామం చుట్టూ వున్న బోడు పొలాలకడ్డంబడి పరుగెత్తారు. తర్వాత యాదగిరి గుట్ట సి.ఐ. యాదయ్య, డి.ఎస్.పి. రవీంద్రారెడ్డిలు కలిసి వచ్చి, ‘ఎవ్వరు ఘర్షణ పడవద్దు, మనం కూర్చుని సమస్య మాట్లాడుకుందాం’ అని మైకులో విజ్ఞప్తి చేస్తూ, రాజీకి రాగా ప్రజలు అప్పుడు ఆగారు. అయితే, తర్వాత పోలీసులు 40 మంది ప్రజలపై తప్పుడు కేసులు బనాయించారు. ❑

...పీడితులకు, పీడకులకు, దోపిడీకి గురయ్యేవాళ్ళకు, దోపిడీ చేసేవాళ్ళకు ‘‘సమానత్వం’’ లేదు, వుండజాలదు. పురుషుల చట్టబద్ధమైన అధిక సౌకర్యాల చేత స్త్రీలు లోకువగా వున్నంతకాలం, పెట్టుబడి పెత్తనం నుండి కార్మికులకు స్వేచ్ఛ లేనంతకాలం పెట్టుబడిదారుని, భూస్వామి, వర్తకుని పెత్తనం నుండి శ్రామికరైతుకు స్వేచ్ఛ లేనంతకాలం నిజమైన ‘‘స్వేచ్ఛ’’ లేదు, వుండజాలదు... స్త్రీ పురుషుల సమానత్వం వుందా? ఏ జాతి ఏ జాతికి సమానంగా వుంది? ఏ వర్గం ఏ వర్గానికి సమానంగా వుంది? ఏ పెత్తనం నుండి, లేదా ఏ వర్గం పెత్తనం నుండి స్వేచ్ఛ? ఏ వర్గానికి స్వేచ్ఛ? ఈ ప్రశ్నలు వేయకుండా వీటికి అగ్ర తాంబూలం ఇవ్వకుండా రాజకీయాలు గురించి, ప్రజాస్వామ్యం గురించి, స్వేచ్ఛ గురించి, సమానత్వం గురించి, సోషలిజం గురించి మాట్లాడేవాడూ, ఈ ప్రశ్నలను అణగదొక్కడానికి, మరుగుపరచడానికి, మొద్దుపరచడానికి వ్యతిరేకంగా పోరాడని వాడూ శ్రామిక ప్రజల పచ్చి శత్రువు. మేకతోలు కప్పుకున్న తోడేలు. కార్మిక కర్షకుల ఉన్మత్త వ్యతిరేకి. భూస్వాముల, జారుల, పెట్టుబడిదారుల గులాము.

– లెనిన్.

ఉత్తర తెలంగాణా

# ఎన్నికల నిర్బంధాన్ని గేలిచేస్తూ దోపిడీ పాలకవర్గాలను, ప్రభుత్వ యంత్రాంగాన్ని ముప్పతిప్పలు పెట్టిన ఉత్తర తెలంగాణా ప్రజానీకం

ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన వెంటనే అప్పటిదాకా ఉధృతంగా కొనసాగుతూ వస్తున్న నిర్బంధం మరింత తీవ్రమైంది. చంద్రబాబు ప్రభుత్వం తెలంగాణా ప్రజలపైన యుద్ధానికి సిద్ధమై జూలై 20 నుండి పెట్రోలింగ్‌లు తీవ్రతరం చేసింది. జూలై 28 నుండి ఆగస్టు 3 వరకు జరిగే అమరవీరుల సంస్మరణ వారాన్ని అడ్డుకోవాలని అనేక గ్రామాలలో పార్టీ నిర్వహించే సభలకు వెళ్ళవద్దని హెచ్చరికలు చేసారు. పోస్టర్లు, బ్యానర్లు చించివేసి అక్కడక్కడ తాత్కాలికంగా నిర్మించిన స్థూపాలను తొలగించారు. జిల్లాలలో ఎన్నికల బహిష్కరణ పిలుపును వమ్ముచేస్తామంటూ ప్రతిరోజు యస్.పి. నుండి మొదలుకొని ఎస్.ఐ.ల దాకా పత్రికా ప్రకటనలు ఇచ్చారు. అనేక గ్రామాలలో 'ప్రజాదర్పణం', 'చైతన్య సదస్సులు', 'పోలీసు దర్బార్'ల పేరుతో ప్రజలందరినీ గుంపువేసి పీపుల్స్‌వార్ పిలుపును ఖాతరు చేయవద్దని, ఓట్లు వేయకపోతే కేసులు పెడతామని, తోలు వలుస్తామని, కొన్ని చోట్లనైతే ఏకంగా ఎన్‌కౌంటర్ చేస్తామని బెదిరించారు. మాజీ కార్యకర్తల పేర్లన్నీ పేపర్లలో ప్రకటించి వారందరూ విధిగా వారానికి రెండుసార్లు పోలీస్‌స్టేషన్‌లో హాజరు కావాలని, సంఘ కార్యకర్తలు వచ్చి సరెండర్ కావాలని లేని పక్షంలో ఎన్‌కౌంటర్ చేస్తామని ప్రకటించారు. సానుభూతిపరులను ముందుంచి ఎన్నికలు నిర్వహిస్తామని బాలెట్ బాక్స్‌లు తరలే వరకు సానుభూతిపరులదే బాధ్యత అని ప్రచారం చేశారు. బలమైన గ్రామాలలో ఇంటింటికి పోయి అన్నలు మీకేం చేసారని ప్రశ్నిస్తూ, ఓటుహక్కు ప్రాధాన్యతను, ప్రభుత్వ సంస్కరణలను వివరిస్తూ ప్రచారం చేశారు. ఓటుహక్కు గురించి వివరించే 'మీకోసం' ఆడియో క్యాసెట్‌ను జీబుల్లో మారుమూల గ్రామాల వరకు మైకు ద్వారా ప్రచారం చేసారు. గ్రామాలలో వీధి సమావేశాలు, ప్రధాన కూడళ్ళలో సమావేశాలు నిర్వహించి ప్రభుత్వం ఎన్నో సంస్కరణలు చేస్తున్నట్టు, పార్టీ అభివృద్ధిని అడ్డుకుంటున్నట్లు చెప్పారు. చివరికి ఓట్లు వేయకపోతే గ్రామాలకు కరెంటు, బస్సు, రేషన్ బియ్యం బంద్ చేస్తామని బెదిరించారు. గెరిల్లాలు ప్రభుత్వ ఆస్తులు దగ్ధం చేస్తున్నట్టు, ప్రభుత్వం ఫ్యాక్టరీలను నిర్మిస్తున్నట్టు, ప్రజలు పార్టీని ఖాతరు చేయకుండ ఓట్లేస్తున్నట్లు చూపించే పెద్ద పెద్ద గోడ పోస్టర్లను గ్రామాలలో అంటించారు. ''పార్లమెంట్ అసెంబ్లీ ఎన్నికల్లో స్వేచ్ఛగా ఓటేయండి'', ''ప్రజాస్వామ్యాన్ని రక్షించండి'' వంటి నినాదాలు రాసిన ప్లేకార్డులు పట్టుకొని గ్రామాలలో, పట్టణాలలో పోలీసులు 'మార్చ్‌ఫాస్ట్' చేశారు. పోలీసు అధికారుల నాయకత్వంలో ఎ.పి.ఎస్.పి., ఎ.ఆర్., బి.ఎస్.పి., సివిల్ పోలీసులు ఈ కవాతులో పాల్గొన్నారు.

తెలంగాణాలో మూడవ విడత పోలింగ్ కోసం 62 వేల మంది పోలీసులను, 8,500 మంది హోంగార్డులను, 800 మంది స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ సాయుధ కానిస్టేబుళ్ళను, అధికారులను వినియోగించారు. రెండువేల మంది సీనియర్ ఎన్.సి.సి క్యాడెట్లతో పాటు రిటైర్డ్ పోలీసు, ఆర్మీ జవాన్ల, అధికారులతో కూడిన స్పెషల్ పోలీసు ఫోర్స్‌ను రంగంలోకి దించారు. వీటికితోడు రాష్ట్రానికి ఎన్నికల కోసం కేంద్రం కేటాయించిన సాయుధ బలగాలన్నింటినీ మూడో విడతలో ఉపయోగించారు. ఇందులో 37 కంపెనీల సి.ఆర్.పి.యఫ్., 15 కంపెనీల బి.యస్.యఫ్., 13 కంపెనీల రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ మొత్తం 90 కంపెనీలు, వీటికితోడు 3 కంపెనీల రాపిడ్ యాక్షన్ ఫోర్సు. ఈ బలగాలను మొత్తం 850 సాయుధ పోలీసు ప్లాటూన్లుగా ఏర్పాటుచేసి పోరాట ప్రాంతంలో గస్తీని విస్తృతం చేశారు. 623 మెరుపు దళాలు, 177 ప్రత్యేక మెరుపు దళాలతో పాటు 2,315 గస్తీ దళాలు ఏర్పాటు చేసి ఉత్తర తెలంగాణాను పోలీసు పదఘట్టనలతో ముంచెత్తారు.

ప్రపంచబ్యాంక్ ఏజెంట్ చంద్రబాబు ప్రభుత్వం 1999 ఆగస్టు నుండి డిసెంబర్ వరకు 26 మంది కామ్రేడ్స్‌ను పొట్టన పెట్టుకుంది. ఆగస్టు 12న నిజామాబాద్ జిల్లాలో కరీంనగర్-కామారెడ్డి రోడ్డుపై ఆరెపల్లి వద్ద కా॥ సామగంజి శంకర్‌ను, ఆగస్టు 13న ఆదిలాబాద్ జిల్లా సింగపూర్ ఏరియాలో గండి గోపాల్‌పూర్‌కు చెందిన ఆదివాసీ రైతుకూలీ సంఘం నాయకుడు కా॥ శంకర్‌ను, ఆగస్టు 14న వరంగల్ జిల్లాలో పులుకుర్తిలో ముగ్గురిని, ఆగస్టు 15న కరీంనగర్ జిల్లా తుమ్మనపల్లిలో ఒకరిని కాల్చి చంపారు. చికిత్సకై హాస్పిటల్‌కు పోయిన వరంగల్ జిల్లా నర్సంపేట శాక్ కార్యదర్శి కా॥ కోడి కుమారస్వామి (ఆనంద్)తో పాటు పాక శ్రీనును పట్టుకొని ఆగస్టు 16న గోవిందాపురం అడవుల్లో కాల్చి పడవేశారు. ఆగస్టు 24న ఇదే జిల్లాలో శాయంపేటలో ఒకరిని కాల్చి చంపారు. ఎన్నికలు జరుగుతుండగా వరంగల్ జిల్లా వెల్లంపల్లిలో సెప్టెంబర్ 19న కా॥ జానంపట్ల గోపాల్, గట్టుమల్లులను కాల్చి చంపారు. షెల్టర్‌లో నిరాయుధంగా వున్న కరీంనగర్ పశ్చిమ జిల్లా కమిటీ సభ్యుడు కా॥ భూపతితోపాటు ఆకెళ్ళ శంకర్‌ను పట్టుకొని మహాముత్తారం మండలం దొబ్బలపాడులో ఆంబుష్ జరిగిన స్థలంలో కాల్చిపడవేసి ఎదురుకాల్పుల కథ అల్లారు. అక్టోబర్ 2న ఖమ్మం జిల్లాలో మధిర క్రాస్‌రోడ్డు వద్ద ఒకరిని, నవంబర్ రెండవ వారంలో మంథిని ఏరియాలో హరిరెడ్డి, కమలక్కలను కాల్చి చంపారు.

మెదక్ జిల్లా పాపన్నపేట్ పోలీస్ స్టేషన్‌పై దాడి జరిగిన తర్వాత ఏడుగురు యువకులను ఎనిమిది రోజులు కస్టడీలో వుంచుకొని పోలింగ్ పెట్టెల బస్సులో రోడ్డుదాకా తీసుకుపోయి వదిలేశారు. గాజిరెడ్డిపల్లిలో పోలీసులు పెట్టే బాధలకు 20 కుటుంబాలు వూరు విడిచి పారిపోయాయి. నర్రా బాలయ్య అనే వ్యక్తి వూరిడిచి పోవడంతో అతని 4 ఎకరాల భూమి ఎండిపోయింది. గొల్లె సత్తయ్య, గొల్లె సిద్ధిరాములు, చాప అంజయ్యలపై కేసుపెట్టి జైలుకు పంపారు. వీరిని, వీరి భార్యలతో పాటు బాన్స్‌వాడ దళ కమాండర్ కా॥ ఐలన్న భార్య పేర్లను ఎఫ్.ఐ.ఆర్.లో ఇరికించారు. పాపన్నపేట్ పోలీస్ స్టేషన్ రెయిడ్‌కు ముందు దళం గాజిరెడ్డిపల్లిలో ఆశ్రయం తీసుకున్నదని,

నీరంతా అన్నం పెట్టారనే సాకుతో రాజద్రోహ నేరం మోపారు. బలన్న రక్త సంబంధీకులైనందున వీరిపై కేసు పెట్టారు. గత పదేళ్ళుగా గ్రామం పోలీసు బూట్లకింద నలుగుతున్నది. రెయిడ్ జరిగిన వెంటనే మెదక్, నిజామాబాద్ జిల్లాల సరిహద్దులోని అడవిలోకి అప్పటికే ఎన్నికలకై వినియోగించిన సాయుధ బలగాలకు తోడు వందలాది మంది సాయుధ పోలీసులను, కమెండోలను దించారు. పోలీసులు యుద్ధ వాతావరణాన్ని సృష్టించి అడవుల్లో తిరుగుతూ గిరిజనులను భయాందోళనలకు గురిచేశారు.

పాల్వాయి పురుషోత్తమరావు యాక్షన్ తర్వాత పోలీసులు జిల్లా వ్యాప్తంగా యాంటీ నక్సల్ దళాలను రంగంలోకి దింపి గాలింపులు ముమ్మరం చేశారు. ఎన్నికల కోసం వచ్చిన పోలీసులను పట్టణాల్లో వుంచి జిల్లాలోని ఎ.ఆర్, ఎ.పి.యస్.పి., బి.యస్.యఫ్. బలగాలను గాలింపు కోసం పంపారు. కాగజ్‌నగర్ పట్టణంలో సంఘటన జరిగిన వెంటనే పట్టణం నలుమూలలా రోడ్లన్నీ మూసివేసి వాహనాలు తనిఖీ చేశారు. జిల్లా వ్యాప్తంగా రెడ్ అలర్ట్ ప్రకటించి ఆకస్మిక తనిఖీలు చేశారు.

## నిర్బంధ వ్యతిరేక ప్రచారం-ఎన్నికల బహిష్కరణ సభలు

విప్లవోద్యమాన్ని నిర్మూలించేందుకు ప్రజా ఉద్యమాలను రక్తమయం చేసేందుకు ప్రయత్నిస్తున్న సంయుక్త సమన్వయ కేంద్ర దాడిని ఓడించాలని, ఫాసిస్టు చట్టాలకు ఘోరీ కట్టాలని, మిలిటెంట్ ప్రతిఘటనోద్యమంతో ప్రభుత్వ దమనకాండను తిప్పికొట్టాలని ఎస్.జెడ్.సి. కరపత్రాన్ని విడుదల చేసింది. ఇన్‌ఫార్మర్లుగా మారి ఉద్యమానికి ద్రోహం చేస్తున్న మాజీ కార్యకర్తలను, మిత్రవర్గాల వ్యక్తులను పాలక వర్గాలతో చేతులు కలపవద్దని, ప్రజల్లో ఒకరుగా కలిసి జీవించాలని కరపత్రాన్ని, ఎన్నికల బహిష్కరణ కరపత్రాలను అన్ని జిల్లాలలో పంచారు. ఓటు వేయాలా వద్దా అని నిర్ణయించుకునే స్వేచ్ఛ ప్రతి పౌరునికి వుండాలని, ప్రస్తుత వ్యవస్థలో ఓట్లు వేయడం అంటే తమ భవిష్యత్తును భూస్వాముల, పెట్టుబడిదారుల, గూండాల చేతుల్లో పెట్టడమేనని ఓటు వేయక పోవడం కూడా ప్రజాస్వామ్యమేనని, గ్రామరాజ్య కమిటీల ద్వారా ఎన్నుకున్నప్పుడే నిజమైన ప్రజాస్వామ్యం వస్తుందని, బూటకపు ఎన్నికలు బహిష్కరించాలని పార్టీ ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రంలో జయప్రకాష్ నారాయణ్ నాయకత్వంలో ఏర్పడిన లోక్‌సత్తా ప్రజలను దోపిడీదారుల చుట్టూ తిరిగేలా చేస్తున్నదని, పోలీసుల మాదిరిగా ఓటింగ్‌లో పాల్గొనాలని కోరడం, భూస్వాములకు, బడా వ్యాపారులకు బిరుదులిస్తున్న లోక్‌సత్తాను నమ్మవద్దని కోరింది. ప్రజలను చైతన్యవంతులను చేసి, వారిని సంఘటితపరచి సాయుధులను చేయటమే బహిష్కరణ పిలుపు ఉద్దేశమని, సెప్టెంబర్ 18న ఎన్నికలు బహిష్కరించి ఉత్తర తెలంగాణా బంద్ పాటించాలని పార్టీ పిలుపునివ్వడం జరిగింది.

ఎన్నికలు బూటకమని, ఎన్నిసార్లు ఓట్లు వేసినా బతుకుల్లో వెలుగు కరువేనని ఎన్నికలకు బదులుగా గ్రామరాజ్య కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని ఎన్నికల బహిష్కరణ సభలలో పిలుపునిచ్చి ప్రచారం సాగించారు. వాల్‌పోస్టర్లు, బ్యానర్లతోపాటు అమరుల స్థూపాలు నిర్మించారు. ఓట్లకొచ్చే నాయకులను ప్రజా సమస్యలపై నిలదీస్తూ తరిమి కొట్టాలని కోరటం జరిగింది. గ్రామరాజ్య కమిటీలను ఎన్నుకునే తీరు ఆయా కమిటీలు చేసే పనులు వివరించడం జరిగింది. ఇప్పటికే ఏర్పాటైన గ్రామరాజ్య కమిటీలు సాధించిన విజయాలను సభలలో వివరించడం జరిగింది. చెరువులు, కుంటలు మరమ్మత్తులు చేసుకోవడం, ప్రజల ఆరోగ్య సంరక్షణకై వైద్య శిబిరాలు నిర్వహించడం, విద్యాభివృద్ధి కోసం పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమించటం, తరగతి గదుల నిర్మాణం, రోడ్లు నిర్మించుకోవడం, తాగునీటిని బోరింగ్‌ల ద్వారా అందించడం, సొసైటీలు నిర్వహించడం, న్యాయ కమిటీల ద్వారా ప్రజా పంచాయితీలు పరిష్కరిస్తూ గ్రామరాజ్య కమిటీలు పలు కార్యక్రమాల ద్వారా ప్రజలకు అందుబాటులో వున్నాయని ప్రచారం చేయటం జరిగింది. ప్రజల మౌలిక సమస్యలపై ఆడియో క్యాసెట్లు పంపిణీ చేసి, వీడియో క్యాసెట్లు ప్రదర్శించారు. పోలీసులు ఒత్తిడి చేస్తే ఓట్లు వేయకుండా ప్రజలను సమస్యల పరంగా, రాజకీయంగా చైతన్యపరిచే కార్యక్రమం తీసుకోవడం జరిగింది. అన్ని ఏరియాలలో క్యాంపెయిన్ బ్యాచ్‌లు, దళాలు విస్తృతంగా ఈ ఎన్నికల బహిష్కరణ సభలు నిర్వహించాయి.

ఆదిలాబాద్ జిల్లాలో కాగడాల ఊరేగింపులలో, ఎన్నికల బహిష్కరణ సభలలో వేలాదిమంది ప్రజలు పాల్గొన్నారు. అనేక గ్రామాలలో చంద్రబాబు, వై.యస్., సోనియా, వాజ్‌పాయి, జిల్లా ఎస్.పి. సుదీప్ శాండిల్య దిష్టిబొమ్మలను ఊరేగించి ఉరితీయడం జరిగింది. సిర్‌పూర్ ఏరియాలో 7 క్యాంపెయిన్ బ్యాచ్‌లు 10 రోజులపాటు 40 గ్రామాలలో విస్తృతంగా ప్రచారం చేసినాయి. 20 గ్రామాలలో 7వేల మంది ప్రజలు, కాగడాల ఊరేగింపులలో, సభలలో పాల్గొన్నారు. బోథ్ ఏరియాలో 15 గ్రామాలలో ఊరేగింపులు, సభలు జరిగాయి. మూడువేల మంది ప్రజలు పాల్గొన్నారు. 15 గ్రామాల్లో రెండు క్యాంపెయిన్ బ్యాచ్‌లు ప్రచారం చేశాయి. ఇంద్రవెల్లి ఏరియాలో అనేక గ్రామాలలో ఊరేగింపులు, సభలు జరిగాయి. 700 మంది ప్రజలు హాజరైనారు. మంగి ఏరియాలో కొన్ని గూడాలలో సభల ద్వారా ప్రచారం జరిగింది. ఒక క్యాంపెయిన్ బ్యాచ్ ఇతర గ్రామాలలో విస్తృతంగా ప్రచారం చేసింది. చెన్నూర్ ఏరియాలోని అన్ని మండలాలలో దళం, రైతుకూలీ సంఘం అలాగే క్యాంపెయిన్ బ్యాచ్‌ల ద్వారా విస్తృత ప్రచారం జరిగింది. 8వేల మంది ప్రజలు హాజరైనారు.

పోలీసులు తీవ్ర నిర్బంధం అమలు జరుపుతూ, విస్తృతంగా పార్టీ వ్యతిరేక ప్రచారం చేసినప్పటికీ జిల్లా వ్యాప్తంగా 50% మంది ఓట్లు వేయలేదు. అనేక గ్రామాలలో ముఖ్యంగా అధికార పార్టీ రిగ్గింగ్‌కు పాల్పడింది. దీనితో జిల్లాలో 64% పోలింగ్ జరిగినట్లు ప్రకటించుకున్నారు. బహిష్కరించాలని నిర్ణయించుకొన్న కొంతమంది పోలీసుల భయానికి పోలింగ్ బూత్‌లకు పోయి ఓట్లు చెల్లకుండా పాడు చేసిన వారు సైతం వున్నారు.

## తేనెపూసిన కత్తి-సిర్పూర్ ఎమ్.ఎల్.ఏ. పాల్వాయి పురుషోత్తమరావు హతం

రాష్ట్రంలో ఒకవైపు ఆర్థిక సంస్కరణల ప్రచారార్భాటం, ఇంకోవైపు పోరాడే ప్రజలపై ఉక్కుపాదాన్ని మోపిన చంద్రబాబు ప్రభుత్వం పార్టీ నాయకులను కోవర్ట్ ఆపరేషన్లలో హేయంగా హత్య చేయిస్తున్నది. ఇన్‌ఫార్మర్ వ్యవస్థను పటిష్టం చేసుకొని పెద్ద ఎత్తున

పోలీసు బలగాలతో, స్పెషల్ కమెండోలతో దళాలపై దాడులు చేసి ప్రజా గెరిల్లాలను చంపేస్తున్నది. సంయుక్త సమన్వయ కేంద్రం ఏర్పడిన తర్వాత ఒక పథకం ప్రకారం పార్టీ నిర్మూలనే లక్ష్యంగా సాగుతున్నది. ఈ దాడిని ప్రతిఘటించడానికి శత్రువు దూకుడును నిలువరించడానికై రాజకీయ నాయకుల యాక్షన్‌లో భాగంగా ఎన్నికలకు మూడురోజుల ముందు ఒక స్పెషల్‌గెరిల్లా దళం సెప్టెంబర్ 15న సిర్పూర్ ఎమ్.ఎల్.ఏ. పాల్వాయి పురుషోత్తమరావును అతని ముగ్గురు గన్‌మెన్లను కాల్చి చంపడం జరిగింది. ఈ దాడిలో రెండు ఆయుధాలను స్వాధీనం చేసుకోవడం జరిగింది.

పాల్వాయి పురోషత్తమరావు రెబ్బెన గ్రామంలో 300 ఎకరాల పట్టాగల వెలమ భూస్వామి. నిరుపేద ఆదివాసుల నుండి అక్రమంగా గుంజుకున్న భూమిని తన కుటుంబం పేరుతో కొంత, మారుపేర్లతో కొంత పట్టా చేయించుకొని ఆదివాసులను తన పంట పొలాల్లో కూలీలుగా, పాలేర్లుగా మార్చినవాడు. 1984లో గ్రామ ఉపసర్పంచ్‌గా రాజకీయాల్లోకి వచ్చి 1987 నాటికే బెజ్జూరు మండలాధ్యక్షుడైనాడు. ఇండిపెండెంట్ ఎమ్.ఎల్.ఏ.గా గెలిచి కాంగ్రెస్‌లో చేరి 1998లో తెలుగుదేశంలోకి మారినాడు. ఐ.ఎన్.టి.యు.సి. అధ్యక్షునిగా ఉండి యాజమాన్యంతో కుమ్మక్కై కార్మిక పోరాటాలకు తీరని ద్రోహం చేశాడు. సిర్పూర్ పేపర్ మిల్లు నుండి పెద్దవాగు మంచినీటిలో కలుస్తున్న కాలుష్యానికి వ్యతిరేకంగా 60 గ్రామాల ప్రజలు ఒకవైపు ఆందోళన చేస్తుండగా యాజమాన్యం దగ్గర లక్షల రూపాయల లంచం తీసుకొని ప్రజల సమస్యను నీటముంచాడు. పాల్వాయి యువసేన పేరుతో యువకులను చేరదీసి ఉద్యోగ పథకాల ఆశచూపి తన స్వార్థ ప్రయోజనాలకు పావులుగా మలుచుకొని గూండా గ్రూపు రాజకీయాలు చేసేవాడు. ఎమ్.ఎల్.ఏ. కోటా కింద వచ్చిన ఇండ్లను పేద ప్రజలకు ఇవ్వకుండా తన అనుయాయులైన గ్రామ పెద్ద మనుషులకు, పటేండ్లకు, సర్పంచ్‌లకు, పెత్తందార్లకు, మండలాధ్యక్షులకు, కాంట్రాక్టర్‌లకు రోడ్లు, చెరువుల నిర్మాణం, జన్మభూమి పనుల కాంట్రాక్ట్‌లు ఇప్పించి గ్రామాల్లో తన అంగబలాన్ని పదిలపర్చుకునేవాడు. ఈ అణుచర గణమే గ్రామాలలో పాల్వాయిని దొర అని, దేవుడని ప్రచారం చేసేవారు.

పాల్వాయి ఆకృత్యాలను ప్రశ్నించే వారిపై అన్నలకు అన్నం పెడుతున్నారని స్పెషల్ పోలీసుల చేత దాడి చేయించి అరెస్టయిన వారిని తానే విడిపించేవాడు. గ్రామాల్లో కొందరు ప్రజలను మాజీలను పేరుపేరునా పలకరించేవాడు. అరెస్టయినవారి ముందు నేను మీ మనిషనేనని మొసలి కన్నీరు కార్చేవాడు. ఇంటివద్ద భోజనాలు పెట్టించి, మీ కోసం కాగజ్‌నగర్‌లో ఆఫీసు కట్టించానని అక్కడే పండుకోవచ్చని పోలీసులొచ్చి అడిగితే పురుషోత్తమరావు మనుషులమని చెప్పండని మోసపూరితంగా మాట్లాడేవాడు. రాజకీయ లబ్ధి పొంది, ప్రాబల్యాన్ని పెంచుకోవడానికి, గిరిజన ప్రజలలో సానుభూతి సంపాదించుకోవడానికి నిరహారదీక్షలు, నిరసన ప్రదర్శనలు చేయడం, ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేయడం వంటి జిమ్మిక్కులు చేస్తుండేవాడు. ఎన్క బాపు ఎన్‌కౌంటర్‌కు నిరసనగా నిరాహార దీక్ష చేసిన తెల్లారే టి.డి.పి.లో చేరాడు. వెనుకబడిన ప్రాంతాలలో శ్రీపాదరావు, పురుషోత్తమరావు లాంటి వారు ప్రజలకు కొన్ని చిన్న చిన్న పనులు చేసి మోసగించే పాలకవర్గ ప్రతినిధులు 'నోట్లో బెల్లం పెట్టి కడుపులో కత్తి గుచ్చడం' పాల్వాయి రాజకీయాల కుటిల నీతి.

1990లో పార్టీ నాయకత్వాన పాల్వాయి భూములను ఆక్రమించిన పేదలను పోలీసుల అండతో బెదిరించి తిరిగి స్వాధీనం చేసుకున్నాడు. 1985లో పాల్వాయి అనుచరుడు వెంకటరావు ఇచ్చిన సమాచారంతో దళంపై జరిగిన దాడిలో ఒక దళ సభ్యునితో పాటు జిల్లాకమిటీ సభ్యుడు కా॥ పులి మదనన్న అమరులైనారు. '97లో దళం లుంబిని నగర్ దగ్గర వున్న సమాచారం తెలుసుకొని దాడి చేయించాడు. 1999లో ఏరియా ఆదివాసీ రైతుకూలీ సంఘం సభ్యుడు కా॥ ఎన్క బాపు మరియు మొర్లిగూడెంలో నలుగురు సంఘనాయకుల ఎన్‌కౌంటర్లకు బాధ్యుడు. క్రమంగా ప్రజాకంతకుడుగా మారుతూ విప్లవోద్యమంతో తన ప్రాణాలకు ప్రమాదం పసిగట్టిన పాల్వాయి రక్షణ కోరగా తెలుగుదేశం నేత చంద్రబాబు తన ముఖ్య అనుచరుణ్ణి కాపాడుకోవడానికి ఏకంగా ఏడుగురు గన్‌మెన్లను నియమించాడు. పాల్వాయిని చంపిన తర్వాత అతని అనుచరగణం ప్రచారం చేసిన వార్తలకే పత్రికలు ప్రాధాన్యత నిచ్చాయి కానీ ఈ తేనెపూసిన కత్తి అసలు రూపం పత్రికలలో రాలేదు. చాలామంది ప్రజలలో మాత్రం ప్రజాకంతకుడు చచ్చాడనే వుంది.

## దొబ్బలపాడు ఆంబుష్

కరీంనగర్ జిల్లా మహాముత్తారం మండలంలోని చాలా గ్రామాలలో పోలింగ్ రోజు బంద్ జరిగి ఓట్లు పోలుకాక పోవడం, పోలింగ్ బూతులమీద దాడి జరగడంతో 30-9-1999న రీపోలింగ్‌కై ఆదేశించారు. ఈ రీపోలింగ్ బందోబస్తుకు 50 మంది సాయుధ పోలీసులు కాటారం నుండి బయలుదేరారు. గండికామారం పోతున్న 15 మంది బ్యాచ్ ముందు వచ్చింది. నలుగురు పైలెట్‌లు ముందు వెళ్ళిపోయారు. మిగతా 11 మంది దొబ్బలపాడు గ్రామ సమీపంలోగల టేకులవాగు దగ్గర ట్రాక్టర్ దిగి వాగులోకి రావడంతోనే మందుపాతర ఘటనలో ఎస్.ఐ.తో సహా నలుగురు పోలీసులు చచ్చారు.

ఒకేసారి వరుసగా జరిగిన ఈ ప్రతిఘటనా చర్యలతో ఉద్యమానికి తీవ్ర నష్టాలు కలుగజేస్తున్నామని విర్రవీగుతూ వచ్చిన ప్రభుత్వం మూడవ అణచివేత క్యాంపెయిన్ మొదలైన నాటినుండి మొదటిసారిగా డిఫెన్స్‌లో పడింది. విచ్చలవిడి హత్యలు జరుపుతూ ఉద్యమాన్ని రక్తపుటేరుల్లో ముంచుతున్న సమయంలో కళ్ళెం పడ్డట్టయ్యింది. పోలీసు అధికారి ఉమేష్‌చంద్ర హత్య, రాజకీయ నాయకుని హత్య, పోలీస్‌స్టేషన్ రెయిడ్, ఆంబుష్‌లు పోలీసుల్లో కలవరాన్ని సృష్టించాయి. రాజకీయ నాయకులు పట్టణాలకు పరుగుతీశారు. అభ్యర్థుల రక్షణపట్ల దృష్టిని సారించారు. డి.జి.పి. దొర 48 గంటల్లో తెలంగాణా జిల్లాల ఎస్.పి.లతో అత్యవసర సమావేశం జరిపి పరిస్థితిని సమీక్షించవలసి వచ్చింది. ఉద్యమ ప్రాంతంలో బందోబస్తు పకడ్బందీగా నిర్వహించాలని, అధికార తెలుగుదేశం పార్టీ నాయకులను ఎక్కడపడితే అక్కడ తిరగరాదని సూచించాడు. మందుపాతరలు, క్లైమోర్‌లు పెట్టే ప్రమాదమున్నందున కచ్చారోడ్లలో, అడివి తొవ్వలలోనే కూంబింగ్ చేయాలని సూచించాడు. దీనితో రాజకీయ పార్టీల ప్రచారం రోడ్డుసైడ్ గ్రామాలకే పరిమితమై పోయింది. ❑

*(భారత విప్లవోద్యమ నాయకులను పోలీసులు పాశవికంగా హత్యలు చేయడాన్ని ఖండిస్తూ పలు మార్క్సిస్ట్ లెనినిస్ట్ పార్టీలు చేసిన ప్రకటనలను 'పీపుల్స్‌మార్చ్' పత్రిక అందుకున్నది. వాటిలో కొన్ని ప్రకటనలను ఇక్కడ పొందుపరుస్తున్నాం)*

## ఫాసిస్టు పాలకులు భారత విప్లవోద్యమ కామ్రేడ్స్‌ని పాశవికంగా చంపడంపై పిలిప్పైన్స్ కమ్యూనిస్ట్ పార్టీ, టర్కీ కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు)ల సంయుక్త ప్రకటన డిసెంబర్ 10, 1999

పిలిప్పైన్స్ కమ్యూనిస్ట్ పార్టీ, టర్కీ కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు)లు భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు-లెనినిస్టు [పీపుల్స్‌వార్]కి తమ ప్రగాఢ విచారాన్ని, సంతాపాన్ని తెలియజేస్తూ, పార్టీ నాయకులైన కామ్రేడ్స్ నల్లా ఆదిరెడ్డి (శ్యాం), ఎర్రంరెడ్డి సంతోష్‌రెడ్డి (మహేష్), శీలం నరేష్ (మురళి) మరియు ప్రజాయుద్ధ సైనికుడైన కా॥ అరుణ్‌ల పాశవిక హత్యలను తీవ్రంగా ఖండిస్తున్నాయి.

అమరులైన ఈ కామ్రేడ్స్‌ని బెంగుళూరులో అరెస్ట్ చేసి, చిత్రహింసలకు గురిచేసి, తర్వాత భారత ప్రగతి నిరోధక రాజ్య ఫాసిస్టులు వారిని పాశవికంగా చంపారనేందుకు రుజువులు చాలా స్పష్టంగానే వున్నాయి. ఈ కామ్రేడ్స్ ఒక సాయుధ ఎన్‌కౌంటర్‌లోనే చంపబడ్డారని చూపేందుకుగాను వారి మృతదేహాలను తర్వాత కరీంనగర్ జిల్లాలోని కొయ్యూరు అడవికి తరలించారు.

భారత ప్రగతి నిరోధక పాలకవర్గాలు ప్రత్యేకించి పీడిత ప్రజానీకం ప్రయోజనాల కోసం పోరాడుతున్న కమ్యూనిస్టులకు, విప్లవకారులకు వ్యతిరేకంగా చిత్రహింసలు, మాయం చేయడాలు, చట్ట విరుద్ధ హత్యలు వంటి అత్యంత కిరాతక నేరాలకు పాల్పడుతున్నారు. అయితే ప్రగతి నిరోధకుల హింసకు విప్లవకారులూ, ప్రజారాసులూ భీతిల్లడంలేదు. దోపిడీ వర్గాల అణచివేత పాలనను కూలదోసి ఒక స్వతంత్రమైన, ప్రజాస్వామికమైన, న్యాయమైన, ప్రగతిశీలమైన సమాజాన్ని నిర్మించేందుకుగాను వారు తిరిగి పోరాడుతూ అన్ని పోరాట రూపాలనూ, ప్రధానంగా సాయుధ పోరాట రూపాన్నీ ఉపయోగిస్తున్నారు.

సోషలిస్టు విప్లవానికి సన్నాహక దశగా నూతన ప్రజాస్వామిక విప్లవ పంథాలో ప్రజాయుద్ధాన్ని సాగించటం ద్వారా భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) [పీపుల్స్‌వార్]కి విశేష ప్రాముఖ్యత వుంది. పార్టీ నాయకత్వంలో భారత కార్మికవర్గం, రైతాంగం, ఇతర ప్రజానీకం విదేశీ గుత్త పెట్టుబడిదారీ విధానానికి, స్థానిక ప్రగతి నిరోధకులకు వ్యతిరేకంగా తమ జాతీయ, ప్రజాస్వామిక హక్కుల కోసం, ప్రయోజనాల కోసం వీరోచితంగా పోరాడుతున్నారు. ఈ క్రమంలో ప్రగతి నిరోధక రాజకీయ అధికారాన్ని ధ్వంసంచేసి, ప్రజాధికార అంగాలను నిర్మించడంలో మీరు గణనీయమైన విజయాలను సాధించారు.

సి.పి.ఐ. (యం-యల్) [పీపుల్స్‌వార్] కామ్రేడ్స్, ప్రజాసైన్యంలోని విప్లవయోధులు, భారత విప్లవ ప్రజలు, వారి విషాదాన్ని విప్లవకర సాహసంగా మార్చుకుని, విప్లవ పోరాటాన్ని ఒక నూతన, ఉన్నతదశకు కొనిపోతారని పిలిప్పైన్స్ కమ్యూనిస్టు పార్టీ, టర్కీ కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు)లు దృఢంగా విశ్వసిస్తున్నాయి. వారు మరింత దృఢ సంకల్పంతో, స్థిరచిత్తంతో పోరాడేలా, మరిన్ని గొప్ప విజయాలను సాధించేలా అమరులు వారికి ప్రేరణ కల్గిస్తుంటారు.

మార్క్సిజం-లెనినిజం-మావోయిజపు మహత్తర అరుణ పతాకచ్ఛాయలో పిలిప్పైన్స్ కమ్యూనిస్ట్ పార్టీ టర్కీ కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు)లు సామ్రాజ్యవాదంతో, రివిజనిజంతో, సకల ప్రగతి నిరోధక శక్తులతో పోరాడటంలోనూ, సోషలిజం ఉజ్వల భవిష్యత్తు వైపుగా, అంతిమంగా నూతన శతాబ్దంలో, నూతన సహస్రాబ్దిలో కమ్యూనిజం వైపుగా మన ప్రజలను నడిపించటంలోనూ భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) [పీపుల్స్‌వార్]తో ఐక్యమవుతాయి.

*కామ్రేడ్స్ శ్యామ్, మహేష్, మురళి, అరుణ్ అమర్ రహే !*

*నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని స్థిర సంకల్పంతో ముందుకు తీసుకు పోదాం !!*

*భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) పీపుల్స్‌వార్ వర్థిల్లాలి !!!*

| | |
|---|---|
| **కేంద్రకమిటీ** | **కేంద్రకమిటీ** |
| **పిలిప్పైన్స్ కమ్యూనిస్ట్ పార్టీ** | **టర్కీ కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు)** |

**(పిలిప్పైన్స్ కమ్యూనిస్ట్ పార్టీ, పిలిప్పైన్స్ జాతీయ ప్రజాస్వామిక ఫ్రంట్‌లు ఉమ్మడిగా ఇదే విధమైన ప్రకటన పంపాయి.)**

## ఎమ్.సి.సి. పత్రికా ప్రకటన

*కొయ్యూరు బూటకపు ఎన్‌కౌంటర్‌పై స్పందిస్తూ మావోయిస్ట్ కమ్యూనిస్ట్ సెంటర్ ప్రకటన పంపింది. పీపుల్స్‌వార్ నాయకుల అమరత్వం భారత విప్లవోద్యమానికే తీరని నష్టం అనీ, ఈ హత్యలకు ప్రతీకారం తీర్చుకుంటామని యం.సి.సి. ప్రకటించింది. ప్రకటన అందనందున పూర్తి పాఠాన్ని ప్రచురించలేకపోతున్నాం.*

## న్యూజీలాండ్ వర్కర్స్ పార్టీ ప్రకటన

***సి.పి.ఐ. (యం-యల్) [పీపుల్స్‌వార్]కి,***

*ప్రియమైన కామ్రేడ్స్!*

డిసెంబర్ 1న ఆంధ్ర పోలీసులు మీ ముగ్గురు కేంద్రకమిటీ సభ్యులు కా॥ నల్లా ఆదిరెడ్డి (శ్యాం), కా॥ సంతోష్‌రెడ్డి (మహేష్), కా॥ శీలం నరేష్ (మురళి) లను కిరాతకంగా హింసించి, చంపినట్లుగా కొద్దిరోజుల క్రితమే విన్న వార్త మమ్మల్ని మహా విషాదంలో, ఆగ్రహావేశంతో ముంచెత్తింది.

పాలకవర్గాలు కుళ్ళిపోయిన తమ దోపిడీ వ్యవస్థను నిలబెట్టుకునేందుకు తన్నుకులాడుతున్నందువల్ల వారి ఫాసిస్ట్ స్వభావం రానురానూ పెరుగుతున్నదని రుజువవుతున్నది. మీ పార్టీ నాయకత్వం, కేడర్ల అద్భుత సాహసకృత్యాలు మా పార్టీకి ఉత్తేజాన్ని కల్గిస్తున్నాయి. ఇతర పార్టీలతో మా కాంటాక్టుల, సంబంధాల క్రమంలో భారతదేశంలో పీపుల్స్‌వార్ అభివృద్ధిపై పలువురిలో శ్రద్ధాసక్తులు పెరుగుతుండటాన్ని మేం చూస్తున్నాం. పీపుల్స్‌వార్‌కి సంబంధించిన వార్తలన్నింటినీ దాదాపుగా బూర్జువా పత్రికా సాధనాలు తొక్కి పెడుతున్నాయి. అందువల్ల 'నిప్పురవ్వ' (ది స్పార్క్), 'పీపుల్స్‌మార్చ్' పత్రిక నుండి తిరిగి ప్రచురిస్తున్న రచనలే న్యూజిలాండ్ ప్రజలకు ఏకైక సమాచార ఆధారంగా వుంటున్నాయి. ఈ సంఘటనలు, పరిణామాలను ప్రచారంలోకి తేవడానికి మాకు చేతనైనంత వరకు కృషి చేస్తాం. భారతదేశంలోని అధికారులకు ఈ సంఘటనను ఖండిస్తూ, వుత్తరాలు పంపుతాము.

ఈ ముగ్గురి హత్య మీకు గొప్ప నష్టమని మాకు తెలుసు. కాని పోరాటంలో భాగమయ్యేందుకు ఇతరులు ముందడుగు వేస్తారనడంలో మాకే సందేహం లేదు.

హిమాలయా పర్వతాలకంటే బరువైన ఈ మేటి విప్లవ నాయకుల మృతికి మేం అంజలి ఘటిస్తున్నాం.

**సహానుభూతితో, విప్లవాభివందనాలతో,**

**డాప్నె వైట్‌మోర్,**

**న్యూజిలాండ్ వర్కర్స్ పార్టీ కార్య నిర్వాహక ప్రతినిధి.**

## రిమ్ (RIM) ప్రకటన

సి.పి.ఐ. (యం-యల్) [పీపుల్స్‌వార్] కేంద్రకమిటీకి;

ప్రియమైన కామ్రేడ్స్

కామ్రేడ్స్ నల్లా ఆదిరెడ్డి (శ్యామ్), ఎర్రంరెడ్డి సంతోష్‌రెడ్డి (మహేష్), శీలం నరేష్ (మురళి)లను మీరు భారత ప్రతీఘాతుక పాలక వర్గాల చేతుల్లో కోల్పోవటం విని మా కమిటీ మహా విషాదంతో మునిగి పోయింది. మీ పార్టీ కేంద్రకమిటీ సభ్యులుగా ఈ ముగ్గురు కామ్రేడ్స్ భారత కమ్యూనిస్ట్ పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) [పీపుల్స్‌వార్] పురోగమనంలో నిర్ణయాత్మక పాత్ర వహించారు. వారిని కోల్పోవడమన్నది భారతదేశంలోనే కాక ప్రపంచమంతటా నిజమైన కమ్యూనిస్టులను, విప్లవకారులను తీవ్రంగా బాధించింది.

తమ మృతదేహాలను పడవేసిన చోటుకు వందలాది కిలోమీటర్ల దూరంలో శత్రువు చేత చిక్కిన తర్వాత జరిగిన ఈ కామ్రేడ్స్ హత్య గత కొద్ది సంవత్సరాలుగా జరిగిన సి.పి.ఐ. (యం-యల్) [పీపుల్స్‌వార్]కి చెందిన ఇతర నాయకుల, సభ్యుల, మద్దతుదారుల హత్యలను మించిపోయింది. అనేక ఇతర సందర్భాలలాగే ఈ సరికొత్త సందర్భంలో కూడా ప్రభుత్వాధికారులు నిరాయుధ బందీలపై పిరికితనంతో గావించిన హత్యలను ''ఎన్‌కౌంటర్ హత్యలు''గా మభ్యపెట్టడానికి ప్రయత్నించారు. భారతదేశంలోనూ, విదేశాల్లోనూ విప్లవకర, ప్రగతిశీల శక్తులు ఈ పిరికితనపు దొంగదెబ్బ చర్యను ఎండగడుతూ ఖండిస్తున్నారు.

మీరు భారతదేశంలోని విశాల ప్రాంతాల్లోని కోట్లాది మంది పీడిత ప్రజానీకాన్ని మేల్కొల్పారు. ''తిరగబడటం న్యాయమైనది'' అనీ, సామ్రాజ్యవాదం, భూస్వామ్య విధానం, నిరంకుశ పెట్టుబడిదారీ విధానమనే బలమైన శత్రువులను ఓడించడం ప్రజాయుద్ధం ద్వారా మాత్రమే సాధ్యమనీ మీరు చాటి చెప్పారు. మీ పార్టీ మార్క్స్, లెనిన్, మావోలు వృద్ధి చేసిన కార్మికవర్గ సిద్ధాంతంపైనే ఆధారపడుతూ వచ్చింది. అట్లే, కమ్యూనిజాన్నే లక్ష్యంగా కల్గిన ప్రపంచ కార్మిక వర్గ విప్లవంలో భాగంగా భారతదేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని కొనసాగించటానికి మీ పార్టీ పోరాడుతోంది. ఈ కారణాల వల్లే ప్రతీఘాతుక భారతీయ రాజ్య వ్యవస్థ సి.పి.ఐ. (యం-యల్) [పీపుల్స్‌వార్]కి వ్యతిరేకంగా విషపూరిత దాడులను ప్రారంభిస్తోంది. అయితే ఎంతటి భీభత్సం కాని, పాశవికత కాని అభివృద్ధి నిరోధక వర్గాలను వాటి పతనం నుండి కాపాడలేదు.

కామ్రేడ్స్, ఈ పెను నష్టాలున్నప్పటికీ మీ పార్టీ ఈ విషాదాన్ని శక్తిగా మార్చుకుని మీ దేశంలోని కార్మికవర్గం, పీడిత ప్రజారాసుల లక్ష్యాన్ని మరింతగా ముందుకు తీసుకు పోతారని మా అంతర్జాతీయ విప్లవోద్యమ కమిటీ (రిమ్), మరియు అంతర్జాతీయ విప్లవోద్యమంలోని పార్టీలూ, సంస్థలూ విశ్వసిస్తున్నాయి. కామ్రేడ్స్ ఆదిరెడ్డి, సంతోష్‌రెడ్డి, నరేష్‌ల ప్రాణత్యాగాలకు ప్రగతి నిరోధక పాలకవర్గాలను అంతిమంగా ఓడించటం ద్వారానే ప్రతీకారం తీర్చుకోబడుతుంది.

5-1-2000 **అంతర్జాతీయ విప్లవోద్యమ కమిటీ**

# బెల్జియం వర్కర్స్ పార్టీ కొయ్యూరు బూటకపు ఎన్‌కౌంటర్‌ను నిరసిస్తూ భారత రాష్ట్రపతి కె.ఆర్.నారాయణన్‌కి రాసిన లేఖ

**భారత రాష్ట్రపతికి,**

ప్రజా ఉద్యమాలకు పేరుగాంచిన నాయకుడిగా అందరికీ తెలిసిన సి.పి.ఐ. (యం-యల్) [పీపుల్స్‌వార్] పార్టీకి చెందిన ముగ్గురు నేతలు 1999 డిసెంబర్ 2న ఒకానొక కోవర్ట్ ఆపరేషన్‌లో కిరాతకంగా చంపబడ్డారని వార్తలను బట్టి బెల్జియం వర్కర్స్ పార్టీకి తెలిసింది. వారు శ్యామ్ (నల్లా ఆదిరెడ్డి), మహేష్ (సంతోష్‌రెడ్డి), మురళి (శీలం నరేష్)లు. ఈ ముగ్గురు నేతలతో పాటు చంపబడిన నాలుగో వ్యక్తి వివరాలు తెలియటం లేదు. ఇంతవరకూ మాకు తెలిసిందాన్ని బట్టి ఈ రాజకీయ హత్యలను నిర్వహించిన ప్రధాన పాత్రధారి అయిన ఆంధ్రప్రదేశ్ డి.జి.పి. హెచ్.జె.దొర ఆ నాలుగో వ్యక్తి పేరును ఇప్పటికీ (డిసెంబర్ 7 నాటికి) ప్రకటించలేదు.

డిసెంబర్ 2న బుధవారం నాడు ఆంధ్రప్రదేశ్‌లోని కరీంనగర్ జిల్లా, తాడిచెర్ల మండలంలోని కొయ్యూరు అడవిలో పోలీసులతో హోరాహోరీగా జరిగిన ఒక ఎన్‌కౌంటర్‌లో ఈ ముగ్గురు నేతలూ చంపబడ్డారని డి.జి.పి. ప్రకటించాడు. ఇందుకు భిన్నంగా డిసెంబర్ 1వ తేదీ రాత్రి ఒక ఇంటెలిజెన్స్ అధికార్ల బృందం ఈ ముగ్గురు నాయకులనీ బెంగుళూరులోని ఒక ఇంటినుండి పట్టుకునిపోయి చంపివేసి మరునాడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ హెలికాప్టర్‌లో వారిని రహస్యంగా కరీంనగర్ అటవీ ప్రాంతంలోకి తరలించినట్లుగా చెప్పబడుతోంది.

భారతదేశ విప్లవోద్యమానికి చెందిన ముఖ్యమైన రాజకీయ నాయకులను చంపివేసిన ఈ పిరికి చర్య సి.పి.ఐ. (యం-యల్) [పీపుల్స్‌వార్] ప్రత్యామ్నాయ రాజకీయాలతో భారత పాలకవర్గాలు భయపడి పోయాయన్న విషయాన్ని తెలుపుతోంది.

వార్తలనుబట్టి, కేంద్ర హోంమంత్రి ఎల్.కె. అద్వాని, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చందబాబునాయుడులు ఆంధ్రప్రదేశ్ డి.జి.పి. హెచ్.జె.దొరతో కుమ్మక్కై చేసిన కుట్రపూరిత చర్య ద్వారా సి.పి.ఐ. (యం-యల్) [పీపుల్స్‌వార్]కి చెందిన ఈ ముగ్గురు నాయకులూ చంపబడ్డారని తెలుస్తోంది.

ప్రజా వుద్యమాల నేతలను చంపడం వుద్యమాన్ని అంతమొందించలేదు.

సి.పి.ఐ. (యం-యల్) [పీపుల్స్‌వార్] నేతల హత్యను బెల్జియం వర్కర్స్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది.

ఈ నికృష్టమైన హత్యాకాండపై విచారణ జరపాలని మేం డిమాండ్ చేస్తున్నాం.

భారతదేశంలో మీ ప్రభుత్వ పాలనలో జరిపిన ఈ ఫాసిస్ట్ చర్యను గురించి మేం మా బెల్జియన్ ప్రజానీకానికి తెలియజేస్తాము.

**జీన్ పెస్టియు,**
**అంతర్జాతీయ విభాగం,**
**బెల్జియం వర్కర్స్ పార్టీ wpb@wpb.be**

# ఆదిలాబాద్ జిల్లాలో ఆదివాసీ మహిళలకు భూమి పట్టాల పంపిణీ

అడవిమీద ఆదివాసులదే హక్కని, దున్నేవారికి భూమి దక్కాలని, అటవీ భూములకు, కొత్త భూములకు పట్టాలివ్వాలని ఎన్నో ఏండ్ల నుండి ఆదివాసీ ప్రజలు ప్రభుత్వంతో పోరాటం చేస్తూ వస్తున్నారు. ఊరేగింపులు, ధర్నాలు, రాస్తారోకోలు చేసినా అనేక ప్రాణత్యాగాలు చేసినా ప్రభుత్వం పట్టించుకున్నదిలేదు. పోలీసులను ఉసిగొలిపి పోరాడే ప్రజలను రాజ్యం అణిచివేస్తున్నది. దీనికి వ్యతిరేకంగా ప్రజలకు తమ హక్కులను సాధించుకోవటానికి తమకు నూతన రాజ్యం అవసరమని భావించారు. అక్కడక్కడ గ్రామరాజ్య కమిటీలు ఏర్పడి ప్రజలకు భూమి పట్టాలు పంపిణీ చేస్తున్నవి. దీని ప్రభావంతో అనేక గ్రామాలలో ఆదివాసులు తమ గ్రామాలలోకి కూడా పార్టీ రావాలని, గ్రామరాజ్య కమిటీలను ఏర్పరచుకుంటామని ఉత్సాహంగా కదులుతున్నారు.

ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి ఏరియాలో అనేక గ్రామాలలో గ్రామరాజ్య కమిటీలు స్త్రీ, పురుషులకు రెండున్నర ఎకరాల చొప్పున భూమి పట్టాలు పంపిణీ చేస్తున్నాయి. గ్రామరాజ్య కమిటీలు లేనిచోట సంఘాల, సంఘాలు కమిటీలు లేనిచోట సంఘాలు, సంఘాలు లేనిచోట స్క్వాడ్ ఏరియా కమిటీలు పట్టాలు పంపిణీ చేస్తున్నాయి. పట్టాలపై ఒక ఫోటో, రికార్డ్ బుక్‌లో ఒక ఫోటో జతచేసి సంతకాలు నమోదు చేస్తున్నారు.

ఇంతవరకు ఆస్తిలో ఎలాంటి హక్కులేక పరాధీనంగా జీవించిన మహిళలు పురుషులతో సమానంగా తమ పేరున భూమిపై హక్కు కల్పించబడుతుండటంతో ఎంతో సంతోషంగా పట్టాలు తీసుకుంటున్నారు. స్త్రీలను పట్టాలు తీసుకుంటున్నపుడు గమనిస్తే వారిలో ఎంతో ఆత్మవిశ్వాసం పెరుగుతున్నట్లు కన్పిస్తున్నది. కొన్ని గ్రామాలలో పురుషులకంటే స్త్రీలే ఎక్కువగా ఉత్సాహాన్ని కనబరుస్తున్నారు. ఈ విధానాన్ని సమర్థిస్తున్నారు. వారిలో వారు రెండున్నర ఎకరాలు సరిపోవని ఐదు ఎకరాలు కావాలని మాట్లాడుకుంటున్నారు. ఈ విషయంలో గ్రామరాజ్య కమిటీ (జి.ఆర్.సి.)లు, పార్టీ వారికి అర్థం చేయించటం జరుగుతున్నది. ఎక్కువలో ఎక్కువ 3 ఎకరాలు పంపిణీ జరుగుతుందని, మెట్ట భూములను తరిభూములుగా మార్చుకోవాలని ఇందుకుగాను ఒక ప్రణాళికా బద్ధంగా తమ శక్తిమేరకు ఇతర గ్రామ ప్రజల సహకారంతో చిన్న చిన్న ఒర్రెలను కలిపి కుంటలు నిర్మించుకోవాలని, అందుకవసరమైన వస్తు సామాగ్రిని సమీకరించుకోవాలని చెప్పడం జరుగుతున్నది. రెండున్నర లేదా మూడు ఎకరాల పంపిణీ ప్రస్తుతం అడివి కొడుతున్న గ్రామాలకే పరిమితం చేయాలని, గతంలో కొట్టుకొని సాగు చేసుకుంటున్న వారి భూములను తీసి ఇతరులకు ఇవ్వవద్దని నిర్ణయించారు. అదే సమయంలో పెద్ద మొత్తంలో భూమి ఉంచుకొని పాలేర్లను పెట్టుకొని ధనికరైతు స్థాయిలో వున్నవారి విషయంలో ప్రజల అభిప్రాయం మేరకు కొంత భూమిని తీసి భూమిలేని వారికి పంచాలని నిర్ణయించారు. ❑

# గ్రామరాజ్య కమిటీ సభ్యురాలితో ఇంటర్వ్యూ

ఉత్తర తెలంగాణాలో పోలీసు ఎన్‌కౌంటర్‌లో మరణించిన కామ్రేడ్ భార్య గ్రామరాజ్య కమిటీ సభ్యురాలిగా పనిచేస్తున్నదని తెలిసి మమ్మల్ని అది ఎంతో ఉత్తేజ పరిచింది. ఏ కాలేజీలో చదవక పోయినా, ప్రపంచ రాజకీయాలు తెలువకున్నా బతుకు పోరులో వర్గపోరు బాటనెంచుకొని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతున్న ఆ మహిళా కామ్రేడ్‌తో ఇంటర్వ్యూ....

**ప్రశ్న:** నీ భర్తను పోలీసులు ఎన్‌కౌంటర్ చేసింద్రుకదా? దాని గురించి నువ్వేం అనుకుంటున్నావ్? మంచిపని చేసిండా-చెడ్డపని చేసిండా?

**జవాబు:** నా భర్త వూరోల్లనొకటి జెయ్య పనిజేసిండు. దొరొల్ల కింద బాంచె బతుకొద్దని భూమి కావాలని తెగబడి కొట్లాడిండు. చంపింద్రు. గాయన మంచే చేసిండు. మా అసోంటి గరీబోల్ల కోసం కొట్లాడి సచ్చిపోయిండని అనుకుంటున్నా.

**ప్రశ్న:** నీ భర్తను చంపినా నువ్వెందుకు పనిచేయాలనుకుంటున్నావ్?

**జవాబు:** మాకు అంతకు ముందు ఒక ఎకరం భూముండె. గాయన పోయినంక సంఘపోల్లు ఇంకో ఎకరం భూమిచ్చింద్రు. నా భూమిని ఊరోల్లే దున్నిచ్చింద్రు. నా పిల్లగాండ్ల హాస్టల్లేసింద్రు. నన్ను ఆదుకుంటుంద్రు. పాత ముసలోల్లు మాత్రం మొగుడు బోయినా ఇంకా పొరకల్ల పొన్న తిరుగుతాంది. గాపొలగాండ్ల బట్టుకొని బతుకరాదా? ఇంకోన్ని చేసుకుంటే కాదా అంటాండ్లు. నా లెంక బతికేటోల్ల కోసం నేనింకా పనిచేత్తా!

**ప్రశ్న:** నీమీద నిర్బంధం వస్తే ఏం చేస్తావు?

జవాబు: గింతకు ముందు లేందైతే గిప్పుడు పోయేదేంది. గాయనున్నప్పుడే ఇంట్లో దాసుకున్నావనీ సెప్పుతలేదనీ బాలింతనైనా గొట్టింద్రు. గాజులు పలగొట్టింద్రు. నిర్బంధమైతే గప్పుడు లేందిలేదు. గిప్పుడు వోయేదిలేదు. తెగబడితేనన్న మా బతుకులు మారుతయ్. గాభూములు దక్కుతయ్.

**ప్రశ్న:** ప్రభుత్వం ఐ.టి.డి.ఎ.ల వల్ల మీరు ఏం ప్రయోజనం పొందారు?

**జవాబు:** గాసర్కారోల్లు ఏంజేయలే. గీ ఐ.టి.డి.ఎ. ఏం జేయలే. గాపోలీసోల్ల తోలి తన్నించుడు తప్ప! మాకేం బెట్టలే. మాకు భూమి కావాలంటే పోలీసోల్లతో తన్నత్తాంద్రు. జైళ్ళ బెడ్తాండ్లు. కాల్చి చంపుతాండ్లు. గీసర్కారు, దొరలు అంతా యాకమే. ఐ.టి.డి.ఎ. మాకేం జేస్తలేదు.

**ప్రశ్న:** జి.ఆర్.సి.లో వుండి పనిచేయాలని ఎందుకు అనుకున్నవ్? దీంట్లో వుండడం వల్ల నీకు ఉపయోగమేంది?

**జవాబు:** మమ్ముల జి.ఆర్.సి.ల ఊరోల్లు నిలబెట్టి ఆరు నెల్లయ్యింది. ఇదీ మా ప్రభుత్వం. మా ఊర్లె మంచిగ జెయ్యాలె అనుకున్న భూములు దున్నటానికి ఎడ్లు ఇప్పించినం. మంచిగా పసల్ దీయ్యాన్ననీ ఇంజన్లిద్దామనుకుంటున్నాం. మా పిల్లగండ్లకు బడినడిపియ్యాలనుకున్నాం. మా ఊర్ల దవఖాన నడిపియ్యాలనుకుంటున్నం. గివ్వన్నీ మేము కద్దుగుండి జేద్దామనుకుంటున్నం. గిదంతా మా మంచికే గదా! ఊరోల్లందరి లాభమే నాకు మంచి అనుకుంటున్నా. మేము తెగబడితే దేన్నయినా సాధిస్తాం. గీదోపిడీ లేకుండ జేస్తం.

**ప్రశ్న:** అక్క నీవు మీ కమిటీ సమావేశంలో అన్ని విషయాలు మాట్లాడలేదు ఎందుకని?

**జవాబు:** నేను మహిళా సంఘంలో నా భర్త వున్నకాన్నుంచి పనిజేత్తన్న. ఆడోల్లమీద మొగోల్ల పెత్తనం వుండొద్దనీ అందరు సమానం గావాలని కొట్లాడ్తన్నం. కానీ జి.ఆర్.సి.లో నన్ను వాళ్ల మామీద దొరొల్ల, సర్కారు దోపిడీ పోవన్ననీ, మా పేదోళ్ల రాజ్యం రావాన్ననీ కొట్లాడుతున్నం. కానీ జి.ఆర్.సి.లో నన్ను వాళ్లు మాట్లాడనియ్యరు. ఊల్లె పెద్ద మనుషులు గీ ఆడోళ్ళు ఏం జేస్తరనీ అంటరు. ముప్పయి జుట్లు కూడుతయ్‌కానీ మూడు సిగలు కలవవని అంటంద్రు. వాళ్లు పంచాయితీలు చేసేకాడ మేం పోయిజేస్తే గీ ఆడోళ్ళ సంఘపోళ్ళకు ఏం తెలుసు అనీ మమ్మల్ని సిన్నసూపు చూస్తాంద్రు. మీరున్నప్పుడు అక్కరావాలెననీ అంటాండ్లు కానీ అటెన్క మా కమిటోల్లు కూడ ఊరోల్ల తీర్గనే జేత్తరు. మేం మాట్లాడ్తన్నాం కానీ మీరు కూడా ఆడోళ్ళ పట్ల సిన్నసూపు వుండొద్దని చెప్పాలె. ❑

---

'' మతం తీసుకోండి, లేదా స్త్రీలకు హక్కులు నిరాకరించడం తీసుకోండి, లేదా రష్యనేతర జాతుల పీడనను అసమానతను తీసుకోండి ఇవన్నీ బూర్జువా ప్రజాస్వామ్య విప్లవానికి సంబంధించిన సమస్యలు...ప్రపంచంలోని అత్యంత పురోగామి దేశాలలో **ఒక్కగానొక్క** దాంట్లో కూడా ఈ సమస్యలు **బూర్జువా ప్రజాతంత్ర** పద్ధతుల్లో **సంపూర్ణంగా** పరిష్కారం కాలేదు. మనదేశంలో అక్టోబర్ విప్లవం చేసిన శాసనాలతో ఇవి సంపూర్ణంగా పరిష్కారమైనాయి. మతంతో మనం మనస్పూర్తిగా పోరాడినాం, పోరాడుతున్నాం. రష్యనేతర జాతుల**కన్నింటికి వాటి స్వంత** రిపబ్లిక్‌లు కాని స్వపరిపాలక ప్రాంతాలుగానీ ఇచ్చినాం. రష్యాలో మనకు స్త్రీల హక్కులకు సంబంధించి హీనమైన, నీచమైన, దారుణమైన నిరాకరణ అనేది, లేదా స్త్రీ పురుషుల అసమానత్వం అనేది మధ్యయుగతత్వాల ఆ అసహ్యమైన అవశేషం ఇక ఎంతమాత్రమూ లేదు. మినహాయింపు లేకుండా ప్రతి దేశంలోనూ దురాశాపూరితులైన బూర్జువాలు, మందబుద్ధులు, భయగ్రస్థులు అయిన పెటీబూర్జువాలు ఈ అవశేషానికి మెరుగులు దిద్దుతున్నారు.

ఇవన్నీ కలిసి బూర్జువా ప్రజాతంత్ర విప్లవం యొక్క సారం అవుతాయి. 150 ఏళ్ళ క్రితమూ, 250 ఏళ్ళ క్రితమూ ఈ విప్లవ (లేదా, ఒకే సాధారణ రకంలోని ప్రతి జాతీయ విప్లవాన్ని లెక్కలోకి తీసుకుంటే, ఆ విప్లవాల యొక్క) ప్రగతిశీల నాయకులు మధ్యయుగ అధిక సౌకర్యాలను స్త్రీ, పురుషుల అసమానతను, ఏదో ఒక మతానికి (లేదా **''మతభావాల''**కు, మొత్తంమీద ''మతవ్యవస్థ''కు) లభించే ప్రభుత్వ సౌకర్యాలను, జాతీయ అసమానతను మానవజాతికి తొలగిస్తామని వాగ్దానం చేశారు. వాళ్ళు వాగ్దానం చేసినారు కానీ తమ వాగ్దానాలు నిలుపుకోలేదు. వాళ్ళు నిలుపుకోలేక పోయినారు; ఎందుకంటే వాళ్ళకు వాళ్ళ ''గౌరవం'' అడ్డుపడింది–''పవిత్రమైన సొంత ఆస్థి'' పట్ల గౌరవం. ఈ పాపిష్టి మధ్యయుగ తత్వంపట్ల ''పవిత్రమైన ఆస్థి''పట్ల ఈ పాపిష్టి ''గౌరవం'' మన కార్మికవర్గానికి సోకలేదు.

**–లెనిన్ ''మహిళల ఉద్ధరణ'' నుండి**

# వందలాది పసిపిల్లల మెదడువాపు వ్యాధి మరణాలకు ప్రభుత్వానిదే పూర్తి బాధ్యత!

మొన్నటిదాకా రాష్ట్రంలో అటు ఆదిలాబాద్, ఇటు విశాఖ ఏజెన్సీలో 'మలేరియా' బారినపడి వందలాదిమంది గిరిజనులు 'దుర్మరణం' పాలుకాగా, నవంబర్ నెలలో అది బాల, బాలికల వంతైంది. మెదడువాపు వ్యాధి సోకి ముక్కుపచ్చలారని పసిపిల్లలు, 'భావిభాగ్యవిధ్యాతలు' 500 మందికి పైగా మరణించారు. అనేకమంది శాశ్వత అంగ వికలురు అయ్యారు. రాష్ట్రంలోని చంద్రబాబు హైటెక్ పాలనకు అమెరికా అధ్యక్షుడితో సహా మురిసి కితాబులిస్తుంటే, చంద్రబాబు ఆ పొగడ్తలకు తబ్బిబ్బవుతూ, మరింతగా తన పాలన గొప్పతనాన్ని గురించి తనకనుకూలమైన ప్రచార మాధ్యమాల ద్వారా ఊదరగొట్టి ప్రచారం చేయించుకుంటుంటే, రాష్ట్రవ్యాప్తంగా పది పదిహేను సంవత్సరాల లోపు వయసు కలిగిన పిల్లలున్న తల్లిదండ్రులు కంటిమీద కునుకురాక, ప్రాణాలు చిక్కపట్టుకుని గడిపారు. పిల్లలకు ఏ చిన్న నలత ఏర్పడినా, అది 'మెదడువాపే'మోనని భయపడ్డారు.

మలేరియా అయినా, మెదడు వాపు వ్యాధి అయినా దోమకాటు వలనే వస్తాయి. మెదడువాపు వ్యాధి కి కారణమయ్యే వైరస్ కొంగలు, పక్షులు, పందులలో వుంటుంది. వాటిని కుట్టిన దోమలు తిరిగి మనుషుల్ని కుడ్తే, అలా వైరస్ దోమకాటు ద్వారా మానవ శరీరంలోకి ప్రవేశించి వ్యాధికారకమవుతుంది. అయితే, ఆ వైరస్‌ను తట్టుకునే శక్తి, 15 ఏళ్ళలోపు బాల బాలికల్లో తక్కువగా వుంటుంది. అందువలన ఆ వ్యాధి కి ఎక్కువగా వాళ్ళే గురవుతారు. ప్రధానంగా మెదడువాపు వ్యాధి వర్షాకాలంలో, అదీ సెప్టెంబర్-అక్టోబర్-నవంబర్ మాసాల్లోనే ఎక్కువగా వస్తుంది. 1979 నుండి మన రాష్ట్రంలో క్రమం తప్పకుండా ప్రతి ఏడాదీ వస్తూ, పసిపిల్లల ప్రాణాలను కబళించుకు పోతూనే వుంది. ఈ విషయం రాష్ట్ర ప్రభుత్వానికి తెలియనిది కాదు. అయితే, రాష్ట్రంలో మెదడువాపు వ్యాధి పేరుతో పిల్లల ప్రాణాలు హరించుక పోవటం మొదలుపెట్టి ప్రజల్లో భయాందోళనలు చెలరేగగా, అప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో హంగామా చేయటం మొదలుపెట్టింది. ఒక ప్రక్క కలెక్టర్‌లను, మున్సిపల్ కమీషనర్లను ముందు జాగ్రత్త చర్యలు ఎందుకు తీసుకోలేదని నిలదీస్తూ, ఇంకో ప్రక్క పందులే వ్యాధికి కారణం అని, అందువలన రాష్ట్రవ్యాప్తంగా పందులను చంపేయాలని ఆర్డర్‌మీద ఆర్డర్ జారీ చేస్తూ, టెలీ కాన్ఫరెన్స్‌ల్లో, పత్రికా ప్రకటనల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి మెదడువాపు వ్యాధిపై ప్రకటనల హైటెక్ యుద్ధం మొదలు పెట్టాడు.

## ప్రజల సంక్షేమం పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యమే వ్యాధికి ప్రధాన కారణం!

అంతర్జాతీయ కాబూలీ వాలాలైన ప్రపంచబ్యాంకు ఆజ్ఞల మేరకు రాష్ట్రాన్ని పరిపాలిస్తున్న చంద్రబాబు, ప్రపంచబ్యాంక్ ఆజ్ఞలకు లోబడి సంస్కరణల పేరుతో అనేక సంక్షేమ పథకాలకు కోత విధించిన విషయం తెలిసిందే! కోత విధించటంతో పాటు సర్వీసు రంగాలను (విద్య, వైద్యం) కూడా ప్రైవేట్‌పరం చేయాలన్నది ప్రపంచబ్యాంక్ షరతు.

హైదరాబాద్ మొదలుకొని మారుమూల పల్లెటూరు వరకు రాష్ట్రంలో ఏమున్నా లేకపోయినా, దోమలకు కొదవలేదు. మురుగునీరు పోయే సౌకర్యాలు (మురుగునీటి సౌకర్యం) లేవు; ఉన్నా అవి నామమాత్రంగా ఉన్నాయి. మురికి కాల్వలు, మురికి గుంటలు దోమల ఉత్పత్తి కేంద్రాలుగా విలసిల్లుతూ, ప్రజల్ని అనారోగ్యం పాలు చేస్తున్నాయి. కేవలం అడవిలోనే కాకుండా, ఈ ఊరూ, ఆ పట్టణం అని లేకుండా రాష్ట్రంలో మలేరియా వ్యాధి లేని ప్రాంతమే లేదు. మలేరియాకైనా, పసిపిల్లల ప్రాణాలు తీస్తున్న మెదడువాపు వ్యాధికైనా దోమలే కీలకం.

మెదడువాపు వ్యాధి వస్తేనో, మలేరియా ప్రబలితేనో ఆ వ్యాధి నివారణకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతున్నామంటూ హంగామా చేస్తున్న ప్రభుత్వం వ్యాధికి మూల కారకమైన దోమల్ని లేకుండా చేయటానికి ఏం చర్యలు చేపడుతున్నది అన్నది చూసినపుడు శూన్యం అనే చెప్పాలి. ప్రజల సంక్షేమంపట్ల, ఆరోగ్యంపట్ల బాధ్యత కలిగిన ప్రభుత్వమేదైనా, వ్యాధికారకమైన దోమల్ని, అవి ఉత్పత్తి అయ్యే పరిస్థితిని లేకుండా చేయాలి. ప్రపంచ ఆరోగ్య సంస్థ పథకంలో భాగంగా డి.డి.టి. మొదలైనవి ఉచితంగా వచ్చినంతకాలం దోమల నివారణకు, మలేరియా నిర్మూలనకు 'విశేషంగా' కృషి చేసిన ప్రభుత్వం ఆ ఉచిత పథకం ఎప్పుడైతే ఆగిపోయిందో, అప్పుడే ఆపేసింది. ఇక ఇప్పుడు, అంతర్జాతీయ కాబూలీ వాలాలైన ప్రపంచబ్యాంక్ ఆజ్ఞల మేరకు రాష్ట్రాన్ని పరిపాలిస్తున్న చంద్రబాబు, ప్రపంచబ్యాంక్ ఆజ్ఞలకి లోబడి సంస్కరణల పేరుతో అనేక సంక్షేమ పథకాలకు కోత విధించిన విషయం తెలిసిందే! కోత విధించటంతో పాటు సర్వీసు రంగాలను (విద్య, వైద్యం) కూడా ప్రైవేట్‌పరం చేయాలన్న ప్రపంచబ్యాంక్ విషమ షరతులకనుగుణంగానే చంద్రబాబు పాలన కొనసాగిస్తున్నది. దాని వలన అనేక రకాల వ్యాధులు ప్రబలిపోయే పరిస్థితిని, ప్రజల ప్రాణాలు పోయే పరిస్థితిని ప్రభుత్వమే కల్పిస్తున్నది, పెంచి పోషిస్తున్నది. అందువలన, రాష్ట్రంలో మెదడువాపు వ్యాధికాని, ఇతరత్రా ఇటువంటి వ్యాధులు ప్రబలటానికి బాధ్యత పడాల్సింది రాష్ట్ర ప్రభుత్వమే. కానీ, నేడు జరుగుతున్న నాటకమంతా తన 'నేరస్థ' బాధ్యత నుండి తప్పించుకుని, అది ఎవరెవరిమీదో నెట్టడమే!

రాష్ట్రంలో ప్రతి ఏడాది సెప్టెంబర్ నుండి నవంబర్ వరకు మెదడువాపు వ్యాధి ఎక్కువగా వస్తుందని తెలిసినా, ప్రభుత్వం, దాని యంత్రాంగానికి ప్రజలపట్ల బాధ్యతగా లేకపోవటానికి నిదర్శనాలెన్నెన్నో. వాటిల్లో ఒకటి-శాశ్వతంగా దోమల నివారణకు చర్యలు చేపట్టక పోయినా, కనీసం ఈ వ్యాధి సోకే కాలంలోనైనా, దోమలను నివారించటానికి చేసిన కృషి లేదు. తీరా మెదడువాపు వ్యాధి ప్రబలి, పిల్లల ప్రాణాలు హరించుకు పోవటం మొదలైన తర్వాతగాని ప్రభుత్వం మొద్దు నిద్ర నుండి బయట పడలేదు. అప్పుడు టెలీ కాన్ఫరెన్స్‌ల పేరుతో, ఆకస్మిక తనిఖీల పేరుతో ముఖ్యమంత్రి కలెక్టర్లను ఇతరులను మీరు ఇప్పటిదాగా ఏం చేస్తున్నారు? ముందు జాగ్రత్త చర్యలు ఎందుకు చేపట్టలేదు? అని నిలదీయటం, వాళ్ళు కింది

వాళ్ళను నిలదీయటం మొదలుపెట్టారు.

మెదడువాపు వ్యాధికి పందులే కారణం అని ప్రచారం చేస్తూ, రాష్ట్ర వ్యాపితంగా పందుల సంహారానికి పూనుకుంది రాష్ట్ర ప్రభుత్వం. పందుల వలనే ఈ వ్యాధి రాదు అని ఒక ప్రక్క డాక్టర్లు చెప్తున్నా, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆ మాటన్నందుకు డాక్టర్లను విమర్శిస్తూ, పందుల సంహారం కొనసాగించాడు. పందుల పెంపకంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న ఎరుకలు మొదలైన బడుగు జీవుల విన్నపాల్ని కనీసం పట్టించుకోలేదు. మెదడువాపు వ్యాధి ప్రబలకుండా చేయటంలో ప్రభుత్వ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికే, పందుల సంహారం పెద్ద ఎత్తున చేపట్టి, తన పాపాన్ని కడిగేసుకోదలచింది. బ్రిటన్‌లో లక్షలాది ఆవులకు 'మాడ్‌కౌ' అనే వ్యాధి వచ్చి, అవి మనుషులు ఆహారంగా తీసుకోవటానికి పనికిరాక పోయినపుడు కూడా ఇలా కాల్చి చంపలేదు. ఇది ఏ 'గోవుల' ద్వారా వస్తుందంటే ఇలా చేసేదా రాష్ట్ర ప్రభుత్వం? కేవలం, నిమ్నజాతులు బ్రతుకుదెరువు కోసం పెంచుకునే బక్క జీవాలు కాబట్టి, అంత కర్కశంగా వాటిని కాల్చి చంపారు. ప్రభుత్వ వర్గ స్వభావమే కాదు, అగ్రకుల దురహంకారం కూడా ఇమిడి వుంది దీనిలో. ప్రయోగశాలల్లో జంతువులపై ప్రయోగాన్ని చేయటాన్ని కూడా కోర్టుకెళ్ళి అడ్డుకుంటూ, జంతు సంరక్షురాలిగాలాగా ప్రచారం చేసుకుంటూ, ఫోజులు కొడ్తున్న మాజీ సినీనటి అక్కినేని అమలు కూడా పందుల సంహారానికి మద్దతునిచ్చి, తన సంస్థ స్వభావాన్ని చాటుకుంది. రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో మెదడువాపు వ్యాధి నివారణా చర్యలు చేపట్టదలచుకుంటే, నిరంకుశంగా పందులను కాల్చి చంపాల్సిన అవసరం లేదు. ముందు జాగ్రత్త చర్యలుగా పిల్లలకు వాక్సిన్ ఇప్పించే ఏర్పాటు చేయవచ్చు. కానీ, మెదడువాపు వ్యాధి ప్రబలిన తర్వాతగానీ రాష్ట్ర ప్రభుత్వం వ్యాక్సిన్ తెప్పించటం మొదలు పెట్టలేదు. వాక్సిన్ పిల్లలకిచ్చిన ఆరువారాల తర్వాతగానీ అది పనిచేయదు, అప్పటినుండి 6 నెలల వరకు పిల్లలకు మెదడువాపు వ్యాధిరాకుండా నిరోధిస్తుంది. జూలై, ఆగస్టు నెలల్లో వ్యాక్సిన్ ఇస్తే, అది ఉపయోగపడేది. కానీ, నవంబర్‌లో వ్యాక్సిన్ తేవటం, కంటితుడుపు చర్యకేగాని, ఉపయోగం లేదు. రాష్ట్ర ప్రభుత్వం వేపు నుండి జరిగిన ఈ వైఫ ల్యాలను కప్పి పుచ్చుకోవటానికి పందుల సంహారంతో పాటు, పారిశుధ్య పనులు ప్రైవేట్ ఏజెన్సీలకివ్వాలనే నినాదం అందుకున్నాడు చంద్రబాబు. రాష్ట్రాన్ని ప్రపంచబ్యాంక్‌కు తాకట్టు పెట్టి, ఇక్కడి వనరుల్ని సామ్రాజ్యవాదుల పరం చేయబూనుకున్న చంద్రబాబుకి, తన దుష్ట పథకాలు అమలు చేయటానికి మెదడువాపు వ్యాధీ ఒక వరమే!

రాష్ట్రంలో పంచాయితీలు, మున్సిపాలిటీలు, కార్పోరేషన్లు, వాటి సిబ్బంది పారిశుద్ధ్య పనులు సక్రమంగా అమలు చేయకపోవటం వలన వ్యాధులు ప్రబలుతున్నాయి అని, అందువలను ప్రైవేట్ ఏజెన్సీలకివ్వాలని, డ్వాక్రా గ్రూపుల్ని, స్వయం సేవక్ బృందాలకి ఆ పనులు అప్పగించమని కలెక్టర్లకు ఆదేశాలిచ్చాడు. ఒకవేళ సిబ్బంది నిర్లక్ష్యం వలన పారిశుద్ధ్య పనులు అమలు జరగకపోతే, అమలు జరిగేటట్లు చర్యలు తీసుకోవడం కాకుండా, ప్రైవేట్ ఏజెన్సీల కివ్వాలన్న పాట ఎత్తుకోవటం అంటే, ఏ చిన్న సాకు దొరికినా ప్రైవేట్‌పరం చేసే ఎత్తుగడల అమలుకు పూనుకుంటున్నాడన్నది అర్థమవుతుంది. ఇక, పారిశుద్ధ్య పనులు ప్రైవేట్‌పరం చేసినాక, ఇప్పటిదాకా ఉన్న పారిశుద్ధ్య సిబ్బందితో పనేముంది? ప్రభుత్వోద్యోగులను తగ్గించమని ప్రపంచబ్యాంక్ జారీ చేసిన ఆజ్ఞను అమలు చేయటానికి చంద్రబాబుకి ఇదీ ఒక తరుణోపాయమే. సిబ్బంది అలక్ష్యానికి మించిన కారణం, రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించక పోవటం. పారిశుద్ధ్యపు పనుల లోపంపై స్థానిక సర్పంచ్‌లను, మున్సిపల్ ఛైర్మన్‌లను ప్రజల ముందు నేరస్థులుగా నిలబెట్టే ప్రయత్నం చేస్తుంటే వాళ్ళు స్పష్టంగా నిధుల కొరత విషయం చెప్పారు. స్థానికంగా 'నిధులు' సమకూర్చుకుని, మీరే ఆ పనులు చేసుకోవాలని చంద్రబాబు సమాధానం. గ్రామాల నుండి, మున్సిపాలిటీల నుండి వచ్చే పన్నులను రాష్ట్ర ప్రభుత్వం కాజేస్తూ, వాటికి ముష్టి విదిల్చినట్లు విదిలిస్తూ, వనరులను మీరే సమీకరించుకోవాలని చెప్పటంలో అర్థం తన బాధ్యత నుండి తప్పించుకోవటమే కాదు, ఆ పనులను ప్రైవేట్‌పరం చేయమని చెప్పటమే.

ఇక ముఖ్యమంత్రి, ఆరోగ్య శాఖా మంత్రి చేసిన కొన్ని ప్రకటనలు అయితే, ప్రజల్ని మరీ వంచించటానికి, వెర్రి వాళ్ళను చేయటానికే పనిచేస్తాయి. మెదడువాపు వ్యాధి సోకిన బాలికలకు, బాలికల సంరక్షణ పథకం క్రింద భీమా సౌకర్యం కల్పించమని, అటువంటి చట్టం, అవకాశం ఏదీ లేదని తెగేసి చెప్పినా, అదే పాట పాడాడు. మొన్నటి ఎన్నికల్లో, తన మోస పూరిత పథకాలకి ఆకర్షితులై మహిళలే గట్టెక్కించారన్న దానితో, మహిళలపట్ల తను ఎంతో శ్రద్ధ తీసుకుంటున్నట్లు నమ్మించటానికే లేని పథకాన్ని, అమలు కాని పథకాన్ని చెప్పి, మరీ మోసగిస్తున్నాడు.

ఇక ఆరోగ్య శాఖా మంత్రి శనక్కాయల అరుణ అయితే, అందరికీ దోమతెరలు ఇస్తామనే చెప్పింది. ఇందుగలడందు లేదడను సందేహము వలదు, ఎందెందు వెదికిన అందందే కనపడును అన్నట్లుగా, ఎక్కడ పడితే అక్కడ సర్వకాల సర్వావస్థల యందు దోమలమయంగా వున్న పరిస్థితులను మార్చకుండా, 'దోమ తెరలు' ఇస్తామనటం కేవలం పబ్బం గడుపుకోవటానికే. పోనీ అవైనా ఇచ్చారా అంటే ఎక్కడా ఇచ్చింది లేదు.

గాలిలో కలసిన 500 మందికి పైగా పిల్లల మరణాలకు, శాశ్వితంగా బాల బాలికలు కొందరు అంగ వికలత్వం పొందటానికి బాధ్యత ప్రభుత్వానిదే! రాష్ట్రంలో పారిశుద్ధ్య లోపం వలన, అనేక రకాల వ్యాధులు ప్రబలకుండా ఉండాలంటే, అందుకు తగిన చర్యలు చేపట్టాలి. అందుకోసం ప్రభుత్వం అమలు చేస్తున్న శాశ్వత పథకం ఒక్కటే లేదు. అందువలన, ప్రతిఏడు, బాలబాలికలు మెదడువాపు వ్యాధి బారిన పడాల్సిన పరిస్థితే కొనసాగుతున్నది. అప్పుడు మరలా ప్రభుత్వం కిందిస్థాయి వాళ్ళ అలసత్వం అని నిందించటమో, పందులను కాల్చి చంపటమో చేసి, తన నేరపాత్రను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేయవచ్చు. ఈ సందర్భంగా, మనం గుర్తు పెట్టుకోవలనది ఇంకా అనేక రకాల వ్యాధుల బారిన రాష్ట్ర ప్రజలు పడే పరిస్థితి ముందున్నది. ఉదాహరణకు పర్యాటక రంగం అభివృద్ధి గురించి ప్రభుత్వం చేపడుతున్న చర్యలన్నీ, ఆ పేరుతో స్త్రీలను వేశ్యలుగా మార్చి, విదేశాల నుండి వచ్చే యాత్రికుల కోర్కెలు తీర్చే యంత్రాలుగా మార్చుతాయి. థాయ్‌లాండ్‌లో, మలేషియాలో, సింగపూర్‌లో జరుగుతున్నదిదే. రేపు మన దేశంలోనూ జరిగేది ఇదే. దీని ద్వారా, రాష్ట్రంలో విదేశీ కామ పిశాచుల ద్వారా ఎయిడ్స్ వ్యాధి ధారాళంగా సరఫరా అవుతుంది.

అందువలన, రాష్ట్రంలో మెదడువాపు వ్యాధి మొదలైన వాటి వలన కలుగుతున్న అకాల మరణాలు మొ॥నవి జరగకుండా ఉండాలంటే, ప్రజల ఆరోగ్యాల్ని కాపాడేందుకు ప్రజా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసేలా ప్రభుత్వాన్ని డిమాండ్ చేసి సాధించుకోవలసి వుంది. ❑

## శ్రీకాకుళ గిరిజన సాయుధ రైతాంగ పోరాట ఫలం 'వన్ ఆఫ్ సెవెంటీ' (1/70 ) చట్టం!

# ప్రపంచబ్యాంకుకి దాసోహం అయిన చంద్రబాబు ప్రభుత్వం దీనిపైన గురిపెట్టిన దాడి-తిరిగి అదే స్థాయి పోరాటాన్ని రగల్చక తప్పదు!!

ఆదివాసీలకి వారి భూమిపై గట్టి రక్షణ కల్పించే 'వన్ ఆఫ్ సెవెంటీ' ప్రత్యేక చట్టం (1/70 రెగ్యులేషన్)పై వేటు పడిపోతోంది. దేశంలో ఒక్క ఆంధ్ర రాష్ట్రానికి మాత్రమే పరిమితమవుతూ, రాష్ట్రంలో షెడ్యూల్ ప్రాంతాలుగా పిలువబడే, ఆదివాసీ తెగల ప్రజలు అత్యధిక శాతంలో నివసించే ప్రాంతాలలో (వీటినే ఏజెన్సీ ప్రాంతాలు అని కూడా అంటారు) గిరిజనవాసుల భూమి హక్కు రక్షణ కోసం 1970వ సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున నాటి ఆంధ్ర రాష్ట్ర గవర్నర్ ప్రత్యేకంగా రూపొందించి అమలులోకి తెచ్చిన మొట్టమొదటి చట్టం గనుక దీన్ని '1/70 ప్రత్యేక చట్టం' లేక '1970 రెగ్యులేషన్ ఒకటి' అని వ్యవహరిస్తుంటాం.

ఈ చట్టంపై చంద్రబాబు డేగకళ్ళవేట ఈనాటిది కాదు. ఎన్.టి. రామారావు హయాంలోనే, రాష్ట్ర కర్షక పరిషత్ ఛైర్మన్‌గా చక్రాలు తిప్పుతుండిన రోజుల్లోనే ఇతగాడు ఈ చట్టానికి మంగళం పాడాలని బహిరంగంగానే కోరాడు. ముఖ్యమంత్రి పదవి కబ్జా చేసిన తరువాత కూడా ఇతడు వివిధ సందర్భాలలో ఈ చట్టంపై విషం కక్కుతూ వ్యాఖ్యలు చేస్తూనే వస్తున్నాడు. ముఖ్యమంత్రి పదవిని పదిలపరచుకొని, పార్టీలో ప్రభుత్వంలో తన పట్టు బిగించుకున్న తరువాత ఇక ఈ చట్టానికి ఉరి తగిలించే పన్నాగాలు చురుగ్గా ప్రారంభించాడు. అయితే ఈ చట్టం అనేక సందర్భాలలో కీలకమైన నైతిక చట్టపర సమర్థనలని, సానుకూలతని, సానుభూతిని సంపాదిస్తూ రావడం అనేది చంద్రబాబుకి మింగుడుపడని విషయం అయిపోయింది. 5-6-'84న 'రాష్ట్ర గిరిజన సలహా మండలి' ఈ చట్టం యధాతథంగా, నిర్ద్వంద్వంగా కొనసాగి తీరాలని ఏకగ్రీవంగా తీర్మానించింది. మైదానాల్లోంచి ఆదివాసీ షెడ్యూల్ ప్రాంతాల్లోకి చొరబడిపోయి రకరకాల దగాలు, దౌర్జన్యాలతో ఆదివాసీల భూముల్ని అన్యాయంగా దురాక్రమించేసిన అగ్రకుల బడా బాబులంతా లేవదీసిన భూవివాద సంబంధమైన కేసుల్ని పరిశీలించిన సుప్రీంకోర్టు 14-7-'88లో ఒకసారి, తిరిగి 18-9-'95లో మరోసారి గిరిజనేతర సంపన్న భూస్వాముల కూటవాదనల్ని కొట్టిపారేస్తూ 1/70 చట్టాన్ని సరిగ్గానే సమర్థిస్తూ స్పష్టమైన తీర్పులనే ఇచ్చింది. ఇక ఇటీవలనే (1997-1998) రాష్ట్ర ప్రభుత్వ గిరిజన తెగల సంక్షేమ కమీషన్ సైతం ఈ చట్టం యధాతథంగా కొనసాగాలని ప్రభుత్వానికి సిఫారస్ చేసింది. ఈ ఇబ్బందుల్ని అధిగమిస్తూ ఈ చట్టం పీక ఎలా పిసికేయాలా అని ఆలోచిస్తున్న చంద్రబాబుకి 1997లో పశ్చిమ గోదావరి జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో చెలరేగిన గిరిజన భూపోరాటాలు మరింత ఒత్తిడిని, తొందరని కలిగించాయి. ఈ పోరాటాలలో తాము సైతం కొంత పాత్ర కలిగివున్న సి.పి.ఎమ్. పార్టీ వారు అప్పటికి రాష్ట్ర అసెంబ్లీలో తమకుండే కాస్తంత సంఖ్యాబలం రీత్యా ప్రభుత్వంపై ఒత్తిడి చేసి ఏజెన్సీ (పశ్చిమ గోదావరి) భూవివాదాల పరిష్కారానికి ఒక మంత్రివర్గ ఉపసంఘాన్ని వేయించారు. కాగల కార్యం గంధర్వులే తీర్చారన్నట్లుగా చంద్రబాబు మదిలో పదిలంగా తిష్టవేసుకున్న దుష్ట పథకం అమలుకి ఈ ఉపసంఘమే ఊతం అయింది.

నాటి రెవెన్యూ మంత్రి దేవేందర్‌గౌడ్ అధ్యక్షతలో 24-9-'97న ఈ మంత్రివర్గ ఉపసంఘం హైదరాబాద్‌లో ఒక అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించి ఏజెన్సీ భూవివాదాల్ని చర్చించింది. ఈ అఖిలపక్ష సమావేశం చర్చల పర్యవసానంగానే 12-11-1998న రాష్ట్రంలోని ప్రధాన పార్లమెంటరీ రాజకీయ పార్టీలకి చెందిన 21 మంది శాసనసభ్యులతో, అధికార తెలుగుదేశం పార్టీకి చెందిన ఒక గిరిజన శాసనసభ్యుని అధ్యక్షతలో 'సభాసంఘం' నియమించింది చంద్రబాబు ప్రభుత్వం. రాష్ట్ర 10వ శాసనసభ ముగుస్తూ, 11వ శాసనసభ ఎన్నికలు ముంగిట్లోకి వచ్చేసిన సందర్భంలోనే ఆ ఎన్నికల హడావిడిలోనే ఈ సభాసంఘం తన నివేదికని 28-9-1999న ప్రభుత్వానికి అందజేసింది. ఈ సభాసంఘం నిర్వాకం ఏమిటో, అదేం చేయదలచిందో, అది చేసిన సిఫారసులేమిటో పత్రికలకు ఉప్పు అందింది. 26-11-1999 నాటి 'ఆంధ్రప్రభ' దినపత్రిక ఏం రాసిందంటే ''రాష్ట్రంలోని తొమ్మిది జిల్లాల్లో గిరిజనుల జన్మభూమికి సంబంధించిన గిరిజనుల భూముల బదలాయింపు, నిషేధ (1/70) చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం త్వరలో సమూలంగా మార్చబోతున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. వివాదాస్పదమైన ఈ చట్టానికి ఎటువంటి మార్పులు చేసినా తాము దాదాపు ఎనిమిది లక్షల ఎకరాలలో హక్కులు కోల్పోతామని గిరిజనులు అంటున్నారు. గిరిజనేతరులకి కూడా హక్కులు కల్పించే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ చట్టానికి సవరణలు తీసుకురాబోతున్నట్లు తెలిసింది. తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం, ఖమ్మం, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లోని ఏజెన్సీ ప్రాంతాలలో దాదాపు ఎనిమిది లక్షల ఎకరాల భూములను గిరిజనేతరులు అనేక దశాబ్దాలుగా అనుభవిస్తున్నారు. ఈ భూములను అనుభవిస్తున్న గిరిజనేతరులలో అత్యధికులు క్షత్రియ, కమ్మ, కాపు కులస్థులే! నిజానికీ భూములన్నీ తమవేననీ, 1/70 చట్టం ప్రకారం వీటిని తిరిగి తమకు అప్పగించాలని గిరిజనులు చాలా కాలంగా కోరుతున్నారు..... గిరిజనుల ఒత్తిడులకి తట్టుకోలేక అగ్రవర్ణాలలోని కొందరు రాజకీయ నాయకులు తెచ్చిన ఒత్తిడి కారణంగానే రాష్ట్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని సవరించి వివాదాస్పద భూములలో గిరిజనేతరులకి కూడా హక్కులు కల్పించాలనుకుంటున్నట్లు తెలిసింది. రాష్ట్ర మంత్రి ఒకరు ఇటీవల తనను కలిసిన గిరిజనేతర ప్రతినిధులతో ఈ చట్టాన్ని త్వరలో రాష్ట్ర ప్రభుత్వం సవరించబోతున్నట్లు చెప్పారని తెలిసింది.....''

ఈ విధంగా 1/70 చట్టానికి ఉచ్చు బిగిస్తోంది చంద్రబాబు ప్రభుత్వం! ఈ విషయంలో చంద్రబాబు ప్రదర్శిస్తున్న దూకుడు, దుస్సాహసాలకి రెండు రకాల నేపథ్యాలున్నాయి. ఒకటి తాత్కాలిక తక్షణ నేపథ్యం, రెండు దీర్ఘకాలిక శాశ్వత నేపథ్యం. ఈ రెంటినీ దేనికదిగా ప్రత్యేకంగా పరిశీలిస్తూనే ఈ రెండింటి మధ్య వుండే

సంబంధాన్ని అర్థం చేసుకోకపోతే; తక్షణ నేపథ్యాన్ని మాత్రమే చూస్తూ దీర్ఘకాలిక నేపథ్యాన్ని చూడలేకపోతే లేక చూడనిరాకరిస్తే ఈ సమస్యకి, సమస్యని అంటిపెట్టుకొని సాగాల్సిన గిరిజనోద్యమానికి న్యాయం చెయ్యలేం! చంద్రబాబు ప్రభుత్వ కుట్రల్ని ఓడించలేం!

## తక్షణ నేపథ్యం

ఆదివాసీ ప్రాంతాలైన షెడ్యూల్ ప్రాంతాల్లోకి భూదాహంతో వలసలు కట్టి అక్కడ తిష్టవేసుకు కూర్చున్న మైదాన ప్రాంతాలకి చెందిన సంపన్న భూస్వాములు, ధనికరైతులు, ప్రత్యేకించి ఉభయగోదావరి జిల్లాలకి చెందిన ఏజెన్సీ ప్రాంతాల్లోని ఈ భూస్వామ్య శక్తులు 1/70 చట్టానికి వ్యతిరేకంగా కారాలు మిరియాలు నూరుతూ దీన్ని అటకెక్కించటానికి, లేదా అది పేరుకి మాత్రమే వుంటూ ఆచరణలో అన్నిరకాల నీరుకారిపోయేట్టు దాన్ని నీరసపరచడానికి ఎన్నెన్నో కూట ఎత్తుగడలు పన్నుతూ వస్తున్నారు. 1950కి ఇంకా ముందే ప్రారంభమైనా, 1950ల నాటి నుంచి షెడ్యూల్ ప్రాంతాల్లోకి మైదాన ప్రాంతాల నుంచి గిరిజనేతర సంపన్న భూస్వామ్య వర్గాల వలసలు పెరిగాయి. ప్రత్యేకించి ఉభయగోదావరి జిల్లాల్లోని ఏజెన్సీ భూములు సారవంతమైనవి, వాణిజ్య పంటలకి ఎంతో అనుకూలమైనవి కావడం వలన ఈ భూములపై ఈ జిల్లాలకి చెందిన భూస్వాములు, ధనికరైతుల కళ్లు పడ్డాయి, పెద్ద ఎత్తునే ఏజెన్సీల్లోకి వలసలు సాగాయి. 1970లో ఈ 1/70 చట్టం అమలులోకి రావడానికి ముందే ఈ గిరిజనేతర సంపన్నులు ఉభయ జిల్లాల ఏజెన్సీల్లో గిరిజనులు సాగుచేస్తుండే వందలాది ఎకరాల భూముల్ని కబ్జా చేసేశారు. ఈ భూముల్లో ముందులో పొగాకు పంటలు వేసి లక్షలు గడించుకున్నారు. తరువాత జీడి మామిడి సాగు ప్రారంభించారు. వారి పంట రూపాయిల పంటగానే సాగుతూ వచ్చింది. అయినా వారి భూదాహం తీరలేదు, పైగా అది దుర్దాహంగా పెరిగిపోయింది. కారణం ఏమంటే ప్లాంటేషన్లు, పండ్లతోటలు వంటి పెట్టుబడిదారీ వ్యవసాయ పద్ధతుల వేపు, వివిధ తరహాల ఆగ్రో బిజినెస్‌ల వేపు వారి దృష్టి మళ్లింది. ఇందుకు మరిన్ని మరిన్ని భూములు కావాలి! కాని, కంటిలో నలుసులా కాలిలో ముల్లులా ఈ 1/70 చట్టం వారికి అడ్డు అయిపోయింది. ఎందుకంటే-ఈ చట్టం 1970 లగాయితూ షెడ్యూల్ ప్రాంతాలలో గిరిజనుల నుంచి గిరిజనేతరులనే వారెవరూ ఎలాంటి భూమిని కొనడానికి వీలు లేకుండా అలాంటి అన్నిరకాల భూబదలాయింపుల్ని ఈ చట్టం నిషేధించింది. ఎవరు కొన్నా ఆ భూమిని ఎలాంటి పరిహారం చెల్లించనవసరం లేకుండానే ప్రభుత్వం స్వాధీనపరచుకొని దాన్ని తిరిగి గిరిజనులకే పంచాలని ఈ చట్టం చెబుతుంది. అంతేకాదు, షెడ్యూల్ ప్రాంతాలలోని గిరిజనేతరుల మధ్య కూడా ఎలాంటి భూముల క్రయవిక్రయాలు జరగరాదని ఈ చట్టం ఆంక్ష విధించింది. అలా బదలాయింపైన భూముల్ని కూడా ప్రభుత్వం స్వాధీనపరచుకొని గిరిజనులకి పంచేస్తుంది, పంచాలి! ఈ చట్టం ప్రకారం తెలిసీగాని తెలియకగాని తమ భూముల్ని అమ్ముకున్న గిరిజనులు ఏ రకంగాను జవాబుదారులు కారు, తెలిసీగాని తెలియకగాని భూములని కొన్న గిరిజనేతరులే జవాబుదారీతనం వహించాల్సి వుంటుంది. తాము నిర్వహించిన భూబదలాయింపు వ్యవహారం సక్రమమైనదేనని, చట్టబద్ధమైనదేనని తగిన సాక్ష్యాధారాలతో గిరిజనేతరులే రుజువు పరచుకోవాల్సి వుంటుందే, లేదంటే సదరు వివాదగ్రస్థ భూమిని వారు కోల్పోతారు.

గొంతులో పచ్చి వెలక్కాయలా అడ్డుపడిన ఈ 1/70ని తప్పించుకుంటూ అప్పటికే కబ్జాచేసేసిన భూముల్ని దక్కించుకోడానికి, కొత్తగా మరిన్ని భూముల్ని కబ్జా చేయడానికి షెడ్యూల్ ప్రాంతాల్లోని గిరిజనేతర భూబకాసుర భూస్వామ్య వర్గాలు రకరకాల కూట ఎత్తుగడల్ని పన్నుతూ వచ్చారు. అవేమంటే-

### 1.నిరాధారం అయిన కోర్టు లిటిగేషన్లతో సంవత్సరాల తరబడి సాగదీయడం.

**ఎ.** 1/70 చట్టమే చెల్లనేరదంటూను, లేదా కనీసం తాము నిర్వహించిన క్రయవిక్రయాలకి ఈ చట్టం వర్తింపుకానేరదంటూ తప్పుడు కాలక్షేపపు వాదనలతో క్రింద కోర్టులు, హైకోర్టు, సుప్రీంకోర్టు వరకు దశాబ్దాలుగా నడుపుతూ ఈలోగా స్టేలు తెచ్చుకొని నిరభ్యంతరంగా భూముల్ని అనుభవించడం. 1972 నుంచి 1988 వరకు ఇలానే తంతు నడిపి, చట్టం గురించి తెలీని అమయాక గిరిజనుల నుంచి కారుచవగ్గా కాజేసిన వందలాది ఎకరాల భూముల్ని 1/70కి దొరకకుండా అనుభవిస్తూ పోయారు భూస్వాములు.

**బి. గిరిజన గ్రామాల హోదాని మార్చే వివాదాలు లేవదీయడం**

తాము భూముల్ని కబ్జా చేసేసిన, ఇంకా చేయాలని పథకం వేసుకున్న అనేక గిరిజన గ్రామాలు అవి షెడ్యూల్ ప్రాంతం పరిధిలోకి రావనే తప్పుడు వాదాలతో కోర్టులనాశ్రయించి ఆ గ్రామాల హోదాని మార్చాలని కోరుతూ కోర్టుల్లో కేసులు నడుపుతూ వివాదం తుదిగా తేలేంతదాకా వాటిని షెడ్యూల్ ప్రాంతపు గ్రామాలుగా పరిగణించరాదనే తీరులో స్టేలు రాబట్టిస్తూ ఈ లోగా తమ అవసరాలు చక్కబెట్టేసుకోవడం. ఉభయగోదావరి జిల్లాల్లో ఇలాంటివి కోకొల్లలు. ఇలాంటి కేసుల్లో గిరిజనులు దశాబ్దాల తరబడి కోర్టుల చుట్టూ తిరుగుతూనే వున్నారు. ప్రభుత్వం చిద్విలాసంగా ఈ తంతుని చూస్తూనే వుంటుంది. పశ్చిమగోదావరి ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనేతర భూస్వాములు వేసిన ఇలాంటి 13 గ్రామాలకి చెందిన కేసుల్ని రాష్ట్ర హైకోర్టు కొట్టివేస్తూ ఆ గ్రామాలు షెడ్యూల్ గ్రామాలేనని, 1/70 చట్టం అక్కడ వర్తింపు కావాలని ఇటీవలనే తీర్పు ప్రకటించింది.

### 2.పెద్ద లంచాలతో రెవెన్యూ అధికార్లని కొనివేసి భూరికార్డులను అనుకూలంగా రాయించుకోవడం

**ఎ. ముందస్తు తేదీలతో భూబదలాయింపుల సృష్టి:** (CREATION OF ANTE-DATING TRANSCERS) '70 తరువాత కొనే భూములకి '70కి ముందే కొన్నట్లుగా రసీదులు సృష్టించుకోవడం, భూరికార్డులలో అవసర మార్పులు చేర్పులు చేయించుకోవడం, వందల వేల ఎకరాలు ఇలా కాజేయబడినవే! పశ్చిమ గోదావరి జిల్లా ఏజెన్సీలో గ్రామాధికార్ల వ్యవస్థ రద్దుకి ముందు జీలుగుమిల్లి కరణం సోమరాజు, అలానే బుట్టాయిగూడెం మునసబు కరాటం రాంబాబు అతడి తండ్రి అడ్డకిపడ్డా లంచాలు మెక్కి అమాయక గిరిజనుల కళ్ళుగప్పి వేలాది ఎకరాల భూముల్ని భూస్వాములకి కట్టబెట్టారు.

**బి.** షెడ్యూల్ ఏరియా భూముల్లో '70ల తరువాత కూడా కొత్తగా ఏ గిరిజనేతర సంపన్నుడు సాగు ప్రారంభించినా, అతడా

భూమి ఎలా పొందాడనే ప్రశ్నతో ఎలాంటి సంబంధం లేకుండా అడ్డకి పడ్డా లంచాలు మెక్కేసి రెవెన్యూ సిబ్బంది, అధికార్లు వారి పేరన సాగుఅడంగల్ రిజిష్టర్‌లో సాగు నమోదు చేసేయడం.

### 3. రాజకీయ పైరవీలు ప్రభావాలతో లబ్ధి పొందటం

**ఎ. కార్య నిర్వాహక ఉత్తర్వు:** అంటే, సంపన్న భూస్వాముల ఒత్తిడితో, చట్టాన్ని అమలు చేయాల్సిన ప్రభుత్వమే ఏవేవో కుంటిసాకులతో కొన్ని ఆటంకపు ఉత్తర్వుల్ని జారీ చేయిస్తుంది. 1979 నాటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇలాంటి ఉత్తర్వు ఒకటి జారీ అయింది. ఇది రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోకి రాని, పైగా రాజ్యాంగ విరుద్ధ చర్య!

**అభిప్రాయ సేకరణల తంతు:** రాజకీయ ప్రబుద్ధులు ఆస్థిపరవర్గాలను కూడదీసి 'అభిప్రాయ సేకరణ' అంటూ చట్టానికి చిల్లులు పెట్టే ఘనకార్యంకై మార్గాలు అన్వేషిస్తుంటారు. ఈ 1/70 చట్టంపై ఇలాంటి కూడదీతలెన్నెన్నో జరిగాయి.

### 4. బినామీ అనుభవం

తమ చెప్పుచేతుల్లో అత్యంత నమ్మకంగా కొంతమంది గిరిజనుల్ని కట్టుడి చేసుకొని వారిపేరుపై బినామీగా భూముల్ని సాగుచేసుకు అనుభవించడం.

### 5. కొత్త తెగల సృష్టి

ఆదివాసీలతో పోలిస్తే సాపేక్షికంగా కొంత సాంస్కృతిక ఎదుగుదలతో, లోకం పోకడలతో పరిచయం వుండే లంబాడీలు లాంటి వారిని సామాజిక ఒత్తిడి నేపథ్యంలో గిరిజన తెగగా గుర్తించడమనేది ఒక అంశం! కాగా, వారిని తమ పబ్బం గడుపుకోవడానికి అనువుగా కూటనీతితో ఆదివాసీలపైకి వారి భూములపైకి ఉరకదోలించడమనేది తీవ్రంగా గర్హించదగ్గది. ఇదే జరుగుతోంది.

### 6. నామమాత్రపు అద్దెతో అనుభవం

గిరిజనుల సాగుభూములకి నామమాత్రపు అద్దెను (కౌలు) చెల్లిస్తూ వందలాది ఎకరాలు నిక్షేపంగా అనుభవిస్తుండటం.

### 7. పెళ్లికాని పెళ్లిళ్ళు

పెళ్లి పేరుతో గిరిజన స్త్రీలను లోబరుచుకుని వారిని ఉంపుడుగత్తెలుగా వుంచుకుంటూ వారిపేరుపై భూముల్ని సాగుచేసుకోవడం.

### 8. తూతూ దత్తతలు, తెగల పేర్లు తగిలించుకోవడాలు

తమ పిల్లల్ని గిరిజనులకి, అలానే గిరిజనుల పిల్లల్ని తాము తాత్కాలికంగా అబద్ధపు దత్తతలు చేసుకొని వారి పేరుపై యధేచ్ఛగా భూములు అనుభవించడం. మరి కొంతమందైతే, ఏకంగా కొన్ని ఆదివాసీ తెగల పేర్లని తమ ఇంటిపేర్లుగా పెట్టేసుకొని అమాంతం ఆదివాసీ అవతారాలెత్తేసి భూముల్లో తిష్టవేసేయడం.

గిరిజనేతర సంపన్న వర్గాలు ప్రయోగిస్తూ వచ్చిన ఈ కూట ఎత్తుగడలన్నింటినీ ఎత్తి ఎండగడుతూ ఉభయగోదావరి జిల్లాల్లోని, ప్రత్యేకించి పశ్చిమ గోదావరి జిల్లా షెడ్యూల్ ప్రాంతంలోని పోలవరం, జీలుగుమిల్లి, బుట్టాయగూడెం మండలాల్లోని 102 గ్రామాలకి చెందిన ఆదివాసీ ప్రజలంతా ఐక్యంగా కదిలి తమ భూమి హక్కు రక్షణ కోసం, 1/70 చట్టాన్ని రక్షించుకోవడం కోసం, ఆ చట్టాన్ని సక్రమంగా అమలుపరుస్తూ తమ భూముల్ని తమకు అప్పజెప్పాలని నినదిస్తూ గడచిన మూడు సంవత్సరాలుగా పెద్ద ఎత్తున పోరాడుతున్నారు. దాంతో, ఆ ప్రాంతాల్లో తిష్టవేసుకున్న వలస పెత్తందార్లకి కలవరం పుట్టింది. 1/70 చట్టం అమలులో వుంటున్నా కూడా అడ్డదారులు దొడ్డిదారుల్లో ఇంతదాకా చెలాయించుకుపోయిన తీరులోనే ఇకపై కూడా సాగిపోవడం సాధ్యం కాదని వారు గ్రహించారు. కనుక అసలీ చట్టానికి మొత్తంగానే మంగళం పాడించడం, లేదంటే దాని సారాన్నంతా గుంజేసి పేరుకి మాత్రమే మిగిలేట్లు దానికి సవరణలు చేయించడం ఈ రెండిండిలో ఏదో ఒకటి సాధించి తీరాలని వారంతా నడుం బిగించారు. రాష్ట్రంలోని ప్రధాన పార్లమెంటరీ రాజకీయ పార్టీలన్నింటితోనూ వీరికి చక్కటి సంబంధాలున్నాయి. ప్రత్యేకించి కాంగ్రెస్, తెలుగుదేశాలతో-మరీ ప్రత్యేకించి అధికార తెలుగుదేశం పార్టీలోను, ప్రభుత్వంలోను వీరికి బలమైన లాబీ వుంది. కాని, ప్రభుత్వాన్ని రంగంలోకి దించడానికి వీలుగా కొంత వాతావరణం, ఒక బలమైన సాకు వుండాలి కదా! అందుకే, తమకు మాత్రమే వ్యతిరేకంగా గిరిజనులు ఎక్కుపెట్టిన పోరాటాన్ని గిరిజనేతర పేదలకి సైతం వ్యతిరేకంగా ఎక్కుపెట్టబడిన పోరాటంగా, ప్రధానంగా గిరిజనేతర పేదలపైననే ఎక్కుపెట్టిన పోరాటంగా చిత్రిస్తూ ప్రచారం చేసారు. ప్రభుత్వం ప్రచార సాధనాలు కూడా అదే పాట అందుకుని అది గిరిజన, గిరిజనేతరులందరి మధ్య రగిలిన పోరాటంగా చిత్రిస్తూ ప్రచారం చేశాయి. పర్యవసానం ఏమంటే- షెడ్యూల్ ప్రాంతాలల్లో గిరిజన-గిరిజనేతరుల మధ్య శాంతి సామరస్యాల్ని పునరుద్ధరింపజేసే 'పవిత్ర లక్ష్యం'తో చంద్రబాబు ప్రభుత్వం హుటాహుటిన ఒక సభాసంఘాన్ని నియమించేసింది! ఈ సభాసంఘం మరింత అర్జెంటుగా తన 'పరిశీలనాకృషిని' ముగించేసి 'అమూల్యమైన' తన నివేదికని ప్రభుత్వానికందజేసింది!

## 1/70పై విషం కక్కుతూ వలస భూస్వాములకి వత్తాసుగా సభాసంఘం చేసిన సిఫార్సులు!

1/70 చట్టంలోని కీలకమైన నిబంధనలన్నింటినీ తీవ్రంగా ఈసడిస్తూ ఈ చట్టానికి మౌలికమైన సవరణని ప్రతిపాదించడమే (చట్టం రద్దు అనాల్సిన అవసరం లేకుండా) ఈ సభాసంఘం చేసిన అతి కీలకమైన సిఫారసు. 1/70 చట్టం విధిస్తున్న ఆంక్షలు ''గిరిజనేతరుల్ని ఇబ్బంది పెట్టేవే గాక గిరిజనులకి సైతం నిరుపయోగం'' అంటూ సన్నాయి నొక్కు నొక్కుతోంది ఈ సభా సంఘ నివేదిక! గిరిజనేతరుల ఇబ్బంది ఏమిటంటే వారు ఈ చట్ట నిబంధన కారణంగా తమ భూముల్ని అమ్ముకోలేక పోతున్నారట! అమ్ముకోడానికి వారు న్యాయబద్ధంగా చట్టబద్ధంగా కొన్న భూములైతే కదా! తమ నివాస ప్రాంతాలు భూములు ఇళ్లు వుండే మైదానాల్లోంచి వారు ఏజెన్సీల్లోకి చొరబడింది భూముల్ని 'కొనుక్కోడానికే' (అంటే కాజేయడానికే) తప్ప అమ్ముకోడానికి కాదుగదా! పోనీ వారు అక్రమంగా కాజేసినవో లేక సక్రమంగానే కొనుక్కున్నవో-ఈరోజు ఏ కారణం

చేతనైనా వారు నిజంగా అమ్ముకోదలిస్తే 1/70 మీద పడాల్సిన పనిలేదే! దాన్నిలా వుండనిస్తూనే ఇలాంటి గిరిజనేతర ఆసాముల భూస్వాముల భూముల అమ్మకాల్ని పర్యవేక్షించడానికి ''ఏజెన్సీ ల్యాండ్ కమీషన్'' అనేదాన్ని ప్రభుత్వం నియమించవచ్చుగదా! అందుకు 1/70 అడ్డుతగలదే! ఇందుకు భిన్నంగా నిర్నిబంధంగా నిరాఘాటంగా గిరిజనేతరుల భూముల క్రయవిక్రయాల్ని ఏజెన్సీ ప్రాంతంలో అనుమతించడమంటే- ఇక షెడ్యూల్ ప్రాంతాలన్నీ వలసల వరదలతో నిండిపోయి ఆదివాసీలంతా తమ నేలని విడచి దేశం నలుమూలలకి శరణార్థులుగా పోవాలి! సభాసంఘ నివేదిక సానుభూతి ఒలకబోస్తున్న గిరిజనుల ఇబ్బంది ఏమిటంటే- వారు తమ భూములకి 'తగిన రేటు' పొందలేక పోతున్నారట! భూమే ఏకైక ఆధారం అయిన గిరిజనులు తమ భూముల్ని ఎందుకు అమ్ముతారు? ఎప్పుడు అమ్ముతారు? అమ్ముకోక గతిలేని పరిస్థితుల్లో పడ్డప్పుడు అమ్ముతారు. అలాంటి పరిస్థితులు సృష్టించే కదా వారి భూములన్నింటినీ గిరిజనేతర భూస్వాములు పడేసుకున్నది! నూటికి కోటికి ఎవరో ఒక గిరిజనుడు బయటి ప్రాంతంలో కొంత మెరుగైన ఉపాధి అవకాశం పొందితే అప్పుడిక తనకుండే కాస్త భూమికోసం ఏజెన్సీలో వుండదలచక దాన్ని అమ్ముకుని మైదాన ప్రాంతం పోవాలనుకోవచ్చు. కానిలాంటి సందర్భాలెన్ని? అసలుండవని చెప్పగలంతటి అరుదు. సభాసంఘ నివేదిక చెప్పే 'తగినరేటు' అనేది నవ్వు పుట్టించే విషయం! ఈ 'తగినరేటు' అనేది ప్రభుత్వం ఇవ్వడమో ఇప్పించడమో చెయ్యవచ్చుగదా! గిరిజనులు భూమిని 'తగినరేటుకి' అమ్ముకోవడమా?! ఆచరణలో ఇది పరమ అసంభవం అయిన విషయమని సభాసంఘం 'పెద్దలకి' తెలీంది కాదు. కనుక సభాసంఘ నివేదిక మాట్లాడుతున్న మార్మికభాషని సామాన్యులకి అర్థమయ్యే సాధారణ భాషలోకి అంటే అమాయక గిరిజనుల స్వానుభవ భాషలోకి తర్జుమా చేసి చెప్పడమంటే- గిరిజనులు తమ భూముల్ని 'అమ్ముకోవడము' అనే 'పోగొట్టుకోవడాన్ని' అనుమతిస్తూ గిరిజనేతర నాగరీకులు 'కొనుక్కోవడం' అనే లాక్కోవడాన్ని అనుమతించాలి! ఇదీ సభాసంఘం చేసిన అమూల్యమైన సిఫారసు! అమ్మకం అనే ఎరకి అమాయక గిరిజనులు బలైపోవడాన్ని, 'కొనుక్కోవడం' అనే వంచనకి గిరిజనేతర పెద్ద మనుషులు పాల్పడకుండా కాస్త నిరోధించడానికే 1/70 చట్టం! గిరిజనులు తమ భూముల్ని అమ్ముకోవడం ప్రారంభిస్తే భూస్వామ్య తిమింగలాలు వారి భూములన్నింటినీ ఒక్క రోజులోనే 'కొనేసి' వారిని బికారుల్ని చేసి మరీ ఏజెన్సీల్లోంచి దేశం మీదికి అడుక్కోమని తరిమేయగలరు! కనుక, సభాసంఘ నివేదిక ప్రదర్శిస్తున్న మార్మికత లౌక్యం చూసి దోపిడీ భూస్వామ్య వర్గాలు అభినందించి మెచ్చుకోవచ్చునేమో గాని గిరిజనులు, గిరిజనోద్యమానికి బాసటగా నిలిచే ఉద్యమకారులు ఛీకొడతారు!

1902, 1933 సంవత్సరాల నాటి రెండు సర్వే సెటిల్‌మెంట్ల లోనూ సంబంధిత ఆర్.ఎస్.ఆర్‌లలో (రీ సెటిల్‌మెంట్ సర్వే రిజిష్టర్స్) ను గిరిజనేతరులు భూమి హక్కుదార్లుగా నమోదై పట్టాలు పొందారు గనుక, వాటిని పరిగణనలోకి తీసుకోకుండా ఒకప్పుడు ఆ భూములు గిరిజనులు సాగు చేసినవే అనే 'ప్రిజంప్షన్ క్లాజు'తో ఇకీనాడు గిరిజనేతరులు మరోసారి ఆ భూములు తాము చట్టబద్ధంగా పొందినవేనని రుజువు చేసుకోవాల్సిన అవసరం లేదని, ఇందుకు సంబంధించిన 1/70 ఆంక్ష అర్థరహితమని సభాసంఘ నివేదిక అంటోంది. ఏజెన్సీ గ్రామాలలో ఈ ఆర్.ఎస్.ఆర్. రికార్డుల ద్వారానే కదా గిరిజనుల భూములన్నింటినీ గిరిజనేతరులు కాజేసింది! ఈ వాస్తవాన్ని విస్మరిస్తూ ఈ సర్వేలకి, వీటి ద్వారా భూస్వాముల పొందిన పట్టాలకి ఎక్కడ లేని పవిత్రతని, సాధికారతని అందిస్తోంది సభా సంఘం. 1/70 చట్టంలోని ప్రిజంప్షన్ క్లాజుని (Presumption clause) అంటే- చారిత్రకంగా చూస్తే గిరిజనేతరులనేవారు సాగు చేస్తుండే భూములన్నీ ఒకానొకప్పుడు ఆదివాసీ గిరిజనులు సాగుయోగ్యం చేసినవే కదా అనే వివేకవంతమైన అవగాహనా ప్రాధాన్యతతో ఆలోచించడం- అనేదాన్ని సభాసంఘం చాలా ఆశ్చర్యంగా ప్రశ్నిస్తూ ఒకరకంగా దీన్ని తన నివేదికలో ఎద్దేవా చేసింది. అవును మరి! దోపిడీ భూస్వామ్య బడా బాబుల సేవకి అవసరమైన సేవక ప్రవృత్తికి భిన్నంగాను అదనంగాను ఎలాంటి సామాజిక, చారిత్రక దృష్టికోణాన్ని కలిగుండాల్సిన అవసరాన్ని పట్టించుకోని సభా సంఘానికి ఇది సహజమే! ప్రపంచబ్యాంకు పంతులయ్యలు చెప్పే పాఠాలు నేర్చుకుంటే చాలు, చరిత్రలు సామాజిక శాస్త్రాలు అవసరం లేదని బోధించగలిగిన అధినాయకుడి అనుచరగణం ఇంతకంటే ఆలోచించలేదు కదా! ఉభయ గోదావరి జిల్లాలకి చెందిన పాత రికార్డుల్ని (1907 నాటి గెజిటీర్, వాల్యూమ్స్ 384, 916) పరిశీలిస్తే ఈ రెండు జిల్లాల్లోని ఆదివాసీ తెగల స్వపరిపాలన గురించి, గిరిజన జమీందార్ల సంస్థానాల గురించి అబ్బురపరచే నిజాలు కనబడతాయి. ఏజెన్సీ భూములు మైదాన ప్రాంతాల భూబకాసురుల కబంధ హస్తాల్లోకి ఎలా పోయాయో కళ్లకి కట్టినట్టు చూపెడతాయి ఈ రికార్డులు!

దేశంలోని ఇంకే ఇతర రాష్ట్రంలోను లేని ఈ 1/70 చట్టం, దాని ఆంక్షలు ఒక్క మన రాష్ట్రంలోనే ఎందుకని చాలా అసహనంగా తన నివేదికలో ప్రశ్నిస్తోంది సభాసంఘం. షెడ్యూల్ ప్రాంతాలలోని భూరికార్డులకి సంబంధించి 1902, 1933 ల నాటి ఆర్.ఎస్.ఆర్.ల గురించి ఎంతో తెలివితేటల్ని ప్రదర్శిస్తూ మాట్లాడిన సభాసంఘం నివేదిక అన్నింటికి మించిన ముఖ్యమైన రికార్డు అయిన ఎల్.టి.ఆర్. (LTR-Land Transfer Regulation=భూబదలాయింపు రెగ్యులేషన్) గూర్చి ఏమీ మాట్లాడక పోవడం ఎందుకో! సభాసంఘం ఈ భూబదలాయింపు రెగ్యులేషన్‌పైగాని దృష్టి పెట్టి వుండినట్లయితే 1/70 భూబదలాయింపు రెగ్యులేషన్ ఆవిర్భావం, దాని చారిత్రక నేపథ్యం అర్థమై వుండేవి. ఇది ఇతర రాష్ట్రాలలో ఎందుకు లేదో, మన రాష్ట్రంలోనే ఇది ఎందుకు అమలులోకి వచ్చిందో సభాసంఘానికి అర్థమై వుండేది.

ఆదివాసీల స్వేచ్ఛా జీవనానికి బ్రిటీష్ హయాంలోనే గ్రహణం పట్టింది. అటవీ, అబ్కారీ, సివిల్, క్రిమినల్ చట్టాల దాడితో, రెవెన్యూ పెంపుదలే ధ్యేయంగా బ్రిటీష్ పాలన సాగింది. అటవీ శాఖాధికార్ల దోపిడీ దౌర్జన్యాలు పెచ్చరిల్లాయి. ఆదివాసుల్లో అశాంతి చెలరేగింది. 1803లో తూ.గో జిల్లాలో రంప ఆదివాసీ తిరుగుబాటు (రంప పితూరీగా ప్రభుత్వ రికార్డుల్లోకెక్కింది) కి నేపథ్యం ఇదే! 1830 నాటికే మైదాన ప్రాంతాల నుంచి ఏజెన్సీల్లోకి వలసలు ప్రారంభమయ్యాయి, గిరిజన వాసాలు కల్లోలానికి గురయ్యాయి. ఇకప్పుడు బ్రిటీష్ ప్రభుత్వం రెవెన్యూ బోర్డు సభ్యుడైన జార్జ్ రూసెల్‌ని ఆదివాసీ ప్రాంతాల పరిశీలనకు నియమించింది. గిరిజన హక్కులు (ప్రత్యేకంగా భూమిహక్కు) సాంప్రదాయాలు, ఆచారాలు

రక్షించబడాల్సిన అవసరముందని రూసెల్ నివేదిక సిఫారస్ చేసింది. పర్యవసానమే 1939లో విశాఖ, గంజాం జిల్లాలకి వర్తింపయిన ఒక ప్రత్యేక చట్టం వచ్చింది. ఈ చట్టం ప్రకారం కలెక్టర్ ఆదివాసీ ప్రాంతాలకి ప్రభుత్వ ఏజెంట్‌గా వ్యవహరిస్తాడు. దీన్నుంచే ఆదివాసీ ప్రాంతాలకి ఏజెన్సీ అనే వాడుక వచ్చింది. ఇప్పటికీ నాటి విశాఖ గంజాం జిల్లాల్లో భాగాలుగా వుండిన నేటి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, రాయఘడ, కొరాపుట్, మల్కన్‌గిరి ఆదివాసీ ప్రాంతాలని వాడుక భాషలో ఏజెన్సీలనే అంటారు. తరువాత 1874లో షెడ్యూల్డ్ జిల్లాల చట్టం వచ్చింది. ఇవేవీ గిరిజన అశాంతిని ఆందోళనల్ని చల్లార్చలేక పోయాయి. 1862, 1879లలో కోయలు తిరుగుబాట్లు చేశారు. అవిశ్రాంతంగా సాగుతూ వచ్చిన ఆదివాసీల పోరాటాల పర్యవసానమే 1917 భూబదలాయింపు రెగ్యులేషన్ (యల్.టి.ఆర్-1917) ఇదెంత అనాదరణతో మూలపడిందో ఎత్తి ఎండగడుతూ బ్రద్ధలై ముందుకొచ్చినదే 1922 నాటి అల్లూరి సీతారామరాజు నాయకత్వంలోని కోయల తిరుగుబాటు, ఆ తరువాత 1940లో కొమురంభీం నాయకత్వాన బ్రద్ధలైన గోండులు, కోలాంల తిరుగుబాటు. ఈ తిరుగుబాటు ఫలితంగానే తెలంగాణా ప్రాంతంలో నిజాం హయాంలో 1946లో 'గిరిజన ప్రాంతాల చట్టం' వచ్చింది. దీన్నే మరింత మెరుగుపరుస్తూ 1949లో 'హైదరాబాద్ గిరిజన ప్రాంతాల చట్టం' వచ్చింది. ఇది 1917 ఎల్.టి.ఆర్.కంటే కొంత మెరుగ్గానే అమలైందని చెప్పాలి.

గిరిజనుల భూమి తదితర స్థిరాస్తులు గిరిజనేతరులు పొందడాన్ని ఈ 1917 రెగ్యులేషన్ నిషేధించినప్పటికీ, ప్రభుత్వ ఏజెంట్ అనుమతితో గిరిజనేతరులు గిరిజనుల భూముల్ని కొనుక్కోవడాన్ని ఈ యల్.టి.ఆర్. అనుమతించింది. ఇంకేం! అమాయిక గిరిజనుల్ని వంచించడానికి భూస్వాములకి ఆమాత్రం వెసులుబాటు చాలును. ప్రభుత్వ ఏజెంట్‌ని ప్రసన్నం చేసుకోగల పెద్దవారే కదా వారు! గిరిజనుల చాలా భూములు గిరిజనేతర భూస్వాముల ఖాతాల్లోకి జారుకున్నాయి. ఈ లోపాన్ని సరిచేయడానికంటూ 1959లో మరో ఎల్.టి.ఆర్ వచ్చింది. ఇది ప్రభుత్వ ఏజెంట్ హక్కుల్ని రద్దు చేసింది. స్థిరాస్తుల జాబితాలో భూమితోపాటు ఇల్లు, పంట, కలప, చెట్లు కూడా కలిపింది. గిరిజనుల ఈ స్థిరాస్తులు గిరిజనేతరులకి ఏ రూపంలోనూ బదిలీ కారాదని అలాంటి బదిలీలని నిషేధించింది. కాని, ప్రభుత్వాధికారి ప్రత్యేక అనుమతితో కొనుక్కోవచ్చని ఒక మినహాయింపునిచ్చింది. అంతేకాదు, గిరిజనేతరుల మధ్య సాగే భూముల క్రయ విక్రయాల్ని (ఏజెన్సీలో) ఈ యల్.టి.ఆర్. అనుమతించింది. ఇదే వెసులుబాటుగా ఏజెన్సీలోకి గిరిజనేతరుల వలసలు ముమ్మరమయ్యాయి. ఏజెన్సీ ప్రాంతాలు ఉద్రిక్తమయ్యాయి.

1968-69లలో నక్సల్‌బరిలో రగిలిన సాయుధ రైతాంగ పోరాట నిప్పురవ్వ శ్రీకాకుళం ఏజెన్సీలో పెనుమంటై ప్రజ్వరిల్లింది. ఇది దావానలంలా రాష్ట్రంలోని ఇతర ఏజెన్సీ ప్రాంతాలన్నింటికీ తేలిగ్గానే వ్యాపించే పరిస్థితిని, ప్రమాదాన్ని పసిగట్టిన నాటి రాష్ట్ర పాలక ప్రభుత్వం ఆఘమేఘాలపై ఈ 1/70 ప్రత్యేక చట్టాన్ని రూపొందించి అమలుపెట్టింది. ఇదీ ఈ 1/70 రెగ్యులేషన్ యొక్క చారిత్రక నేపథ్యం! పాలకులు ప్రజోపయోగకరమైన చట్టాలు చేస్తూ వచ్చారంటే, తదనుగుణమైన చర్యలు చేపడుతూ వచ్చారంటే ప్రజాపోరాటాల పర్యవసానంగానే అనేది చారిత్రక సత్యం! మహత్తర తెలంగాణా రైతాంగ సాయుధ పోరాట పర్యవసానమే, దేశంలో వెరెక్కడా లేని తీరులో 'రక్షిత కౌల్దారీ చట్టం' అనేదాన్ని నాటి హైదరాబాద్ రాష్ట్ర ప్రభుత్వం చేయాల్సి వచ్చింది. 1917 ఎల్.టి.ఆర్.లోని ఒక లోటు కారణంగా భూస్వాములు వేలాది ఎకరాల గిరిజనుల భూముల్ని మింగేశారు. 1959 నాటి ఎల్.టి.ఆర్. కూడా ఆ లోటుని భర్తీ చేయలేదు, భూముల పరాయీకరణని నిరోధించలేక పోయింది. కనుకనే శ్రీకాకుళ గిరిజన రైతాంగ సాయుధ పోరాట నేపథ్యంలో ఈ 1/70 రెగ్యులేషన్ వచ్చింది. దీని ఈ నేపథ్య చరిత్ర తెలిసివుంటే దేశంలో ఇంకెక్కడా లేని ఈ చట్టం ఇక్కడే ఎందుకుందని సభాసంఘం ప్రశ్నించి వుండేది కాదు. చట్టాలనేవి ఊసుపోక తెచ్చేవి, పాలకుల బుర్రల్లోంచి ఊడొచ్చేవి కావు. పాలకుల ప్రయోజనాల రీత్యానో, పాలిత ప్రజల ప్రయోజనాల రీత్యానో రూపొందించ బడుతుంటాయి. దోపిడీ పాలకవర్గాల ప్రయోజనాల గూర్చి చెప్పే చట్టాలే తప్ప ప్రజా పోరాటాల పర్యవసానంగా అప్పుడప్పుడూ ప్రజల ప్రయోజనాల్ని చేకూర్చిపెట్టేవి కాకపోయినా కనీసం చెప్పే చట్టాలైనా వస్తుంటాయనే సంగతిని పట్టించుకోకుండా, ఆ మాత్రం ప్రజల ప్రయోజనాల గురించి చెప్పడాన్ని కూడా అనుమతించలేని అసహనాన్ని ప్రదర్శించుకుంది ఘనత వహించిన ఈ సభాసంఘం!

సభాసంఘం ఈ నివేదికలో చేసిన మరో దారుణమైన సిఫారస్ ఏమంటే-1/70 రెగ్యులేషన్ అమలుకి సంబంధించిన రూల్స్‌ని రూపొందించడంలో అప్పటి ప్రభుత్వం 8 సంవత్సరాలు జాప్యం చేసింది గనుక ఆ రూల్స్ అనేవి అమలులోకి రాడానికి ముందుండే 8 సం॥ల కాలం అంటే 1970-'78ల మధ్య 8 సం॥లలో జరిగిన భూబదలాయింపున్నింటికీ చట్టబద్ధత కల్పించాలనేది. వలస భూస్వాముల మనసులో కోరిక సరిగ్గా ఇదే! కాని వారు మరీ ఇంత పచ్చిగా అడగడానికి వెనుకాడారనే చెప్పాలి! ఎలాంటి సిగ్గూ బిడియం లేకుండా వారి తరపున సభాసంఘం మాత్రం అడుగేస్తోంది. దీని అంతస్సారమల్లా ఏమంటే 1/70 రెగ్యులేషన్ రద్దు రగడతో ఎలాంటి పనిలేకుండానే ఆ చట్టాన్ని కేవలం జీవశ్చవం చేసేయడమే!

ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజనేతర భూస్వాముల వాదనలు, ప్రయోజనాలని ఎలా ఔననిపించాలనే ఆరాటమే ఈ నివేదిక నిండా కనబడుతుంది. గిరిజనుల ఆకాంక్ష ఆరాటాలకి ఆవగింజంత స్థానం కూడా ఈ సభాసంఘ నివేదిక ఇవ్వలేదు. వలసకారుల చేతుల్లో ముందు ఏజెన్సీవాసుల భూములు కబ్జా అవుతాయి, తరువాత వ్యాపారం, ఆ క్రమంలో అక్కడ వలస వచ్చిన వారి జనాభాయే మెజారిటీ అయిపోయి కూర్చొంటుంది, ఇక దాన్నంటి పెట్టుకొని రాజకీయాధికారం అక్కడ రంగంమీదికొస్తుంది. ఈ క్రమంలో ఒక నాటికి యావత్ ఆదివాసీ ప్రాంతం పరాయీకరణ అయిపోతుంది. అమెరికాలోని రెడ్ ఇండియన్స్ పరిస్థితిలా తయారవుతుంది. ఆదివాసీల స్థితి ఉభయ గోదావరి జిల్లాల్లో జరిగింది. జరుగుతోంది ఇదే! గిరిజన ప్రాంతాల్లో గిరిజనేతరులకి ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతించింది, పొజిషన్ సరిఫికేట్లను ఇచ్చింది, దీనికిప్పుడు ఈ సభాసంఘం ఆమోద ముద్ర వేసింది.

ఏజెన్సీ ప్రాంతాలలో అసలేనాడూ ఒక సమస్యగానే తలెత్తని గిరిజనేతర పేదల గూర్చి సభాసంఘ నివేదిక గంభీరంగా వ్యాఖ్యానించేస్తోంది, గిరిజనేతర పేదలపై సానుభూతిని

కురిపించేస్తోంది. ఇది పరమ దగాకోరు ఎత్తుగడ! 1/70 నిబంధన రీత్యా గిరిజనేతర పేదలు సైతం తమ భూముల క్రయ విక్రయాలు చేసుకోలేకుండా కట్టడి అయిపోయారని సభాసంఘం మొసలి కన్నీరు కారుస్తోంది. ఏజెన్సీ ప్రాంతాలలోని గిరిజనేతర పేదలని సాటివారుగానే గిరిజనులు తొలినుంచీ చూస్తూ వస్తున్నారు. 1/70 చట్టానికి వెలిగా జరిగినా కూడా అలాంటి పేదల భూబదలాయింపుల్ని గిరిజనులేనాడూ ప్రశ్నించలేదు, అడ్డుకోలేదు. తమకి లాగే చట్టంగూర్చి తెలీక జరిగినవిగా వాటిని గుర్తిస్తూ అనుమతిస్తూనే వచ్చారు. ఒకవేళ ఇందుకు సంబంధించిన అరకొర వివాదాలు ఘర్షణలు తలెత్తినా అవి గిరిజనులు-గిరిజనేతర పేదలు సామరస్యంగా పరిష్కరించుకోదగ్గవే! వాటిలో ప్రభుత్వ జోక్యం అవసరం వుండదు. అసలు ఏజెన్సీ ప్రాంతాలలో భూముల అమ్మకాలు కొనుగోళ్ళు సమస్య అనేది అక్కడ తిష్టవేసిన వలస భూస్వాములది తప్ప గిరిజనులది గిరిజనేతర పేదలది కాదు. ఈ ఉభయులు తమకుండే చేరడు మూరడు భూముల్ని వుంచుకోడానికే చూస్తారు తప్ప అమ్ముకోరు అమ్ముకోవలసి రావడమంటే నిర్బంధంగానే! అలాంటి నిర్బంధ పరిస్థితులనుంచి గిరిజనుల భూమికి రక్షణ కల్పించడానికే 1/70 చట్టం. కనుక ఈ చట్ట రక్షణ గిరిజనులకి మాత్రమే కాదు, వారితో సహజీవనం చేస్తున్న గిరిజనేతర పేదల భూరక్షణకి కూడా ఇది అవసరమే! ఈ 1/70 చట్టమే లేకుంటే గిరిజనేతర పేదల భూమి అంగుళం కూడా మిగలదు. భూస్వామ్య తిమింగలాల నోట పడిపోతాయి.

1970కి ముందు జరిగిన భూబదలాయింపులకి కూడా ఈ చట్టం తీవ్ర ఆటంకాలు కలిగిస్తోందని సభాసంఘ నివేదిక అంగలారుస్తోంది. కావాలని పరిస్థితిని గందరగోళపరచి చూపుని దారి మళ్లింపచేసే దగాకోరు, దండాకోరు వాదనే ఇది. 1970కి ముందు జరిగిన భూక్రయ విక్రయాలన్నింటినీ ఒక రకంగా 1/70 చట్టం సాఫీగానే సానుకూలం చేసేసింది. అదీ హెచ్చుపాళ్లు గిరిజనేతర భూస్వాములకనుకూలంగానే చేసింది. ఈ నిజాన్ని గుర్తించే సుప్రీంకోర్టు సైతం ఈ చట్టం అమలులోకి వచ్చిన తరువాతి కాలంపైనే దృష్టి పెడుతూనే తీర్పులనిచ్చింది. ఏమంటే ఈ చట్టంలోని 2/70 సెక్షన్ ప్రకారం 1970కి ముందు ఎనిమిది వరుస సంవత్సరాలు సాగులో వున్న గిరిజనేతరులు రైత్వారీ పట్టాకి అర్హులేనని అవకాశం కల్పించబడింది. ఆ రకంగా ఈ చట్టం నీడలోనే అనేకమంది గిరిజనేతర బడాబాబులు చాలా తేలిగ్గానే '70లకి ముందు వరుస 8 సంవత్సరాల సాగు రికార్డులు సృష్టించుకుని చాలా భూముల్ని కింద వేసుకున్నారు.

కనుక మిగిలివున్న సమస్య, అసలు సమస్యల్లా 70ల తరువాత ప్రత్యేకించి '70-'78ల మధ్య సాగిన వందలవేల ఎకరాల అక్రమ భూబదలాయింపులకి సంబంధించినదే! కనుకనే, ఇక ఏ సమస్యా మిగల్చకుండా వీటిని సైతం చట్టబద్ధం చేసేయమని తన నివేదికలో సిఫారస్ చేస్తూ సభాసంఘం ఆదివాసుల్ని ఆదివాసీ పోరాటాల్ని వెక్కిరిస్తోంది!

అంటే-ఏజెన్సీలలో భూబకాసురులుగా తిష్టవేసిన సంపన్న వలస భూస్వామ్య వర్గాల ప్రయోజనాలని రక్షించడం అనేది చంద్రబాబు ప్రభుత్వ తక్షణావసరంగా అర్థం చేసుకోవాలి. 1/70 చట్టంపై చంద్రబాబు నిన్నటిదాకా ప్రదర్శిస్తూ వచ్చిన కసుర్లు విసుర్ల వైఖరికి ప్రేరణ ఇదే1 కాని మారిన, మారుతున్న తాజా పరిస్థితుల్లో చంద్రబాబు లక్ష్యం ఈ మాత్రంకే పరిమితమై లేదు. ఈనాడు చంద్రబాబు కోరుతున్నది వలస భూస్వామ్య పెత్తందార్ల సంతృప్తి మాత్రమే కాదు, అంతకుమించిన విశేష ప్రయోజనాన్ని అతడు ఆశిస్తున్నాడు.

## చంద్రబాబు దూకుడుకి సంబంధించిన దీర్ఘకాలిక వ్యూహం

సభాసంఘం ప్రభుత్వానికందించిన నివేదికను నిశితంగా పరిశీలిస్తే ఇందులో చంద్రబాబు ఆశిస్తున్న విశేష ప్రయోజన మేమిటనేది అర్థమవుతుంది. విస్తృత స్థాయిలో భూముల అమ్మకపు మార్కెట్‌ని ఏర్పరచాలనే అసాధారణ ఆతృత అనేది ఈ నివేదికలో కొట్టొచ్చినట్టుగా కనపడుతుంది. ఇది ఇప్పటి చంద్రబాబు అవసరం. ''అమ్మకానికి ఆంధ్రప్రదేశ్' అంటూ బోర్డు తగిలించుకుని, పాలకవర్గాల సేవకుడిగా ప్రపంచబ్యాంకు ఏజెంట్‌గా చంద్రబాబు విదేశీ సామ్రాజ్యవాదుల కాళ్ళుచుట్టూ పెట్టుబడుల కోసం దేబరిస్తున్న తీరు నిత్యం చూస్తూనే వున్నాం. పర్యావరణాన్ని; జీవావరణాన్ని; జాతుల చరిత్రని, సంస్కృతిని, యావత్ మనుగడని; మానవ సంబంధాల్ని, విలువల్ని అన్నింటిని సర్వనాశనం చేసే సామ్రాజ్యవాద పెట్టుబడులకి ఆదివాసీ షెడ్యూల్ ప్రాంతాల ద్వారాలను బార్లా తెరుస్తున్నాడు చంద్రాబు! సర్వ విధ్వంసక సామ్రాజ్యవాద పెట్టుబడులకి బలై ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే 87 ఆదిమజాతులు నామరూపాల్లేకుండా నశించిపోయాయి. సామ్రాజ్యవాద పెట్టుబడుల విధ్వంసకర అభివృద్ధికి ఆదిమవాసులు అణగారి పోవడానికి ఆదిమ తెగలు తెగలుగానే అంతరించుకు పోవడానికి మధ్య వుండే అంతస్సంబంధాన్ని మనం అర్థం చేసుకోవాలి! పిడికెడు పెట్టుబడిదార్ల ధనాపేక్ష లాభోన్మాదం అనేవి జాతుల మనుగడనే బలి కోరుతాయి. సామ్రాజ్యవాదులకి ఊడిగం చేసే పాలకవర్గాలు వారి సేవక ప్రభుత్వాలు ధనపిశాచాలకి ప్రజల్ని నిర్దయగా బలిపెడుతున్నాయి.

కనుకనే, ఇటీవలి వరకు ఈసమస్యని చూసే తీరు ఆ పరిమితులు చాలవు. ఇదీనాడు కేవలం ఏజెన్సీల్లోకి వలసపోయి స్థిరపడిన మైదాన ప్రాంతాల భూస్వాములకి-గిరిజనులకి మధ్య పరిష్కరించ బడాల్సిన సమస్యగాను, వైరుధ్యంగానే లేదు. ఇదీనాడు కేవలం ఏజెన్సీ ప్రాంతాల్లోని ఆదివాసీల భూహక్కు రక్షణ సమస్యగానే లేదు. ఆదివాసీ తెగల అస్థిత్వ సమస్య అయిపోయింది. కనకు ఈ 1/70 రెగ్యులేషన్‌కి ఏ చిన్న సవరణని గాని, ఎలాంటి వెసులుబాటుని గాని అనుమతించని, అంగీకరించని సుధృఢవైఖరి కలిగి వుండటం అవసరం! ఎందుకంటే, ఇలాంటి దృఢవైఖరితో ఆదివాసీలిప్పటికే పోగొట్టుకున్న భూములు తిరిగి పొందగలగడానికి మాత్రమే కాదు, అలా పొందవచ్చు పొందలేక పోవచ్చు, అది సమస్య కాదు, అయినా ప్రధాన సమస్యకాదు! ఇలాంటి ధృఢవైఖరి ద్వారా అదనపు వలసల్ని నిరోధించవచ్చు! ఇదీనాడు అత్యవసరం! ఏజెన్సీ ప్రాంతాల్లో ఈనాడు బద్దలవుతున్న సమస్య వైరుధ్యాలనేవి గిరిజన, గిరిజనేతర పేదలు ఒక పక్షంగాను; గిరిజనేతర సంపన్న భూస్వామ్య శక్తులు, వారికి వత్తాసుగా నిలుస్తున్న ప్రభుత్వం ఇంకొక పక్షం అనే తీరులో కాకుండా ఇందులో గిరిజన, గిరిజనేతర పేదల వైరుధ్యం సైతం వున్నట్లుగా చూడ్డం, దాన్ని సైతం ముందుకి నెట్టే వైఖరిని ప్రదర్శించడం అనేది పరమ అసంగతం,

అభివృద్ధి నిరోధకం, సంకుచితం అయిన వైఖరే అవుతుంది. ఏమంటే ఇది నిజానికి గిరిజనేతర సంపన్న భూస్వాములకి ఉపయోగపడే వాదన వైఖరే అవుతుంది. కేవల సూత్రరీత్యానే కాదు, భౌతిక వాస్తవికత రీత్యా కూడా గిరిజన, గిరిజనేతర పేదల మధ్య ఐక్యత సామరస్యాలు అనేవే ప్రధానాంశాలుగా వుంటున్నాయి తప్ప ఘర్షణ, వైరుధ్యం అనేవి కానేకావు! కనుక గిరిజనేతర పేదల ప్రయోజనాల పరిరక్షణ సైతం అవసరమే కదా అంటూ అనవసర గంభీరతని ప్రదర్శిస్తూ 1/70 చట్టానికి సవరణల సన్నాయి నొక్కులు నొక్కుతూ, ఎలాంటి సవరణలనైనా ఆమోదించేవారు, అనుమతించేవారు తమనితాము ఏమని ప్రకటించుకుంటున్నా, ఆదివాసులకి ఆదివాసుల ఉద్యమానికి వ్యతిరేకులుగా మలచబడి మారిపోక తప్పదు!

## గవర్నర్ రంగరాజన్ నిర్లక్ష్యాన్ని గట్టిగా నిలెయ్యాలి!

చంద్రబాబు, అతడి సభా సంఘం, రాని నివేదిక సిఫార్సులు, వాటి అమలు-వీటన్నింటికీ ఎదురొడ్డి పోరాడ్డంలో ఒక ముఖ్య భాగంగా రాష్ట్ర గవర్నర్ రంగరాజన్ ఎందుకిలా నిద్రపోతున్నాడో తెలుసుకోవాల్సిన, అతడ్ని కుదిపి లేపాల్సిన అవసరం వుంది. ఏమంటే- భారత రాజ్యాంగంలోని 5, 6 షెడ్యూల్స్ ప్రకారం ఆదివాసీలు ఎక్కువగా నివసించే ప్రాంతాలను రాష్ట్రపతి షెడ్యూల్డ్ ప్రాంతాలుగా ప్రకటిస్తాడు. మన రాష్ట్రంలోని షెడ్యూల్ ప్రాంతాలకు 5వ షెడ్యూల్ మాత్రమే వర్తింపు అవుతుంది. రాష్ట్రంలోని షెడ్యూల్ ప్రాంతాలన్నింటిలోనూ ఈ షెడ్యూల్ సక్రమమైన అమలుని పర్యవేక్షించే బాధ్యత రాష్ట్ర గవర్నర్‌ది. ఈ షెడ్యూల్ ప్రకారం రాష్ట్ర గవర్నర్ షెడ్యూల్ ప్రాంతాలను సాధారణ చట్టాల పరిధినుంచి మినహాయించడానికి, సాధారణ చట్టాల్ని సవరించడానికి, లేక ఆ ప్రాంతాలకి కొత్త చట్టాలని చేయడానికి అతడికి రాజ్యాంగ రీత్యా హక్కు, అధికారాలు వున్నాయి. (1/70 ఇలానే వచ్చింది). ఇది గవర్నర్‌కి రాజ్యాంగపరంగా వుండే విశేష హక్కు, అధికారం మాత్రమే కాదు, అంతకు మించి ఇది అతడి రాజ్యాంగపరమైన విధి, బాధ్యత కూడా! గిరిజనేతరుల వలసల దాడి దోపిడీల నుంచి గిరిజనులకి రక్షణ కల్పిస్తూ వారి సంక్షేమాన్ని పెంపొందించగల ప్రత్యేక చట్టాలను తయారు చేయడానికి, వాటిని నిరాటంకంగా అమలు చేయడానికే రాజ్యాంగంలో ఈ షెడ్యూల్ పొందుపరచబడింది.

బూర్జువా ఆర్థిక నిపుణుడుగా పెద్ద పేరున్న, రిజర్వు బ్యాంకుకి గవర్నర్‌గా పనిచేసిన అనుభవాన్ని వెనకేసుకున్న ఘనత వహించిన రంగరాజన్ రాష్ట్ర గవర్నర్‌గా తన రాజ్యాంగ విధుల్ని నిర్వర్తించడానికి ఈ పదవిలో నియమించబడ్డాడనడానికి నిదర్శనంగా ఏ చిన్న దాఖలా కనబడదు. ఇందుకు విరుద్ధంగా ప్రపంచబ్యాంకుకి ఛీఫ్ ఎక్జిక్యూటివ్‌గా పనిచేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకి ప్రపంచబ్యాంకు ఆర్థిక సూత్రాలు నియమాలపై తర్ఫీదు ఇవ్వడానికే రాష్ట్ర గవర్నర్ పదవి చేపట్టాడా అనిపిస్తుంది. ఏభై శాతం (50%) మించి ఆదివాసీలుండే ప్రాంతాలే షెడ్యూల్ ప్రాంతాలుగా గుర్తించబడతాయని ఆ మధ్య చంద్రబాబు ప్రకటించాడు. ఏది షెడ్యూల్ ప్రాంతమో ఎందుకో ప్రకటించే హక్కు, అధికారాలు చంద్రబాబుకి లేవు! అది దేశాధ్యక్షుడి హక్కు, దేశాధ్యక్షుని తరపున రాష్ట్ర గవర్నర్‌కి సంతరించే హక్కు మాత్రమే! కాని చంద్రబాబు దూకుడు ప్రకటనపై రాష్ట్ర గవర్నర్ నోరు మెదపడు. రాజ్యాంగాన్ని మార్చేడానికి (అంటే దాన్ని మరింత ఫాసిస్టీకరించడానికి) కేంద్రంలోని బి.జె.పి. నాయకత్వంలోని ఎన్.డి.ఏ. ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది, సమీక్షా సంఘాన్ని వేసింది. కాని ఏ సంఘాలు సమీక్షలు అనే వాటితో సంబంధం లేకుండానే చంద్రబాబు తన తీరులో రాజ్యాంగాన్ని మార్చేస్తున్నట్టే కనబడుతోంది! ఇందుకు రాష్ట్ర గవర్నర్ తన మౌనం ద్వారా అంగీకరించేస్తున్నట్లే కనబడుతోంది.

## విజన్ 2020, గ్రీన్ 2020ల నేపథ్యంలో 1/70పై జరుగుతున్న దాడిని చూడాలి!

షెడ్యూల్ ప్రాంతాల హోదాకి సంబంధించి చంద్రబాబు ఇటీవల చేసిన ప్రకటన చాలా ప్రమాద సూచకమైనది. అనేక ఆదివాసీ గ్రామాలను, ప్రాంతాలను షెడ్యూల్ పరిధినుంచి తప్పించే కుట్ర ఇందులో వుంది. ఇది ఇప్పుడు చంద్రబాబుకి ఎంతైనా అవసరం! ఎందుకో అర్థం చేసుకోవాలంటే చంద్రబాబు ప్రభుత్వం ప్రపంచబ్యాంకు ఆదేశాల మేరకే విపరీత ప్రచారంతో ముందుకి పెడుతున్న 'విజన్ 2020' అందులో అతి ముఖ్యమైన భాగం అయిన 'గ్రీన్ 2020' (వ్యవసాయ విధానం)లను లోతుగా అర్థం చేసుకోవాల్సి వుంటుంది. వ్యవసాయ రంగంలో సమూల మార్పులు చేయ సంకల్పిస్తూ నూతన వ్యవసాయ విధానాన్ని రూపొందించడానికి అవసరమైన కసరత్తు కోసం గడచిన నవంబర్‌లోనే చంద్రబాబు ప్రభుత్వం ఒక కేబినెట్ సబ్ కమిటీని నియమించింది. అక్కడ అక్కడా సదస్సులు చర్చలు అభిప్రాయ సేకరణలు, సలహాలు పేరుతో తంతు నడిపివేసిన ఈ సబ్ కమిటీ గడచిన సంవత్సరాంతానికే తన నివేదికని అందజేసింది. ఈ నివేదికను అనుసరించి చంద్రబాబు ప్రభుత్వం వ్యవసాయ విధానంపై ఒక 'కార్యాచరణ ప్రతిపాదన పత్రం'ని విడుదల చేసింది. 1991లో ప్రపంచబ్యాంకు ప్రకటించిన వ్యవసాయ పత్రానికి కేవలం నకలు తప్ప ఇది వేరు కాదు! ఈ కార్యాచరణ పత్రంలోని అతి కీలకాంశం ఏమంటే విస్తరణ కార్యక్రమాలకు పెద్దపీట వేయడం. అంటే అపారమైన దేశీయ వ్యవసాయ భూముల్ని దేశీయ బడా పారిశ్రామికవేత్తలకీ, కార్పోరేషన్లకీ, విదేశీ బహుళజాతి కంపెనీలకి కట్టబెట్టడం. దీనికోసం సన్నకారు, చిన్నకారు, మధ్య తరగతి రైతాంగమంతటినీ భూములనుంచి ఖాళీ చేయించాలి. మోతుబరులైన కొద్దిమంది ధనికరైతులు, బడా భూస్వాములు మాత్రమే భూములపై మిగలాలి. రాష్ట్రం మొత్తంపై మైదాన ప్రాంతాలలో జరగనున్నది జరుగుతున్నది ఇదే! ఈ అవసర రీత్యానే షెడ్యూల్ ప్రాంతాల లోని ఆదివాసీలను తెగలు తెగలుగానే వారి భూములనుంచి వెళ్ళగొట్టించేందుకుగాను భూములపై వారు ఆధారపడలేని పరిస్థితుల్ని కల్పించాలి. 1/70కి బిగిస్తున్న ఉచ్చు వెనుక చంద్రబాబు ప్రభుత్వ అసలు పథకం ఇది!

## ఆదివాసీలు తమ భూమిహక్కుని, మనుగడని రక్షించుకోవడం కోసం రాజ్యంతో రాజీలేని సమరశీల పోరాటాలకు సమాయత్తం కాక తప్పదు!

1991 జనాభా లెక్కల ప్రకారం పశ్చిమ గోదావరి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలోని మొత్తం జనాభా 1.36 లక్షలుకాగా అందులో గిరిజనులు 85 వేలమందిగాను, మిగతా 51 వేల మంది

**(తరువాయి 59వ పేజీలో)**

# సామ్రాజ్యవాద సంకెళ్ళను తెంచుతున్న తూర్పుతైమూర్ ప్రజా ఉద్యమం

1999 మొదట్లో సామ్రాజ్యవాదుల వ్యూహాత్మక రాజకీయ ఎత్తుగడలు కొసావోలో మారణకాండను సృష్టించడమేగాక మొత్తం యుగోస్లావియాలో హైటెక్ యుద్ధ జ్వాలలను రగుల్కొల్పినాయి. అవే ఎత్తుగడలు సంవత్సరం చివర్లో తూర్పుతైమూర్‌కి సార్వభౌమాధికారాన్ని 'ప్రసాదించే' మిషతో వేలాది తైమూరీ ప్రజలపై దారుణ హత్యాకాండకు దారి కల్పించాయి. శతాబ్దాలుగా పోర్చుగీసుల వలసపాలనలో వుండి, 1976లో ఇండోనేషియా దురాక్రమణకు గురైన తూర్పుతైమూర్ ఇపుడు సామ్రాజ్యవాద సైన్యాల 'సంరక్షణ'లో చిక్కుకు పోయింది. వలస పాలన నుండి విముక్తికి ప్రయత్నించే ఏ జాతినైనా సామ్రాజ్యవాదులూ, స్థానిక దళారీలూ తమ కుట్రలూ, కుమ్మక్కుల రాజకీయాలతో, ఎలా అణచి పెట్టి వుంచుతారో చెప్పే మరొక స్పష్టమైన ఉదాహరణగా తూర్పుతైమూర్ ఈ సహస్రాబ్ది చివరలో సైతం ప్రపంచం ముందు నిలుస్తోంది.

1998 మే నెలలో ఇండోనేషియా నరహంతక పాలకుడు సుహార్తో సామ్రాజ్యవాదుల మద్దతు కోల్పోయి గద్దె దిగాడు. ఆ తర్వాత తూర్పు తైమూర్‌లో మరోసారి స్వాతంత్ర్య కాంక్షతో వెల్లువెత్తిన ప్రజా పోరాటాలు 1999 ఆగస్ట్ చివరకు పరాకాష్టకు చేరుకున్నాయి. ఆగస్టు 30న ఇండోనేషియా నుండి 'సంపూర్ణ స్వాతంత్ర్యం' అన్న అంశంపై తూర్పుతైమూర్ ప్రజల అభిప్రాయాన్ని కోరుతూ ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో వోటింగ్ జరిగింది. పేరుకి తూర్పుతైమూర్ ''ప్రజానీకంతో సంప్రదింపు'' అనే రూపంలో ఇది జరిగినా సారాంశంలో ఇది 'ప్రజాభిప్రాయ సేకరణే' (ప్లెబిసైట్) తప్ప మరొకటి కాదు. తూర్పు తైమూర్ రాజకీయ భవితవ్యాన్ని నిర్దేశించే లక్ష్యంతో కూడిన ఈ చర్యకు తూర్పుతైమూర్ ప్రజలు సరిగ్గానే స్పందించారు. (తూర్పుతైమూర్ రాజకీయ భవితవ్యంపై ఐక్యరాజ్యసమితికి, పాశ్చాత్య దేశాలకు ఇంత శ్రద్ధాసక్తులు ఎందుకన్నది తర్వాత చూద్దాం).

నాలుగన్నర లక్షల మంది తూర్పుతైమూర్ ఓటర్లలో 78.5 శాతం తమ జాతి స్వాతంత్ర్యానికి అనుకూలంగా ఓటేశారు. (ఒకప్పటి పోర్చుగీసు వలస ప్రాంతంగాను, తర్వాత ఇండోనేషియా దురాక్రమిత ప్రాంతంగానూ తూర్పుతైమూర్ ఇంతవరకూ కొనసాగుతూంది.) ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి కోఫీ అన్నన్ సెప్టెంబర్ 4న ఓటింగ్ ఫలితాలను ప్రకటించాడు. కేవలం 21 శాతం ఓటర్లు మాత్రమే తూర్పుతైమూర్‌ని ఇండోనేషియా రక్షణలో 'విస్తృత స్వయంప్రతిపత్తి కల్గిన ప్రాంతం'గా వుండటానికి అనుకూలంగా ఓటేశారని ప్రపంచానికి వెల్లడయింది. అయితే రెండు దశాబ్దాలకు పైగా దురాక్రమణలో వున్న తూర్పుతైమూరీలు ఎటువైపు మొగ్గేదీ పసిగట్టిన ఇండోనేషియా అనుకూల సాయుధ మిలీషియా మూకలు భారీ ఎత్తున విధ్వంసానికి, హింసాత్మక చర్యలకు పూనుకున్నాయి. ఇండోనేషియా పెంచి పోషించిన ఈ సాయుధ మూకలు తూర్పుతైమూర్‌లోని నగరాలను, పట్టణాలను కాల్చివేస్తూ, లూటీచేస్తూ సాగించిన విధ్వంసక చర్యల్లో వేలాదిమంది తైమూరీలు కిరాతక హత్యల పాలైనారు. లక్షలాదిమంది నిరాశ్రయులై ప్రాణాలరచేతిలో పెట్టుకుని పరుగులు తీశారు.

''తూర్పు తైమూర్ ఐక్యరాజ్య సమితి సహాయక సమితి'' (యు.ఎన్.ఎ.యమ్.ఇ.టి.) కి చెందిన ఉద్యోగులపై, పాశ్చాత్య దేశాల పరిశీలకులపైకి కూడా స్వాతంత్ర్య వ్యతిరేక మూకలు తమ దాడిని గురిపెట్టడంతో ఇదంతా ఇండోనేషియా సైన్యం, ప్రభుత్వ యంత్రాంగం కనుసన్నల్లోనే పరోక్షంగా జరుగుతోందని తెలిసి పోయింది. ఇండోనేషియా పాలకవర్గాల మద్దతుతోనే తూర్పుతైమూర్ భవితవ్యాన్ని 'నూతన మార్గం' వైపుకు మళ్ళించి మొత్తం ఆగ్నేయాసియా ప్రాంతంలో తమ వ్యూహాత్మక ప్రయోజనాలను యధాతధంగా కాపాడుకోవాలన్న పథకంతో వుండిన సామ్రాజ్యవాదులు పరిస్థితి చేజారిపోతున్నదని గ్రహించి తమదైన ప్రత్యేక శైలి రాజకీయాలకు తెరలేపారు. స్వాతంత్ర్య వ్యతిరేక సాయుధ మూకల విధ్వంసక చర్యల వల్ల తూర్పుతైమూర్‌లో నెలకొన్న అరాచకమైన, ప్రమాదకరమైన పరిస్థితి ఇండోనేషియాను చుట్టుముట్టి జాతి సంఘర్షణలను, తిరుగుబాట్లను రేకెత్తించనున్నదని సామ్రాజ్య వాదులకు అర్థమైంది. దీంతో శరవేగంగా వారు పావులు కదిపారు. తూర్పుతైమూర్ హింసా జ్వాలల్లో దహించుకు పోతూండగా సెప్టెంబర్ 9న న్యూజిలాండ్‌లోని ఆక్‌లాండ్‌లో సమావేశమైన ఆసియా ఫసిఫిక్ ఆర్థిక సహకార సమితి (ఏ.పి.ఇ.సి.) లోని సామ్రాజ్యవాద సభ్యదేశాలు నాలుగు రోజులపాటు తర్జన భర్జనలు జరిపాయి. ప్రధానంగా న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, కెనడా, వీటితో జతగలిపిన అమెరికాలు ప్రత్యక్ష చర్యకు ఆమోద ముద్ర వేశాయి. దీనికనుకూలంగా తూర్పుతైమూర్‌లో శాంతి భద్రతల పరిరక్షణ కోసం ఆస్ట్రేలియా నేతృత్వంలో బహుళ జాతీయ సైన్యం అడుగు పెట్టింది. ఈ బహుళ జాతీయ సైనిక విన్యాసాలకు ఐక్యరాజ్యసమితి ఆమోద ముద్ర సాధికారంగానే లభించిందని వేరే చెప్పక్కర్లేదు.

సెప్టెంబర్ 19న క్షిపణులతో కూడిన యుద్ధనౌకలలో, ఓడలలో 8,000 మందితో కూడిన శక్తివంతమైన బహుళ జాతీయ సైన్యం ఆస్ట్రేలియన్ కమాండర్ నాయకత్వంలో ఈశాన్య ఆస్ట్రేలియాలోని డార్విన్ జలమార్గం నుండి తూర్పుతైమూర్‌కి యాత్ర మొదలెట్టింది. అయితే రెండు దశాబ్దాల క్రితం తూర్పుతైమూర్‌పై ఇండోనేషియా దురాక్రమణను ఆమోదించి ఇండోనేషియాలోని ఒకానొక పాలనా విభాగంగా తూర్పుతైమూర్‌ని గుర్తించిన ఏకైక ప్రపంచ రాజ్యమైన ఆస్ట్రేలియా ఇపుడు అదే తూర్పు తైమూర్‌లో స్వాతంత్ర్య స్థాపనకు, శాంతి భద్రతల పరిరక్షణకు నడుంకట్టి నిస్సిగ్గుగా ముందుకు వచ్చింది. తూర్పు తైమూర్‌పై దురాక్రమణను ప్రత్యక్షంగాను, పరోక్షంగానూ ఆనాడు సమర్థించిన సామ్రాజ్యవాద దేశాలు ఈరోజు కూడా ఆగ్నేయాసియా ప్రాంతంలో తమ మొత్తం ప్రయోజనాల కోసమే పూర్తిగా వ్యతిరేక దిశలో పావులు కదిపాయి. ఈ నేపథ్యంలో తూర్పుతైమూర్ చరిత్రను తడుముతూ పాశ్చాత్య దేశాల కూటనీతిని విశ్లేషిద్దాం.

## వలస పాలన నుండి దురాక్రమణ దాకా.....

ఆస్ట్రేలియాకి 200 మైళ్ళ దూరంలో, ఇండోనేషియాకి ఆగ్నేయ దిశలో నెలకొన్న ద్వీప భాగమే తూర్పు తైమూర్. 1511లో వర్తక, వ్యాపారాల రీత్యా పోర్చుగీసులు తూర్పు తైమూర్‌లోకి అడుగుపెట్టారు. ఆనాటికే స్థానిక 'అటోనీ' జాతి ప్రజలతో పాటు భారతీయులు, ఆఫ్రికన్లు, చైనీయులు, మలయన్లు, అరబ్బుల వంటి పలు మిశ్రమ జాతులు ఇక్కడ నివసిస్తూండేవారు. ఈ వివిధ జాతుల ప్రజలు శతాబ్దాలుగా పడుగు పేకల్లాగా కలసిమెలసి వుండేవారు. 1976లో ఇండోనేషియా దురాక్రమించే నాటికి తూర్పుతైమూర్‌లో 70 శాతం మంది ప్రజలు ప్రాచ్య సంస్కృతికి సంబంధించిన సర్వాత్మవాదాన్ని (ఆనిమిజమ్ = రాళ్ళకు, చెట్లకు, గాలికి అన్నింటికీ ఆత్మలున్నాయని, ప్రతిదాంట్లోనూ జీవముందని నమ్మే మత భావన) నమ్మేవారు. తక్కిన వారు క్యాథలిక్ క్రిస్టియన్లు. మత దురభిప్రాయాలు లేని ఈ భిన్న మతాల ప్రజలతో కూడిన తూర్పుతైమూర్ జాతుల, మతాల; ప్రాచీనత, ఆధునికతల సమాహారంగా వుండేది.

పోర్చుగీసులు తొలినుండీ తూర్పుతైమూర్ నుండి ఎర్ర చందనాన్ని, ఇతర సహజ వనరులను తరలించుకుపోయే వర్తక, వ్యాపారుల్లాగే వ్యవహరించారు. ఇతర వలస వాదులతో పోలిస్తే బలహీనమైన, వెనుకబడిన వలసవాద సామ్రాజ్యమైన పోర్చుగీస్, తూర్పుతైమూర్ నాగరికతను విచ్ఛిన్నం చేయడానికి పూనుకోలేదు. బ్రిటీష్‌వారు ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లలో స్థానిక తెగలను నిర్మూలించి, శాశ్వతంగా స్థిర నివాసమేర్పరుచుకున్న విధంగా తాము కూడా తూర్పుతైమూర్‌లో స్థిర నివాసమేర్పరుచుకోవాలని పోర్చుగీసులు ప్రయత్నించలేదు. గణాలూ, గ్రామస్థాయి యూనిట్లుగా విభజింపబడి వున్న ఆదివాసీ బృందాలతో కూడిన అసంఖ్యాక రాజ్యాలుగా విడిపోయి వుండిన తూర్పుతైమూర్‌లో పోర్చుగీసులు తమ వ్యాపార సంరక్షణకై చిన్న సైన్యాన్ని ఏర్పరుచుకున్నారంతే. రెండో ప్రపంచ యుద్ధకాలంలో పోర్చుగీసు తటస్థంగానే వుండిపోయింది.

1942లో జపాన్ తూర్పుతైమూర్‌తో సహా ఇండోనేషియాను మొత్తంగా ఆక్రమించింది. ఆ సమయంలో తూర్పుతైమూర్‌లో వుండిన పోర్చుగీస్ సైనిక విభాగాలు జపాన్ దురాక్రమణదారులను ప్రతిఘటించలేదు. మరోవైపు జపానీయులు కూడా పోర్చుగీసులను తూర్పుతైమూర్ నుండి తరిమి వేయడానికీ ప్రయత్నించలేదు. అయితే బ్రిటీష్ సామ్రాజ్యవాదులకు నిలయాలుగా వుండిన ఇరుగుపొరుగు దేశాలలోకి, ప్రత్యేకించి ఆస్ట్రేలియాలోకి చొరబడటానికై జపాన్ సైన్యం తూర్పుతైమూర్‌లో వైమానిక స్థావరాలను నిర్మించటం మొదలెట్టింది. ఆస్ట్రేలియా కూడా జపాన్ దాడులను తిప్పి కొట్టేందుకుగాను జపాన్ బలగాలకు వ్యతిరేకంగా సైనిక దళాలను దింపి గెరిల్లా యుద్ధాన్ని మొదలెట్టింది. పోర్చుగల్ తటస్థంగా వున్నప్పటికీ తూర్పుతైమూర్ ఇలా ప్రపంచ యుద్ధంలోకి ఈడ్వబడింది. పోరాడుతున్న సామ్రాజ్యవాద సైన్యాల యుద్ధరంగంగా మారి పోయింది. జపాన్ బలగాలు పెద్ద ఎత్తున తమను ఇతర ప్రాంతాలకు తరలించడాన్ని, తమ భూములను దోచుకోవడాన్ని ప్రతిఘటించేందుకుగాను తూర్పుతైమూర్ ప్రజలు తమకు తాముగా జపాన్ దురాక్రమణదారులకు వ్యతిరేకంగా పోరాడారు. ఈ క్రమంలో రెండో ప్రపంచ యుద్ధం 60,000 మంది తైమూరీలను బలిగొంది. ఆనాటికి తూర్పుతైమూర్ జనాభా 6 లక్షలు మాత్రమే, అంటే మొత్తం జనాభాలో 10శాతం ప్రాణాలు కోల్పోయారు. ప్రపంచ యుద్ధం ముగిశాక ఇండోనేషియా స్వాతంత్ర్యం పొందినా తూర్పుతైమూర్ మాత్రం పోర్చుగీసు పాలనలోనే వుండిపోయింది.

పోర్చుగల్ ఆధీనంలోని పలు ఆఫ్రికన్ వలస దేశాలు (అంగోలా, మొజాంబిక్, గినియా, బిసెయా మొ॥నవి) 1950ల నుండి పోర్చుగీసులకు వ్యతిరేకంగా సాయుధ పోరాటాలు ప్రారంభించాయి. అయితే జపాన్ దురాక్రమణ దారులకు వ్యతిరేకంగా 60,000 మంది తైమూరీ ప్రజలు ప్రాణాలర్పించినప్పటికీ, మొత్తం వలస పాలనకు వ్యతిరేకంగా బలమైన జాతీయ పోరాటంకాని, సాయుధ పోరాటంకాని మొదలుకాని ప్రత్యేక పరిస్థితుల్లో తూర్పు తైమూర్ చాలా కాలం వుండిపోయింది. ఈ శతాబ్ది మొదట్నుండి, ప్రత్యేకించి రెండో ప్రపంచ యుద్ధం తర్వాత నుండి ప్రపంచం మొత్తంగా రాజకీయ కార్యాచరణలో మునిగి తేలుతున్నప్పటికీ 1974 వరకూ తూర్పుతైమూర్ సమాజంలో ఎలాంటి రాజకీయ పార్టీ కూడా లేకపోవటమనే పరిస్థితి వుండేది. చిరకాలంగా తైమూర్ ప్రజల శాంతికాముక చరిత్ర, పోర్చుగీసులు తొలినుండి దానితో వ్యవహరించిన తీరు వంటివే ఇందుకు కారణాలు. పోర్చుగల్ సమాజంలో అంతర్గతంగా ఏర్పడిన రాజకీయ సంక్షోభమే తూర్పుతైమూర్ స్వాతంత్ర్య కాంక్షను వేగిరపర్చింది. సాధారణంగానే బలహీనమైన వలసవాద సామ్రాజ్యమైన పోర్చుగీసు 1950ల తర్వాత మరింతగా బలహీనపడింది. ఆఫ్రికాలోని తన వలసలలో మొదలైన సాయుధ, ప్రజాపోరాటాల ఫలితంగా పోర్చుగల్ సమాజంలోనూ, దాని సాయుధ బలగాల్లోనూ సంక్షోభం వృద్ధి చెందింది. ఈ క్రమంలో రాజధాని లిస్బన్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా యువ, కిందిస్థాయి సైనికాధికారులు తిరుగుబాటు చేసి సైనిక పాలకులను గద్దెదించారు. ఈ విధంగా పోర్చుగీస్‌లో సైనిక నియంత సాలాజార్ నెలకొల్పిన పాలన అంతమయింది. అక్కడ ప్రభుత్వ వ్యతిరేక సాయుధబలగాల ఉద్యమం మొదట్నుంచీ వామపక్ష స్వభావంతో కూడి వుండేది. అందుకే అది సైనిక పాలన అంతమయాక ఇక తాను వలసలను కొనసాగించనని, వాటికి స్వాతంత్ర్యాన్ని కల్పిస్తానని ప్రకటించింది. 1974 నాటికి పోర్చుగీస్ చరిత్ర ఇలాగుండేది. శరవేగంగా జరిగిన ఈ పరిణామాల తర్వాతే తూర్పుతైమూర్‌లో స్వాతంత్ర్యం గురించిన భావన ప్రవేశించి, తూర్పుతైమూర్ మేల్కొంది. ఈ విధంగా తూర్పు తైమూర్‌లో రాజకీయ కార్యాచరణకు రంగం సిద్ధమయినప్పటినుంచే అది ప్రపంచం దృష్టిని ఆకర్షించ సాగింది. 1974-76 మధ్య రెండు సం॥ల లోపు జరిగిన పరిణామాలు తూర్పుతైమూర్‌ని కదిలించి వేశాయి. సామ్రాజ్యవాదుల రాజకీయ ఎత్తుగడలలో తూర్పుతైమూర్ మరోసారి చిక్కుకుపోయి ఇండోనేషియా దురాక్రమణకు గురైంది.

## వెంటాడిన 'కమ్యూనిస్టు భూతం'

1974లో తూర్పుతైమూర్‌లో రాజకీయ కదలికలు పొడసూపగానే విభిన్న వర్గ శక్తులు తమ సొంత ఎజెండాలతో, ప్రణాళికలతో ప్రజల ముందుకొచ్చాయి. ఆ సంవత్సరం ఏప్రిల్‌లో లిస్బన్‌లో కల్లోలం తర్వాత ఒక నెలలోపే తూర్పు తైమూర్‌లో మూడు రాజకీయ పార్టీలు ఆవిర్భవించాయి. వీటిలో మొదటిది ''తైమూర్ ప్రజాతంత్ర యూనియన్'' (యు.డి.టి.) ఇది వలస పాలనాధికార

యంత్రాంగంలోని కులీనవర్గంతో, కాఫీ తోటల యజమానులతో కూడిన సంస్థ. తన సామాజిక పునాదికనుగుణంగానే, స్వతంత్ర తైమూర్ గురించిన ఆలోచనేలేని ఈ సంస్థ మొదట్లో పోర్చుగల్‌తో సమాఖ్యకు కూడా పిలుపిచ్చింది. ఇక రెండోది తైమూర్ ప్రజల మేలుకోసం కొన్ని నిజమైన ఆర్థిక సంస్కరణలను డిమాండు చేస్తూ వచ్చిన యువ పెటీబూర్జువా జాతీయవాదులు స్థాపించిన ''తైమూర్ సోషల్ డెమాక్రటిక్ ఆసోసియేషన్'' (ఏ.యస్.డి.టి.). ఇదే తర్వాత 'స్వతంత్ర తూర్పు తైమూర్ విప్లవ ఫ్రంట్' (FRETIPLIN)గా మారింది. ఇక మూడోది ''తైమూరీస్ పాపులర్ డెమాక్రటిక్ అసోసియేషన్''(APODETI). పశ్చిమ తైమూర్ ప్రజలతో సన్నిహిత సంబంధాలున్న ఈ పార్టీకి ''ఇండోనేషియాలో సమైక్యం కావటు''మన్నది రాజకీయ నినాదంగా వుండేది.

తూర్పుతైమూర్ రాజకీయ రంగానికి సంబంధించి రెండో పార్టీ అయిన 'ఫ్రెటిలిన్'కే ప్రాధాన్యత వుంది. 'స్వతంత్ర తూర్పు తైమూర్ విప్లవ ఫ్రంట్' అనే దీని పేరులో 'విముక్తి' అనే పదమే లేదు. ఆ రోజుల్లో ఆఫ్రికాలో సాగుతున్న అనేక సాయుధ పోరాటాల ద్వారా ఈ పదం చాలా పేరుగాంచింది. సామ్రాజ్యవాద వ్యతిరేకులకు, అట్లే కుహనా సామ్రాజ్యవాద వ్యతిరేకులకు కూడా ఈ విముక్తి అనే పదం విస్తృత స్థాయిలో ఊతపదంగా వుండేది. అలాంటిది పై 'విప్లవ ఫ్రంట్' ఈ 'విముక్తి' పదాన్ని వాడనప్పటికీ దాన్ని కమ్యూనిస్ట్ పార్టీగా ఆరోపిస్తూ బూర్జువా మీడియా, సామ్రాజ్యవాదులూ నిందించారు. నిజానికి వీరు నిజమైన జాతీయవాదులే తప్ప కమ్యూనిస్టులు కారు. వలస పాలన పొడవునా కార్మికవర్గానికి, ప్రజారాసులకూ వ్యతిరేకంగా తాము చేసిన సుదీర్ఘ పోరాటంలో సామ్రాజ్యవాదులు ఈ 'నిజమైన జాతీయవాదాన్ని' చాలా హేయంగానూ, నిరసన భావంతోనూ చూశారన్నది ఇక్కడ గుర్తు తెచ్చుకోవాలి. ఈ పార్టీని నడుపుతున్న వారు తమ పెటీబూర్జువా మూలాల కారణంగా జాతీయవాదం మొదలుకుని, విప్లవకర జాతీయవాదం, బూర్జువా ప్రజాస్వామ్యం, సోషల్ డెమాక్రసీ, అస్పష్టరూపంలోని 'మార్క్సిజం' వరకు వివిధ ప్రగతిశీల సిద్ధాంతాల చేత ప్రభావితులవుతూ వచ్చారు. మొత్తంమీద తూర్పుతైమూర్ సమస్యపట్ల వివిధ సామ్రాజ్యవాదుల, దళారీ ప్రభుత్వాల వైఖరిని నిర్దేశించటంలో ఈ 'విప్లవ ఫ్రంట్' జాతీయవాదమే నిర్ణాయక పాత్ర వహించింది. ఇది ఇండోనేషియా, పోర్చుగల్ అనుకూల గ్రూపులు రెండింటినీ వ్యతిరేకిస్తూ ''మరో దేశానికి అమ్ముడుబోయేందుకు మనం ఆలుగడ్డలం కాదు'' అని ప్రకటించింది. తైమూర్ ప్రజలను అట్టడుగుస్థాయి నుండి సమీకరించి, స్వాతంత్ర్య భావనతో వారిని మేల్కొల్పనారంభించింది. ఈ ఫ్రంట్ కార్యకర్తలు అక్షరాస్యతా క్యాంపెయిన్‌లు జరిపి బడులని, ఆస్పత్రులను స్థాపించారు. వివిధ కోఆపరేటివ్ పథకాలను ప్రారంభించారు. క్రమంగా ఇది గ్రామీణ ప్రాంతాన్ని మొత్తంగా ఇముడ్చుకున్న బలమైన ప్రజా ఉద్యమంగా మారింది.

వీటికంటే మించి పోర్చుగల్‌లో చదువుతూ అక్కడి తిరుగుబాట్లతో, వామపక్ష, రాడికల్ సిద్ధాంతాలతో ప్రభావితులైన తూర్పుతైమూర్ విద్యార్థులు స్వదేశానికి తిరిగొచ్చాక ఈ 'విప్లవ ఫ్రంట్'లో చేరిపోయారు. సామ్రాజ్యవాద దేశాలూ, ఆగ్నేయాసియా ప్రగతి నిరోధక ప్రభుత్వాలూ కనుబొమలెగరేయడానికి ఇది చాలు కదా! దీనికి తోడుగా 1975 జనవరిలో ఈ విప్లవ ఫ్రంట్ స్వాతంత్ర్యాన్ని డిమాండ్ చేస్తూ తైమూరీస్ ప్రజాతంత్ర యూనియన్ (యు.డి.టి.) తో ఐక్య సంఘటనకు దిగింది. అయితే ఈ ఐక్యసంఘటన స్వాతంత్ర్యం కోసం ఉమ్మడి ప్రచారం మొదలెట్టకముందే ఇండోనేషియా ఏజెంట్లు యు.డి.టి.ని ప్రభావితం చేసి ఘర్షణలను రెచ్చగొట్టిన ఫలితంగా నెలరోజుల లోపే ఇరుపక్షాలలో దాదాపు 2000 మంది పోరాటయోధులు చంపబడినారు. ఇక ఆ తర్వాతే 'విప్లవ ఫ్రంట్'ని నిరాయుధం చేయకపోతే, తూర్పుతైమూర్ ఇండోనేషియాలో భాగం కాకపోతే పరిస్థితులు చేజారిపోతాయని ఇండోనేషియా తన సామ్రాజ్యవాద యజమానులకు నచ్చబలికింది. అప్పటికే ఇండోచైనా (వియత్నాం, కాంబోడియా)లో అమెరికా ఓటమి దరిదాపుల్లోకి పోవటం; దూరప్రాచ్యం, ఆగ్నేయాసియా ప్రాంతం మొత్తంలో సామ్రాజ్యవాద పునాదులు కదలిపోయే పరిస్థితుల నేపథ్యంలో సామ్రాజ్యవాద దేశాలు ప్రత్యేకించి అమెరికా, ఆస్ట్రేలియాలు కలవరపడినాయి. 'విప్లవ ఫ్రంట్' తూర్పుతైమూర్‌ని కమ్యూనిస్టు తిరుగుబాటుకు మరో స్థావరంగా మారుస్తుందని ఆందోళన చెందిన సామ్రాజ్యవాదులు తూర్పుతైమూర్‌లో తిరుగుబాటు వెల్లువను అదుపులో వుంచేందుకు నిశ్చయించారు. దీంతో సామ్రాజ్యవాదుల పెంపుడుకుక్క అయిన ఇండోనేషియా అధ్యక్షుడు సుహార్తో మళ్లీ రంగంమీదికొచ్చాడు. మొత్తం ఆసియా ఖండంలోనే కమ్యూనిజాన్ని అడ్డుకునేందుకు; మావోయిస్ట్ చైనాని చుట్టుముట్టేందుకు సామ్రాజ్యవాదులకు అత్యవసరమైన వ్యూహంలో భాగంగా అప్పటికే ఈ నికృష్టుడు స్వదేశంలో 10 లక్షల మంది ప్రజలను, కమ్యూనిస్టులను ఊచకోత కోసి 'నూతన వ్యవస్థ'ను స్థాపించి వున్నాడు. ఆసియాలో 'కమ్యూనిస్టు భూతం' బారిన పడివున్న సామ్రాజ్యవాదులు ఈ విధంగా మరోసారి ఈ కర్కశ నియంతను ఉసిగొల్పారు. సామ్రాజ్యవాదులూ, ఇండోనేషియా చెరో వైపునా అవకాశం కోసం గుడ్లగూబల్లా కాచుకుని వుంటూండగా ఆ అవకాశం రానే వచ్చింది. పోర్చుగీసులు తైమూరును ఇక పట్టించుకోవటం దాదాపుగా మానివేసి స్వదేశానికి వెనుదిరిగే పనిలో వుంటూండగా 1975 నవంబర్ 28న ఫ్రెటిలిన్ (విప్లవ ఫ్రంట్) ఏకపక్షంగా తూర్పుతైమూర్ స్వాతంత్ర్య ప్రకటనను గావించింది. వాస్తవంగానే అప్పటికే పరిపాలన 'ఫ్రెటిలిన్' చేతుల్లో వుండిపోయింది. లాంఛనంగా స్వాతంత్ర్య ప్రకటన చేసిన మరుక్షణం నుండే దురాక్రమణకు రంగం సిద్ధమైంది.

## సామ్రాజ్యవాదుల దుర్మార్గ పాత్ర

తూర్పుతైమూర్‌ని ఇండోనేషియా దురాక్రమించిన తర్వాత గత పాతికేళ్ళుగా జరుగుతూ వస్తున్న పరిణామాలు సామ్రాజ్యవాదుల నికృష్ట దౌత్యానికి, వారి వ్యూహాత్మక రాజకీయాల నయవంచనకు పరమ ప్రామాణిక ఉదాహరణలుగా నిలుస్తాయి. 1975 డిసెంబర్ నుండి 1976 ఫిబ్రవరి లోపల తూర్పుతైమూర్‌లో ఇండోనేషియా దురాక్రమణ సైనిక బలగాలు జరిపిన హేయమైన దాడిలో 60,000 మంది తైమూరీలు చనిపోయారు. 99 ఆగస్ట్ నెలలో 'ప్రజాభిప్రాయ సేకరణ' అనంతరం జరిగిన సాయుధ మూకల విశృంఖల విహారం నాటికి మొత్తం మృతుల సంఖ్య 2 లక్షలకు దాటింది. అమెరికా కిరాయి సేనలు వియత్నాంలో జరిపిన వూచకోతలను తలదన్నుతూ ఇండోనేషియా సైనిక బలగాలు తూర్పుతైమూర్‌లో గ్రామాలకు గ్రామాలనే ధ్వంసంచేసి వాటిలోని ప్రజానీకాన్ని మొత్తంగా

నిర్మూలించి వేశాయి. ''నువ్వొక పొలాన్ని శుద్ధి చేసేటపుడు దానిలోని చిన్న పెద్ద, పిల్ల, ముదురు పాములన్నింటినీ చంపుతావు మరి'' ఇది ఆ హత్యాకాండపై ఇండోనేషియా సైనికాధికారి వ్యాఖ్య. దురాక్రమణ బలగాలపై నేరారోపణకు ఇంతకంటే మించిన రుజువేముంది? తేనె పూసిన కత్తుల లాంటి సామ్రాజ్యవాదుల ఆమోదముద్ర కూడా లభించింది. తూర్పుతైమూర్‌పై ఇండోనేషియా దురాక్రమణను, దాని ఫలితంగా శాంతికాముక ప్రజల మాతృభూమిలో జరిగిన రక్తపాతాన్ని గురించి అప్పటి అమెరికా అధ్యక్షుడు ఫోర్డ్ ఎలాంటి వ్యాఖ్య చేయకుండా సమాధానాన్ని దాటవేశాడు. కాని అతడి పత్రికా కార్యదర్శి మాత్రం ''హింస ఎక్కడ జరిగినా అధ్యక్షుడు బాధపడుతూనే వుంటాడు'' అనే ఏక వాక్య ప్రకటన ఇచ్చాడు. ఒక సామ్రాజ్యవాది కపటత్వాన్ని ఇది బండెడు గ్రంథాల పరిమాణంలో విడమర్చి చెబుతుంది. ఇండోనేషియాలో భాగం కావటం ద్వారానే తూర్పు తైమూర్‌కి వాస్తవమైన, ఉత్తమమైన భవిష్యత్తుకు ఆస్కారముందని ఆస్ట్రేలియా ప్రధాని ప్రకటించి దురాక్రమణను నేరుగా సమర్థించాడు. మొత్తంగా ఈ వ్యవహారంలో ఎవరి ప్రయోజనాలు వారికి వున్నాయి. ఆగ్నేయాసియాలో మరో 'కమ్యూనిస్టు భూతానికి' తావియ్యకూడదని ప్రయోజనం అమెరికాదయితే, తూర్పుతైమూర్ చుట్టూ గల చమురు నిక్షేపాలను కొల్లగొట్టే ప్రయోజనం ఆస్ట్రేలియాది. చమురు నిక్షేపాలను స్వతంత్ర తైమూర్ కంటే, దాన్ని ఆక్రమించిన ఇండోనేషియా అతి చవగ్గా ధారాదత్తం చేస్తుంది మరి. ఆ ప్రకారమే ''తైమూర్ గ్యాప్ ట్రీటీ'' పేరుతో ఒక ఆస్ట్రేలియా కంపెనీ తైమూర్ చుట్టుపక్కల చమురును తవ్వి ఉపయోగించేందుకుగాను హక్కులను పొందింది. ఈ ఒప్పందం 7 బిలియన్ బ్యారెళ్ళ మేరకు చమురును వందలాది కోట్ల డాలర్లను ఆస్ట్రేలియాకు అందిస్తుంది. తైమూర్ లోతట్టు ప్రాంతంలోని 'ప్రెటిలిన్' గెరిల్లా బలగాలతో పోరాటంలో ఫ్రాన్స్ ఇండోనేషియాకు తోడ్పడగలిగే యుద్ధ విమానాలను, రాపిడ్ ఫైరింగ్ తుపాకులను, టాంకులను, సాయుధ శకటాలను ఇండోనేషియాకు అమ్మడానికి సంబంధించిన ఒక పెద్ద ఆయుధ ఒప్పందాన్ని ఇండోనేషియాతో కుదుర్చుకుంది. దీనికి ప్రతిఫలంగా ఐక్యరాజ్య సమితిలో తూర్పుతైమూర్‌పై జరిగే చర్చలలో ఫ్రాన్స్ మౌనం వహించింది. ఇక బ్రిటన్‌లో థాచర్ ప్రభుత్వం అయితే తూర్పుతైమూర్ ప్రజలు స్వయం నిర్ణయాధికార హక్కును ఆచరించగల స్థితిలో లేరని తీర్పు చెప్పటమేగాదు..., తూర్పు తైమూర్‌లో ఇండోనేషియా బలగాల చేతుల్లో బలైన మృతుల సంఖ్య ఏమంత పెద్దగా లేదని కూడా నిస్సిగ్గుగా ప్రకటించింది. శవాలతో వ్యాపారం చేసే సీజనల్ వ్యాపారుల కంటే భిన్నంగా ఇవి వ్యవహరించలేదు. జపాన్ విషయానికొస్తే మధ్య ప్రాచ్యం నుండి దాని చమురు దారికి ఏ అడ్డంకులూ లేకుండా పోవాలంటే స్వతంత్ర తైమూర్ వునికిలో వుండకూడదు. 'కర్ణుడి చావుకు ఆరుగురు కారణ''మన్నట్లుగా స్వతంత్ర తైమూర్ ఆవిర్భావాన్ని అడ్డుకోవటంలో సామ్రాజ్యవాదులందరిదీ తిలాపాపం తలా పిడికెడు.

కానీ గుర్తుంచుకోవలసిందేమంటే నెలల తరబడి ఇండోనేషియా బలగాలు తూర్పుతైమూర్‌లో సాగించిన మానవ మారణకాండను గురించి 'నాగరిక ప్రపంచానికి చెందిన ఏ పాలకుడుగాని, ప్రచార మాధ్యమంగానీ, ఐక్యరాజ్య సమితిగానీ ఎన్నడూ మాట్లాడలేదు. పాశ్చాత్య దేశాల నుండి ఏ ఒక్కరు కూడా, సుహార్తో దారుణ హత్యాకాండల మూలంగా ఏర్పడిన 'సామూహిక మానవ సమాధుల'ను తవ్వి వెలికి తీయడానికి ప్రయత్నించిందీ లేదు. దాని గురించి మాట్లాడిందీ లేదు. కాని ఇదే 'నాగరిక' ప్రపంచం, దాని తొత్తు మీడియాలు సోవియట్ రష్యాలోని నిర్బంధ శిబిరాలను, కాంబోడియా పోల్‌పాట్ పాలనను గురించి ప్రపంచానికి పదే పదే గుర్తు చేస్తాయి. తమ సొంత ప్రయోజనాల కోసం సకల విలువలనూ తలక్రిందులు చేసే సామ్రాజ్యవాద విజేతల దృష్టిలో లోన్‌నాల్, సామోజా, పినోచెట్, సుహార్తో, మొబుటు, పుజిలు తృతీయ ప్రపంచపు 'సమర్థపాలకులు'గా కితాబులందుకుంటారు. తమ్మత్తాము పాలించడానికి అర్హతలేనివిగా ముద్రపడిన తూర్పుతైమూర్ వంటి వలస దేశాలు ఒక్కొక్కరు మహా హంతకులుగా తయారైన ఇలాంటి 'సమర్థ పాలకుల' జూదంలో పావులవుతాయి. శతాబ్దాల పర్యంతం వలసలను కబళించడానికి ఈ 'పాలనార్హతా రాహిత్య' సిద్ధాంత తర్కమే సామ్రాజ్యవాదులకు ఉపయోగపడుతూ వచ్చింది. ఈ 'పాలించే అర్హత లేకపోవటం' సామర్థ్యతా రాహిత్యం వంటి ఆరోపణల క్రమంలోనే యూరప్ దేశాలు వలస ప్రజలను, జాతులను మూకుమ్మడిగా నిర్మూలించాయి. మనుష్యులను బానిసలుగా అమ్మిపారేశాయి. జాతులకు జాతులనే, దేశాలకు దేశాలనే కొల్లగొట్టాయి. శతాబ్దాలపాటు వలసాధిపత్యం, పీడనల బారిన పడిన వలస ప్రజలు తమ గమ్యాన్ని తామే నిర్దేశించుకోవడానికి లేచి నిలబడే ప్రయత్నం చేసినా నాగరిక దేశాలు మరోసారి పై సిద్ధాంతాన్నే ముందుకు తెస్తాయి. పాలించలేని దేశాలు 'నాగరిక ప్రపంచం' అందించే పాలనా సాధనాలనే ఆమోదించి సర్దుకు పోవాలని, లేదంటే వాటికి నరకాన్ని చవిచూపిస్తామని నాగరిక దేశాలు చెబుతాయి. తూర్పుతైమూర్‌లో 'కమ్యూనిస్టు భూతం' ప్రమాదాన్ని అడ్డుకునేందుకుగానూ సామ్రాజ్య వాదులకు సుహార్తో సమర్థ పాలకుడయిపోయాడు. ఈ విధంగా ఒక పాలించే శక్తి లేని దేశం మరొక పాలించే శక్తి కల్గిన 'సమర్థ' పొరుగు దేశంలో ఇలా భాగమై పోయింది. పాతికేళ్ళ తర్వాత ఇపుడు సైతం పై సిద్ధాంతం వెలుగులోనే సామ్రాజ్యవాద దేశాలు 'శాంతి పరిరక్షణ' పేరుతో తూర్పుతైమూర్‌ను తమ తమ సైన్యాల ఏలుబడిలోకి తెచ్చుకుని 'సంరక్షిస్తు'న్నాయి.

## మూర్తీభవించిన అసమర్థతలో ఐక్యరాజ్యసమితి

ప్రపంచ ప్రజలందరి ప్రాణాలకు, వారి గౌరవప్రదమైన జీవనానికి, ప్రజాస్వామిక వ్యవస్థల మనుగడకూ హామీ పడగలనని ఢంకా భజాయించి ప్రకటించుకున్న ఐక్యరాజ్యసమితి ఉనికి ఏనాడో ప్రశ్నార్థకమై పోయింది. గత 50 సం॥లలో భద్రతామండలిలో శాశ్వత సభ్యతం వున్న దేశాలు ఎలా ఆడమంటే అలా ఆడుతున్న సమితి ఈ మధ్యకాలంలో అమెరికా ప్రభువులకు తాను ఎలా నడుచుకుంటే వారికి సంతోషం కలుగుతుందో అలా నడుచుకునే కొత్త పాత్రలోకి కుదించుకు పోయింది. ఐక్యరాజ్యసమితి ఎంత బలహీనమై పోయిందో, ఆ సమితిలో అంతర్భాగమైన భద్రతామండలి అసలు ఐక్యరాజ్యసమితి కంటే ఎంతటి బలోపేతమైనదో సాక్ష్యాలతో సహా నిరూపించటానికి ఒక్క తూర్పుతైమూరే చాలు. అమెరికాకు సన్నిహితంగా వుండే ఇండోనేషియాకు చీమకుట్టినంతైనా నొప్పి వుండకూడదన్న వుద్దేశంతోనే, తూర్పుతైమూర్‌లో ఇండోనేషియా ఎంతటి విలయం సృష్టించినా సమితి ఒక్క అడుగు ముందుకు వేయలేదు. తూర్పు తైమూర్‌లో స్వేచ్ఛగా రిఫరెండం జరిగేటట్లు చేయటంలోనే ఐక్యరాజ్యసమితి విఫలమైపోగా, ఆ తర్వాత జరిగిన సాయుధ మూకల విధ్వంసకాండను సైతం అది చేష్టలుడిగి చూస్తుండి పోయింది. 1976లోనూ, 1999లోనూ 'అంతర్జాతీయ సమాజం' (అంటే అమెరికా, దాని నేతృత్వంలోని సామ్రాజ్యవాద శక్తుల మూక మాత్రమే తప్ప మరేం కాదు. ప్రచ్ఛన్న యుద్ధానంతరం మీడియా ప్రభువులైన

ముర్డోక్, తదితరులు సృష్టించిన సరికొత్త పదబంధమిది) తూర్పుతైమూర్‌కి సంబంధించి కోరుకున్న 'శాంతియుత పరిష్కార' మార్గానికి తలుపులు తీస్తూ ఐక్యరాజ్యసమితికాని, మానవహక్కుల గురించి విషాద స్వరంతో ఆలపించే చర్చి బిషప్ కాని తూర్పుతైమూర్ నుండి ఒక విధంగా చెప్పాలంటే పారిపోయారు. 1975 చివరిలో కేవలం 2 నెలల వ్యవధిలో ఇండోనేషియా దురాక్రమణ సైన్యాలు రాజధాని 'డిలి'లో, దాని చుట్టుపక్కల నిక్రృష్టమైన మారణకాండకు దిగి 60,000 మంది తూర్పు తైమూరీలను ఊచకోత కోసిన సందర్భంలో, ఈ హంతక బలగాల రక్షణ వలయంలోనే వుండిన ఐక్యరాజ్యసమితి కానీ, చర్చి బిషప్, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత అయిన కార్గోస్‌బెలో కాని స్వచర్మ రక్షణార్థం తరలి వెళ్ళిపోయారు. తమ వెనుక నిస్సహాయంగా మిగిలిపోయిన సామాన్య ప్రజలకు ఏ గతి పట్టిందీ వీరు చెప్పలేక పోయారు. అటు దేవుడూ (బిషప్) ఇటు ఐక్యరాజ్యసమితీ రెండూ సమాధానం చెప్పలేక పోయాయి. ఈ అమానుషమైన, అమానవీయమైన మౌనం ఫలితంగా నగరాలు, పట్టణాలు, గ్రామాలు తూర్పుతైమూర్ మొత్తంగా కిరాయి సైన్యాల దహనకాండలో చిక్కుకుపోయింది. ఆరోజుకీ, ఈరోజుకీ పరిస్థితిలో తేడా లేదు. 1976 నుంచి 1999 వరకు తూర్పుతైమూర్‌లో సమితికాని, బిషప్‌కానీ లేరు.

''తూర్పు తైమూర్ ప్రాదేశిక సమగ్రతను అన్ని దేశాలూ గౌరవించాలని'' పిలుపిస్తూ, తన బలగాలను ఇండోనేషియా వెంటనే ఉపసంహరించుకోవాలంటూ ఐక్యరాజ్యసమితి ఇచ్చిన ఆదేశం ఈ 23 సం॥లలో ఎన్నడూ అమలులోకి రాలేదు. సరిగ్గా ఈ సుదీర్ఘకాలం పొడవునా ఇండోనేషియా సైన్యం 'ఫ్రెటిలిన్' గెరిల్లాలను దాదాపుగా నాశనం చేసింది. ప్రచ్ఛన్న యుద్ధం ముగిసి నూతన ప్రపంచ వ్యవస్థ ఉనికిలోకి వచ్చిన ఫలితంగా ఫ్రెటిలిన్ గ్రూప్‌ని కమ్యూనిస్టులుగా ఆరోపించాల్సిన అవసరం సామ్రాజ్యవాదులకు తీరిపోయింది. ఇప్పుడు సైతం తూర్పుతైమూర్‌కి 'శాంతి పరివర్తనా' క్రమాన్నే సమితి ప్రతిపాదించింది కాని 'తూర్పుతైమూర్‌కి స్వాతంత్ర్యం' అనే పదాన్ని కూడా భద్రతామండలి సూచించలేదు. 'ఇండోనేషియా లోపలే తూర్పుతైమూర్ స్వయంప్రతిపత్తి'కి సంబంధించి సంవత్సర కాలంగా సమితి ఆడిన నాటక క్రమం ఆగస్ట్ 30 ఎన్నికలతో పరాకాష్టకు చేరింది. స్వాతంత్ర్య కాంక్షపై తూర్పుతైమూరీల 'ప్రజాభిప్రాయాన్ని' సైతం గుర్తించని ఇండోనేషియా కిరాయి సైన్యాలు జరిపిన దారుణ హత్యాకాండ ఫలితంగా నేటికీ ''మానవ సామూహిక సమాధులు'' బయల్పడుతూనే వున్నాయి. ''అంతర్జాతీయ సమాజం'' రూపొందించిన పరిమితులను దాటకుండా 'శాంతి పరిరక్షణ' బలగాలను తూర్పుతైమూర్‌లో దింపిన సమితి అంతటితో తన పని ముగిసినట్లుగా సద్దుమణిగింది. గల్ఫ్ దురాక్రమణ దాడి కాలంలో, కొసావో సంక్షోభ కాలంలో అమెరికా కనుసన్నలలో సమితి వ్యవహరించిన తీరే ప్రస్తుతం తూర్పుతైమూర్‌లోనూ పునరావృత మయింది.

## తూర్పు తైమూరీల బాట

గల్ఫ్, కొసావో సంక్షోభాల్లో సామ్రాజ్యవాదులు ప్రత్యక్ష దాడులకు దిగినా, ఇండోనేషియాకు చీమకుట్టని రీతిలో తూర్పుతైమూర్‌లో శాంతి పరిరక్షక బలగాలను దింపినా ప్రతి సందర్భంలోనూ సామ్రాజ్యవాదుల రాజకీయ, ఆర్థిక, వ్యూహాత్మక ప్రయోజనాలే ప్రాధాన్యం వహించాయి. అయితే అక్కడికీ ఇక్కడికీ మార్పేమిటంటే ప్రపంచ శక్తులు ఇండోనేషియాతో విరోధం పెట్టుకోదల్చుకోలేదు. గల్ఫ్, యుగోస్లావియా సంఘటనలనే పునరావృతం చేసినట్లయితే, ఇండోనేషియా మొత్తంగా ముక్కలయ్యే ప్రమాదముంది. ఎందుకంటే తమ స్వంత స్వతంత్ర రాజ్యాల కోసం పోరాడుతున్న పలు జాతీయ గ్రూపులు ఇక్కడ వున్నాయి. ఆసియా, ఆఫ్రికా ఖండాల్లోని అన్ని దేశాల్లో నెలకొన్న జాతి సమస్యే ఇండోనేషియాలోనూ ఏర్పడితే అది పాశ్చాత్య దేశాలకు నూతన సమస్యగా మారగలదు. కొసావో ఇప్పటికే సామ్రాజ్యవాదులకు ముళ్ళదారిగా రుజువయింది. వెనుకబడిన దేశాల స్వాతంత్ర్య కాంక్ష జాతి సమస్య రూపంలోనే ప్రధానంగా బయటపడిన చారిత్ర అనుభవంతో సామ్రాజ్యవాదం కొత్తగా మరో కొరివిని నెత్తిన పెట్టుకో దల్చుకోలేదు. తూర్పుతైమూర్‌లో అస్తవ్యస్థత వుండాల్సిందే కాని అది తన ప్రయోజనాలకనుగుణంగా వుండాలి. అదే సమయంలో తైమూర్ నుండి తాము కొల్లగొట్టే మొత్తంలో ఇండోనేషియాకు కాసింత విదిలించి దాన్ని కూడా అదుపులో పెట్టుకోవాలి. సామ్రాజ్యవాదుల ఈ ద్వంద్వ ఎత్తుగడలలో పూర్తిగా నలిగిపోతున్నది తైమూరీలే. కానీ 1993లో తమ నాయకుడు జనానా గుస్‌మావో అరెస్ట్ తర్వాత ఫ్రెటిలిన్ గ్రూప్ ఐక్యరాజ్యసమితిపై ఆశలు పెట్టుకుని ఎక్కువగా దానిపై ఆధారపడుతూ వచ్చినందువల్ల, ఇండోనేషియా సైన్యం చేతుల్లో వరస పరాజయాల నుండి గుణపాఠాలను తీసుకుని అపజయాలను విజయాలుగా మార్చే క్రమానికి అది దూరంగా జరిగింది. దౌత్యం మీద ఆధారపడిన ఈ మార్గమే ఒక ప్రమాదకరమైన వుచ్చు లాంటిది. 'అంతర్జాతీయ సమాజం' ప్రజలపై అత్యంత మొరటు పద్ధతులలో స్వారీ చేస్తూ 'ప్రపంచాభిప్రాయాన్ని' తనకనుకూలంగా సృష్టించుకుంటూ పరిస్థితి డిమాండ్ చేసిన విధంగా శాంతియుతంగా గాని, బలాత్కారంగాగాని సమస్యను పరిష్కరించ డానికి ముందుకు కదులుతున్నటువంటి ప్రస్తుత 'నూతన ప్రపంచ వ్యవస్థ'లో ఇలాంటి వుచ్చు పలు విషాదాలకు దారిని సుగమం చేస్తుంది.

అందుకే 'ఫ్రెటిలిన్' మిత్రులను శత్రువులను వేరుపర్చి తీరాలి. వందలాది వేలాది మంది దేశ ప్రజలు, యుద్ధవీరులు తమ జీవితాలను ఫణంగా పెట్టి ఏర్పర్చిపోయిన లక్ష్యం వైపుగా అది ముందుకు పోవాలి. ఈరోజు అమెరికా కాని ఐక్యరాజ్య సమితికాని ఏదైనా ఒక సంఘర్షణలో ప్రధాన పాత్ర వహిస్తున్నప్పుడు అది విప్లవకారులను మరింత అప్రమత్తులను చేసి తీరుతుంది. అమెరికా వైపు దారి తీయటం అన్నది అని వార్యంగానే ఏ పోరాటాన్నయినా లొంగుబాటుకి, సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని శిరసావహించటానికి దారితీస్తుంది. పాలస్తీనా పోరాటం, దక్షిణాఫ్రికా జాతి వివక్షతా వ్యతిరేక పోరాటం దీన్నే నిరూపించాయి. వర్ణ వివక్షత అంతమయినాక తాను చేపడతానని వాగ్దానం చేసిన అన్ని చర్యలనూ మండేలా వదిలిపెట్టేశాడు. దక్షిణాఫ్రికా నుండి వారసత్వంగా పొందిన ఆర్థిక వ్యవస్థలో అతడు ఏ మార్పూ చేసిందీ లేదు. ఇక యాసర్ ఆరాఫత్ అయితే సామ్రాజ్యవాద యజమానుల ప్రయోజనాలను కాపాడ్డానికి పాలస్తీనా విప్లవాన్ని అణచివేసి, ఇజ్రెయిల్‌కి చట్టబద్ధతను కల్పించడానికిగాను పాలస్తీనా గెరిల్లా యోధులను పోలీసులుగా మార్చేశాడు. నెల్సన్ మండేలా, ఆరాఫత్‌లు పట్టిన దారి అటు దోపిడికి, ఇటు జాతీయ అణచివేతకు వ్యతిరేకంగా పోరాడుతున్న ఏ విప్లవోద్యమానికైనా తగిన మార్గం కానేరదు. అది మరెక్కడికో దారి తీయదు. సరిగ్గా చెప్పాలంటే అది మొబుటుల సుహార్తోల లేదా అక్వినోల, హబీబీల మార్గానికే బాటలేస్తుంది. కాబట్టి అన్ని రకాల శత్రువులకు, ప్రగతి నిరోధకులకు వ్యతిరేకంగా చివరిదాకా పోరాటాన్ని సాగించకుండా ఏ జాతికీ నిజమైన స్వాతంత్ర్యం సాధ్యపడదు. కాగా అది సుదూర స్వప్నంలాగే మిగిలి వుంటుంది. ❑

( 60వ పేజీ తరువాయి)

కనిపించకుండా పోయాడు. ఆరోజు సాయంత్రమే పోలీసులు వాడిని సురక్షిత స్థలానికి తీసుకెళ్ళారు. నిజానికి ఈ హత్యలకు సంబంధించిన వార్త విన్న తర్వాత ఆ మరుసటి దినమే మేము గోవిందరెడ్డి నివాసముంటున్న ఇంటి ఓనరుకి కబురు చేశాం. గోవిందరెడ్డి తన ఇంటికి తాళమేసి 1వ తేదీ సాయంత్రమే ఇంటినుండి వెళ్ళిపోయాడని తెలుసుకున్నాం.

★ హిందూస్తాన్ టైమ్స్, ఇండియన్ టైమ్స్, వార్త పత్రికలకు సంబంధించిన కొందరు విలేఖరులు డిసెంబర్ 9న బెంగుళూరులో ఆ ఇంటికి వెళ్ళి ఓనర్‌తో, అతడి కొడుకుతో, ఇరుగు పొరుగు వారితో మాట్లాడారు. మొదట్లో భయపడిపోయినప్పటికీ, కొంత ప్రయత్నం తర్వాత వారు 1వ తేదీన ఏమి జరిగిందనే విషయంపై మాట్లాడారు. ఇంటి యజమాని కొడుకు గేటువద్ద సాయుధులైన వారితో కూడిన రెండు మారుతీ వ్యాన్‌లను స్పష్టంగా చూశాడు. వారిలో కొందరు గోవిందరెడ్డి ఇంటిలోకి వెళ్ళి మా ఇద్దరు కామ్రేడ్స్ నోళ్ళకు ప్లాస్టర్ అంటించి వారిని తీసుకెళ్ళి పోయారు. ఆ ఇంట్లో అద్దెలకుంటున్న వారిని వారు నోరు తెరిస్తే తీవ్ర పరిణామాలుంటాయని బెదిరించారు. ఈ పత్రికా రిపోర్టులోని కొంత భాగం డిసెంబర్ 10/11 తేదీల్లో 'హిందూస్థాన్ టైమ్స్' పత్రికలో వచ్చింది. అయితే ఈ రిపోర్టు పత్రికల్లో కనిపించిన తర్వాత పోలీసులు ఇంటి ఓనరును, అద్దెకున్న వాళ్ళను మళ్ళీ బెదిరించారు.

డిసెంబర్ 11న ఒక నిజ నిర్ధారణ బృందం ఆ ఇంటికి వెళ్ళినపుడు ఇంటివారు వివరాలు చెప్పేందుకు వ్యతిరేకించారు. అయితే ఒకటికి నాలుగుసార్లు అడిగిన తర్వాత వారు నిజాలు బయటపెట్టారు. ఈ విషయం పత్రికల్లో వచ్చాక పోలీసులు తిరిగీ ఆ ఇంటికెళ్ళి హెచ్చరించారు. ఈసారి ఈ బెదిరింపులు పనిచేశాయి. డిసెంబర్ 23, 24 తేదీలలో ఒక అఖిల భారత నిజ నిర్ధారణ కమిటీ అక్కడికి వెళ్ళినపుడు అక్కడివారు నిజాలను మరోసారి చెప్పలేదు. సాక్షుల నోరు మూయించే 'ప్రజాస్వామిక' పద్ధతి ఇదన్నమాట. ఇప్పుడు ఆ ఇంటి యజమాని, అక్కడ అద్దెకున్నవారు మరోసారి వాస్తవాలను గురించి మాట్లాడతారని నేననుకోవటం లేదు. అయితే జరిగింది మాత్రం ఇదే.

★ మా కామ్రేడ్ల శరీరాలపై క్రూరమైన చిత్రహింసలకు సంబంధించిన ఆనవాళ్ళే వాళ్ళు అరెస్టు అయారని, కిరాతకంగా హింసించబడ్డారని, తర్వాత చంపబడినారని చెప్పేందుకు ఒక స్పష్టమైన రుజువుగా వుంటున్నాయి.

★ ఇక దళసభ్యుడిగా చిత్రించడానికి డి.జి.పి. దొర ప్రయత్నించిన నాలుగో వ్యక్తి నిజానికి ఎన్‌కౌంటర్ జరిగినట్లుగా చెప్పబడుతున్న స్థలానికి సమీప గ్రామమైన గర్జనపల్లి నుండి నవంబర్ 30వ తేదీనే అరెస్టయినాడు. డిసెంబర్ 2 తెల్లవారుజామునే మిగతా ముగ్గురితోపాటు ఇతడినీ కాల్చిచంపారు. ఇతడి ఫోటో పత్రికలలో వచ్చాక అతడి తల్లి గుర్తు పట్టింది. బెంగుళూరులో పార్టీ నేతల సమావేశం గురించిన సమాచారాన్ని పోలీసులు ఆ సమావేశంకి కొద్దిరోజుల ముందే ద్రోహి గోవిందరెడ్డి ద్వారా అందుకున్నందువల్ల ముగ్గురు కామ్రేడ్స్ అరెస్టు కావడానికి ఎంతో ముందుగానే ఈ ఎన్‌కౌంటర్ కుట్రకు పథకం జరిగిందని పై వాస్తవమే తెలుపుతోంది.

★ పోలీసులు పత్రికలకు విడుదల చేసిన ఎన్‌కౌంటర్ కథనాన్ని ప్రచార సాధనాలు సైతం ప్రశ్నించాయి. అది ఎంత చెత్తగా వుందంటే ఈ కథనాన్ని జనం నమ్మగలరని పోలీసులు ఎలా ఊహించారంటూ ఎవరైనా సరే ఆశ్చర్యపోతారు. నమ్మలేక పోవటమే కాదనుకోండి పోలీసుల మందబుద్ధికి అంతకు మించిన తెలివితేటలెక్కడివి లెమ్మనే ఎవరైనా అనుకునేంత చెత్తగా వుందది. ఉదాహరణకు సంఖ్య రీత్యా 30 మందిదాకా వున్నారని భావించబడుతున్న గెరిల్లాలతో దాదాపు 5 గంటలపాటు కాల్పులు జరిగాయని పోలీసుల ప్రకటన పేర్కొంది. చుట్టుపక్కల గ్రామాల ప్రజలుకానీ, ఆ స్థలానికి కేవలం కిలోమీటరు దూరంలో వున్న రోడ్డు మీదుగా పోతున్న ప్రజలుగాని ఎలాంటి కాల్పుల శబ్దం వినకుండా అంత హోరాహోరీగా ఎదురుకాల్పులు ఎలా జరిగాయని దారినబోయే దానయ్య సైతం సందేహపడతాడు. పైగా, మామీద ఎప్పుడు దాడి జరిగినా గెరిల్లా దళాలు నాయకులకు రక్షణ కల్పిస్తాయి. నాయకులను వదిలిపెట్టి దళసభ్యులు క్షేమంగా తప్పించుకున్నపుడు ముగ్గురు ముఖ్యమైన నాయకులు శత్రు దాడికి వ్యతిరేకంగా తమ్ముతాము కాపాడుకోవడానికి పక్కకు పోయారన్నదే ఏ రకంగా చూసినా ఊహించలేని విషయం. ఇంత 'సుదీర్ఘకాలంపాటు సాగిన కాల్పుల'లో ఒక్కడంటే ఒక్క పోలీసు కూడా గాయపడలేదని ఆ కథనం సాగటం మరింత నవ్వులాటగా వుంటుంది.

★ పోలీసులు ఈ ప్రకటన చేసిన తక్షణం 'ఎన్‌కౌంటర్' జరిగినట్లుగా చెప్పబడుతున్న స్థలానికి పోయేందుకు విలేఖరులను అనుమతించలేదన్న వాస్తవమే ప్రజలముందు వాస్తవాలు బయటపడతాయన్న పోలీసుల భయాన్ని ఎత్తిచూపుతోంది. అత్యున్నత స్థాయి న్యాయ విచారణకు ఏర్పాటు చేయటంవల్ల తన నిజ స్వరూపం బయటపడుతుందని ప్రభుత్వం భీతిల్లింది. అందుచేతే పలు సంఘాలూ, వ్యక్తులూ లేవనెత్తిన న్యాయ విచారణా డిమాండును అంగీకరించటానికి ప్రభుత్వం ససేమిరా అంటూ మొండికేసింది.

**3. మీ ఉద్యమంపై ఈ హత్యలు వేసే ప్రభావమేమిటి? మీ పార్టీపై అది కల్గించే శూన్యం మాట ఏమిటి?**

**4. ఈ నాయకుల సీనియారిటీ ఏమిటి? ఈ సంఘటనతో పీపుల్స్‌వార్ రెండో స్థాయి నాయకత్వం పూర్తిగా తుడిచిపెట్టుకు పోయిందని పోలీసులూ, ప్రచార సాధనాలూ చెబుతున్నాయి. ఇది నిజమా? నిజం కాకపోయినట్లయితే వారి స్థానంలోకి వచ్చేది ఎవరు? ఈ నష్టాలను మీరు ఎలా పూడ్చుకోగలరు?**

**జ.** ఈ రెండు ప్రశ్నలకూ దగ్గర సంబంధమున్నందువల్ల నేను ఈ రెండు ప్రశ్నలనూ ఒకటిగానే తీసుకుంటాను. మా పార్టీకి, భారత విప్లవోద్యమానికి ఈ ముగ్గురు ముఖ్యమైన కామ్రేడ్స్‌ని కోల్పోవటం నిస్సందేహంగానే చాలా పెద్ద దెబ్బ. దాదాపు రెండు దశాబ్దాల విప్లవ జీవితానుభవం కల్గిన ఈ ముగ్గురూ చాలా సీనియర్ కామ్రేడ్లే. పార్టీ రాజకీయ, సైనిక వ్యూహాన్ని పలు సమస్యలపై దాని ఎత్తుగడలను, విధానాలను అభివృద్ధి చేసి, సుసంపన్నం చేయటంలో, స్థిరంగానూ, పటిష్టంగానూ వాటిని అమలు చేయటంలో ఈ ముగ్గురు కామ్రేడ్స్ అమూల్యమైన సేవలందించారు. తమ విప్లవకర జీవితంలో చాలా భాగాన్ని వారు వర్గ పోరాట ప్రాంతాల్లో, గెరిల్లా దళాల మధ్య, పీడిత ప్రజానీకంలో గడిపారు. మార్క్సిజం-లెనినిజం-మావో ఆలోచనా విధానానికి స్థిరంగా కట్టుబడి వుంటూనే తమ ఆలోచన, ఆచరణలలో వీరు సృజనాత్మకంగా వుండేవారు. అత్యంత నిరాడంబరంగానూ, ముక్కుసూటి తత్వంతో వుండేవారు. నాయకులుగా వారెన్నడూ డాంబికాన్ని ప్రదర్శించలేదు. మొత్తం పార్టీ శ్రేణుల, ప్రజానీకం ప్రేమానురాగాలను వీరు పొందారు.

కా॥ శ్యాం ఎమర్జెన్సీకి కాస్త ముందుగా 1974లో పూర్తికాలం విప్లవకారుడిగా ఉద్యమంలో చేరాడు. 1975 జూన్ నెలలో ఎమర్జెన్సీ ప్రకటించడంతో తను అజ్ఞాతంలోకి వెళ్ళాడు. మొట్టమొదటిసారిగా 1986లో అరెస్టయినాడు. శత్రువు చేతుల్లో క్రూరాతి క్రూరమైన చిత్రహింసలకు గురైై కూడా ఒక్కటంటే ఒక్క రహస్యాన్ని సైతం బయటపెట్టలేదు. ఆ చిత్రహింసల ప్రభావంతో జీవితాంతం బాధపడుతూ వచ్చినప్పటికీ 1988 చివరిలో జైలునుండి తప్పించుకున్న తర్వాత కేడర్లకు బోధిస్తూ, మార్గ నిర్దేశం చేస్తూ నిరంతరం వర్గపోరాట రంగంలోనే వుంటూ వచ్చాడు. ఉద్యమాన్ని ప్రత్యక్ష ఆచరణతో అధ్యయనం చేయటం ద్వారా ఉద్యమాన్ని చక్కగా అర్థం చేసుకుంటూ వచ్చినందువల్ల ఇటీవలి సం॥లలో తన ఎదుగుదల తీవ్రస్థాయిలో పెరిగింది. ఉద్యమం ఎదుర్కొన్న సమస్యలను ఆకళింపు చేసుకున్నాడు. ఉత్తర తెలంగాణాలో మా వుద్యమంపై ఆర్థికవాదం ప్రభావాన్ని గురించి తన అమరత్వానికి కొద్దిరోజులకు ముందుగా మంచి అధ్యయనంతో కూడిన ఒక వ్యాసం రాశాడు.

కా॥ మహేష్ 1978-79 కాలంలో ఉస్మానియా యూనివర్శిటీలో రాడికల్ విద్యార్థి సంఘం నాయకుడిగా వుండేవాడు. అప్పటినుండే పార్టీ హోల్‌టైమర్‌గా పని ప్రారంభించాడు. 1981లో ఏర్పడిన మొట్టమొదటి హైదరాబాద్ సిటీకమిటీలో సభ్యుడైనాడు. 1986-91 కాలంలో జైలులో వున్నపుడు అత్యున్నత స్ఫూర్తిని ప్రదర్శించాడు. అతడు అత్యంత ప్రతిభావంతుడైన ఆర్గనైజరే కాదు. దళాలతో కలిసి నడిచేటపుడు తన కిట్‌బాగ్‌లో అనేక పుస్తకాలను పెట్టుకుని మోసిన తీవ్రమైన అధ్యయనాభినివేశం కల్గిన పాఠకుడు కా॥ మహేష్. తన సిద్ధాంత జ్ఞానాన్ని భారత విప్లవం ఎదుర్కొంటున్న సమస్యలతో సమన్వయించాలనే లక్ష్యంతో అతడు తన సిద్ధాంత జ్ఞానాన్ని మెరుగుపర్చుకునేందుకు ప్రతి క్షణాన్ని వినియోగించుకునేవాడు.

కేంద్రకమిటీ టీంలోకెల్లా చిన్నవాడైన కా॥ మురళి (39) 1980-81లో విద్యార్థిగా, తర్వాత యువజనుడిగా, నాయకుడిగా వుద్యమంలోకి వచ్చాడు. అప్పటినుండి పార్టీలో తన జీవితం మొత్తంగా ఉత్తర తెలంగాణాలోనే వుంటూ ప్రజల ప్రియతముడైనాడు. కేడర్‌తో, ప్రజానీకంతో తనకు అసాధారణమైన ప్రీతిపాత్రమైన అనుబంధం వుండేది. నిజామాబాద్‌లో, ఉత్తర తెలంగాణాలో ఉద్యమాన్ని నిర్మించడంలోనే తన జీవితమంతా గడిపిన కా॥ మురళి సమస్యలను చక్కగా ఆకళింపు చేసుకునేవాడు. జనం నాడి తనకు బాగా తెలుసు. ఈ విధంగా సుదీర్ఘ అనుభవశాలురైన నాయకులను మేం కోల్పోయాం.

అయితే ఈ నాయకులను కోల్పోవడంతో మొత్తం నాయకత్వమే లేకుండా పోయిందని తలవడం ప్రచార సాధనాల, పోలీసుల కల్పనే తప్ప మరేం కాదు. రెండో శ్రేణి నాయకత్వం అనడంలో మీ అర్థమేమిటో నాకు బోధపడటం లేదు. మా పార్టీలో మొదటి శ్రేణి నాయకత్వమంటే కేంద్రకమిటీ అని రెండో శ్రేణి నాయకత్వమంటే రాష్ట్రకమిటీలని అర్థం. ప్రతి ఒక్కరూ రెండు దశాబ్దాల కంటే ఎక్కువగా వర్గపోరాటాన్ని నడిపిన అనుభవం కల్గిన నాయకులతో మా కేంద్రకమిటీ వుంది. ఈ ముగ్గురు నాయకులను కోల్పోవడం మాకు నిజంగానే పెద్ద దెబ్బే అయినప్పటికీ వర్గపోరాటంలో సుదీర్ఘకాలంగా కాకలుదీరిన అనేకమంది అనుభవశాలురైన నాయకులు మా కేంద్రకమిటీలోనూ రాష్ట్రకమిటీలోనూ వున్నారు. కొద్దిమంది కామ్రేడ్లను కోల్పోవటంతోనే ఉద్యమం కుప్పగూలి పోలేనంతటి స్థాయికి మా సమిష్టి పనివిధానం వృద్ధి చెందింది. అట్లే కేంద్రకమిటీలోకి రాగలిగిన, తీసుకోదగిన సమర్థులైన, అంకితభావం కల్గిన కామ్రేడ్లు మా పలు రాష్ట్ర కమిటీలలో వున్నారు. గతంలో మేం తీవ్రమైన కష్టకాలాలనే ఎదుర్కొన్నాం. 1993లో ఆంధ్ర రాష్ట్రకమిటీ కార్యదర్శి కా॥ పులి అంజన్న, 1994లో రాష్ట్రకమిటీ సభ్యుడైన కా॥ వెంకటస్వామి (సూర్యం), రాష్ట్రకమిటీ సభ్యులైన కామ్రేడ్స్ ప్రకాష్ మాస్టర్, మహేందర్, దామోదర్‌రెడ్డి (సంజీవ్), రెడ్డెప్ప, మల్కాపురం భాస్కర్ (రమేష్) తదితర సీనియర్ నాయకులను మేం కోల్పోయాం. అయితే సమర్థమైన నాయకులుగా అచిర కాలంలోనే ఎదిగివచ్చిన తదుపరి శ్రేణుల ద్వారా మా నష్టాలన్నీ నిరంతరం భర్తీ అవుతూ వచ్చాయి.

విప్లవోద్యమం నిరంతరం స్థిరంగా ఎదుగుతూ వస్తోంది. నేల కూలిన వీరుల స్థానంలో సమర్థులైన వారి వారసులను ఉద్యమం కనుగొంటోంది. ఇది విప్లవోద్యమానికి చెందిన గతి తార్కిక అభివృద్ధి క్రమం. ప్రతి క్షణం నవరక్తం ఉప్పొంగుతూనే వుంది. సరైన పంథాకు, ప్రజారాసులకు మేం కట్టుబడి వున్నంతవరకు నూతన నాయకులు నిత్యం సృష్టింపబడతారు. కొంతమంది ముఖ్య నేతల్ని మేం కోల్పోయినపుడల్లా మేం కొన్ని కష్టాలను ఎదుర్కోవచ్చు. నాయకత్వంలో చాలామందిని మేం కోల్పోయి నట్లయితే మా వుద్యమం వెనుకంజ కూడా వేయవచ్చు. అయితే ప్రజాపంథాపై ఆధారపడి మా ఆచరణ వుంటున్నందువలన మమ్మల్ని పూర్తిగా తుడిచిపెట్టడం సాధ్యం కాదని మేం దృఢ

విశ్వాసంతోనే చెప్పగలము. నాయకులు వర్గ పోరాటం నుండే నిత్యం పుట్టుకొస్తున్నారు. విప్లవ క్రమంలో బలంరీత్యాను, ఆయుధాల రీత్యానూ మాకంటే ఎంతో అధికుడైన శత్రువుతో మేం యుద్ధం సాగిస్తున్నపుడు మేం నష్టాలకు గురవటం అన్నది అత్యంత సహజమే. అంతిమ విజయాన్ని సాధించేవరకు పలు ఒడిదుడుకుల గుండా, అనేక పరాజయాల ద్వారానే మా ఉద్యమం ఎదుగుతుంది. ఇదీ మా దీర్ఘకాలిక యుద్ధం స్వభావం. మా పార్టీ మొత్తంగా దీనిపై చైతన్యవంతమైంది. అందుచేత అటువంటి నాయకులను తయారు చేసుకోవటానికి కొంతకాలం పట్టినప్పటికీ, ఈ నష్టాలను మేం నిబ్బరంగా ఎదుర్కోగలం.

**5. మీ నాయకుల్ని కోల్పోవడంతో మీరెదుర్కొన్న నష్టానికి ప్రతిగా మీరు తలపెట్టదలుస్తున్న నిరసన ఎలాంటిది? హింసాత్మకంగానే వుంటుందా? ఎవరిని లక్ష్యంగా పెట్టుకుని మీ నిరసన సాగుతుంది? మీరు చేపట్టే ప్రతీకార చర్యలలో సాధారణ పౌరులెవరూ దెబ్బతినకుండా మీరెలాంటి జాగ్రత్త చర్యలు చేపట్టదలచారు?**

**జ.** నిరసనలు ఇప్పటికే కొనసాగుతున్నాయి. మా పోరాట ప్రాంతాలలోని ప్రజలు ఏ తీరులో స్పందిస్తున్నారనేది ఎవరైనా చూడగలిగేదిగానే వుంది. దేశంలోని చాలా ప్రాంతాలలో ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్‌లో ప్రజానీకపు నిరసనలు, ప్రతీకార చర్యలు అనేక ప్రాంతాలలో సాగుతున్నాయి. ప్రజలు తమ తీవ్ర విషాదాన్ని వర్గశత్రువులకి వ్యతిరేకంగా వర్గకసిగా మలుచుకొని మండిస్తున్నారు. మా ఉద్యమంపై ఫాసిస్టు పాలన రుద్దుతున్న పాశవిక అణచివేతని భయోత్పాత పాలనని ప్రతిఘటించడానికి అవసరంగా మేముపయోగించే ఒకానొక సాధనం మాత్రమే హింస అనేది! కాగా, రాజ్యానికి (ప్రభుత్వానికి) వ్యతిరేకంగా సాగే పోరాటాలలో ప్రజల్ని మరింత మరింతగా భాగస్వాముల్ని చేయడానికే మేము ప్రాధాన్యతనిస్తాం, దాన్నే మేము ప్రధానంగా నొక్కి చెబుతాం. భారత ప్రజల్ని కృంగదీస్తున్న ఫ్యూడలిజం, సామ్రాజ్యవాదం, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానం అనేవే మేము ఎక్కుబెట్టిన లక్ష్యాలు. కానైతే, ప్రత్యక్షంగా గాని పరోక్షంగా గాని మా కామ్రేడ్స్‌ని క్రూరంగా హత్యచేయడంలో పాత్ర సంబంధం వుండే వారిపై మేము మా తక్షణ గురిని ఎక్కుబెడతాం! ఈ హత్యాకాండని నడిపిన వారిలో కొన్ని పేర్లు మాకిప్పటికే తెలుసు. ఈ హత్యాకాండతో బాధాతప్తులైన పార్టీ శ్రేణులకి, విప్లవ ప్రజానీకానికి అలానే ఆ అమరవీరుల కుటుంబీకులు యావన్మందికీ మేము హామీపడుతున్నదేమంటే- కొంత వ్యవధి తీసుకున్నా సరే ఈ హత్యాకాండకి ప్రతీకారం తీర్చుకుని తీరుతాం! ఎల్లవేళలా మేము అనుసరించే తీరే ఇది. **శత్రువు మాకు రుణపడి వున్న నెత్తుటి బాకీలని కక్కించి తీరుతాం!**

సాధారణ పౌరులు బలైపోతున్నారనేదానికి సంబంధించి మేము చెప్పేదేమంటే- ఇలాంటివి జరగకుండా మేము చూస్తాం! ఇది ఎల్లవేళలా మా విధానమే! కాని దురదృష్టవశాత్తు ఇలాంటి ఘటనలు అప్పుడప్పుడూ ప్రమాదవశాత్తుగా జరిగిపోతుంటాయి. గడచిన ఆరువారాలలో 150 ప్రముఖ నిరసన చర్యలు జరిగాయి, వాటిలో ఒక్కగానొక్క సందర్భంలోనే అమాయకులైన సాధారణ పౌరులు కొంతమంది చనిపోయారు, అదీ ఎలా జరిగిందంటే మా కామ్రేడ్స్ ఒక ఇంటిని కూల్చదలచి ఇంట్లోవారినందరినీ బయట కొచ్చేయమని చెప్పి మరీ కూల్చారు. అయితే బయటపడినవారుగాక ఇంకా కొంతమంది ఆ ఇంట్లో వుండిపోయిన సంగతి తెలియక మావాళ్ళు ఇంటిని కూల్చేశారు. ఆ రకంగా ఇంట్లో వున్న మరికొంతమంది చనిపోయారు. ఈ అమాయకులు ఇలా బలైపోవడంపట్ల మా పార్టీ ఇప్పటికే బహిరంగంగానే తన తీవ్ర విచారాన్ని వ్యక్తపరిచింది, ఇకపై ఇలాంటివి జరగకుండా చూస్తాం.

**6. మీపై సాగుతున్న ఈ 'అణచివేత' ఉధృతి ఇలా ఎంతకాలం కొనసాగగలదని భావిస్తున్నారు? ఈ అణచివేతకి ప్రతిగా మీరు చేపట్టదలుస్తున్న ఇతర చర్యలు గూర్చి వివరిస్తారా?**

**జ.** మాపై సాగుతున్న అణచివేత తగ్గు ముఖం పడుతుందన్న భ్రమలు మాకేమీ లేవు. నిజం చెప్పాలంటే- సామ్రాజ్యవాదుల హుకుంనామాలుగా దేశీయ పాలకవర్గాలు నెత్తినెత్తుకున్న ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రైవేటీకరణ విధానాల్ని అమలుచేసే విఫలయత్నంలో భాగంగా ఈ నిర్బంధం మరింతగా పెరుగుతుంది. పాలకవర్గాలు అమలుచేసే ఈ విధానాలకి వ్యతిరేకంగా ప్రజలు పెద్దఎత్తున తిరగబడితీరుతారనేది వారికి తెలీంది కాదు. కనుక ఇలాంటి ప్రజా తిరుగుబాట్లని అణచేయడానికి ప్రజలకి వారి పోరాటాలకి తగిన నాయకత్వం లేకుండా చేయాలని, అందుకే మా పార్టీని అణచేయడం ద్వారా అది సాధించవచ్చని పాలకవర్గాలు వారి సామ్రాజ్యవాద యజమానులు ఆశపడుతున్నారు. కాని వారి ఆశలు అడియాశలు కాక తప్పవు. అసలు విషయం ఏమిటంటే- మరింత మరింతగా తీవ్రతరమౌతున్న ఈ వ్యవస్థా సంక్షోభం నేపథ్యంలో రోజురోజుకీ పెరుగుతున్న ప్రజల చైతన్యం, వారి పోరాటాల తీవ్రతలోనే మా శక్తి వుంది. ఈ ఫాసిస్టు బలం ప్రభుత్వం అమలుచేసే నిర్బంధకాండకి, అణచివేతకి ప్రతిగా చేపట్టాల్సిన అనేక చర్యల్ని మా కేంద్రకమిటీ రూపొందించింది. అవన్నీ అమలవుతున్న క్రమంలోనే వున్నాయి. వాటి ఫలితాలు త్వరలోనే రుజువు కాగలవు.

**7. మీ నిర్మాణం 'మతిలేని హింస' (విచక్షణా రహితమైన హింస)కి తలపడుతోందని ఆంధ్రరాష్ట్ర పోలీసు ఉన్నతాధికారి హెచ్.జె.దొర నిందిస్తున్నాడు. పోతే పీపుల్స్‌వార్ ప్రజల తరపున పోరాడటాన్ని కూడా ఒదిలేసుకున్నట్టు చెబుతున్నాడు. దీనిపై మీ వ్యాఖ్య ఏమిటో వివరించండి. (దీన్ని మీరు 'పోలీసు ప్రచారం' అని కొట్టిపారేయదలిస్తే మాత్రం దీంతో మీరు ఏ రకంగా విభేదిస్తారో మీ వాదననెలా సమర్థిస్తారో తెలియజేయండి).**

**జ.** పీడిత ప్రజలకోసం అంకిత భావంతో పోరాడే విప్లవకారులకి వ్యతిరేకంగా ఎప్పుడూ వచ్చే సాధారణ నిందారోపణే ఇది. చైనాలో సైతం, విప్లవ కాలంలో కమ్యూనిస్టు విప్లవకారుల్ని

''ఎర్రబందిపోట్లు'' అని ముద్రవేశారు. ఇంతకీ ''మతిలేని హింస'' అంటే అర్థం ఏమిటట?! ప్రతి సంవత్సరం వందలాది మంది అమాయక ప్రజల ప్రాణాల్ని బలితీసుకుంటున్న, రాయలసీమని రక్తసిక్తం చేస్తున్న టి.డి.పి.-కాంగ్రెస్ గూండాలు పాల్పడుతున్న హింస; వేరొక ప్రక్క గూండా అధినేతలు చంద్రబాబు, హెచ్.జె.దొరల ఆధ్వర్యంలో పోలీసుల గూండాలు గడచిన ఐదు సంవత్సరాల కాలంలో ఆంధ్రరాష్ట్రంలోని అనేక గ్రామీణ ప్రాంతాలు పట్టణ ప్రాంతాలలో అమలు చేస్తూవస్తోన్న అలవిలేని హింసాకాండతో 600 మంది పైగా ప్రజల్ని పొట్టన బెట్టుకున్న హింసాకాండ-ఇదంతా మతిలేని హింస కాదా? ఉత్తర తెలంగాణా స్పెషల్ జోనల్ కమిటీకి చెందిన కామ్రేడ్ రమేష్, ఆంధ్ర రాష్ట్రకమిటీ సభ్యుడు కా॥ రెడ్డెప్పలతోపాటు కనీసం 30 మంది మా పార్టీ కామ్రేడ్స్‌ని దారుణంగా హత్యచేసి వారి రక్తంతో తన చేతుల్ని తడుపుకున్న ఒకానొక ఉమేష్‌చంద్ర లాంటి వాడిని విప్లవకారులు చంపితే మాత్రం ఇక అందులో దొర లాంటి వారికి 'మతిలేని హింస' తప్ప ఇంకేమీ కనబడదు. కమ్యూనిస్టు సిద్ధాంతానికి నిబద్ధతతో కట్టుబడి వుంటూ పనిచేసే పార్టీ మాది. మా ఈ పార్టీ శ్రేణులు, నాయకులు అంతా కూడా దొర లాంటి కిరాయి మూకల ద్వారా అనునిత్యం పాలకవర్గాలు ప్రయోగిస్తుండే తెల్ల బీభత్సకాండని ఎదిరిస్తూ ఆ బీభత్సకాండ నడుమనే పీడిత ప్రజల్లో మసులుకునేవాళ్లం! ప్రభుత్వం పనుపుతో ప్రభుత్వానికి కిరాయి మూకలుగా వ్యవహరించే సాయుధ బలగాలు అనునిత్యం రాత్రి పగలూ అమలు చేసే బుర్రలేని హింసాకాండకి ప్రతిగా దాన్ని ప్రతిఘటించే లక్ష్యంతో, ప్రతిఘటించే సాధనంగా మాత్రమే మేము తలపెట్టే హింస వుంటుంది! ఎవరిని మీరు శత్రువులుగా భావిస్తున్నారని వీధినపోయే ఏ ఒక్కరినైనా అడిగి చూడండి, పోలీసులే మా శత్రువులు అనేది వారి సమాధానంగా మీరు వింటారు. డి.జి.పి. దొర చేసిన మరో నవ్వు పుట్టించే ప్రకటన ఏమంటే-మేము ప్రజల తరపున పోరాడటం లేదని ప్రజా పోరాటాల పట్ల ఎంతో సానుభూతి వున్నవాడిలా ఆవేదన పడిపోతున్నాడు. అయితే ఇంతకీ మరి మేము ముందునుండీ ఏం చేస్తున్నట్లో? వాస్తవం ఏమిటంటే తెలుగుదేశం పార్టీ పాలనలోని గడచిన ఐదు సంవత్సరాల కాలంలోనే గతంలో ఎప్పటికంటే కూడా ఎక్కువగా పోరాటాలు నిర్వహించాం. 1995 నుంచి ఒక్క ఆంధ్రరాష్ట్రంలోనే 35,000 ఎకరాల భూమిని పేద ప్రజలు ఆక్రమించుకునేటపుడు మా పార్టీ ప్రజల్ని సమీకరించి సమాయత్తపరచింది. ప్రజల్ని ఏమార్చే లక్ష్యంతో, కుతంత్రంతో ఎస్.సి., ఎస్.టి. కార్పొరేషన్లు అంటూ రకరకాల నాటకాలకి చంద్రబాబు నాయుడు దిగడం అనేది మా ఆధ్వర్యంలో సాగిన ఈ భూపోరాటాల నేపథ్యంలో సాగుతూ వచ్చినవే! ఈ భూపోరాటాలతో పాటు, అనేక కూలీరేట్ల పోరాటాలు అలానే గిట్టుబాటు ధరలకోసం పోరాటాలు ఇంకా ఇలాంటి అనేక సమస్యలపై అనేక పోరాటాలకు ప్రజల్ని కదిలించాం. ఇలాంటి సమస్యలపై లక్షలాది ప్రజల్ని మేము కదిలించాం. ఇదే నిజం కాకపోతే మాపార్టీ పైన, మా ప్రజాసంఘాలపైన నిషేధం విధించాల్సిన పనేముంటుంది? అంతేకాదు, బహిరంగ పోరాటాల సంగతలా వుంచి చిన్న సమావేశం జరుపుకోడానికి సైతం మా ప్రజాసంఘాలని అనుమతించక పోవడం ఎందుకు జరుగుతోంది? ఎలాంటి ఆటంకం లేకుండా సభలు నిర్వహించుకోడానికి మాకు అనుమతించిన నాడు మా ప్రజాపునాది ఏమిటో ఎంతో రుజువుచేసి చూపుతాం. అధికార తెలుగుదేశం పార్టీతో సహా ఏ ఒక్క అభివృద్ధి నిరోధక పాలకవర్గ పార్టీ కూడా కదిలించలేనంతటి ప్రజా సమూహాల్ని మేము కదిలించగలం. కావాలంటే దొర, చంద్రబాబు దీన్నొక సవాల్‌గా తీసుకొని సిద్ధపడమని నేను సవాల్ విసురుతున్నాను. ఈ పార్టీలు ఏ ఒక్క దానికంటే కూడా మాకున్న ప్రజామద్దతు ఎక్కువే అని రుజువు చేయగలం! మా పార్టీపై నిషేధాన్ని ఇలానే కొనసాగించడం కోసమే చంద్రబాబునాయుడు, దొర మేము ప్రజల అవసరాల రీత్యా పోరాటాలు చేయడం లేదని, విచక్షణా రహితమైన హింసాచర్యలకే పరిమితమవుతున్నామని అవాకులు చవాకులు ఆరోపణలతో ప్రచారాన్ని లంకించు కుంటున్నారు, ఈ ఆరోపణలు ప్రచారాలతో మా పార్టీపై నిషేధాన్ని సమర్థించుకో ప్రయత్నిస్తున్నారు. రాష్ట్రంలోని తెలుగుదేశం ప్రభుత్వం, కేంద్రంలోని బి.జె.పి. నాయకత్వంలోని ఎన్.డి.ఎ. ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల పర్యవసానమే ప్రజల దురవస్థకి కారణం అనే సత్యం నుంచి ప్రజల దృష్టిని ఏమార్చడానికి పక్కతోవలు పట్టించడానికి, ఈ ప్రభుత్వాలు అనుసరించే భయోత్పాత ఎత్తుగడల్ని సమర్థించుకోడానికి మా ఉద్యమం కేవలం ''శాంతి భద్రతల సమస్యే'' అని చెప్పడం వారికి అవసరం అవుతోంది.

**8. తన లక్ష్యాన్ని సాధించడానికి హింసామార్గాన్ని ఎంచుకున్న పార్టీ పీపుల్స్‌వార్. ఈ పార్టీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా 'దీర్ఘకాలిక యుద్ధం' కొనసాగుతున్నట్టుగా చెబుతోంది. కాని తుపాకి పట్టడం ద్వారా మిమ్మల్ని మీరే చట్ట బహిష్కృతులుగా ప్రకటించుకున్నారు. కాగా దేశంలో చట్టం సవ్యంగా అమలు కావాలని కోరడం విడ్డూరం కాదా? మీ కార్యకర్తలు దర్యాప్తుల గురించి ( ఇంకా ప్రజాస్వామ్యం అందించే ఇలాంటి ఉపశమన చర్యలని గురించి) కోరడం విచిత్రం కాదా? అసమంజసం అనిపించుకోదా?**

**జ.** ఇది నిజంగా మంచి ప్రశ్నే! ఈ తీరులో కొంతమంది ఆలోచిస్తున్నారని మాకు తెలుసు. ఈనాడు దేశంలో వుంటున్నది బూటకపు ప్రజాస్వామ్యం తప్ప నిజమైన ప్రజాస్వామ్యం కానే కాదని మేము భావిస్తాం. ధనవంతులకి, ఆస్తిపర వర్గాలకి మాత్రమే అక్కరకొచ్చే ప్రజాస్వామ్యం ఇది. కాగితాలపై ప్రజలకి ఎన్నెన్ని హక్కులు హామీలున్నా వాస్తవంలో అధికశాతం ప్రజలకి నిజానికి ఎలాంటి హక్కులూ లేవు. తమ స్వశక్తిపై నిర్మించుకున్న పోరాటాల ద్వారానే ప్రజలు కొన్ని హక్కుల్ని సాధించుకున్నారు. వాటిని దోపిడీదార్లు అంత తేలిగ్గా లాగేసుకోజాలరు. ఆ రకంగా సుదీర్ఘకాలంగా ప్రజలు రక్తపాత సహితమో, రక్తపాత రహితమో ఏదో రకమైన పోరాటాల ద్వారా ప్రోది చేసుకుంటూ వచ్చిన హక్కులు మాత్రమే నిజానికీ ప్రజాస్వామ్యానికి ఆ కాస్తంత ప్రజాస్వామిక స్వభావాన్నయినా మిగులుస్తున్నాయి. ఇలాంటి తమ

పోరాట ఫలితాలైన ఈ హక్కుల్ని పరిరక్షించుకోవాలన్నా వాటిని మరింత పెంచుకోవాలన్నా ప్రజలు ఎడతెరపిలేని పోరాటాలు చేస్తుండటం అవసరం, అనివార్యం. ఈ సత్యాన్ని మేము గుర్తిస్తాం, ప్రజలు తమ అసంఖ్యాక త్యాగాలతోను, అలవిలేని కష్టసహిష్ణుత తోనూ సాధించుకున్న హక్కుల్ని మేము సహజంగానే ఉపయోగించుకుంటాం. అదే సందర్భంలో ఈ దోపిడీ వ్యవస్థలో ప్రజలు తమ హక్కుల్ని సంపూర్ణంగా వాస్తవీకరించు కోలేరని, అనుభవించలేరని కూడా మేం గుర్తిస్తాం. కనుక ఈ దోపిడీ వ్యవస్థని కూలదోయటం ద్వారా మాత్రమే ప్రజలు నిజమైన ప్రజాస్వామ్యాన్ని సాధించగలుగుతారు. కనుక పాశవిక బలప్రయోగానికి దిగిపోకుండా ప్రజలు చట్ట బద్ధంగా పోరాడ్డానికి ప్రభుత్వం అవకాశమిచ్చినంత కాలం, అనుమతించినంత కాలం, ప్రజలు తమ హక్కుల్ని మరింతగా పెంచుకోడానికి ఆ అవకాశాల్ని వినియోగించుకుంటారు. ఎప్పుడైతే వారిపై పాశవిక అణచివేత దమనకాండ ప్రారంభమౌతాయో, ఇకప్పుడు వారు ఆయుధాల్ని అందుకోవడం అనివార్యం. మేము ఆయుధాల్ని అందుకోవడం కూడా సరిగ్గా ఈ తీరులోనే జరిగింది-మేము సాయుధం కావడమనేది అదేదో మా వీరత్వ ప్రదర్శనకెంత మాత్రం కాదు. దేశంలోని చట్ట వ్యవస్థ ఎంతటి అప్రజాస్వామికమైనదో మాకు తెలుసు. ఈ చట్ట వ్యవస్థపై మాకెలాంటి భ్రమలు లేవు. కనుక ఎలాంటి న్యాయ విచారణ అయినా న్యాయాన్ని అందించలేదన్నది మాకు తెలిసిందే! భార్గవ కమీషన్ లాంటి అనేక కమీషన్ల కథలు ఎలా కంచికి చేరాయో అందరికీ తెలిసిందే! అయినా కూడా, ప్రజాస్వామ్యంపట్ల నిబద్ధతని ప్రకటిస్తూ చట్టంమీద ప్రమాణాలు ప్రతిజ్ఞలతో చెలామణి అయిపోయే దోపిడీ పాలకవర్గాల అసలు రంగుల్ని వారి కాపట్యాన్ని మార్మికతని ఎత్తిచూపి ఎండగట్టే లక్ష్యంతోనే మేము అలాంటి డిమాండ్స్‌ని ముందుకి పెడుతుంటాం. కనుక నేటి వ్యవస్థలో అసలు ప్రజాస్వామ్యమే లేదని ప్రకటిస్తూనే ఈ వ్యవస్థ నిజ స్వభావాన్ని ఎత్తిచూపి ఎండగట్టగల ప్రతిచిన్న అవకాశాన్ని ఉపయోగించుకుంటూ మా ఉద్యమాన్ని అభివృద్ధి చేసే ఈ మా వైఖరి మొత్తంలో ఎలాంటి వైరుధ్యం లేనే లేదు.

**9. ప్రపంచంలోని రక్తపాత విప్లవాలన్నింటిలోనూ ఆంతరంగిక కలహాలనేవి ఒక సాధారణ అంతర్భాగాంశంగానే కనబడుతుంది. పీపుల్స్‌వార్‌కి సైతం ఈ అనుభవం వుంది. పీపుల్స్‌వార్ పార్టీ మరింతగా సైనికీకరించబడాలని కోరుతూ ఇప్పుడు చంపబడిన నాయకులు మీకు వ్యతిరేకంగా ఎదుగుతూ వచ్చినట్టుగా చెప్పబడుతోంది. ఇదెంతవరకు వాస్తవం? ఈ ముగ్గురు నేతలు మీతో విబేధించారనేదాన్ని మీరు కాదంటారా?**

**జ.** ఇది కేవలం ఊహాశకలం మాత్రమే! సాధారణంగా పార్టీలలో శత్రు ఏజెంట్లుగా కొంతమంది వుంటూ వుంటారు తప్ప ఆంతరంగిక కుమ్ములాటలంటూ వుండవు. శత్రు పాలకవర్గాలు తను ఏజెంట్లని నిర్మాణంలోకి చొప్పిస్తూ వారి కారణంగా ఉత్పన్నమయ్యే పరిస్థితుల్ని ఘటనల్ని పార్టీలో ఆంతరంగిక కుమ్ములాటలుగా చిత్రిస్తూ ప్రచారం చేస్తూ వుంటారు. మీరు ఊహిస్తున్నట్టు మా పార్టీలో ఏనాడూ ఆంతరంగిక కలహాలు, కుమ్ములాటలనేవి లేవు. కుమ్ములాటలు అనేవి ఎల్లప్పుడూ అభివృద్ధి నిరోధక విప్లవ ప్రతీఘాతుక పార్టీలలోనే వుంటూ వుంటాయి, ఏమంటే ఎల్లవేళలా ఏదో విధంగా అధికారాన్ని కైవశం చేసుకోవడమే లక్ష్యంగా అవి పనిచేస్తుంటాయి గనుక! తెలుగుదేశం పార్టీ నిర్మాత, తన స్వంత మామ అయిన ఎన్.టి.ఆర్.ని కూల్చడానికి చంద్రబాబు నాయుడు పాల్పడిన అంతఃపుర కుట్ర మీరు చెబుతున్న అధికార దాహోర్తితో కూడిన ఆంతరంగిక కుమ్ములాటలనేదానికి నిఖార్సయిన ఉదాహరణగా నిలుస్తుంది. మా పార్టీ గత అనుభవాలన్నీ ఇందుకు పూర్తిగా భిన్నమైనవి. 1985-86లలోను అటు తరువాత 1991-92లలోను పార్టీ అనుసరించాల్సిన రాజకీయ పంథా విషయమై మా పార్టీలో భిన్నాభిప్రాయాలు తలెత్తాయి. తొలి సందర్భంలో అప్పటి పార్టీ కార్యదర్శి స్థానంలో వుంటూండిన సత్యమూర్తి; మలి సందర్భంలో పార్టీ కార్యదర్శి స్థానంలో వుంటుండిన సీతారామయ్య ఈ ఉభయులు ఉద్యమాన్ని పురోగమింపజేసి నడిపించడంలో వారికుండే బలహీనతల్ని కప్పిపుచ్చుకోడానికిగాను, అలానే తమ తమ తప్పిదాల్ని ఆత్మవిమర్శనాత్మకంగా అంగీకరించడానికి సంసిద్ధత లేని కారణంగాను పార్టీలో సంక్షోభాల్ని సృష్టించారు. ఇక వారికి వ్యతిరేకంగా పార్టీ క్రమశిక్షణా చర్యలు తీసుకుంది, ముందుగా వారిని హెచ్చరించింది, వారు పార్టీ హెచ్చరికల్ని బేఖాతరు చేయడంతో వారిరువురికి ఉద్వాసన చెప్పింది. అప్పటి పార్టీ అగ్రనాయకత్వం పార్టీ వుట్టి ముంచ ప్రయత్నించి విద్రోహానికి తలపడినా కూడా పార్టీ పంథా వెనుక యావత్ పార్టీ శ్రేణులు దృఢంగా నిలచారు, కనుక ఈ ఆంతరంగిక సంక్షోభాల్ని ఆంతరంగిక కుమ్ములాటలుగా చూడటం, చిత్రించడం తగదు. ఇక ప్రస్తుత సందర్భానికి వస్తే, ప్రచార మాధ్యమాల ద్వారా పోలీసులు పనిగట్టుకు చేయిస్తున్న తప్పుడు ప్రచార కథనాలకి విరుద్ధంగా నేడు మా పార్టీ కేంద్రకమిటీలో చెప్పుకోదగ్గంతటి భిన్నాభిప్రాయాలు సైతం లేవు. ప్రతి ముఖ్య సమస్యపై ప్రతి ప్రధాన సమస్యపై మా పార్టీ కేంద్రకమిటీ దృఢమైన ఐక్య అవగాహనతోనే వుంటూ ప్రజా యుద్ధాన్ని పురోగమింపజేసే విషయంలో ఐక్య ఆలోచనతోనే పనిచేస్తోంది. నేటి ఈ తరుణంలో మా పార్టీ వున్నంతటి ఐక్యంగా గతంలో ఏనాడూ లేదని నేను చెప్పడం ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. అంతేకాదు, సీతారామయ్య ఆధ్వర్యంలో పార్టీ వ్యతిరేక ముఠా పాల్పడిన విచ్ఛిన్న కార్యకలాపాలని విజయవంతంగా త్రిప్పికొడుతూ పార్టీ ఐక్యతని దృఢంగా నిలబెట్టడంలో భాగస్వాములై, నాటి నుంచి కొనసాగుతూ వస్తున్న వారే నేటి మా కేంద్రకమిటీ సభ్యులలో ఎక్కువమందిగా వుంటున్నారు. ఈ నాయకత్వ బృందం గడచిన కాలమంతటిలోను తమ సమిష్టి అవగాహనని, అనేక విషయాలలో తమ సమిష్టి ఆలోచన ఆచరణల సమైక్యతని మరింత మరింతగా అభివృద్ధి పరచుకుంటూ వస్తున్న వారుగానే వుంటున్నారు. పోతే ఒకప్పటి పీపుల్స్‌వార్-పార్టీ యూనిటీల మధ్య జరిగిన విలీనం కూడా కేంద్రకమిటీ పని సరళిని సానుకూలంగా ప్రభావితపరుస్తూ వస్తోంది, పర్యవసానంగా నేటి కేంద్రకమిటీ మునుపటికంటే సుసంపన్నమైన వివిధ రకాల అనుభవాలని సంతరించుకుంటోంది.

అమరులైన ముగ్గురు కా(మ్రేడ్స్ కూడా మా పార్టీ రాజకీయ పంథాకి విశిష్ట ప్రతినిధులని, మా పార్టీలోని అత్యంత అంకిత భావంతో వుంటూ వచ్చిన ఆచరణశీలురని సగర్వంగా ప్రకటిస్తున్నాను.

**10. పీపుల్స్‌వార్‌లోకి పార్టీ యూనిటీ విలీనం అయినది లగాయితూ మీరు సాధించిన ప్రగతి ఏమిటి? విలీన సందర్భంగా మీరు ఆ విలీనాన్ని భవిష్యత్‌లో జరగబోయే మరిన్ని విలీనాలకి ఒక సంకేతంగా చెప్పుకొచ్చారు, కాని ఆ తరువాత ఇంకే విలీనాలు జరుగలేదు. అంటే ప్రభుత్వం వాదిస్తున్నట్లుగా పీపుల్స్‌వార్ బలహీనపడింది లేక బలహీన పడుతోంది అనే దానికి ఈ స్థితి నిదర్శనం కాదంటారా?**

**జ.** విలీన సందర్భంగా మేము చెప్పినట్టుగానే-ఈ రెండు పార్టీల మధ్య జరిగిన ఐక్యత దానికదిగానే భారత విప్లవోద్యమంలో ఒక ప్రముఖ పరిణామం. భారతదేశంలోనేగాక ప్రపంచ వ్యాపితంగానే అనేక విప్లవ గ్రూపులు, అనేకమంది విప్లవ ప్రముఖులు ఈ ఐక్యతని శ్లాఘించారు. ఇక ఆ తరువాత ఈ నూతన ఐక్య పార్టీతో సంప్రదింపులకి చర్చలకి కొన్ని గ్రూపులు ఆసక్తిని వ్యక్తపరిచాయి, ఐక్యతని వాంఛించాయి. పోతే కొన్ని గ్రూపులు, అలానే కొంతమంది వ్యక్తులుగా తాముండే పూర్వపు నిర్మాణాల్ని విడచిపెడుతూ మా పార్టీలో కలవాలనే అభిలాషని వ్యక్తపరిచారు. మార్క్సిస్టు-లెనినిస్టు శిబిరంలో ఇప్పటికే ఒక రకమైన మధనం అనేది వుంటోంది. మా ఉద్యమ పురోభివృద్ధితో అది మరింత వేగాన్ని పుంజుకోగలదని మేము ఆశిస్తున్నాము.

ఇక మేము బలహీనపడిపోయామనే ప్రభుత్వ వాదనకి సంబంధించి చెప్పాల్సి వస్తే-నేను ఒకే ఒక చిన్న ప్రశ్న వేస్తాను. పీపుల్స్‌వార్ బలహీనపడి పోవడం అనేదే నిజమైతే-మాకు వ్యతిరేకంగా సాయుధ బలగాల్ని మరింత మరింత ఎక్కువగా మోహరింపజేయడానికి ఈ ప్రభుత్వాలు ఇంత ఉన్మాదంగా ఎందుకు పూనుకుంటున్నాయి? నిన్నటి వరకు నాలుగు రాష్ట్రాలకే (ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒరిస్సా) పరిమితమవుతూ వచ్చిన జాయింట్ కో ఆర్డినేషన్ కమిటీలో నేడు కొత్తగా బీహార్‌ని సైతం ఎందుకు చేర్చాల్సి వచ్చింది? ఆదరాబాదరాగా ఇబ్బడిముబ్బడిగా ఈ ఐదు రాష్ట్రాలకి అధిక మొత్తాలలో నిధుల్ని కేంద్రం ఎందుకని కుమ్మరిస్తోంది? ఇక మా పార్టీని దేశ వ్యాపితంగానే నిషేధించాలని పాలకవర్గాలెందుకు గుబులు పోతున్నాయి?

విలీనానంతరం మా పార్టీ మరింతగా శక్తివంతం అయిందనడానికి ఇవన్నీ నిదర్శనాలు కావా? ❑

---

**( 48వ పేజీ తరువాయి)**

గిరిజనేతరులుగాను వుంటున్నారు. తూ.గో. జిల్లాలోని షెడ్యూల్ ఏరియాలో మొత్తం జనాభా 2.53 లక్షలు కాగా గిరిజనులు 1,76,000 గాను, మిగతా 77 వేలు గిరిజనేతరులుగాను వుంటున్నారు. రాష్ట్రంలోని మిగతా ఏడు షెడ్యూల్ ప్రాంతాలైన శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్‌లతో పోలిస్తే ఉభయ గోదావరి జిల్లాల షెడ్యూల్ ప్రాంతాల్లోకి వలసలు ఎక్కువ వుండటం అనేది అక్కడ ఉద్రిక్తతలు బ్రద్ధలు కావడానికి ఒక కారణం మాత్రమే! ముందే చెప్పుకున్నట్టు షెడ్యూల్ ప్రాంతాలలో రగలనున్న పోరాట జ్వాలలకి గిరిజన, గిరిజనేతర భూఘర్షణలు అనేవి ఒక కారణం మాత్రమే కాగలుగుతుంది. అంతకు మించిన మరో ముఖ్య కారణం, అసలు కారణం ఏమంటే చంద్రబాబు ప్రభుత్వ వ్యవసాయ వ్యూహం విధానాలే! దేశీయ బడా పారిశ్రామిక వేత్తలకి విదేశీ బహుళజాతి కంపెనీలకి సువిశాల షెడ్యూల్ ప్రాంతాల వ్యవసాయ భూములన్నింటినీ దారాధత్తం చేయడానికి చంద్రబాబు ప్రభుత్వం చాలా తీవ్రంగా ప్రయత్నిస్తుంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతాలన్నీ భూస్వామ్య వ్యతిరేక సామ్రాజ్యవాద వ్యతిరేక, దోపిడీ ప్రభుత్వ వ్యతిరేక రణక్షేత్రాలుగా ఎరుపెక్కక తప్పదు!

పశ్చిమ గోదావరి జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో గడచిన మూడు సంవత్సరాల నుంచి సాగుతున్న గిరిజన పోరాటం మనకు అనేక విలువైన పాఠాలనందిస్తోంది. ముఖ్యమైన పాఠం ఏమంటే పార్లమెంటరీ పరిధికి లోబడి చేసే ఆదివాసీ పోరాటాలకి సమయం మించిపోయింది. పాలకవర్గాలు ప్రభుత్వాలు చాలా దూకుడుగా దూసుకొచ్చేస్తున్నాయి. సాధారణ పార్లమెంటరీ పోరాటాల పరిధిలో ఈ దూకుడుని నిలవరించగలగడమనేది దుస్సాధ్యం! రాజ్యంతో రాజీలేని సమరశీల పోరాటాలకి ఆదివాసీ జన బాహుళ్యాన్ని సమాయత్తపరచాల్సి వుంటుంది.

ఆదివాసీ ప్రజల రక్తసిక్త పోరాట ఫలం 1/70 ప్రత్యేక చట్టం! దీనిపై ఇవాళ చంద్రబాబు ప్రభుత్వం ఎక్కుపెడ్తున్న దాడి కేవలం ఈ చట్టం సరిగా అమలుకాని కారణంగా తాము పోగొట్టుకున్న భూముల్ని గిరిజనులు తిరిగి అడక్కుండా కట్టడి చేయడానికి ఉద్దేశించింది మాత్రమే కాదు! రాష్ట్ర ప్రజల రక్తమాంసాలని పీల్చి పిప్పి చేసుకు తినడానికి తాను, తన ప్రభుత్వం అన్నిరకాల సహకరిస్తామని పదే పదే హామీపడుతూ రక్తదాహార్తులైన దేశీయ విదేశీయ బడా పెట్టుబడిదార్లకి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ద్వారాలు తెరిచి స్వాగతం చెబుతున్న చంద్రబాబు ప్రభుత్వ పెట్టుబడుల ఉన్మాదం 1/70 చట్టాన్ని బలితీసుకోవడంతో మాత్రమే ఆగదు. నషాళానికెక్కిన 'ప్రపంచగ్రామ' నిషాతో షెడ్యూల్ ప్రాంతాల హోదాని, షెడ్యూల్ అనే భావననే మొత్తంగా తుడిచిపెట్టేసే దిశలో పావులు కదుపుతోంది చంద్రబాబు ప్రభుత్వం. ఇదంతా ఆదివాసీలని వారి భూముల నుంచి పూర్తిగా తొలగించేసి తమ గడ్డమీదే తాము పరాయివారుగా వేతన కూలీలుగా మారిపోయే భయంకరం, బాధాకరం అయిన స్థితికి వారిని నెట్టేస్తుంది. కనుక 1/70 రక్షణ అనేది ఈనాడు షెడ్యూల్ ప్రాంతాల్లోని గిరిజనేతర పేదల భూసమస్యగా మాత్రమే లేదు. తమ అస్థిత్వ రక్షణ కోసం ఆదివాసీలు తలపడాల్సిన సమస్యగా అది మారిపోయింది. తదనుగుణంగానే ఆదివాసీ ప్రజలంతా ఆలోచన రీత్యా ఆచరణ రీత్యా సాయుధం కాక తప్పదు. అయితీరుతారు! ❑

# కేంద్రకమిటీ కార్యదర్శి కా॥ గణపతి ఇంటర్నెట్‌లో రీడిఫ్.కామ్ (Rediff.com) వెబ్‌సైట్‌కి జనవరి చివరిలో ఇచ్చిన ఇంటర్వ్యూ.

**1. పీపుల్స్‌వార్ నేతలు ముగ్గురూ ఎలా చంపబడ్డారు?**

**జ.** మా పార్టీతో పాటు పలు స్వంతంత్ర సంస్థలు కూడా ఈ విషయాన్ని ఇప్పటికే చాలాసార్లు వివరించాయి. ఆ సంఘటన తర్వాత వెనువెంటనే మా కేంద్రకమిటీ చేసిన ప్రకటనలలోనూ, డిసెంబర్ 9న మా సి.సి. సెక్రటేరియట్ ప్రకటనలోనూ డిసెంబర్ 16న సి.సి. సెక్రటేరియట్ సర్క్యులర్‌లోనూ మేం ఈ సంఘటనను కూలంకషంగా వివరించాము. ఈ సంఘటన గురించి వివరాలందించే 'అమరులపై బుక్‌లెట్'ని కూడా మేం సిద్ధం చేశాం. మీ పరిశీలన కోసం ఆ పుస్తకం ప్రతిని మీకు పంపుతున్నాం.

**2. వారు ఎన్‌కౌంటర్‌లో చనిపోయారని పోలీసులు చెబుతున్నారు. వారిని బెంగుళూరు నుంచి పట్టుకొచ్చి, హింసించి, తరువాత కాల్చి చంపారన్న పీపుల్స్‌వార్ ఆరోపణను రాజ్యాన్ని అప్రతిష్టపాలు చేయాలన్న మీ గ్రూపు ప్రచారంలో భాగమే అని కూడా వారు చెబుతున్నారు. దీనికి వ్యతిరేకంగా మీరు వాదనలు/రుజువులు ఏవయినా చూపగలరా?**

**జ.** గత రెండు దశాబ్దాలుగా రెండువేల మంది మా కామ్రేడ్స్‌పై జరిపిన హత్యలను ఎన్‌కౌంటర్లుగా తప్ప మరే విధంగానయినా పోలీసులు ప్రకటించిన ఒక్కగానొక్క ఉదాహరణనయినా మీరు చూపగలరా?

నిజమైన ఎదురుకాల్పులు జరిగిన ప్రతిసారీ వాటిపై మేం విస్తృతంగా ప్రచారం చేస్తూ, శత్రు బలగాలతో పోరాడుతూ నేలకొరిగిపోయిన కామ్రేడ్స్ ప్రదర్శించిన వీరోచిత శౌర్యాన్ని గూర్చి శ్లాఘిస్తూనే వస్తున్నాం. నిజాలను వక్రీకరించటం వల్ల మేం సాధించేదేమిటి? కాని రాజ్యానికయితే మరొక మార్గంలేదు. తన ఫాసిస్ట్, రాజ్యాంగ విరుద్ధమైన, చట్ట విరుద్ధమైన చర్యను కప్పిపెట్టుకునేందుకుగాను అది అనివార్యంగా అబద్ధాలను అల్లక తప్పదు. ఈ సంఘటనపై ప్రభుత్వం న్యాయ విచారణకు పూనుకోలేదన్న వాస్తవమొక్కటే ఎన్‌కౌంటర్‌గా అది ప్రకటించు కుంటున్నది పూర్తిగా బూటకమని తేల్చి వేస్తోంది. దారినబోయే దానయ్య సైతం అతి సులభంగా ఈ అవగాహనకే వస్తాడు.

కరీంనగర్‌లోని కొయ్యూరు అడవిలో పోలీసులతో హోరాహోరీ జరిగిన ఒక ఎన్‌కౌంటర్లో అరుణ్ అనే అతనితో పాటు కామ్రేడ్స్ శ్యాం, మహేష్, మురళిలు మరణించారన్న కథ ఒక పచ్చి అబద్ధం. అది ఆంధ్రప్రదేశ్ గోబెల్స్ అయిన హెచ్.జె.దొర, వాడి యజమాని చంద్రబాబు నాయుడుల సృష్టి. ఈ పాశవిక హత్యలను కప్పిపుచ్చుకోవడానికి ఈ ఫాసిస్టులు దాదాపుగా ప్రతిరోజు మా పార్టీకి వ్యతిరేకంగా నిరాఘాటంగా అసత్యాలకూ, విద్వేషపూరితమైన ప్రచారానికి దిగుతున్నారు. ఈ కామ్రేడ్ల హత్య ముందే పన్నిన కుట్రకనుగుణంగా జరిగిందని, ప్రపంచబ్యాంకు తొత్తు చంద్రబాబునాయుడి సహస్రాబ్ది అసత్యమే కొయ్యూరు 'ఎన్‌కౌంటర్' అని నిష్పక్షపాతి అయిన ఏ వ్యక్తి అయినా నమ్మడానికి కావలసినంత గట్టి సాక్ష్యముంది. నా వాదనను నిరూపించడానికి కొన్ని రుజువులను కింద పొందుపరుస్తున్నాను.

★ మొదటగా, మా ప్రకటనలో, సర్క్యులర్‌లో, బుక్‌లెట్‌లో పొందుపరచిన సత్యాలు. బెంగుళూరులో గోవిందరెడ్డి (కామేశ్వరరావు) ఇంట్లో డిసెంబర్ 1 నాటి సమావేశం గురించి గత జూలై నెలలోనే అనుకోవటం జరిగింది. కేంద్రకమిటీ సభ్యులందరికీ ఈ విషయం తెలుసు. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మా కేంద్రకమిటీ సెక్రటేరియట్ డిసెంబర్ మొదటివారం చివర్లో అందుకోవలసి వుండింది. వాటిని అందుకోవడానికి మాకు వారితో కాంటాక్టు కూడా వుండింది.

★ కా॥ శ్యాం అక్టోబర్ చివరలో ఉత్తర తెలంగాణా నుండి తిరిగొచ్చాడు. నవంబర్ 30 వరకూ అంటే ఆ సంఘటనకి ముందురోజు వరకూ ఇతర కేంద్రకమిటీ సభ్యులతో సంబంధంలో వుండినాడు. 30 రాత్రి తాను మొబైల్ ఫోన్‌లో మాట్లాడినాడు. కా॥ మహేష్ ఒక వ్యాసాన్ని (ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవలి ఎన్నికలపై సమీక్ష) రాయటం పూర్తి చేశాక 30 రాత్రే మరో కామ్రేడ్ ఇంటినుండి బయటకొచ్చాడు. ఆ వ్యాసాన్ని 30 రాత్రే ఆ కామ్రేడ్ ఇంట్లోనే వుంచి వెళ్ళాడు. కా॥ మహేష్ రాసిన ఆ వ్యాసం మావద్ద వుంది. దానిపై 30వ తేదీయే వుంది.

కామ్రేడ్ మురళి గుంటూరు నుండి బెంగుళూరు పోయేటపుడు 30 రాత్రి ఒక కామ్రేడ్‌ను కలిశాడు. అతడివద్ద 30వ తేదీన పూనాకు పార్శెల్ చేసిన ఒక లారీ ట్రాన్స్‌పోర్ట్ రసీదు వుంది. ఆ పార్శెల్‌ని పోలీసులు పట్టుకుని అడ్రస్‌ని కనుగొనేందుకు ప్రయత్నించారు. ట్రాన్స్‌పోర్ట్ ఆఫీస్‌పై శత్రువు నిఘా పెట్టి వుంటాడు కాబట్టి ఆ పార్శిల్‌ని తీసుకోవద్దని ఆ పార్శిల్‌మీది చిరునామాదారును మేం హెచ్చరించి వున్నాం.

★ డిసెంబర్ 1న ఈ కామ్రేడ్స్ అరెస్ట్ అయిన నాటి నుంచి విద్రోహి గోవిందరెడ్డి బెంగుళూరులోని తన ఇంటిలో

**(తరువాయి 54వ పేజీలో)**